
'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 307

మంగళవారం 28-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఈ అమ్మల ఒడికి పద్మాలు

లిబియా లోబో సర్దేశాయ్. భీమవ్వలపై ప్రత్యేక కథనం


-13లో



టెస్టుల్లో బుమ్రా.. వన్డేల్లో స్మృతి

ఐసీసీ వార్షిక అవార్డులు గెల్చుకున్న భారత స్టార్ క్రికెటర్లు

-14లో



సవరణలకు ఆమోదం

వక్ఫ్ సవరణ బిల్లును సమీక్షించేందుకు ఏర్పడిన జేపీసీ.. ఎన్‌డీఏ కూటమి నేతలు సూచించిన ప్రతీ సవరణకూ ఆమోదముద్ర వేసింది.

వివరాలు 6లో ▸



ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి

పౌరులందరికీ సమాన హక్కులు లక్ష్యంతో తెచ్చిన 'ఉమ్మడి పౌరస్మృతి'.. దేశంలో తొలిసారిగా ఉత్తరాఖండ్‌లో అమల్లోకొచ్చింది.


వివరాలు 6లో ▸



ట్రంప్‌కు మోదీ ఫోన్

అమెరికా అధ్యక్షునిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

వివరాలు 6లో ▸



ఆ వయసు పిల్లలకి నో ఎంట్రీ

పదహారేళ్లలోపు పిల్లల్ని ఉదయం 11కి ముందు, రాత్రి 11 తర్వాత సినిమాల స్పెషల్ షోలకు అనుమతించ వద్దని హైకోర్టు ఆదేశించింది.

వివరాలు 16లో ▸



ఆహారం తీసుకున్న తర్వాత అందులోని పోషకాలు ఒంటికి పట్టకపోవడం అనే కండిషన్‌ను 'మాల్ అబ్జార్ప్షన్' అంటారు. పోషకాలు ఒంటికి పట్టని ఈ కండిషన్ గురించి తెలుసుకుందాం.

సాక్షి ప్లస్‌లో

మధ్యాహ్నం.. అధ్వానం!

ప్రభుత్వ బడుల్లో 'మధ్యాహ్న భోజనం'పై విద్యా కమిషన్ నివేదిక



- చాలీచాలని మెస్ చార్జీలతో పోషకాహారం అందేది ఎలా?
- ఆహారం కలుషితం కావడానికి కారణాలు ఎన్నో
- సరుకులు కొనేందుకు కార్పొరేషన్ ఉండాలి
- ప్రభుత్వ స్కూల్ విద్యార్థుల మెనూ దారుణమనే అభిప్రాయం
- విద్యా సంస్థలన్నింటికీ ఒకే విధానం అవసరమని స్పష్టీకరణ
- రాష్ట్రంలోని వందలాది స్కూళ్లను పరిశీలించి నివేదిక రూపకల్పన
- తక్షణమే చేపట్టాల్సిన చర్యలపై పలు కీలక సూచనలు

ప్రభుత్వం వీటిపై దృష్టిపెట్టాలి: కమిషన్ చైర్మన్ ఆకునూరి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం అమలు అస్తవ్యస్తంగా ఉందని విద్యా కమిషన్ అభిప్రాయపడింది. చాలీచాలని నిధులతో ఈ పథకాన్ని సక్రమంగా నిర్వహించడం అసాధ్యమని పేర్కొంది. విద్యార్థులకు పోషకాహారం అందేది ఎలాగని ఆందోళన వ్యక్తం చేసింది. వంట ఖర్చులనూ సక్రమంగా చెల్లించని పరిస్థితిని ఎత్తి చూపింది. అప్పులు చేసి వండి పెడుతున్నా, ప్రభుత్వం బకాయిలు చెల్లించడం లేదని మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తేల్చి చెప్పింది. వీటన్నింటినీ పరిశీలిస్తే మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రత ఆశించడం కష్టమేనని పేర్కొంది. గత కొన్ని నెలలుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఆహారం తిన్న విద్యార్థులు అస్వస్థత పాలవ్వడం, పలుచోట్ల తీవ్ర అనారోగ్యానికి గురవడం వంటి ఘటనల నేపథ్యంలో ఈ అంశంపై రాష్ట్ర విద్యా కమి షన్ పరిశీలన జరిపింది. మధ్యాహ్న భోజన పథకం పరిస్థితి, చేపట్టాల్సిన చర్యలపై కొన్ని సిఫార్సులతో ప్రభుత్వానికి సోమవారం నివేదిక సమర్పించింది.

వందలాది స్కూళ్లను పరిశీలించి...

రాష్ట్రవ్యాప్తంగా వందలాది ప్రభుత్వ స్కూళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ హాస్టళ్లు, కేజీబీవీలు, అంగన్ వాడీ కేంద్రాలను విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర రావు, డాక్టర్ చారకొండ వెంకటేశ్, జోత్స్న శివారెడ్డి సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, మౌలిక సదుపాయాలు, పారిశుధ్యానికి

మిగతా 5వ పేజీలో ▶

> మధ్యాహ్న భోజనం ఖర్చులో కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం భరిస్తున్నాయి. గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచారు. కానీ, ప్రభుత్వ స్కూళ్లలో ఇప్పటికీ 1 నుంచి ఐదో తరగతి (ప్రైమరీ) వరకు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4.97 చొప్పున.. 6 నుంచి 8 తరగతులవారికి రూ.7.45 చొప్పున, 9, 10 తరగతులవారికి రూ.9.45 చొప్పున ఇస్తున్నారు. ఈ కేటాయింపులు పెంచాలి. 1–5 తరగతులకు 55 శాతం, 6–8 తరగతులకు 58 శాతం, 9–10 తరగతుల వారికి 60 శాతం చొప్పున నిధులు పెంచాలి.

వైఎస్ జగన్‌పై కేసుల విచారణ..

మరో రాష్ట్రానికి బదిలీ అవసరం లేదు

జగన్ బెయిల్ రద్దు చేయాల్సిన అవసరం లేదు

తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు

- సీబీఐ కోర్టు విచారణను తెలంగాణ హైకోర్టు పర్యవేక్షిస్తోంది
- రోజువారీ విధానంలో విచారణ జరపాలని కూడా ఆదేశాలిచ్చింది
- ఇక హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదు
- రఘురామ పిటిషన్‌ను తోసిపుచ్చిన ధర్మాసనం

సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకున్న మాజీ ఎంపీ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు సుప్రీంకోర్టు గట్టి షాక్‌నిచ్చింది. వైఎస్ జగన్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసులపై సీబీఐ ప్రత్యేక కోర్టులో జరుగుతున్న విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టు నిర్ద్వందంగా తోసిపుచ్చింది. అలాగే వైఎస్ జగన్ బెయిల్‌ను రద్దు చేసేందుకు సైతం సుప్రీంకోర్టు నిరాకరించింది. జగన్‌పై రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ మేరకు

మిగతా 3వ పేజీలో ▶

కొత్త పట్టాలకూ 'భరోసా'



- ఈ ఏడాది జనవరి 1వ తేదీలోపు రిజిస్ట్రేషన్ అయిన వ్యవసాయ భూములకు వర్తింపు

2లో

4 పథకాలు.. ఒక్కరోజు లబ్ధిదారులు

6,15,677 మంది



డీప్‌సీక్.. మార్కెట్ షేక్

- యూఎస్ టెక్ దిగ్గజాలలో కలవరం
- యూఎస్ ఏఐకు పోటీగా చైనీస్ ఆర్1
- టెక్నాలజీ షేర్లలో భారీ అమ్మకాలు
- 3 శాతం పతనమైన నాస్‌డాక్
- చాట్‌జీపీటీకి పోటీగా చైనీస్ డీప్‌సీక్

వివరాలు 15లో▶

సూర్యాపేటలో పరువు హత్య!



- పెళ్లి అయిన 5 నెలలకే యువకుడి విషాదాంతం
- కులాంతర వివాహమే కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్న పోలీసులు
- సోదరుడిపై మృతుడి భార్య ఆరోపణలు
- నలుగురిపై కేసు నమోదు

వివరాలు 16లో▶

ఓవైపు గాంధీ పరివార్.. మరోవైపు గాడ్సే పరివార్

దేశంలో ఈ రెండు పరివారాల మధ్య యుద్ధం

- మోదీ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు
- రాహుల్‌గాంధీ రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుతున్నారు
- మనం రాహుల్‌తో కలిసి నడవాలి
- ఇండోర్ సంవిధాన్ బచావో ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి




సాక్షి, హైదరాబాద్: 'దేశంలో రెండు పరివారాల మధ్య యుద్ధం జరుగుతోంది. ఒకటి గాంధీ పరివారం.. మరోటి గాడ్సే పరివారం. గాంధీ పరివార్ వైపు నుంచి రాహుల్ గాంధీ పోరాడుతున్నారు. గాడ్సే పరివారం నుంచి మోదీ ఉన్నారు. మనమంతా గాంధీ పరివారంగా రాహుల్‌గాంధీకి మద్దతుగా నిలవాలి. రాహుల్ నేతృత్వంలో దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రాజ్యాంగాన్ని పరిరక్షించాలి..' అని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇది ఎన్నికల ర్యాలీ కాదని, ఓ యుద్ధమని అభివర్ణించారు. 'రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడే వారికి, రాజ్యాంగాన్ని మార్చాలనుకునే వారికి మధ్య ఈ యుద్ధం జరుగుతోంది. ప్రధానిగా బాధ్యతలు

మిగతా 2వ పేజీలో ▶

ఇందుమూలంగా ఐదున్నర కోట్ల మందికీ తెలియచేయునది ఏమనగా..

'సూపర్ సిక్స్' ఇవ్వలేం



ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నా.. అందరూ అర్థం చేసుకోండి

ఎలాగైనా బాబు చేస్తారని నమ్మి ఓట్లు వేశాం కదా..! అనే ఫీలింగ్‌లోకి జనం వెళ్తున్నారు

అందుకే వాస్తవాలను వెల్లడించి వారికి అవగాహన కల్పిస్తున్నా

- ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు తొమ్మిదేళ్లు పడుతుందో.. పదేళ్లు పడుతుందో..
- సంపద సృష్టించి.. వృద్ధి రేటు 15 శాతానికి పెరిగితేనే సూపర్ సిక్స్ హామీల అమలు

గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ హామీల ఎగవేతకు పక్కా ప్రణాళికతో అడుగులు

రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచికలతో నీతి ఆయోగ్ నివేదికపై ప్రజెంటేషన్‌లో ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

3లో



యుద్ధం తాత్కాలికంగా ముగిసిన చోట.. ఇప్పుడు బతుకుపోరు మొదలైంది. నాడు ఇజ్రాయెల్ దాడుల ధాటికి ప్రాణాలు చేతబట్టుకుని వలసపోయిన పాలస్తీనియన్లు ఇప్పుడు గుండెదిటవు చేసుకుని స్వస్థలాలకు పయనమయ్యారు. నామరూపాల్లేకుండా పోయిన ఇళ్లు.. ఎటు చూసినా శిథిలాలు.. గుంతలుగా మారిన రహదారులు.. నిన్నటి వరకు తాము బతికిన నేల మరుభూమిగా మారిపోవడాన్ని చూసి వారు రోదిస్తున్న తీరు కంటతడి పెట్టిస్తోంది.

2 గంటల్లో లక్షల మంది

ఇజ్రాయెల్ అనుమతితో ఉత్తర గాజాలోని స్వస్థలాలకు పాలస్తీనియన్లు

6లో



ఇందిరాగాంధీ పేరుంది కాబట్టి ఢిల్లీ విమానాశ్రయంలో దిగను అంటే ఎలా సార్!

దావోస్ పెట్టుబడులూ 6 గ్యారంటీల్లాగే..

బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం డైరీ, కేలండర్ ఆవిష్కరణలో కేటీఆర్

- 12 వేల పంచాయతీలకుగాను 600 గ్రామాల్లోనే పథకాలు అమలు చేస్తారా?
- అబద్ధపు హామీలపై 31న గాంధీ విగ్రహాలకు వినతులు



సాక్షి, హైదరాబాద్

ఆరు గ్యారంటీల తరహాలోనే దావోస్ పెట్టుబడుల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం అవాస్తవాలు ప్రచారం చేస్తోందని ప్రజలు నమ్ముతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు విమర్శించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసమే ఆరు గ్యారంటీల పేరిట హంగామా చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో 12 వేల కుపైగా గ్రామ పంచాయతీలు ఉంటే కేవలం 600 గ్రామాల్లో పథకాల అమలు పేరిట స్థానికసంస్థల్లో ఓట్ల కోసం కొత్త మోసానికి సీఎం రేవంత్ తెరలేపారని దుయ్యబట్టారు. గతేడాది దావోస్ నుంచి వచ్చిన రూ. 40 వేల కోట్ల పెట్టుబడుల్లో ఇప్పటివరకు ఏదీ వాస్తవరూపం దాల్చలేదని.. ఒకవేళ ఆ పెట్టుబడులు కార్యరూపం దాలిస్తే తామే సీఎం రేవంత్‌కు సన్మానం చేస్తామని ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం జరిగిన బీఆర్‌ఎస్

మిగతా 2వ పేజీలో ▶

మేం మారాం!

- ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్ల కొత్త జీవితం
- నెలరోజులుగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న 39 మంది
- ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విధుల నిర్వహణ
- ఫలితాన్నిస్తున్న నగర ట్రాఫిక్ విభాగం శిక్షణ




- వివరాలు 2లో▶

మళ్లీ మానస సరోవర యాత్ర

- చైనాకు నేరుగా విమాన సర్వీసులు
- సంబంధాల బలోపేతానికి చర్యలు
- జల వనరుల సమాచార మార్పిడి
- మిస్రీ పర్యటనలో కీలక ఒప్పందాలు
- మంత్రులతో వరుస భేటీలు, చర్చలు

- వివరాలు 6లో▶



హక్కుల రక్షణలో సుప్రీం



- సర్వోన్నత న్యాయస్థానం ఏర్పాటై నేటికి 75 ఏళ్లు
- ప్రజా ప్రయోజనాలను కాపాడటంలో 'సుప్రీం' కమాండర్
- రాజ్యాంగం, సమానత్వ పరిరక్షణలో కీలక భూమిక
- 1950, జనవరి 28న 8 మంది జడ్జీలతో ఏర్పాటు

- వివరాలు 12లో▶

క్లుప్తంగా...

వచ్చే నెల 28 కల్లా కౌంటర్ దాఖలు చేయండి

జీవో 46 కేసుపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో 5,010 పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 46ను సవాలు చేస్తూ దాఖలైన కేసులో పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. జీవో 46ను సవాలు చేస్తూ చేసిన వాదనలను తోసిపుచ్చి గతేడాది ఆగస్టు 28న తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ మాటూరి శ్రీకాంత్ సహా 74 మంది అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓక్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని గతేడాది డిసెంబర్ 10న సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వం సహా ప్రతివాదులను ఆదేశించగా.. రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదని ధర్మాసనం గుర్తించింది. అయితే ఈ కేసులో కౌంటర్ దాఖలుకు ప్రభుత్వం తరపు న్యాయవాది రెండు నెలల గడువు కోరగా వచ్చే నెల 28వ తేదీకల్లా రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అనంతరం సుప్రీంకోర్టులో వాదనలకు హాజరైన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, పిటిషనర్‌లో ఒకరైన ఏనుగుల రాకేశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే జీవో 46ను రద్దు చేస్తామని హామీ ఇచ్చి, నిరుద్యోగ యువతను ఎన్నికల సామగ్రిలాగా వాడుకొని వదిలేయడం చాలా దుర్మార్గమని మండిపడ్డారు.

మున్సిపాలిటీల్లోని కూలీలకు వర్తింపుపై

నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోండి

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై సర్కార్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 26న ప్రారంభించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని మున్సిపాలిటీల్లోని కూలీలకు వర్తింపజేయడంపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఏ నిర్ణయం తీసుకున్నా చట్టప్రకారమే ఉండాలని, ఆ వివరాలను పిటిషనర్‌కు తెలియజేయాలని స్పష్టం చేసింది. ముందుగా పిటిషనర్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి ఓ వినతిపత్రం సమర్పించాలని సూచించింది. గ్రామాల్లో భూమి లేని రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు చెల్లించేలా ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో పథకాన్ని రూపొందించింది. అయితే ఈ పథకాన్ని పట్టణాలు, పురపాలికల్లోని రైతు కూలీలకు ఇవ్వడం లేదని రైతు గవినోళ్ల శ్రీనివాస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది.

నేడు ప్రొద్దటూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

శంకర్‌పల్లి: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూర్ గ్రామానికి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారు. ఇక్కడ 150 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'ఎక్స్‌పీరియం'పార్కును మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సీఎం ప్రారంభిస్తారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సినీనటుడు చిరంజీవి కూడా హాజరవుతారని పార్కు అధినేత రాందేవ్‌రావు తెలిపారు. తమ పార్కులో అరుదైన జాతుల 25 వేల రకాల మొక్కలను పెంచామన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం: లచ్చిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. రెవెన్యూ ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ ఇక నుంచి రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్‌తో కలిసి పని చేస్తుందన్నారు. రెవెన్యూ ఉద్యోగులకు ఎలాంటి ఆపద వచ్చినా తోడుగా ఉంటామని తెలిపారు. నాంపల్లిలోని సీసీఎల్ఏ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో లచ్చిరెడ్డి మాట్లాడారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మంచిరోజులు రాబోతున్నాయన్నారు.



పంజగుట్ట చౌరస్తాలో విధులు నిర్వర్తిస్తూ...

మేం మారాం..!

ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్ల కొత్త జీవితం

నెలరోజులుగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న 39 మంది

ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా విధుల నిర్వహణ

ఫలితాన్నిస్తున్న నగర ట్రాఫిక్ విభాగం శిక్షణ

- ట్రాఫిక్ విభాగంలో ట్రాన్స్‌జెండర్ల సేవలు అంటూ ప్రభుత్వం ప్రకటించినప్పుడు అంతా తేలిగ్గా తీసుకున్నారు...
- సిటీ పోలీసులు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా 44 మందిని ఎంపిక చేసిన తర్వాత శిక్షణ అయ్యే - వరకు వీళ్లు ఉంటారా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి.
- శిక్షణ పూర్తి చేసుకున్న 39 మంది విధుల్లో చేరనున్నారని తెలిశాక, వీళ్లు పట్టుమని పది రోజులు కూడా పని చేయరని, వివాదాలు తప్పవని భావించారు.
- కానీ నెల రోజులుగా 38 మంది ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పని చేస్తుంటే అంతా ముక్కున వేలేసుకుంటున్నారు.
- ఒకరిద్దరు ట్రాన్స్‌జెండర్లు భవిష్యత్తులో జరగబోయే కానిస్టేబుల్, ఎస్సై పరీక్షల్లోనూ పోటీపడేలా కోచింగ్ తీసుకునే ప్రయత్నాలు ప్రారంభించడం మరింత ఆసక్తికరం.

సాక్షి, హైదరాబాద్: ట్రాన్స్‌జెండర్లకు సమాజంలో సముచిత స్థానం, గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ట్రాఫిక్ విభాగంలో హోంగార్డుల మాదిరి ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ఎంపిక చేయడం ద్వారా ఉపాధి కల్పించాలని ఆదేశించింది. దీంతో హైదరాబాద్ ట్రాఫిక్ విభాగంలో పైలెట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేశారు. ఏదో ఆషామాషీగా కాకుండా ఎంపిక, శిక్షణలో కట్టుదిట్టంగా వ్యవహరించారు. గత ఏడాది డిసెంబర్ 4న గోషామహల్‌లోని పోలీసు స్టేడియంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. మహిళా శిశుసంక్షేమ శాఖ కూడా ఇందులో పాలుపంచుకుంది. సాంఘిక సంక్షేమ శాఖ నుంచి అర్హులైన ట్రాన్స్‌జెండర్ల వివరాలను పోలీసులు సేకరించారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. 165 సెంటీమీటర్ల ఎత్తు, (ఎస్టీలు 160 సెం.మీ) కలిగి ఉండాలనే నిబంధన విధించారు. శరీర దారుఢ్య పరీక్షల్లో భాగంగా 800 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షాట్ పుట్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు మొత్తం 58 మంది హాజరు కాగా 44 మంది ఎంపికయ్యారు.

హావభావాల నుంచి అన్నీ మార్చి..

సిటీ ట్రాఫిక్ విభాగం ఆధీనంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (టీటీఐ) అధికారులు గోషామహల్ స్టేడియం కేంద్రంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం 15 రోజుల ట్రైనింగ్‌లో నాలుగు రోజులు కేవలం వారి ప్రవర్తన మార్చడానికే వెచ్చించారు. ఈ ట్రాన్స్‌జెండర్లు ఏళ్ల తరబడి ఓ విధమైన హావభావాల ప్రదర్శన, విపరీత ప్రవర్తన, క్రమశిక్షణ లేని జీవనశైలికి అలవాటుపడ్డారు. వీరిని పోలీసు విభాగంలోకి తీసుకుంటుండడం, అదీ ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగి ఉండే ట్రాఫిక్ వింగ్‌లో పని చేయించనుండటంతో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. నడక, నడవడిక, హావభావాలు, మాట తీరే కాదు... ఆహారం తినే విధానాన్నీ చక్కదిద్దారు. వారిలో స్ఫూర్తి నింపడం కోసం వారికి హీరోయిన్లు, యాంకర్ల వీడియోలు చూపించారు. ఆపై ఐదో రోజు నుంచి ట్రాఫిక్ శిక్షణ మొదలైంది.

క్షేత్రస్థాయిలో సమర్థంగా విధులు

అంబర్‌పేట, బహదూర్‌పుర, బంజారాహిల్స్, బేగంపేట, బోయిన్‌పల్లి, చిక్కడపల్లి, చాంద్రాయణగుట్ట, చిలకలగూడ, జూబ్లీహిల్స్, కాచిగూడ, లంగర్‌హౌస్, మహంకాళి, మలక్‌పేట్, మారేడ్‌పల్లి, నల్లకుంట, పంజగుట్ట, ఎస్సార్‌నగర్, సంతోష్‌నగర్, తిరుమలగిరి, టోలిచౌకి.. ఈ 20 ట్రాఫిక్ పోలీసుస్టేషన్లలోనూ వీరు క్షేత్రస్థాయి విధుల్లోనే ఉండటం గమనార్హం.

వెన్నుతట్టి ప్రోత్సహించి..

ఎంపికైన 44 మందిలో 39 మంది మాత్రమే శిక్షణ పూర్తి చేసుకున్నారు. మిగిలిన ఐదుగురూ అప్పటికే ఉన్న ఉద్యోగాల కారణంగా వెళ్లిపోయారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించిన తర్వాత తుది జాబితా ఖరారు చేశారు. 'సమాజంలో మీకు ఎదురవుతున్న అవమానాలు, మీ పట్ల వివక్షను చూసిన ప్రభుత్వం ఈ అవకాశం ఇచ్చింది. మీ పని తీరుపైనే మీలాంటి ఇతరుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది..'అంటూ వెన్ను తట్టి హితవు పలికిన నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ డిసెంబర్ 22న వీరి శిక్షణ పూర్తి అయినట్లు ప్రకటించారు. వీరి కవాతునూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో వీక్షించారు. అనంతరం డిసెంబర్ 26 నుంచి ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా తమ కొత్త జీవితం ప్రారంభించారు. ఇప్పటికి నెల గడిచింది. ఈ నెల రోజుల్లో కేవలం ఒక్కరు మాత్రమే ఈ ఉద్యోగం వదిలి వెళ్లగా... మిగిలిన వారు సమర్థంగా తమ విధులు నిర్వర్తిస్తున్నారు.

నాలుగు పథకాలు.. ఒక్కరోజు లబ్ధిదారులు 6,15,677 మంది

- రైతుభరోసాకు రూ.569 కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు రూ.10.91 కోట్లు విడుదల చేసిన ఆర్థిక శాఖ
- కూలీలకు భరోసా దేశంలోనే ప్రథమమన్న మంత్రి సీతక్క
- మండలంలో ఒక రెవెన్యూ గ్రామానికి రైతు భరోసా ఇచ్చామన్న మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: నాలుగు సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజునే 6,15,677 మందికి లబ్ధి చేకూరినట్టు ప్రభుత్వం ప్రకటించింది. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఆర్థికశాఖ రూ. 579 కోట్లు విడుదల చేసింది. ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం ఉదయం నుంచి రైతులు, వ్యవసాయ కూలీల ఖాతాల్లోకి ఈ నిధులు జమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 563 గ్రామీణ మండలాల్లో ఎంపిక చేసిన 563 రెవెన్యూ గ్రామాల్లో ఈ పథకాలను ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. రైతులకు రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతోపాటు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు కొత్తగా ఆహారభద్రత కార్డులను జారీ చేసింది. ఇల్లు లేని పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం మంజూరు పత్రాలను అందించినట్టు ప్రభుత్వం తెలిపింది. పాత కార్డుల్లో అదనంగా కుటుంబసభ్యుల నమోదు ప్రక్రియను పూర్తి చేసినట్టు చెప్పింది.

రైతుభరోసా 9.48 లక్షల ఎకరాలకు..

రైతుభరోసా కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.569 కోట్లు విడుదల చేసింది. మొత్తం 32 జిల్లాల్లోని 563 గ్రామాల్లో 4,41,911 మంది రైతులకు ఎకరానికి తొలివిడతగా రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం అందింది. మొదటి రోజునే 9,48,333 ఎకరాల విస్తీర్ణంలోని భూమికి రైతు భరోసాను చెల్లించింది.



18,180 కుటుంబాలకు ఆత్మీయ భరోసా

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద తొలి రోజున 18,180 వేల వ్యవసాయ కూలీ కుటుంబాలకు రూ.6 వేల చొప్పున నగదు సాయాన్ని వారి ఖాతాల్లో జమ చేసింది. ఈ పథకానికి తొలిరోజునే ఆర్థిక శాఖ రూ.10.91 కోట్లు విడుదల చేసింది.

రేషన్‌కార్డులు.. ఇందిరమ్మ ఇళ్లు

రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. తొలి రోజున 531 గ్రామాల్లో 15,414 కొత్త కార్డులు ఇచ్చింది. వీటిలో 51,912 మంది కుటుంబ సభ్యులు లబ్ధి పొందినట్లు ప్రభుత్వం తెలిపింది. పాత రేషన్‌కార్డుల్లో అదనంగా కుటుంబ సభ్యులను చేర్చాలంటూ వేలాది కార్డుదారులు దరఖాస్తు చేసుకున్నారు. ఏళ్లకేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరించింది. 1,03,674 మంది పేర్లను పాత రేషన్‌కార్డుల్లో చేర్చారు. గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తొలి రోజునే అర్హులైన 72 వేల మందికి ఇళ్ల పత్రాలను ప్రభుత్వం అందజేసింది.

మొదలైన భరోసా | సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో

రైతు భరోసా	:	4,41,911
ఆత్మీయ భరోసా	:	18,180
ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు	:	72,000
రేషన్ కార్డుల్లో కొత్తగా...	:	51,912
పాత కార్డుల్లో పేర్ల చేర్పు	:	1,03,674

చరిత్రలో ప్రప్రథమం.. దేశానికే ఆదర్శం : మంత్రి సీతక్క



ఏ ఆస్తి లేని కూలీలకు భరోసాగా తెలంగాణ సర్కార్ ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. చరిత్రలోనే ప్రప్రథమంగా దేశానికే ఆదర్శంగా నిలుస్తూ వ్యవసాయ కూలీలకు ఏటా రూ. 12వేల చొప్పున ఆర్థిక సాయం అందించే పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు.

మండలంలో ఒక రెవెన్యూ గ్రామానికి : తుమ్మల



రైతుభరోసా నిధులు జిల్లాలో ప్రతి మండలానికి ఒక్కో రెవెన్యూ గ్రామం చొప్పున విడుదల చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. అవి సోమవారం రైతుల అకౌంట్లలో జమ అయ్యాయన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా పథకాన్ని వర్తింపచేస్తామన్నారు

కొత్త పట్టాలకూ 'భరోసా'

ఈ ఏడాది జనవరి 1వ తేదీలోపు రిజిస్ట్రేషన్ అయిన వ్యవసాయ భూములకు వర్తింపు



సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా విషయంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గత సంవత్సరం ఆఖరు వరకు భూములు కొనుగోలు చేసి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులందరికీ 'రైతుభరోసా'కింద ఎకరానికి రూ. 6వేలు అందించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు జనవరి 1వ తేదీ లోపు పట్టాదార్‌పాస్ పుస్తకాలు పొందినవారు దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించింది.

కొత్తగా దరఖాస్తు తప్పనిసరి

జనవరి 1వ తేదీ వరకు పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందినవారు రైతుభరోసా పథకానికి వ్యవసాయ విస్తరణాధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలి. పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ లేదా ధరణి(భూభారతి)లో రిజిస్ట్రేషన్ రోజు ఇచ్చిన డ్రాఫ్ట్ పాస్ బుక్ కాపీని, పట్టాదారు బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌ను జతచేసి దరఖాస్తు చేసుకోవాలి. వ్యవసాయ భూముల డేటా వ్యవసాయ విస్తరణాధికారుల వద్ద ఉండడంతో వారు దాన్ని సరిచూసుకొని రైతుభరోసాకు లింక్ చేస్తారు. ఇప్పటికే రైతుబంధు తీసుకుంటున్న వారికి ఆటోమేటిక్‌గా ఆర్థికసాయం అందుతుంది. వారెవరూ కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. అయితే కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల దరఖాస్తులకు చివరి గడువు తేదీని ప్రకటించలేదు.

బరాబర్ చెప్తున్నం.. గద్దర్‌కు అవార్డు ఇచ్చేది లేదు

జాబితా పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్త తీసుకోవాలి: బండి



సాక్షి, హైదరాబాద్: 'పద్మ అవార్డుల జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలి. గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తాం? వందల మంది బీజేపీ కార్యకర్తలు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తే నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్. బరాబర్ చెప్తున్నం. నక్సల్స్ కోసం పాటలు పాడిన గద్దర్‌కు అవార్డు ఇచ్చేది లేదు'అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. పద్మ అవార్డుల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కలిసి తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో, ఎవరు బలయ్యారో ప్రజలకు అర్థమైందని, ఇక ఆ పార్టీల మాటలను ప్రజలు నమ్మరని ఆయన అన్నారు.

పథకాల పేర్లు మార్చితే ఊరుకోం..

రాష్ట్రాల్లో కేంద్ర పథకాల పేర్లు మార్చితే ఊరుకోబోమని బండి సంజయ్ హెచ్చరించారు. గరీబ్ కల్యాణ్ యోజన, పీఎం ఆవాస్ యోజన వంటి కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను రాష్ట్ర ప్రభుత్వం మార్చాలని అనుకుంటోందన్నారు. రాష్ట్రం పేర్లు మార్చాలనుకుంటే మాత్రం.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కల్యాణ్ యోజన వంటి పథకాలను రాష్ట్ర సర్కార్ ప్రమేయం లేకుండా కేంద్రమే నేరుగా ప్రజలకు అందిస్తుందని స్పష్టం చేశారు. పరిస్థితిని అంతవరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఖర్చయ్యే సంక్షేమ పథకాలకు ఎవరి పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్ వైఖరి మారుతోంది

మీట్ ది ప్రెస్‌లో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి మారుతోందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి నాలుగున్నర నెలలు గడిచినా.. ఇప్పటికీ వర్గీకరణ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో మందకృష్ణతో సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీట్ ది ప్రెస్ నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న తీరుపై ఘాటుగా స్పందించారు. 'వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత మొదటగా స్పందించిన వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి. వర్గీకరణ అమలులో తెలంగాణ మొదటి రాష్ట్రం అవుతుందని, గత నోటిఫికేషన్లకు కూడా వర్గీకరణ అమలు చేస్తామని చెప్పింది ఆయనే. కానీ మాట మార్చి నియామకాలు చేపడుతున్నారు. డీఎస్సీ, గ్రూప్-4 పూర్తి చేయడంతోపాటు వివిధ నోటిఫికేషన్ల భర్తీ ప్రక్రియ పూర్తయ్యింది. గ్రూప్-1,2,3 కూడా త్వరలో భర్తీ చేయనున్నారు. ఈ నియామకాలతో మాదిగలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏదో ఒక రకమైన సాకుతో వర్గీకరణను ఆపే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతుంది. సీఎం రేవంత్ వర్గీకరణకు అనుకూలంగా ఉన్నా, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఆయన సోదరుడు, కుమారుడు ఈ ప్రక్రియను అడ్డుకోవాలని నిర్ణయించారు. అందుకే అధిష్టానంపైన ఒత్తిడి చేసి వర్గీకరణకు బ్రేకులు వేస్తున్నారు. వర్గీకరణలో తీవ్ర జాప్యం జరుగుతున్నందున ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో 'లక్ష డప్పులు, వేల గొంతుకలు'కార్యక్రమాన్ని చేపడుతున్నాం. కేవలం దళితులే కాకుండా అన్ని కులాలకు చెందినవారు ఈ కార్యక్రమానికి మద్దతుగా ఉన్నారు'అని చెప్పారు. వర్గీకరణ సాధించిన తర్వాత ప్రజాసమస్యలపై ఉద్యమాలు కొనసాగిస్తానని, ఏ పార్టీ జెండా వేసుకోనన్నారు. రాష్ట్రంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అమలులో లోపాలున్నాయని, జనాభా కంటే రిజర్వేషన్లు ఎక్కువగా ఉండడం ఇతర వర్గాలకు నష్టం కలిగించడమే అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి అన్ని సమస్యలపైనా ఉద్యమాలు కొనసాగిస్తానన్నారు.



జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో రాహుల్, ఖర్గేలతో సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, ఎంపీ మల్లు రవి తదితరులు..

ఓవైపు గాంధీ పరివార్.. మరోవైపు గాడ్సే పరివార్

▶ మొదటి పేజీ తరువాయి

చేపట్టిన నాటి నుంచీ మోదీ రాజ్యాంగాన్ని మార్చే పనిలో ఉన్నారు. గజనీ మహ్మద్ నాడు భారత్‌ను దోచుకునేందుకు యత్నించినట్టు నేడు రాజ్యాంగాన్ని మార్చేందుకు మోదీ యత్నిస్తున్నారు. అయితే ఆయన ప్రయత్నాలు ఫలించడం లేదు. మోదీ యత్నాలు ముందే గుర్తించిన రాహుల్‌గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్నారు. నాడు బ్రిటిషర్ల నుంచి దేశాన్ని మహాత్మాగాంధీ రక్షించినట్టు నేడు బ్రిటిష్ జనతా పార్టీని ఎదుర్కొనేందుకు ఆయన నిలబడ్డారు. ఈ యుద్ధంలో అందరూ రాహుల్‌గాంధీతో కలిసి నడవాలి. రాజ్యాంగ పరిరక్షణ కోసం కలిసికట్టుగా పోరాడాలి..' అని సీఎం పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, మాజీ ఎంపీలు, పార్టీ సీనియర్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దావోస్ పెట్టుబడులూ 6 గ్యారంటీల్లాగే..

▶ మొదటి పేజీ తరువాయి


విద్యార్థి విభాగం డైరీ, కేలండర్ ఆవిష్కరణలో కేటీఆర్ పాల్గొన్నారు.

సీఎం సహా కేబినెట్‌వి పచ్చి అబద్ధాలు: 'వంద రోజుల్లో హామీల అమలు పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 13 నెలల్లోనే పూర్తిగా విఫలమైంది. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం విక్రమార్క సహా కేబినెట్ మంత్రులు, నేతలు అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారు. బాండ్ పేపర్లు, అఫిడవిట్లతో గోబెల్స్ సిగ్గుపడేలా ప్రచారం చేసిన సీఎం.. రేషన్‌కార్డులు ఇవ్వడాన్ని కూడా చారిత్రక కార్యక్రమం అనే భావదారిద్ర్యంలో ఉన్నారు. బీఆర్ఎస్ పాలనలో 6.47 లక్షల రేషన్ కార్డులను ఇచ్చాం'అని కేటీఆర్ తెలిపారు.

డూప్లికేట్ గాంధీ వైఫల్యాలు ఎండగట్టాలి: డూప్లికేట్ గాంధీలు ఇచ్చిన దొంగ హామీలు, వైఫల్యాలను ఎండగట్టాలని విద్యార్థులు, యువతకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ యువతకు వివిధ హామీలిచ్చి 400 రోజులు గడిచిన సందర్భంగా ఈ నెల 31న రాష్ట్రవ్యాప్తంగా గాంధీ విగ్రహాలకు నివాళులు అర్పించాలని సూచించారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రులు పువ్వాడ అజయ్, మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గ్యాదరి కిషోర్, పార్టీ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, చిరుమల్ల రాకేశ్, బాలరాజు యాదవ్, ఆంజనేయ గౌడ్, రాజారాం యాదవ్, శుభప్రద్ పటేల్, తుంగ బాలు పాల్గొన్నారు.

గద్దర్‌ను ఆలింగనం చేసుకున్నప్పుడు భావజాలం గుర్తు రాలేదా?

బండి సంజయ్‌పై టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలకే అవార్డులు ఇవ్వాలని రాజ్యాంగంలో రాసిపెట్టి ఉందా? అని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ధ్వజమెత్తారు. గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. వెంటనే ఆయనను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ప్రధాని మోదీని సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'నాడు ప్రజా యుద్ధనౌక గద్దర్‌ను ఆలింగనం చేసుకున్నప్పుడు ఆయన భావజాలం గుర్తు రాలేదా? బీజేపీ నేతలు ఒప్పుకోకపోయినా గద్దర్ పేరు చిరస్మరణీయం. కరసేవకుల మీద కాల్పులు జరిపించిన నేతలకు అవార్డులు ఇచ్చినప్పుడు బండి సంజయ్ భావజాలం ఎటుపోయింది? వామపక్ష అభిప్రాయాలున్నవారు బీజేపీలో లేరా? నక్సలిజమే నా ఎజెండా అని చెప్పిన ఈటల రాజేందర్‌ను పార్టీలో చేర్చుకుని ఎంపీగా ఎలా చేశారు? నక్సలైట్లు దేశభక్తులన్న ఎన్టీఆర్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోలేదా? గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ భావజాలం ఉన్నవారు ఎంత మంది మీ పార్టీ టికెట్‌పై పోటీ చేశారు? కొత్తగా ఎన్నికైన బీజేపీ మండలాధ్యక్షుల్లో ఎంతమంది మీ భావజాలం నచ్చిన వారున్నారు? పార్టీ సిద్ధాంతాలు, భావజాలానికి బీజేపీ ఎప్పుడో తిలోదకాలిచ్చింది. బండి సంజయ్ కార్పొరేటర్‌కు ఎక్కువ.. కేంద్ర మంత్రికి తక్కువ. తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడు వస్తే తన ప్రాధాన్యం తగ్గిపోతుందని ఆయన అసహనంతో మాట్లాడుతున్నారు' అని ఆ ప్రకటనలో మహేశ్‌గౌడ్ అభిప్రాయపడ్డారు.

ట్యాపింగ్ కేసు విచారణ ఇంకెన్నాళ్లు?

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసు విచారణకు ఇంకెంత సమయం పడుతుందని.. ఎంత కాలం తీసుకుంటారని ప్రశ్నించింది. కేసులో నిందితుడు ఏఎస్పీ తిరుపతన్నకు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇంకా జైల్లో ఉండాల్సిన అవసరం లేదు..

ఫోన్ ట్యాపింగ్ కేసులో తిరుపతన్న బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ నాగరత్న ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. తొలుత ప్రభుత్వం తరఫున న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా వాదనలు వినిపిస్తూ.. 'ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఏఎస్పీ తిరుపతన్నే ప్రధాన నిందితుడు. ఆయన పాత్రపై దర్యాప్తు పూర్తి చేసేందుకు మరో 4 నెలల సమయం పడుతుంది. ఈ కేసులో మరికొందరు కీలక సాక్షులను ఇంకా విచారించాల్సి ఉన్నందున తిరుపతన్నకు బెయిల్ ఇవ్వరాదు..''అని ధర్మాసనానికి విన్నవించారు. బెయిలిస్తే ఆధారాలను, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే ఇన్నేళ్లుగా కెరీర్‌లో ఎలాంటి ఫిర్యాదు లేని పోలీస్ అధికారి సాక్ష్యాలను ప్రభావితం చేస్తారని తాము భావించడం లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ కేసులో పది నెలలుగా తిరుపతన్న జైలులోనే ఉన్నారని.. చార్జిషీట్ కూడా దాఖలైన నేపథ్యంలో ఆయన ఇంకా జైలులో ఉండాల్సిన అవసరం తమకు కనిపించడం లేదని పేర్కొంది. ఈ మేరకు తిరుపతన్నకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. కేసు దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని తిరుపతన్నను ఆదేశించింది. ఆయన హైదరాబాద్ వదిలి వెళ్లకూడదని.. వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. ఇక కేసులో ఆధారాలను, సాక్షులను ప్రభావితం చేసేందుకు తిరుపతన్న ప్రయత్నిస్తే బెయిల్ రద్దు కోసం రాష్ట్ర ప్రభుత్వం కోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. మిగతా షరతులన్నీ ట్రయల్ కోర్టు నిర్ణయిస్తుందని తెలిపింది.

ట్యాపింగ్ కేసుపై డీసీపీ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా చోటు చేసుకున్న అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసుపై వెస్ట్ జోన్ డీసీపీ ఎస్ఎం విజయ్‌కుమార్ సోమవారం సిట్ అధికారులతో సమీక్షించారు. ఈ కేసులో నిందితుడు తిరుపతన్నకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో.. ఇప్పటివరకు సేకరించిన సాక్ష్యాధారాలు, నమోదు చేసిన వాంగ్మూలాలను సమీక్షించినట్టు తెలిసింది. ఈ కేసులో కీలకమైన ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు, మీడియా చానల్ అధినేత శ్రవణ్‌రావులను విదేశాల నుంచి వెనక్కి రప్పించడం, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చించినట్టు సమాచారం.

● ఇందుమూలంగా యావన్మందికీ తెలియచేయునది ఏమనగా..


‘సూపర్ సిక్స్’ ఇవ్వలేం!

ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నా.. అందరూ అర్థం చేసుకోండి

ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు తొమ్మిదేళ్లు పడుతుందో.. పదేళ్లు పడుతుందో..

నీతి ఆయోగ్ నివేదికపై ప్రజెంటేషన్‌లో ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

తల్లికి వందనంపై ఇక తర్జన భర్జన లేదు..
46 లక్షల మంది తల్లులకు షాక్!
అన్నదాతా సుఖీభవపై ఆలోచనే అనవసరం..
54 లక్షల మంది రైతన్నల్లో నిర్వేదం!
ఆడబిడ్డ నిధి కింద ఏటా రూ.18 వేల సాయం గల్లంతే.. 1.80 కోట్ల మంది అక్క చెల్లెమ్మల ఆక్రందన!
నిరుద్యోగ భృతి నీటి పాలేనని కోటి మంది యువతలో తీవ్ర ఆందోళన!
సూపర్ సిక్స్‌లు.. సెవెన్లు ఇక గాలిలో కలిసినట్లే!
ఎందుకంటే.. సూపర్ సిక్స్‌లు కావాలంటే ఏపీ వృద్ధి రేటు 15 శాతానికి పెరగాలి!
అందుకే.. విజన్ 2047 డ్యాకుమెంట్లను ఇంట్లో భద్రంగా దాచుకోమని
తనను నమ్మి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ
సీఎం చంద్రబాబు పరోక్షంగా చెప్పేశారు!
ప్రెస్ మీట్ సాక్షిగా వారిలో ఏ మూలో దాగిన ఆశలను పటాపంచలు చేశారు!!



సాక్షి, అమరావతి: ఇందుమూలంగా ఐదున్నర కోట్ల మంది ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా.. సంపద సృష్టించాకే సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తామంటూ ఎన్నికల వాగ్దానాలపై సీఎం చంద్రబాబు చేతులెత్తేశారు! తన మార్కు రాజకీయాన్ని ప్రజలకు మరోసారి రుచి చూపించారు. మోకాలికి బోడి గుండుకు ముడిపెడుతూ.. సూపర్ సిక్స్ హామీలకు, వృద్ధి రేటుకు లంకె పెట్టారు! కేంద్రం ఇస్తున్న డబ్బులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి.. సంపద సృష్టించి.. ఆదాయం పెరిగితే.. అప్పుడు రైతు భరోసా, తల్లికి వందనం అమలు చేస్తామని వెల్లడించారు. గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాటన పెట్టేందుకు తొమ్మిదేళ్లు పడుతుందో పదేళ్లు పడుతుందో అంతుబట్టడం లేదంటూ కాడి పారేశారు. సూపర్ సిక్స్‌లు.. సెవెన్లు అంటూ ఎన్నికల హామీలతో ఊరించి ఏడు నెలల పాటు దాగుడు మూతలతో నెట్టుకొచ్చిన సీఎం చంద్రబాబు ఎట్టకేలకు ముసుగు తొలగించారు! వాస్తవ పరిస్థితిని చెప్పి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నానంటూ తన మనసులో ఎప్పుడో ఆవిష్కృతమైన వాటిని కుండబద్దలు కొట్టారు. రాష్ట్రాల ఆర్థిక ఆరోగ్య సూచికలపై నీతి ఆయోగ్ నివేదిక ఆధారంగా సీఎం చంద్రబాబు సోమవారం సచివాలయంలో విలేకరుల సమావేశంలో ప్రజెంటేషన్ ఇచ్చారు.

అబ్బే... ఇప్పుడు చేయలేం...!

రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) ఏటా 15 శాతం మేర పెరిగి తద్వారా ఆదాయం, సంపద సమకూరిన తరువాతే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాబడి తగ్గుతోందని.. ప్రజలందరూ దీన్ని అర్థం చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాల అమలుకు వెసులుబాటు లేదని, అవకాశం ఉంటే ఒక్క నిమిషం కూడా జాప్యం చేయనని చెప్పారు. వృద్ధి రేటు పెరిగి సంపద, ఆదాయం పెరిగితేనే వెసులుబాటు వస్తుందని, అప్పటి వరకు సూపర్ సిక్స్ అమలులో జాప్యం తప్పదని సీఎం స్పష్టం చేశారు. వీటితో మాకేం సంబంధం? బాబు చేస్తారని ఓటు వేశామని, హామీలు అమలు చేయాలనే విధంగా సామాన్య ప్రజలు ఆలోచన చేస్తున్నారని, అందుకే వాస్తవ పరిస్థితిని చెప్పి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నానని వెల్లడించారు.

నమ్మి ఓట్లు వేశాం కదా..!

ఇంకా హామీలను అమలు చేయడం లేదని కొంత మంది ఆలోచన చేస్తున్నారని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. డబ్బులున్నాయి కదా..! ఎందుకు అమలు చేయడం లేదు? నమ్మి ఓట్లు వేశాం కదా..! అనే ఫీలింగ్‌లోకి ప్రజలు వెళ్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పోలవరానికి రూ.12,150 కోట్లు రాగా, అమరావతికి రూ.15,000 కోట్లు వచ్చాయని, విశాఖ ఉక్కు రివైవ్ (పునరుద్ధరణ)కు రూ.11,114 కోట్లు ఇచ్చిందని, అయితే వాటిని సంక్షేమానికి వ్యయం చేయలేనని చంద్రబాబు పేర్కొన్నారు.

తొమ్మిదేళ్లు పడుతుందో.. పదేళ్లు పడుతుందో..!

గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నానని, ఇందుకు తొమ్మిదేళ్లు పడుతుందో పదేళ్లు పడుతుందో తెలియడం లేదని, సూపర్ సిక్స్ హామీల అమలుకు లేట్ అవుతుందని చంద్రబాబు చెప్పారు. విశ్వ ప్రయత్నం చేసినా ఇంకా పూర్తిగా కంట్రోల్‌లోకి రాలేదన్నారు. ఆర్థికంగా వెసులుబాటు వచ్చిన తరువాత సంపద సృష్టించడం ద్వారా ఆదాయం పెంచిన అనంతరం సంక్షేమ పథకాలను అమలు చేస్తానన్నారు. అందుకే ప్రజలకు వాస్తవాలు చెబుతూ అవగాహన కల్పిస్తున్నామన్నారు.

గత ప్రభుత్వం ఎక్కువ అప్పులు చేసింది..

గత ప్రభుత్వం ఎక్కువ అప్పులు చేసిందని, మూలధన వ్యయం తక్కువ చేసిందని, దీంతో వృద్ధి తగ్గిపోయిందని చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్వాకం కారణంగా వృద్ధి రేటు తగ్గిపోయి అప్పులు పెరిగాయన్నారు. రెవెన్యూ మాత్రం పెరగలేదన్నారు. తద్వారా ఏడాదికి రూ.76 వేల కోట్లు నష్టపోతున్నట్లు చెప్పారు. అభివృద్ధిపై డబ్బులు వ్యయం చేయడం ద్వారా 15 శాతం వృద్ధి సాధించే ప్రయత్నం చేస్తున్నానని, తద్వారా సంపద వస్తుందని, దాన్ని సంక్షేమానికి వెచ్చిస్తానని తెలిపారు.

శ్రీలంకలా రాష్ట్రం..

ప్రజల కోరికలు తీర్చాలంటే రెవెన్యూ రాబడి పెరగాల్సి ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థతో పాటు మిగతా వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నానని, అయితే ఇందుకు ఇంకా సమయం పడుతుందన్నారు. రాష్ట్రం శ్రీలంకలా అవుతోందని గతంలోనే చెప్పానని, ఇప్పుడు నీతి ఆయోగ్ కూడా రాష్ట్ర ఆరోగ్య సూచికల్లో అదే చెప్పిందన్నారు. గత ప్రభుత్వం అప్పులు చేసి జల్సాలు చేసిందని సీఎం చంద్రబాబు ఆరోపించారు. అప్పులు తీర్చే స్తోమత కూడా లేకుండా చేసిందన్నారు. కచ్చితంగా వ్యయం చేయాల్సిన వేతనాలు, పెన్షన్లు, వడ్డీల చెల్లింపు, పరిపాలన వ్యయం గత ప్రభుత్వంలో 64.6 శాతానికి పెరిగిందన్నారు. మరో పక్క మూలధన వ్యయం తగ్గిపోయిందన్నారు.

టీడీపీ మేనిఫెస్టోలో ఇతర హామీలివీ..

- పూర్ టు రిచ్.. పీ–4 పథకాలు అంటూ ఇంతవరకు ఏ ఒక్కటీ ప్రకటించలేదు
- ఏటా జాబ్ క్యాలెండర్ జాడే లేదు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే రూ.4 వేల పింఛను హామీ మేనిఫెస్టోకే పరిమితం.
- రూ.5 వేల కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరణ అమలు చేయలేదు
- ఉద్యోగుల సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని పునఃసమీక్షిస్తామని చెప్పి కనీసం చర్చ కూడా జరపలేదు
- ఉద్యోగులకు ఐఆర్, డీఏ హామీని విస్మరించారు
- వలంటీర్ల గౌరవ వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచకపోగా ఏకంగా ఆ వ్యవస్థకే మంగళం పాడారు
- కాపుల సంక్షేమ కోసం ఐదేళ్లలో రూ.15 వేల కోట్లు కేటాయిస్తామని బడ్జెట్‌లో అందుకు తగ్గట్టు నిధులు ఇవ్వలేదు
- విద్యుత్ బిల్లుల భారం తగ్గించకపోగా ఆర్నెళ్లలోనే రూ.15 వేల కోట్లకుపైగా చార్జీల భారం మోపారు.
- ఉచితంగా ఇసుక అంటూ పచ్చముఠాల దోపిడీ విధానాన్ని తీసుకొచ్చారు.

‘కాళేశ్వరం’ రుణాన్ని రీస్ట్రక్చర్ చేయరూ

- ఆర్‌ఈసీ నుంచి ఎన్‌బీఎఫ్‌సీకి బదలాయించాలని కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- తద్వారా మూడేళ్లలో అసలు చెల్లిస్తామని ప్రతిపాదన

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధిక వడ్డీలకు కాళేశ్వరం కార్పొరేషన్ కింద తెచ్చిన దాదాపు రూ.80 వేల కోట్ల రుణాలను రీస్ట్రక్చర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్‌ఈసీ) లిమిటెడ్ నుంచి తెచ్చిన ఈ రుణాలను వడ్డీ తక్కువగా ఉండే బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌ఎఫ్‌బీసీ)కు బదలాయించాలని ప్రతిపాదించినట్లు ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. కాళేశ్వరం అప్పుల కింద ఏడాదికి రూ.14 వేల కోట్ల వరకు చెల్లిస్తున్నామని, దీనికి మరో రూ.10 వేల కోట్లను అదనంగా చెల్లిస్తామని ఈ ప్రతిపాదనలో రాష్ట్రం వెల్లడించినట్లు సమాచారం. ఇలా చెల్లించడం ద్వారా కాళేశ్వరం కింద తీసుకున్న అప్పులో అసలును మూడేళ్లలో చెల్లించే వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నట్లు తెలియవచ్చింది. అయితే ఇందుకు ప్రతిగా 9 నుంచి 10.5 శాతం వరకు ఉన్న వడ్డీని 7 శాతానికి తగ్గించేలా ఆర్‌ఈసీ నుంచి రుణమార్పిడి ప్రక్రియకు అంగీకారం తెలపాలని కోరినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ ముందు విచారణకు హాజరైనప్పుడు కూడా ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఇదే అంశాన్ని వెల్లడించారు. కాళేశ్వరం అప్పునకు ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చినందున ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంటుందని, అయితే రుణాలను రీస్ట్రక్చర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరిందని ఆయన కమిషన్ ముందు చెప్పినట్లు సమాచారం. కాళేశ్వరం అప్పును రీస్ట్రక్చర్ చేసే విషయంలో కేంద్రం నుంచి ఒకవేళ సానుకూల సంకేతాలు రాకుంటే మళ్లీ సంప్రదింపులు జరిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆర్థిక శాఖ వర్గాల ద్వారా తెలిసింది.

ఆ మూడు సీట్లూ గెలవాలి

- త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలి
- బీజేపీ ఎన్నికల సన్నాహక సమావేశంలో దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో మూడు ఎమ్మెల్సీ స్థానాలనూ కైవసం చేసుకోవాలని రాష్ట్ర బీజేపీ భావిస్తోంది. ఈ మేరకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి సత్తా చాటాలని పిలుపునిచ్చింది. ఈ ఎన్నికలను తాము 2028 అసెంబ్లీ ఎన్నికలకు సెమీఫైనల్‌గా పరిగణిస్తున్నందున, మూడు ఎమ్మెల్సీ సీట్లను కచ్చితంగా గెలిచేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు, వ్యూహాలు సిద్ధం చేసినట్టు తెలిపింది. సోమవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలోనే రాష్ట్ర నాయకత్వం నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసింది. ఒక్కో ఎమ్మెల్సీ స్థానానికి ముగ్గురేసి రాష్ట్ర నాయకుల చొప్పున మొత్తం 9 మందితో సమన్వయ కమిటీని, ఒక్కో జిల్లాకు ఒక ఇన్‌చార్జి లేదా కోఆర్డినేటర్‌ను నియమించాలని నిర్ణయించింది. మార్చి రెండోవారంలో..ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ (ఒక్కొక్కటి చొప్పున) స్థానాలకు, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ సీట్లకు బీజేపీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. అధికార కాంగ్రెస్ పార్టీ ఇంకా అభ్యర్థులను ప్రకటించకపోవడం, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అసలు పోటీ చేస్తుందా లేదా అన్న సందేహం నెలకొన్న నేపథ్యంలో..పార్టీ అభ్యర్థుల గెలుపు విషయంలో సానుకూలతలు పెరిగాయని బీజేపీ ముఖ్యనేత ఒకరు ‘సాక్షి’కి చెప్పారు.

బీజేపీకే అనుకూలం: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



‘ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకే అనుకూల వాతావరణం ఉంది. ప్రజా మద్దతు బీజేపీ వైపే ఉంది. మూడు సీట్లలో గెలుస్తామనే నమ్మకం పార్టీకి ఉంది..’అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. సన్నాహక సమావేశంలో కేంద్రమంత్రి, బండి సంజయ్, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్, ఇతర జిల్లాల పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులు సి.అంజిరెడ్డి (గ్రాడ్యుయేట్స్), మల్క కొమురయ్య (టీచర్స్), వరంగల్, ఇతర జిల్లాల టీచర్స్ అభ్యర్థి సరోత్తమ్‌రెడ్డిలను ఈ సందర్భంగా పరిచయం చేశారు.

పెన్నాబేసిన్‌కు ‘గోదావరి’ తరలింపుతో తెలంగాణకు నష్టం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి హరీశ్‌రావు లేఖ



సాక్షి, హైదరాబాద్: బనకచర్ల ప్రాజెక్టు ద్వారా 200 టీఎంసీల గోదావరి జలాలను పెన్నాబేసిన్‌కు తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలతో తెలంగాణకు నష్టం జరుగుతుందని మాజీమంత్రి టి.హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు సాధించడంలో జాప్యం కారణంగా నష్టం జరుగుతోందన్నారు. గోదావరి నదీజలాల్లో తెలంగాణకు కేటాయించిన నీటివాటాలను కాపాడేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాజెక్టులకు అనుమతుల సాధనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో నిర్మాణం ఆలస్యమవుతోందన్నారు. తెలంగాణ హక్కులను కాపాడే చర్యలు చేపట్టడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను రక్షించాలని కోరుతూ ఈ మేరకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి హరీశ్‌రావు సోమవారం లేఖ రాశారు.

మరో రాష్ట్రానికి బదిలీ అవసరం లేదు

▶ మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మ ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది. వైఎస్ జగన్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి దాఖలైన కేసులపై సీబీఐ ప్రత్యేక కోర్టు విచారణ జరుపుతోందని, దీన్ని తెలంగాణ హైకోర్టు పర్యవేక్షిస్తోందని ధర్మాసనం పేర్కొంది. రోజు వారీ విచారణకు తెలంగాణ హైకోర్టు ఆదేశాలు సైతం జారీ చేసిందని గుర్తు చేసింది. ఓ దశలో రఘురామకృష్ణరాజుపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. కింది కోర్టులో జరిగే విచారణను మమ్మల్ని పర్యవేక్షించమంటారా? అంటూ ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసింది. ‘సీబీఐ కోర్టు విచారణను తెలంగాణ హైకోర్టు పర్యవేక్షిస్తోంది. రోజువారీ విధానంలో విచారణ జరపాలని సీబీఐ ప్రత్యేక కోర్టుకి ఆదేశాలు కూడా జారీ చేసింది. హైకోర్టు స్పష్టమైన ఆదేశాల తరువాత కూడా పిటిషనర్ (రఘురామకృష్ణరాజు) సీబీఐ కోర్టు విచారణలో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతున్నారు. వాస్తవానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం ఏమీ మాకు కనిపించడం లేదు’ ధర్మాసనం తన తీర్పులో స్పష్టం చేసింది.

సీబీఐ కోర్టు, హైకోర్టుల్లో రఘురామకు ఎదురుదెబ్బ..

వైఎస్ జగన్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి సీబీఐ, ఈడీ పలువురిపై కేసులు నమోదు చేసింది. ఈ కేసుల్లో జగన్‌కు సీబీఐ ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆయనపై నమోదైన కేసుల్లో సీబీఐ ప్రత్యేక కోర్టు విచారణ కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా జగన్ బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ రఘురామకృష్ణరాజు సీబీఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా కోర్టు కొట్టివేసింది. అటు తరువాత ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టులో సైతం రఘురామకృష్ణరాజుకు చుక్కెదురైంది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వైఎస్ జగన్ బెయిల్‌ను రద్దు చేయడంతో పాటు ఆయనపై నమోదైన కేసులను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ 2023లో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సుప్రీంకోర్టు పలుమార్లు విచారణ జరిపింది. ఈ నెల 20న విచారణ సందర్భంగా అసలు జగన్ కేసులతో మీకేం సంబంధమని రఘురామకృష్ణరాజుని జస్టిస్ నాగరత్న ధర్మాసనం నిలదీసిన సంగతి తెలిసిందే.

జగన్ బెయిల్ రద్దు చేయాల్సిన అవసరం లేదు

వాదన సందర్భంగా వైఎస్ జగన్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ స్పందిస్తూ.. సీబీఐ ప్రత్యేక కోర్టులో జరుగుతున్న కేసుల విచారణను తెలంగాణ హైకోర్టు పర్యవేక్షిస్తోందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. జగన్ బెయిల్‌ను రద్దు చేయాల్సిన అవసరం ఏదీ కనిపించడం లేదంది. అలాగే సీబీఐ కోర్టు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం కూడా లేదని పేర్కొంది. హైకోర్టు పరిధిలోకి జోక్యం చేసుకోవడం దాని పనితీరును ప్రభావితం చేయడమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. అందువల్ల పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సమయంలో రఘురామకృష్ణరాజు తరఫు న్యాయవాదులు జగన్‌పై తాము దాఖలు చేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని, అందుకు అనుమతినివ్వాలని అభ్యర్థించడంతో అందుకు ధర్మాసనం అంగీకరిస్తూ ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్‌కు టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ మద్దతు

సాక్షి, హైదరాబాద్: వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్న పూల రవీందర్‌కు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం (టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ) మద్దతు ప్రకటించింది. ఈమేరకు సోమవారం టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ బాలరాజు, ఎస్.దయాకర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ సమాజంలో అధ్యాపక, ఆచార్యుల సమస్యల పక్షాన చట్టసభల్లో చర్చలు ఆశించిన మేరకు లేవని, సమర్థులను చట్టసభకు పంపిస్తే ప్రభుత్వంతో పోరాడతారని అందుకే గత అనుభవం ఉన్న పూల రవీందర్‌కు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.

గురుకుల స్పౌజ్, మెడికల్ బదిలీలు ఎప్పుడు?

- ప్రభుత్వ ఆదేశాలున్నా పని మొదలుపెట్టని సొసైటీలు.. దరఖాస్తు చేసిన వేయిమంది.. కొందరికే ఎస్‌ఎంఎస్‌లు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లోని ఉద్యోగుల స్పౌజ్, మెడికల్ బదిలీలపై అయోమయం నెలకొంది. దరఖాస్తులను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినప్పటికీ, గురుకుల సొసైటీలు ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పాఠశాల విద్యాశాఖలో పెద్ద సంఖ్యలో టీచర్ల స్పౌజ్, మెడికల్ బదిలీలు పూర్తిచేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సొసైటీల పరిధిలో స్పౌజ్, మెడికల్ కేటగిరీ బదిలీల కోసం వేయిమందికి పైగా ఉద్యోగులు దరఖాస్తులు సమర్పించారు. ఇందులో అత్యధికంగా ఎస్సీ, మైనార్టీ గురుకుల సొసైటీల నుంచే ఉన్నాయి.

సొసైటీ కార్యాలయాల చుట్టూ చక్కర్లు

బదిలీల ప్రక్రియ చేపట్టకపోవటంతో ఉద్యోగులు గత మూడు రోజులుగా సొసైటీ కార్యాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. గత నెలాఖరులో గురుకుల సొసైటీలు స్పౌజ్, మెడికల్, మ్యూచ్‌వల్ కేటగిరీల్లో దరకాస్తులు స్వీకరించాయి. దరఖాస్తులు సమర్పించిన వారిలో కొందరికి ఎస్‌ఎంఎస్‌ల ద్వారా సమాచారం అందగా... మరి కొందరికి ఎలాంటి సమాచారం లేదు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలనకు సంబంధించిన సమాచారాన్ని గురుకుల సొసైటీలు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించామని, ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. దీంతో కొందరు టీచర్లు సచివాలయంలోని కార్యదర్శులకు వినతులు సమర్పిస్తున్నారు. గత రెండ్రోజుల్లో దాదాపు వందమంది గురుకుల టీచర్లు సచివాలయంలో వినతులు సమర్పించినట్లు ఉద్యోగ సంఘ నేతలు చెబుతున్నారు.

కేటీఆర్‌కు ఆవేశమెక్కువ.. ఆలోచన తక్కువ: మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: ‘కేటీఆర్‌కు ఆవేశమెక్కువ. ఆలోచన తక్కువ. ఒక్క గ్రామానికే కొత్త పథకాలను పరిమితం చేసినట్లుగా భ్రమ పడుతున్నారు. తాము చింతమడక సీఎంలం కాదు. ఇది ప్రజా ప్రభుత్వం. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తాం’అని పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క స్పష్టంచేశారు. పథకాలు రాని గ్రామాలు రణరంగంగా మారుతాయన్న కేటీఆర్ వ్యాఖ్యలను ఆమె ఓ ప్రకటనలో ఖండించారు. నూతన పథకాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం కన్పిస్తుంటే కేటీఆర్ ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. కొత్త పథకాలను కేవలం ఒక్క గ్రామానికే పరిమితం చేసినట్లుగా కేటీఆర్ భ్రమలు కల్పిస్తున్నారని విమర్శించారు. ఒక గ్రామంలో పథకాల అమలును లాంఛనంగా మొదలు పెట్టి.. ఇతర గ్రామాలకు విస్తరిస్తారన్న ఇంగిత జ్ఞానం లేకపోతే ఎలా? అని సీతక్క ప్రశ్నించారు.

‘ఐచీ’తో ఆర్థిక బంధానికి సిద్ధం

- జపాన్‌కు చెందిన ఆ రాష్ట్ర ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు



మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైన ఐచీ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: టొయోటా కార్ల పరిశ్రమతోపాటు ఏరోస్పేస్, ఆటోమొబైల్, రోబోటిక్స్, యంత్ర పరికరాల తయారీలో అగ్రగామిగా ఉన్న జపాన్‌లోని ఐచీ రాష్ట్రం (ప్రిఫెక్చర్)తో ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలకు ఆహ్వానం పలుకుతున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ఐచీ ప్రతినిధులతో ఆయన సోమవారం సచివాలయంలో భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాలు వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో పరస్పరం సహరించుకోవాలన్నారు. ఇటీవలే ఐచీ రాష్ట్రం ‘స్టేషన్ ఏఐ’పేరుతో జపాన్‌లోనే అతిపెద్ద అంకుర సంస్థల ఇన్‌క్యుబేషన్ కేంద్రాన్ని ప్రారంభించిన అంశం ఈ భేటీలో ప్రస్తావనకు వచ్చింది. తెలంగాణలో టీ–హబ్ కూడా అంకుర సంస్థల ప్రోత్సాహంలో దేశంలో ప్రముఖంగా నిలుస్తోందని శ్రీధర్‌బాబు వారికి వివరించారు. కాగా, ఐచీ అసెంబ్లీ సభ్యుడు, ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన హిరోహిటో కొండో 2026లో తమ రాష్ట్రంలో జరిగే 20వ ఆసియా క్రీడలకు మంత్రి శ్రీధర్‌బాబును ఆహ్వానించారు. గిబ్లి యాని మేషన్ పార్క్ ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆహ్వానిస్తోందని మంత్రి దృష్టికి తెచ్చారు. ద్వైపాక్షిక సంబంధాలతో ఇరు ప్రాంతాలు ప్రయోజనం పొందేలా సహకారం కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలకు సన్నద్ధం

- రాష్ట్ర మహాసభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీరయ్య, మల్లు లక్ష్మి
- కనీస మద్దతు ధరకు ప్రత్యేక చట్టం తేవాలని తీర్మానించినట్లు వెల్లడి




సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య. చిత్రంలో మల్లు లక్ష్మి

కొండాపూర్ (సంగారెడ్డి): మహాసభల్లో చర్చించి ఆమోదించిన ప్రజాసమస్యలపై రాబోయే కాలంలో మిలిటెంట్ పోరాటాలకు సీపీఎం సన్నద్ధమవుతుందని ఆ పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, మల్లు లక్ష్మి తెలిపారు. రాష్ట్రంలోని ప్రజాసమస్యలపై రాష్ట్ర మహాసభలో తీర్మానాలను ఆమోదించామన్నారు. సంగారెడ్డిలో రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా సోమవారం మీడియా పాయింట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 4 రోజులపాటు జరుగుతున్న రాష్ట్ర మహాసభల్లో ప్రధాన అంశాలపై చర్చించినట్లు తెలిపారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానించినట్లు వెల్లడించారు.


తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటి లభ్యత

సీడబ్ల్యూసీ తన లేఖలో చెప్పింది

- 65 ఏళ్లు ఏకంగా 255 టీఎంసీల నీటిలభ్యత
- జస్టిస్ ఘోష్ కమిషన్ ఎదుట హాజరైన తర్వాత మీడియాతో విద్యుత్ జేఏసీ నేత కె.రఘు



జస్టిస్ పీసీ ఘోష్



కె.రఘు

సాక్షి, హైదరాబాద్: తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదనడం శుద్ధ అబద్ధమని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నేత కె.రఘు స్పష్టం చేశారు. అక్కడ మనకు 160 టీఎంసీల నీరు అవసరం కాగా, 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా 165 టీఎంసీల నీటిలభ్యత ఉందంటూ కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) 2015 మార్చి 4న లేఖ ఇచ్చిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సోమవారం నిర్వహించి క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరైన అనంతరం రఘు మీడియాతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత విషయంలో కమిషన్‌ను తాను తప్పుదోవ పట్టించానని బీఆర్‌ఎస్ నేత వి.ప్రకాశ్ చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. ఎగువ రాష్ట్రాలు తమ వాటాకు అదనంగా 63 టీఎంసీల నీటిని వాడుకుంటే అక్కడ 75% డిపెండబిలిటీ (100 ఏళ్లలో 75 ఏళ్ల పాటు) ఆధారంగా 102 టీఎంసీల నీటిలభ్యతే ఉంటుందని ప్రకాశ్ తప్పుడు లెక్కలు చెప్పారన్నారు. ఒకవేళ ఎగువ రాష్ట్రాలు నిజంగానే 63 టీఎంసీల నీరు అదనంగా వాడుకున్నట్టు అంగీకరించినా, సీడబ్ల్యూసీ లెక్కల ప్రకారం ఈ 75 ఏళ్లలోని 65 ఏళ్లు 255 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని, మిగతా 10 ఏళ్లలో 102 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి ఇప్పటివరకూ ఏ సంవత్సరం కూడా 50 టీఎంసీలకు మించి నీటిని ఎత్తిపోయలేదన్నారు.

148 మీటర్లలో కట్టినా నీటిని తరలించొచ్చు

తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ఒప్పుకోకపోవడంతోనే బరాజ్‌ను అక్కడి నుంచి తరలించినట్టు ప్రకాశ్ చేసిన వాదనను రఘు తోసిపుచ్చారు. మహారాష్ట్ర ఒప్పుకున్న 148 మీటర్ల ఎత్తులో బరాజ్‌ను నిర్మించి అక్కడి నుంచి కేవలం 4 మీటర్ల మేర నీటిని ఎత్తిపోయడం లేదా కాలువ వెడల్పు, లోతు పెంచడం ద్వారా నీటిని తరలించొచ్చు అన్నారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి బరాజ్‌కు నీరు గ్రావిటీగా వస్తుందని ఎవరూ అనలేదన్నారు. తుమ్మిడిహెట్టి నుంచి 19 మీటర్లుపైకి లిఫ్ట్ చేస్తే ఎల్లంపల్లికి నీళ్ల చేరేవని, మేడిగడ్డ నుంచి ఏకంగా 6 రెట్లు ఎక్కువగా 123 మీటర్లు ఎత్తిపోయాల్సి వస్తుందని తెలిపారు. మేడిగడ్డతో విద్యుత్ ఖర్చులూ 6 రెట్లు పెరుగుతాయన్నారు. మేడిగడ్డ బరాజ్ కట్టినా అక్కడి నుంచి ఎల్లంపల్లి వరకు ఎలాంటి ఆయకట్టు లేకపోవడంతో ప్రత్యేక ప్రయోజనం లేదని చెప్పారు. తుమ్మిడిహెట్టి బరాజ్ కడితే తక్కువ ఖర్చుతో నీటిని సరఫరా చేయొచ్చన్నారు.

నామినేషన్లపై అదనపు టీఎంసీ పనులు

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాలు సరైనవి కావని సీడబ్ల్యూసీ తన నివేదికలో ఆధారాలతో సహా చూపిందని రఘు తెలిపారు. పంప్‌హౌస్‌లను తక్కువ ఎత్తులో నిర్మించడంతో ముంపు ప్రమాదం ఉంటుందని స్పష్టంగా రాసిందన్నారు. నిల్వల కోసం మేడిగడ్డ బరాజ్ నిర్మించినట్టు వాదిస్తున్నారని, బరాజ్‌లను నీటి మళ్లింపు కోసం నిర్మిస్తారని, నిల్వ కోసం కాదని చెప్పారు. నిల్వలతోనే బరాజ్‌లు దెబ్బతిన్నాయన్నారు. 15 టీఎంసీల నీటికోసం రూ. 30 వేల కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులు చేపట్టారని విమర్శించారు. నామినేషన్ పద్ధతిలో పనులు ఇచ్చారని ఆరోపించారు. కాల్వలకు బదులు ప్రెషర్ మెయిన్స్ వాడటంతో కరెంటు ఖర్చులు కాళేశ్వరం తొలిదశకు మించిపోతాయన్నారు. తుమ్మిడిహెట్టి లేదా సమీపంలో తక్కువ ఖర్చుతో నిర్మిస్తే అక్కడ నీటి లభ్యత లేనప్పుడు.. కాళేశ్వరం నుంచి నీటిని తీసుకోవచ్చని చెప్పారు.

చేతులతో దాడి చేశారని చెప్పి.. సెక్షన్ 191(2) ఎలా పెట్టారు?

ఈటల కేసులో పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ స్థిరాస్తి వ్యాపారిపై చేయిచేసుకున్నారంటూ దాఖలైన కేసులో బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై బీఎన్‌ఎస్ సెక్షన్ 191(2) కింద కేసు ఎలా నమోదు చేశారని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. దీనిపై వివరాలు తెలుసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది. ఏకశిలానగర్‌లో సామాన్యుల భూమిని కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ క్రమంలో వారి వద్దకు వెళ్లిన సమయంలో వారి తీరు పట్ల ఆగ్రహంతో చేయిచేసుకున్నట్లు ఈటల పేర్కొన్న విషయం తెలిసిందే. ఈటల దాడిపై వాచ్‌మన్ ఉపేందర్ ఫిర్యాదు చేయడంతో పోచారం పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ ఈటల రాజేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఇది రాజకీయ కక్షసాధింపులో భాగంగా పెట్టిన కేసు అని తెలిపారు. రాజకీయ అంశాలపై ఇక్కడ వాదించవద్దని, కేసు, సబ్జెక్ట్‌పై మాట్లాడాలని న్యాయమూర్తి ఆయనకు సూచించారు. అనంతరం న్యాయవాది వాదిస్తూ.. భూమి కబ్జా చేసి అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. తప్పుడు ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. ఏకశిలానగర్ కాలనీలో ప్రభుత్వ ఉద్యోగులు కష్టపడి సంపాదించిన డబ్బుతో ప్లాట్లు కొనుగోలు చేయగా, వాటిని లాక్కోవడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దీనిపై ప్రజాప్రతినిధిగా ప్రభుత్వానికి, ఉద్యోగులకు న్యాయం చేయడం కోసం ఈటల రియల్ ఎస్టేట్ వ్యాపారిని ప్రశ్నించారన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఫిర్యాదుదారు ఉపేందర్‌కు నోటీసులు జారీ చేశారు. పోలీసుల నుంచి వివరాలు తెలుసుకుని చెప్పాలని పీపీని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.



నీ చర్యలే చాలా గట్టిగా మాట్లాడుతాయి.
నువ్వు చెబుతున్నదేమిటో నాకు వినబడట్లేదు.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి

మంగళవారం, 28 జనవరి 2025

బలమైన బంధం దిశగా..!

భౌగోళికంగానే కాదు... సంస్కృతి, నాగరికతల్లోనూ శతాబ్దాలుగా సన్నిహితమైన రెండు దేశాల మధ్య సహకారం సహజం. ఉమ్మడి ప్రయోజనాలూ అనేకం. ప్రయాణ, వాణిజ్యాలు చిరకాలంగా ఉన్నా, ఇప్పటి దాకా ఆ అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో వెనుకబడ్డ భారత, ఇండొనేసియాలు దాన్ని చక్కదిద్దుకొనే పనిలో పడ్డాయి. ఇండొనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో 4 రోజులు భారత్‌లో పర్యటించి, భారత 76వ గణతంత్ర దినోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొనడం బలమైన బంధానికి పునరంకితమయ్యే వీలు కల్పించింది. అన్నీ సాకల్యంగా చర్చించుకొనే విలువైన అవకాశం వచ్చింది. మొత్తం 55 పేరాల తాజా ఉమ్మడి ప్రకటనలో ఇరుపక్షాలూ విస్తృత ద్వైపాక్షిక, అంతర్జాతీయ సహకారంపై ఏకస్వరంతో మాట్లాడడం అందుకు నిదర్శనం.

భౌగోళికంగా, చారిత్రకంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా భారత్‌తో ఇండొనేసియా అనుబంధం బలమైనది. చిత్రమేమిటంటే చిరకాలంగా బలమైన బంధమున్నా అది భారీ స్థాయిలో ప్రతిఫలించినట్లు కనిపించదు. అగ్రరాజ్యాల అధికార రాజకీయాలకు వ్యతిరేకతతో, అలీనోద్యమంతో ఆది నుంచి ముడిపడిన ఈ ఉభయ దేశాలూ వలస పాలనానంతర ఆసియా ఖండంలో ద్వైపాక్షికంగానూ, నాయకత్వంలోనూ కలసి అడుగేయాల్సింది. అయితే, ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఢిల్లీ, జకార్తాలు దూరం జరిగాయి. ఈ నేపథ్యంలో ఇండొనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో తాజా ఢిల్లీ పర్యటన ఆశావహ పరిణామం. ఉభయదేశాల మధ్య అనుబంధానికి అవసరమైన వ్యూహాత్మక ప్రేరణను ఈ పర్యటన అందించింది. భారత గణతంత్ర దినోత్సవ కవాతుకు ముఖ్య అతిథిగా ఇండొనేసియా అధ్యక్షులు హాజరవడం ఇది నాలుగోసారి. భారత్ తొలిసారి జరుపుకొన్న రిపబ్లిక్ డే వేడుకలకు 1950లో సైతం ఇండొనేసియా అధ్యక్షుడే (సుకర్ణో) ముఖ్య అతిథి. ఆపైన సుసిలో బమ్‌బాగ్ యుధొయోనో (2011), జోకో విడోడో (2018), ఇప్పుడు సుబియాంటో!

గమనిస్తే, ఆగ్నేయాసియా దేశాలతో బలమైన స్నేహం 1990ల నుంచి భారత ప్రయత్నం. అందులో భాగంగా జకార్తా, ఢిల్లీల మధ్య దూరం క్రమంగా తగ్గసాగింది. చైనా వ్యూహాత్మక ప్రాబల్యానికి పగ్గం వేసేలా ఆగ్నేయాసియా దేశాలతో సంబంధాలను పెంపొందించుకోవాలని భారత్ 'ప్రాచ్యానికి ప్రాధాన్య విధానం' (యాక్ట్ ఈస్ట్ పాలసీ) చేపట్టింది. ఇండో – పసిఫిక్ ప్రాంతం కీలకమని గుర్తించింది. అయినా, ఇరు దేశాల భాగస్వామ్యం ఉండాల్సినంత లేదు. సుమత్రా, జావా... ఇలా 17 వేలకు పైగా ద్వీపాలతో కూడిన ఇండొనేసియా 28 కోట్లకు పైగా ప్రజలతో జనసంఖ్యలో ప్రపంచంలో నాలుగోది. దాదాపు 1.4 లక్షల కోట్ల డాలర్ల విలువైన ఆర్థిక వ్యవస్థతో వచ్చే 2030 నాటి కల్లా ప్రపంచంలోని 10 అగ్రశ్రేణి ఎకానమీల్లో ఒకటిగా నిలవడానికి ఉరకలు వేస్తోంది. ఈ దేశ వేలాది ద్వీపాలు హిందూ, పసిఫిక్ మహా సముద్రాల మధ్య వారధుల లాంటివి. ఇండొనేసియా సముద్ర జలాలు భారత్ సహా ఈ ప్రాంతంలో పలు దేశాల ప్రపంచ వాణిజ్యానికి ఆయువుపట్టు. సహజ వనరులు పుష్కలంగా ఉండే ఈ అతి పెద్ద ద్వీపసమూహ దేశంతో బంధం భారత ఆర్థికప్రగతికి కీలకమనీ, బంధాన్ని బలోపేతం చేసుకోవాలంటున్నది అందుకే!

అధ్యక్షుడి తాజా పర్యటనలో ఆరోగ్యం, సాంప్రదాయిక వైద్యం, సముద్రయాన భద్రత, డిజిటల్ అభివృద్ధి, సాంస్కృతిక సహకారంపై 5 అవగాహనా ఒప్పందాలు (ఎంఓయూలు) కుదిరాయి. అలాగే, రక్షణ సహకారాన్ని పటిష్ఠం చేసుకోవాలన్న మాట ఉమ్మడి ప్రకటనలోనూ ప్రస్తావించారు. అయితే, భారత్ నుంచి బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థను ఇండొనేసియా కొననున్నదంటూ పర్యటనకు ముందు వార్తలు గుప్పుమన్నా, ఆ రకమైన ఒప్పందమేదీ జరగలేదు. ఇండో– పసిఫిక్‌లో అమెరికా– చైనా శత్రుత్వం, దక్షిణ– తూర్పు చైనా సముద్రాల్లో చైనా బిగిస్తున్న పట్టు లాంటి సున్నిత అంశాలు, వాటి భౌగోళిక రాజకీయ ప్రభావాలు చర్చకు వచ్చిందీ, లేనిదీ తెలియలేదు. ఆర్థికాభివృద్ధిలోనూ ఇరుపక్షాలూ చేయాల్సింది చాలా ఉంది. ప్రస్తుతం 3 వేల కోట్ల డాలర్లే ఉన్న రెండు దేశాల మధ్య వాణిజ్యాన్ని ద్విగుణం, బహుళం చేయాలి. రెంటి మధ్య రాకపోకలు, ఆదానప్రదానాల పెంపుదల, పారిశ్రామిక భాగస్వామ్యాలను పెంచుకోవాలి. అధ్యక్షుడి వెంట దాదాపు 100 మంది సభ్యుల వ్యాపార బృందం వచ్చినందున ఆ రంగంలో పురోగతి కనిపిస్తుందని ఆశించవచ్చు.

ఇండో–పసిఫిక్ ప్రపంచ వివాదానికి కేంద్రమవుతున్న వర్తమాన పరిస్థితుల్లో ద్వైపాక్షిక, ప్రాంతీయ సహకారానికి ఉభయ దేశాలూ నడుంకట్టాలి. గత అక్టోబర్‌లో ఇండొనేసియా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టి, ప్రస్తుతం ఆ దేశంలో అమితమైన ప్రాచుర్యం ఉన్న సుబియాంటో గద్దెనెక్కిన కొద్దికాలానికే భారత్‌లో పర్యటించడం ద్వైపాక్షిక సంబంధాలకు ఉత్ప్రేరకమే. ఇరు దేశాలు సన్నిహిత మిత్రులుగా, భాగస్వాములుగా కొనసాగాలని ఆయన అభిలషించడం గమనార్హం. 'ఆగ్నేయాసియా దేశాల సమాఖ్య'కు మూలస్తంభమైన ఇండొనేసియా ప్రాంతీయ ఆర్థిక సమన్వయానికి, రాజకీయ, భద్రతా అంశాలకూ ముఖ్యమైనది. ఆ సంగతి భారత్ గమనంలో ఉంచుకోవాలి. బీజింగ్ కళ్ళతో, భౌగోళిక రాజకీయాల కోణం నుంచే జకార్తాతో బంధాన్ని చూడరాదు. ఇండొనేసియా సైతం ఆది నుంచీ అగ్ర దేశాలతో ఆచితూచి వ్యవహరిస్తోంది. ఆ సంగతి గుర్తించి, ఆ దేశంతో ద్వైపాక్షిక సహకారం వెల్లివిరిసేలా భారత్ కృషి చేయాలి. ఆసియాలో శాంతి, సౌభాగ్యాలు నెలకొనేలా చూడాలి. పర్యటనతో రాజకీయ నాయకత్వం చొరవ చూపినందున ఇప్పుడిక అధికార యంత్రాంగం, దౌత్యవేత్తలు, పారిశ్రామిక భాగస్వాములు ఆచరణలో ముందుకు తీసుకుపోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు
పుష్య మాసం , తిథి: బ.చతుర్దశి రా.7.38 వరకు, తదుపరి అమావాస్య,
నక్షత్రం: పూర్వాషాఢ ఉ.8.58 వరకు, తదుపరి ఉత్తరాషాఢ,
వర్జ్యం: సా.5.02 నుండి 6.38 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.53 నుండి 9.41 వరకు, తదుపరి రా.11.00 నుండి 11.48 వరకు,
అమృత ఘడియలు: రా.2.40 నుండి 4.17 వరకు, మాసశివరాత్రి

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.49
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు

వైదొలగాలన్న అమెరికా నిర్ణయం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ)కు ఆర్థికంగా ఎదురుదెబ్బ. దీనివల్ల ఆర్థిక వనరుల కోసం ప్రైవేటు విరాళాలపై ఆ అంతర్జాతీయ సంస్థ ఆధారపడాల్సి వస్తుంది. అవి షరతులతో వస్తాయి.

ఆరోగ్యానికి అశనిపాతం

సందర్భం



దినేశ్ సి. శర్మ

అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి పగ్గాలు చేపట్టిన డోనాల్డ్ ట్రంప్ తొలి రోజున తీసుకున్న అనేక నిర్ణయాల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నుంచి వైదొలగడం ఒకటి. దీని ప్రభావం కేవలం అమెరికాకే పరిమితం కాదు. ప్రపంచ ఆరోగ్య భద్రతపై కూడా తీవ్రంగానే ఉండనుంది. కోవిడ్–19 పరిస్థితులను సక్రమంగా నియంత్రించలేకపోవడం, అత్యవసరమైన సంస్కరణలను చేపట్టడంలో విఫలమైన కారణంగా తామీ నిర్ణయం తీసుకుంటున్నట్లు ట్రంప్ సంతకం చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ తెలిపింది. సభ్యదేశాల అనవసర రాజకీయ జోక్యాన్ని నివారించడంలోనూ డబ్ల్యూహెచ్‌ఓ విఫలమైందని ట్రంప్ ప్రభుత్వం ఆరోపించింది. అమెరికా ఇతర దేశాలతో పోలిస్తే, మరీ ముఖ్యంగా చైనా కంటే ఎక్కువగా డబ్ల్యూహెచ్‌ఓకు మద్దతిస్తోందనీ, 140 కోట్లకు పైగా జనాభా ఉన్న చైనా చాలా చిన్న మొత్తం మాత్రమే తన వంతుగా ఇస్తోందనీ కూడా ఈ ఆర్డర్‌లో పేర్కొన్నారు.

డబ్ల్యూహెచ్‌ఓ చేసింది ఎంతో!

ప్రస్తుతం డబ్ల్యూహెచ్‌ఓ మొత్తం బడ్జెట్‌లో 18 శాతం అమెరికా నుంచే వస్తోంది. 2024, 2025 సంవత్సరాలకుగాను ఈ సంస్థ బడ్జెట్ సుమారుగా 680 కోట్ల డాలర్లు! రెండో ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, వ్యాధి సంబంధిత విషయాలను పర్యవేక్షించేందుకుగాను ఐక్యరాజ్య సమితి ప్రత్యేక విభాగంగా డబ్ల్యూహెచ్‌ఓ ఏర్పాటైంది. అంతర్జాతీయంగా శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు, ఆరోగ్య సంబంధిత విధానాలను రూపొందించేవారి నెట్‌వర్క్‌గా, ఒక టెక్నికల్ ఏజెన్సీగా వ్యవహరించాలన్నది దీని ఏర్పాటు లక్ష్యం. అలాగే పేద దేశాలకు సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి సహకారం అందించడం; తద్వారా ఆ యా దేశాలు ఆరోగ్య సమస్యలను సొంతంగా ఎదుర్కొనేందుకు తగిన మానవ వనరులు, సామర్థ్యాలను సంపాదించుకునేలా చేయడం మరో లక్ష్యం.

కొన్ని దశాబ్దాల కాలంలో ఈ సంస్థ మశూచితో పాటు, యాస్(చర్మరోగం), ఎల్లో ఫీవర్, కుష్ఠు, పోలియో వంటి ఎన్నో మహమ్మారులను సమర్థంగా కట్టడి చేయగలిగింది. యూఎస్‌ఎయిడ్స్ ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అంతర్జాతీయ స్థాయి పోరు సాగించింది. ప్రస్తుతం ప్రపంచ ఆరోగ్య సంస్థ దృష్టి మొత్తం క్షయ వ్యాధి నిర్మూలనపై ఉంది. అయితే, సార్స్ వంటి కొత్త వ్యాధులు పుట్టుకొచ్చినప్పుడు, పాత వ్యాధులు తిరగబెట్టిన సందర్భాల్లోనూ ఈ సంస్థ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది.



అమెరికా నూతన అధ్యక్షుడు దోనాల్డ్ ట్రంప్

అమెరికాకూ నష్టమే!

డబ్ల్యూహెచ్‌ఓ నుంచి వైదొలగడం వల్ల సభ్యదేశాలకు అందించే వ్యాధుల సమాచారం అమెరికాకు అందకుండా పోతుంది. 'డబ్ల్యూహెచ్‌ఓ పాండెమిక్ ఇన్‌ఫ్లుయెంజా ప్రిపేర్డ్‌నెస్ ఫ్రేమ్‌వర్క్' ఆధారంగానే పలు అమెరికన్ ఫార్మా కంపెనీలు టీకా తయారీకి సంబంధించి కొత్త రకం వైరస్ నమూనాలు పొందుతూంటాయి. ఇకపై ఈ వివరాలు అందకపోవడం వల్ల ఫ్లూ వైరస్ నిరోధక టీకాపై ప్రభావం పడనుంది. కోవిడ్‌లాంటి మహమ్మారుల నియంత్రణకు చేపట్టాల్సిన అంశాలపై ప్రస్తుతం జరుగుతున్న అంతర్జాతీయ చర్చల నుంచి కూడా అమెరికా వైదొలిగే అవకాశం ఉంది. అలాగే ఇప్పటివరకూ డబ్ల్యూహెచ్‌ఓలో పని చేస్తున్న పలువురు అమెరికన్ నిపుణులను వెనక్కి పిలిపిస్తారు. సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ అనే రెండు అమెరికన్ సంస్థలతో డబ్ల్యూహెచ్‌ఓ ఇప్పటి వరకూ ఏర్పాటు చేసుకున్న భాగస్వామ్యం ఇకపై ఉండదు. ఇది ఇరువర్గాలకూ చేటు చేసేదే.

షరతుల విరాళాలతో సమస్య

అమెరికా నిర్ణయం వల్ల డబ్ల్యూహెచ్‌ఓకు జరిగే నష్టం గురించి ఆలోచిస్తే... ఆర్థికంగా ఎదురుదెబ్బ అని చెప్పాలి. ఇతర సభ్యదేశాలు ఇస్తున్న మొత్తాలు కూడా తక్కువైపోతున్న తరుణంలో అతిపెద్ద దాత వైదొలగడం గమనార్హం. అమెరికా తరువాత అంత పెద్ద స్థాయిలో ఆర్థిక సాయం అందించే దేశం జర్మనీ మాత్రమే. డబ్ల్యూహెచ్‌ఓ వార్షిక బడ్జెట్‌లో సుమారు మూడు శాతాన్ని ఈ దేశం భరిస్తోంది. అయితే ప్రభుత్వాలకు అతీతంగా అందుతున్న విరాళాలు ఇటీవలి కాలంలో గణనీయంగా పెరగడం కొంత ఊరటనిచ్చే అంశం. ఉదాహరణకు బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్, యూరోపియన్ కమిషన్, ప్రపంచ బ్యాంకు లాంటి సంస్థలు భారీ మొత్తాలను అందిస్తున్నాయి. గేట్స్ ఫౌండేషన్ ప్రధానంగా పోలియో నిర్మూలన, టీకా తయారీలకు మద్దతిస్తోంది. అమెరికా వైదొలగుతున్న నేపథ్యంలో ఆర్థిక వనరుల కోసం గేట్స్ ఫౌండేషన్ వంటి వాటిపై డబ్ల్యూహెచ్‌ఓ ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి వస్తుంది. స్వతంత్రంగా పనిచేయాల్సిన ఐక్యరాజ్య సమితి విభాగానికి ఇలాంటి పరిస్థితి రావడం ఏమంత శ్రేయస్కరమైంది కాదు. ప్రైవేట్ సంస్థలు ఇచ్చే విరాళాలు కొన్ని షరతులతో వస్తాయని, ఇవి కాస్తా ఆరోగ్య అజెండాపై ప్రభావం చూపుతాయని విమర్శకుల వాదన.

డబ్ల్యూహెచ్‌ఓ మరింత సమర్థంగా, పారదర్శకంగా పనిచేసేందుకు తగిన సంస్కరణలు చేపట్టాలన్న వాదన సబబే. కోవిడ్ సమయంలో భారత్ కూడా జీ20, బ్రిక్స్ వంటి వేదికలపై ఈ అంశాన్ని లేవనెత్తింది. కొన్ని ఇతర దేశాలు కూడా డబ్ల్యూహెచ్‌ఓ సంస్కరణలపై డిమాండ్ చేశాయి. అయితే ఈ రకమైన విమర్శలపై చర్చకు సంస్థ కూడా సిద్ధంగా ఉంది. అయితే నిధులు నిలిపివేయడం, తప్పుకోవడం పరిష్కారం కాదన్నది అమెరికా గుర్తిస్తే మేలు.

వ్యాసకర్త సైన్స్ వ్యవహారాల వ్యాఖ్యాత ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

నిజానికి ట్రంప్ తండ్రి కూడా అమెరికాకు వలస వచ్చినవాడే! వలసల ప్రాధాన్యాన్ని గుర్తించని ఏ దేశమైనా కుదించుకుపోయే అవకాశం వుంది. ఏ నాగరికత కూడా ఒంటరిగా అభివృద్ధి చెందదు. ట్రంప్ ఆ సంగతి గుర్తించాలి.

వలసలకు విఘాతం

సందర్భం



డా॥ కత్తి పద్మారావు

ప్రపంచ నలుమూలల నుంచీ లక్షల మంది యువతీ యువకులు అమెరికాలో స్థిరపడేందుకు ప్రయత్నిస్తుంటారు. అక్కడ ఏదో ఒక పని దొరుకుతుంది. మంచి వేతనాలు, మెరుగైన జీవితం అందుకోవచ్చన్న ఆశ వారిని అగ్రరాజ్యానికి ప్రయాణం కట్టిస్తోంది. కుదిరితే చట్టబద్ధంగా, లేదంటే అక్రమ మార్గంలోనైనా సరే అమెరికా వెళ్లేందుకు వారు సాహసిస్తున్నారు. మెక్సికో, ఎల్ సాల్వడోర్ ప్రజల తరువాత పెద్ద యెత్తున అనధికారికంగా అక్కడికి వెళ్తున్నది భారతీయులే. 2021 నాటికే అమెరికాలో అలాంటి భారతీయుల సంఖ్య 7,25,000 మించిందని అంచనా. అక్కడి మొత్తం ఉద్యోగుల్లో 4.6 శాతం వరకు అనధికారికంగా వచ్చినవారేనని ప్యూ రీసెర్చ్ సెంటర్ లోగడ వెల్లడించింది.

వలసలే అభివృద్ధికి మూలం

సమాజ పరిణామం జాతుల, గణాల వలసల క్రమంలోనే జరిగిందని నిర్ధారిస్తారు తన 'ఏన్షియంట్ సొసైటీ' పుస్తకంలో ఆంత్రొపాలజిస్ట్ హెన్రీ మోర్గాన్. వలసలు ప్రపంచ వ్యాప్తంగా అనాది కాలం నుంచి జరుగుతూ వచ్చాయి. వలసలు ప్రపంచీకరణను, సరళీకరణను, ప్రైవేటీకరణను ప్రభావితం చేస్తున్నాయి. అమెరికా వలసదారుల వల్ల ఎంతో ఆర్థిక, సాంకేతిక, వైజ్ఞానిక ప్రగతిని పొందిందని చెప్పక తప్పదు. నిజానికి ట్రంప్ తండ్రి కూడా అమెరికాకు వలస వచ్చినవాడే! వలసల ప్రాధాన్యాన్ని గుర్తించని ఏ దేశమైనా కుదించుకుపోయే అవకాశం వుంది. ఏ నాగరికత కూడా ఒంటరిగా అభివృద్ధి చెందదు. మతమూ, మౌలికమైన ప్రాపంచిక దృక్పథాల విషయంలో కూడా స్థానికమైన ఆలోచనా ధోరణులపై ఒక మేరకు బయటి ప్రభావాలు ఉంటాయి. ఆ విధంగా అవి మిశ్రమ నేపథ్యాలవుతాయి.

అమెరికాను పాలించిన ఎంతోమంది మేధావులు ప్రపంచంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాద భావాల్ని, వైజ్ఞానిక విప్లవాన్ని ముందుకు తీసుకువెళ్లినవాళ్లే. జాన్ డ్యూయి వంటి ప్రజాస్వామిక తత్వవేత్త ఆవిర్భవించిన నేల అది. అబ్రహాం లింకన్ ఎన్నో సామాజిక సంస్కరణలను తీసుకువచ్చారు. అమెరికాలో అభివృద్ధి చెందుతున్న ఎంతో విజ్ఞాన శాస్త్ర ప్రభావం ట్రంప్ మీద కనిపించటం లేదు.

ఆది నుంచీ వివాదాస్పదుడే!

చర్చనీయాంశమైన అభిప్రాయాలు, ఉద్వేగభరితమైన ఉపన్యాసాలు, ఇబ్బందికర చేష్టలు, సంచలన ప్రకటనలు చేస్తూ ట్రంప్ గతంలో కూడా వార్తల్లో నిలిచారు. చొరబాటుదారులను నియంత్రించడానికి అమెరికా–మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి పూనుకున్నారు. విదేశాల నుండి అమెరికాకి వచ్చి పురుడు పోసుకున్నంత మాత్రాన పుట్టిన బిడ్డలు పౌరులుగా మారడాన్ని తాను వ్యతిరేకిస్తున్నానని కుండబద్దలు కొట్టారు. తాను అధ్యక్షుడైతే, అక్రమ వలసదారులను తన్ని తరిమేయటానికి ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేస్తానని హెచ్చరించారు. ఉగ్రవాదులు అమెరికాలోకి ప్రవేశించకుండా చూడాలంటే విదేశీ ముస్లింలందరినీ యూఎస్‌లోకి ప్రవేశించకుండా నిషేధించాలని ప్రతిపాదన పెట్టి విమర్శల పాలయ్యారు. ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు ఎన్నో ఉన్నాయి ట్రంప్ జీవితంలో. అమెరికాతో సరిహద్దు సమస్యలను పరిష్కరించుకోలేకపోతే 51వ యూఎస్ రాష్ట్రంగా కెనడా కలిసిపోతుందని కూడా అన్నారు.

మేల్కోవాల్సిన సమయం

ఇదే క్రమంలో మనం కూడా అమెరికాపై మోజును తగ్గించుకోవలసి వుంది. మన మేధావులను, సాంకేతిక నిపుణులను మన దేశ అభివృద్ధికి ఉపయుక్తం చేసుకోవలసిన అవసరం ఉంది. నిజానికి మనకు మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయి. మన సంపదను పెంచుకున్నట్లయితే మనలో వలస భావన తగ్గుతుంది. ఇవాళ అమెరికా గురించి ఆందోళన చెందుతున్న మనం, మన దేశంలో రద్దవుతున్న రాష్ట్రాల హక్కుల గురించి కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది. మన పిల్లలు ఇతర దేశాలకు విద్య కోసం పరుగెడుతున్నారు. దీనికి కారణం విద్యా హక్కును మనం దెబ్బతీశాం. మన విశ్వవిద్యాలయాల్లో తగినన్ని సాంకేతిక పరికరాలు లేవు. విస్తృతమైన ల్యాబ్‌లు, గ్రంథాలయాలు లేక పోవడం వల్ల మన పిల్లలు వలస బాట పడుతున్నారు.

ఇది భారతదేశం మేల్కోవలసిన సమయం. భయభ్రాంతులకు లోనుకాకుండా ఆత్మస్థైర్యంతో మనల్ని మనం పునర్నిర్మించుకోవలసి వుంది. మన పాలకులు అమెరికా నుండి తిరిగి వచ్చే విద్యార్థులను, ఉద్యోగులను, స్కిల్ వర్కర్స్‌ను సాదరంగా స్వాగతించి, వారికి తగిన పనిని కల్పించడానికి పూనుకోవాలి. ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలోనే ఈ విషయాలన్నీ చెబుతూ వచ్చారు. అప్పుడే మనం సిద్ధపడవలసి ఉంది. కానీ మనం ఉదాసీనత వహించి ఇప్పుడు ఆందోళన చెందుతున్నాం.

కొన్ని సామాజిక తరగతులు భారతదేశంలో జీవించడానికి ఇష్టపడనంతగా దేశీయేతర భావాలు కలిగి ఉండటం ఆశ్చర్యం. ఇప్పుడు ఆ భావాల నుండి బయటపడాలి. దేశంలో కుటీర పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, విద్యాలయాలు, యూనివర్సిటీలు, పారిశ్రామిక కారిడార్లు నిర్మించుకోవలసి ఉంది. దేశీయ పారిశ్రామిక విధానాన్ని అభివృద్ధి చేసుకోవాలని అంబేడ్కర్ చెప్పేవారు. ఇలాంటి పరిస్థితులు ప్రపంచంలో అనేకసార్లు వచ్చాయి. మనం ఈ పరిస్థితుల నుండి గుణపాఠాలు నేర్చుకోవాలి. ప్రపంచంలో మానవులంతా ఏ దేశంలోనైనా జీవించవచ్చు, ఉపాధి పొందవచ్చు అనే ప్రపంచ పరిణామ సూత్రం మరోసారి చర్చలోకి వచ్చింది. మానవ జీవన వ్యవస్థల పునర్నిర్మాణానికి పూనుకోవలసిన సమయమిది.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

ఇన్ బాక్స్

స్వతంత్ర సంగ్రామ సింహం

లాలా లజపతిరాయ్ స్వతంత్ర సంగ్రామంలో తన ప్రాణాలను వదిలిన అమర జీవి. మొదట్లో దయానంద సరస్వతి ఏర్పాటుచేసిన ఆర్య సమాజ్ భావాల పట్ల ఆకర్షితులై అందులో చేరి సమాజ సేవ చేశారు. ఆయన మీద ఇటాలియన్ విప్లవకారుడైన జోసెఫ్ మ్యాజినీ ప్రభావం కూడా ఉంది. న్యాయవాద వృత్తిని విడిచి స్వాతంత్ర్య పోరాటంపై దృష్టి సారించారు.

ఒకపక్క స్వాతంత్ర్యోద్యమంలో పనిచేస్తూనే సామాజిక ఉద్యమాల్లోనూ పాల్గొన్నారు. అంటరానితనం నిర్మూలన కోసం మహాత్మా గాంధీ 'హరిజన సేవక్ సంఘ్' బ్యానర్ కింద పని ప్రారంభించారు. ప్రపంచంలోని ఇతర ముఖ్యమైన ఉద్యమాల మాదిరిగానే ఈ సామాజిక సంస్కరణ కూడా జాతీయ ఆమోదం కోసం గొప్ప పోరాటం చేయాల్సి ఉందని ఆయన ప్రకటించారు. లాలాజీ సేకరించిన కరువు నిధిలో కొంత భాగాన్ని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగించారు. కొన్ని ప్రాథమిక పాఠశాలలు కూడా ఈ ఫండ్ నుండి నిధులు అందుకున్నాయి. అనాథ పిల్లల కోసం ఆశ్రమాలను ఏర్పాటు చేసి వారికి నూతన జీవితాన్ని ప్రసాదించారు.



లాలా లజపతిరాయ్

భారత దేశంలో రాజ్యాంగ సంస్కరణలను అధ్యయనం చేయడానికి 1928లో బ్రిటన్ నుంచి వచ్చిన సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. పంజాబ్‌లోని లాహోర్‌లో జరిగిన ఆందోళనకు లజపతిరాయ్ నాయకత్వం వహించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జి చేయడంతో ఈ 'పంజాబ్ కేసరి'కి తీవ్రమైన దెబ్బలు తగిలాయి. ఆ సందర్భంగా 'ఈ రోజు నా మీద పడిన దెబ్బలు, బ్రిటిష్ సామ్రాజ్యవాదం శవపేటికకు వేసిన చివరి మేకులు' అని బ్రిటిష్ పోలీసులను హెచ్చరించారు. ఆ దెబ్బలతోనే చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతి స్వాతంత్ర్యోద్యమం తీవ్రమవ్వడానికి దారితీసింది.

– డా॥ ఎ. శంకర్ । రాజనీతిశాస్త్ర ఉపన్యాసకులు, హైదరాబాద్

(నేడు లాలా లజపతిరాయ్ జయంతి)

దేశాన్ని అణుశక్తిగా మార్చిన మేధ

సందర్భం



డా॥ దేవరాజు మహారాజు

దేశభక్తి, సంస్కృతీ సంప్రదాయాల పట్ల గౌరవం, సంగీత సాహిత్యాల పట్ల ప్రేమ, సగటు మనిషి జీవన ప్రమాణాలు పెంచాలన్న తపన కలిగిన గొప్ప శాస్త్రవేత్త డాక్టర్ రాజా రామన్న. ఆయన 1925 జనవరి 28న సంప్రదాయ మైసూర్ అయ్యంగార్ కుటుంబంలో కర్ణాటకలో పుట్టారు. సంగీతంపై ఉన్న అభిమానంతో సంగీత కళాశాలలో చేరాలనుకున్న రాజా రామన్న, సర్ సి.వి. రామన్ పరిచయ ప్రభావం వల్ల వైజ్ఞానిక రంగంలోకి ప్రవేశించారు. ఆరేళ్ళ వయసులోనే పియానో నేర్చుకోవడం ప్రారంభించారు. పన్నెండో ఏట మైసూర్ మహారాజు ఎదుట పియానో వాయించి ప్రశంసలందుకున్నారు. 1949లో టాటా గ్రూపు– స్కాలర్‌షిప్‌పై లండన్ వెళ్ళి, అక్కడి 'కింగ్స్ కాలేజీ' నుండి 'న్యూక్లియర్ ఫిజిక్స్'లో డాక్టరేట్ తీసుకుని స్వదేశం తిరిగి వచ్చారు. డా॥ హోమీ భాభా ఆధ్వర్యంలో పని చేయడానికి 1952లో– టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో చేరారు. బొంబాయి, ట్రాంబేలోని ఆ సంస్థ పేరు తరువాత కాలంలో భాభా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బీఏఆర్‌సీ: బార్క్)గా మారింది. 1960లలో అణ్వాయుధాలను తయారు చేయడం, వాటిని అభివృద్ధి చేయడంలో సాంకేతిక పరిశోధన చేపట్టారు. అప్పుడే మన దేశంలో అణుబాంబుకు రూపకల్పన జరిగింది. 1966లో ఇందిరా గాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు– అణుపరికరాల తయారీకి సంబంధించిన ప్రాజెక్ట్ కొనసాగింది. ఆ ప్రాజెక్ట్‌లో పనిచేసే 75 మంది శాస్త్రవేత్తల బృందానికి రాజా రామన్న నాయకత్వం వహించారు. బార్క్‌లో 'పూర్ణిమ' అనే పేరుతో ప్లుటోనియం ఇంధనంతో నడిచే ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ స్థాపించడానికి కారకులయ్యారు. 1974 మే నెలలో అతి రహస్యంగా అణు పరీక్షను నిర్వహించారు. 1978లో అప్పటి భారత ప్రధాని మొరార్జీ దేశాయ్, డా॥ రామన్నను బార్క్ నుండి తీసుకొచ్చి, రక్షణ మంత్రిత్వ శాఖకు సలహాదారుగా నియమించారు. రక్షణ పరిశోధన కార్యదర్శిగా, డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్‌గా కూడా నియమించారు. అప్పుడే ఒక విచిత్రమైన సంఘటన జరిగింది. ఈయన నేపథ్యం తెలుసుకుని ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ అణుబాంబుల తయారీలో రామన్న సహాయం అర్థించాడు. పరిస్థితి విషమించేట్టుగా ఉందనుకుని, దేశభక్తుడయిన రాజా రామన్న చెప్పా పెట్టకుండా ఇండియా విమానం పట్టుకుని హుటాహుటిన తిరిగొచ్చారు. నిబద్ధత గల దేశభక్తుల చర్యలు అలా ఉంటాయి. వారు వేటికీ లొంగరు.



డాక్టర్ రాజా రామన్న


హోమీ జె. భాభా అకాల మరణం తర్వాత, ఆయన నిర్దేశించిన మార్గంలోనే రాజా రామన్న పరిశోధనలు కొనసాగించి, అణుశక్తి పరిశోధనల్లో దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టారు. ఆయన న్యూక్లియర్ ఫిషన్ రంగంలో కూడా కృషి చేశారు. బరువైన కేంద్రకాలను విభజించి, శక్తిమంతమైన న్యూక్లియన్ రేడియేషన్‌ను ఉత్పత్తి చేయవచ్చని– ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఆ సిద్ధాంతం అణుపరిశోధనా రంగానికి, తద్వారా దేశ ప్రగతికి ఎంతో ఉపయోగపడింది. 1980లో ఇందిరా గాంధీ ప్రధాన మంత్రిగా తిరిగి రావడంతో అణు కార్యక్రమం ఊపందుకుంది. ఆమె రామన్నను మళ్ళీ బార్క్‌కు డైరెక్టర్‌గా నియమించారు. పైగా అణుపరీక్షల కోసం ఆయనకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. 1990లో వి.పి. సింగ్ ప్రభుత్వంలో రామన్న కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. దేశానికి ఆయన చేసిన సేవలకు గాను పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్‌లతో పాటు అనేక పురస్కారాలు, పతకాలు, డాక్టరేట్లు పొందారు.

రాజా రామన్న శత జయంతి (28 జనవరి 1925 – 28 జనవరి 2025) సందర్భంలో మనం ఉన్నాం. మంచి మనిషిగా, అత్యున్నత స్థాయికి ఎదిగిన వైజ్ఞానికుడిగా, పియానో వాద్యకారుడిగా – ఎవరికి తోచిన విధంగా వారు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

(నేడు డా॥ రాజా రామన్న శతజయంతి)

ఈశ్వరాజ్ఞ



రజతాచలం పైని వనాంతర సీమలలో వసంతం నిండుగా కమ్ముకుని ఉంది. ఆ ప్రకృతి రామణీయకతలో ఒకచోట దాగి ఏకాంత క్షణాలను గడుపుతూ, ఆనందిస్తున్నారు శివపార్వతులు. వారి ఏకాంతాన్ని ఎవరూ భంగపరచకుండా నంది కాపు కాస్తున్నాడు. అలా ఉండగా, అది రజతాచలమని, అక్కడ మదనారియైన శివుడు వసిస్తూ ఉంటాడనే ఆలోచన మరచి, ఆ వసంత శోభను తాము కూడా ఆనందించి తరించాలనే ఉద్దేశంతో గంధర్వ గణాలు ఒక్కసారిగా వచ్చి గిరిపై పడ్డాయి. తమ అరుపులతో, కేరింతలతో ఆ వన ప్రాంతంలో అట్టహాసం చేయసాగాయి. ఆ శబ్దానికి ఉలిక్కిపడిన నంది, కోపగించి, వారిపై మాటల దూషణలతో విరుచుకుపడ్డాడు. 'అంధులా మీరు? లోకేశ్వరుడైన ఈశ్వరుడు, ఈశ్వరితో ఏకాంతంలో ఉండగా, ఇలా వచ్చి గోల చేయడం తగిన పనికాదు. ఆలస్యం చేయక, ఇక్కడి నుండి వెంటనే దూరంగా వెళ్ళిపొండి!' అని మందలించాడు. నంది మాటలను వారు లెక్క చేసే స్థితిలో లేరు. గంధర్వ గణాల ఆ స్థితిని ఆత్మలో ఎరిగిన శంకరుడు, ఉగ్రుడై చెంతనే పడివున్న గడ్డిపోచలను పిడికిట పట్టి 'పిశాచాలుగా మారండని' శపించి వారిపై విసిరాడు. కనువిందు చేసే అందమైన రూపాలు కాస్తా అంతలోనే అంతరించిపోయి, రూపురేఖలు తప్పి వికటాంగులయ్యారు గంధర్వులు. ఆ సందర్భాన్ని తెనాలి రామకృష్ణకవి ఇలా వర్ణించాడు ఉద్భటారాధ్య చరిత్రలో.

**కం. కొఱకును బోవం బడిక /ల్లుఱక పయింబడిన కరణి నొకపనికై రా
నుఱుమని పిడుగై వారికి /గఱకంఠుని చేత నీచగతి వాటిల్లెన్.**

పక్షులు ఎఱను ఏరి తినడానికని వెళ్ళగా, ఇంతలో ఎక్కడి నుండి వచ్చిందో తెలియని పడికల్లు – తుపాకి గుండు – వేగంగా వచ్చి వెంటాడి మీద పడినట్లుగా, రజతాచలంపైని వసంత శోభను ఆనందించాలనే ఒక పని మీద రాగా, ఉరుము లేకుండానే మీద పడిన పిడుగు చందంగా, శంకరుడి శాపం తగిలి నీచ గతి ప్రాప్తించింది కదా అని గంధర్వ గణాలు బాధపడడం పై పద్యం భావం. ఏదైనా తప్పుతుందేమో కాని ఈశ్వరాజ్ఞ తప్పదు కదా!

– భట్టు వెంకటరావు

మధ్యాహ్నం.. అధ్వానం!

▶ మొదటి పేజీ తరువాయి

సంబంధించిన లోటుపాట్లను క్షుణ్ణంగా పరిశీలించింది. దీనికి సంబంధించి ప్రభుత్వానికి 'మధ్యాహ్న భోజన పథకం–ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఆహార నాణ్యత, భద్రత' పేరుతో నివేదిక అందజేసింది. అందులో అనేక అంశాలను ప్రస్తావించింది.

ఇలాగైతే పౌష్టికాహారం అందడం కష్టం

రాష్ట్రంలో 26,519 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 20.36 లక్షల మందికి రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. నిబంధనల ప్రకారం వారికి వారానికి 3 కోడి గుడ్లు ఇవ్వాలి. ఒక్కో గుడ్డు కోసం ప్రభుత్వం ఇస్తున్నది రూ.5 మాత్రమే. మార్కెట్లో గుడ్డు ధర రూ.7 వరకు ఉంది. దీనితో స్కూళ్లలో చాలా చోట్ల వారానికి ఒకటి, రెండు గుడ్లనే అందిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులకు పౌష్టికాహారం అందడం కష్టమని కమిషన్ అభిప్రాయపడింది. భోజనం వండి, వడ్డించే మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ఇప్పటికీ రూ.116 కోట్లు బకాయి ఉంది. తాము వడ్డీ భారం మోయాల్సి వస్తోందని అనేక చోట్ల స్వయం సంఘాల మహిళలు వాపోతున్నారు. ఇక చాలీచాలని నిధులతో నాణ్యమైన కూరగాయలు తీసుకురాలేక పోవడం, నిల్వ చేసేందుకు తగిన మౌలిక వసతులు లేకపోవడం వల్ల ఇబ్బంది ఎదురవుతోందని విద్యా కమిషన్ పేర్కొంది. దీనితో ఆహారం కల్తీ అవడం, నాణ్యత లేకపోవడం వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని స్పష్టం చేసింది.

తక్షణమే ఈ చర్యలు చేపట్టాలి..

మధ్యాహ్న భోజన పథకం అమలుపై విద్యా కమిషన్ ప్రభుత్వానికి పలు సిఫార్సులు చేసింది. వీటిని తక్షణమే అమలు చేయాలని కోరింది. అలా చేస్తేనే భోజనం నాణ్యత పెరుగుతుందని, విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే పరిస్థితి దూరమవుతుందని తెలిపింది.

- మహిళా సంఘాలకు ఎప్పుడు బిల్లులు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. విధి లేని పరిస్థితుల్లో అప్పులు తెచ్చి వండి పెడుతున్నామనేది మహిళా సంఘాల ఆందోళన. ఈ పరిస్థితిని మార్చాలి. గ్రీన్ చానల్ ద్వారా వారం వారం బిల్లులు చెల్లించాలి.
- గురుకులాల్లో అన్నిరకాల పోషకాలు అందిస్తున్నారు. అక్కడ నిధులు పెంచారు. కానీ ప్రభుత్వ స్కూళ్లలో ఇస్తున్న మెనూ విద్యార్థులు తినేలా లేదని అనేక మంది ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థలన్నింటికీ ఒకే తరహా మెనూ అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలి. ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం అందించాలి.
- మధ్యాహ్న భోజనం అమలుకు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ఉండాలి. నిత్యావసరాలు, కూరగాయలు సేకరించడం, వాటిని నిల్వ చేయడం, శుభ్రం చేయడం, వండటం, వృథాగా పారేసేందుకు ప్రత్యేక నిబంధనలు ఉండాలి. దీని అమలుకు యంత్రాంగం చర్యలు చేపట్టాలి.
- రాష్ట్రంలో నిత్యావసరాలు, కూరగాయలు, ఇతర సామగ్రి సేకరించడంలో ఐదు సంస్థలు మాత్రమే పని చేస్తున్నాయి. దీనికి అనేక రకాల నిబంధనలు అడ్డంకిగా ఉన్నాయి. టెండర్లు వేయడం, వాటిని ఖరారు చేయడానికి ఉన్నతాధికారుల అనుమతుల వల్ల ఆలస్యమవుతోంది. ఈ బాధ్యతను ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించాలి. దీనివల్ల ఒకే సంస్థ ఈ బాధ్యతను తీసుకుని, నాణ్యత పెంచుతుంది.

ప్రభుత్వం దృష్టిపెడుతుందని ఆశిస్తున్నాం..



వందల స్కూళ్లలో మధ్యాహ్న భోజన పరిస్థితిని పరిశీలించాం. అన్ని వర్గాలవారితో మాట్లాడాం. అందరి అభిప్రాయాలు తీసుకున్నాం. నాణ్యమైన భోజనం అందించే దిశగా ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు చేశాం. సీఎస్ శాంతి కుమారికి నివేదిక అందజేశాం. ప్రభుత్వం దీనిపై దృష్టి పెడుతుందని ఆశిస్తున్నాం.

– ఆకునూరి మురళి, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్

కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, ద్రోహం

- నేడు నల్లగొండలో రైతు దీక్ష: కర్నె ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ అంటేనే మోసం, దగా, ద్రోహం అని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆరోపించారు. సోమవారం తెలంగాణభవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వాసుదేవరెడ్డి, దూదిమెట్ల బాలరాజు యాదవ్, మేడే సాగర్, రామచంద్రనాయక్‌లతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం నల్లగొండలో రైతు దీక్షా కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు భిక్షం వేయదని, రాష్ట్రాలకు హక్కుగా నిధులు ఇవ్వాలన్నారు.

కిడ్నీ రాకెట్ కేసులో సర్జన్ రాజశేఖర్ రిమాండ్



రాజశేఖర్

చైతన్యపురి: అలకానంద కిడ్నీ రాకెట్ కేసులో మరొకరిని సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్ర చికిత్సలు చేసిన తమిళనాడుకు చెందిన పెరుమాళ్ల రాజశేఖర్ (59)ను చెన్నై వెళ్లిన పోలీస్ బృందం అరెస్ట్ చేసి నగరానికి తీసుకొచ్చారు. కిడ్నీ రాకెట్ కేసులో 13వ నిందితుడుగా ఉన్న రాజశేఖర్ ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లా మిలటరీ కాలనీకి చెందిన వ్యక్తి. తమిళనాడులోని సవిత మెడికల్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. అలకానంద ఆస్పత్రి అక్రమ కిడ్నీ రాకెట్ వ్యవహారంలో శస్త్ర చికిత్సలు చేసిన ప్రధాన సర్జన్. ఆయన సుమారు 12 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాక ఇదే ముఠా ఆధ్వర్యంలో జనని, అరుణ ఆస్పత్రుల్లో కూడా మరో 30కి పైగా కిడ్నీ మార్పిడి చేసినట్లు తెలిసింది.

'పరీక్ష పే చర్చ'కు సుద్దాల విద్యార్థి ఎంపిక

- ప్రధానితో డిబేట్‌లో పాల్గొననున్న సాయితేజ



కోనరావుపేట (వేములవాడ): రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి అలువాల సాయితేజ.. ప్రధాని నరేంద్రమోదీతో జరిగే డిబేట్‌కు ఎంపికయ్యాడు. పరీక్షలంటే భయాన్ని తొలగించేందుకు ప్రధాని 'పరీక్ష పే చర్చ'అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పాల్గొని ప్రశ్నలు అడిగేందుకు ముందుగా నిర్వహించిన అర్హత పరీక్షలో సాయితేజ విజయం సాధించారు. ఈ పరీక్షను దేశవ్యాప్తంగా 10 వేల మంది విద్యార్థులకు నిర్వహించారు. ఈనెల 25 నుంచి 29 వరకు తమ అతిథిగా ఉండాల్సిందిగా కేంద్ర విద్యామంత్రిత్వశాఖ ఆహ్వానం మేరకు ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు గంగాధర్‌తో కలిసి వెళ్లాడు.

అల్ప్రాజోలం తయారీ, విక్రేత ఆస్తులు జప్తు

- వెల్లడించిన టీజీ ఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్‌శాండిల్య

సాక్షి, హైదరాబాద్: కల్తీకల్లు తయారీలో వినియోగించే నిషేధిత అల్ప్రాజోలం తయారీతోపాటు విక్రయిస్తున్న పాత నేరస్తుడు గుడికాడి లింగాగౌడ్‌కు చెందిన రూ.30 కోట్ల విలువైన ఆస్తులను టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) అధికారులు జప్తు చేయించారు. అల్ప్రాజోలం విక్రయించడం ద్వారా ఈ ఆస్తులు కూడబెట్టినట్టు ఆధారాలు సేకరించిన అధికారులు.. ఎన్‌డీపీఎస్ యాక్ట్ సెక్షన్ 68–ఎఫ్ (2) కింద లింగాగౌడ్ స్థిర, చరాస్తులు జప్తు చేసినట్టు టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండాపూర్‌కు చెందిన లింగాగౌడ్ ఉస్మానియా యూనివర్సిటీ లో ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. తనకున్న పరిజ్ఞానంతో నిషేధిత అల్ప్రాజోలంను తయారు చేసి విక్రయించడం ద్వారా డబ్బు సంపాదించాలని పథకం వేశాడు. విజయవాడకు చెందిన రామకృష్ణగౌడ్‌తో కలిసి అల్ప్రాజోలం తయారు చేసి, విక్రయించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో 2021లో పేట్‌బషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, విజయవాడలోని ల్యాబ్‌ను సీజ్ చేశారు. ఆ కేసు జైలు నుంచి విడుదలైన తర్వాత, మళ్లీ అదే ల్యాబ్‌లో అల్ప్రాజోలంను తయారుచేసి, తెలంగాణలోని పలు ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్లకు విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారంతో టీజీఏఎన్‌బీ, మాదాపూర్ పోలీసులు మార్చి, 2024లో లింగాగౌడ్‌ను మరోసారి అరెస్టు చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ

ఫారం–VI
(ప్రాథమిక ప్రకటన)

(భూసేకరణ పునరావాస, పునర్నిర్మాణ చట్టంలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013, కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) మరియు రూలు 19 వలే రూలు (1) ను అనుసరించి

కలెక్టర్ గారి కార్యాలయం ఫైల్ నం.E1/2904/2024 — తేది: 25/01/2025
రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ ఫైల్ నం. D/1490/2024 — తేది: 09/01/2025
గెజిట్ నెంబరు. 07/2025 — తేది: 25/01/2025

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారి ఆదేశానుసారం దిగువ నిర్దిష్ట పరిచిన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలము తోటపల్లి గ్రామం మరియు అక్కన్నపేట మండలము జనగాం & చౌటపల్లి గ్రామములలో ఉన్న భూమి విస్తీర్ణం ఎకరములు 124.36 గుంటలు ప్రజా ప్రయోజన నిమిత్తం అనగా **TGIIC యొక్క పారిశ్రామిక పార్కు ఏర్పాటు కోసం** ఈ దిగువ చూపిన భూమి అవసరం అంటు ఉన్నదని భావించినందున భూసేకరణ పునరావాస, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ఈ ప్రకటన జారీచేయనైనది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము మరియు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పరిశ్రమలు & వాణిజ్య (IP&INF) శాఖ, Memo No.5103/IP&INF/A2/2024, dt.03.12.2024 వారు 10-A అనుసరించి సోషల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ మరియు ఆహార భద్రతను మినహాయింపు ఇవ్వ నైనది.

కావున సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలము తోటపల్లి గ్రామం మరియు అక్కన్నపేట మండలము జనగాం & చౌటపల్లి గ్రామములలో ఉన్న భూమి విస్తీర్ణం ఎకరములు 124.36 గుంటల గల భూమి యొక్క వివరములు ఈ క్రింద చూపిన వారికి భూసేకరణ పనుల ప్రారంభ నిమిత్తం ప్రాథమిక నోటిఫికేషన్ జారి చేయనైనది.

షెడ్యూల్

క్రమ సంఖ్య	సర్వే నెంబర్	భూమి స్వభావం	భూసేకరణ చేయు విస్తీర్ణం	పట్టాదారుపేరు & అనుభవదారుపేరు	నిర్మాణాలు (చెట్లు, బోర్లు, బావులు, కట్టడములు మరియు ఇతరములు)
1	2	3	4	5	6
గ్రామము : తోటపల్లి మండలము : హుస్నాబాద్ జిల్లా : సిద్దిపేట					
1	478	Dry/ Patta	13.34	మంద జ్యోతి (0.13)	1-వేపచెట్టు
				మాషమ్ రాజవ్వ (0.08)	
				శంకర్ (2.20)	1-బోరుబావి పైపు లైను 30-వేపచెట్లు 2-వేపచెట్లు [illegible]
				కందుకూరి వెంకటమ్మ (0.38)	
				ముక్కెర మల్లిక (0.25)	
				బాలవ్వ (0.07)	
				మంద రాజయ్య (2.24)	2-బోర్‌వెల్స్, పైప్‌లైన్
				గద్దల శంకర్ (1.28)	
				ఒడితాల గణేష్ (0.33)	
				మాషమ్ రాధ (1.23)	1-వేపచెట్టు
				వైనాల రాణి (1.16)	1-బోరుబావి
				మంద లింగమ్మ (1.04)	1-బోరుబావి
2	479	Dry/ Patta	7.86	మాషమ్ రాజవ్వ (1.18)	
				తోటపల్లి GP ట్యాంక్ (0.07)	1-బోర్‌వెల్ గొలుసు బావి
				మంద జ్యోతి (2.01)	10-వేప చెట్లు 10-వేప చెట్లు
				కందుకూరి వెంకటయ్య (1.19)	
				శంకర్ (0.13)	
				కందుకూరి వెంకటమ్మ (0.02)	
				మంద లింగవ్వ (0.04)	
				దొడ్డ శ్రీనివాస్ రెడ్డి తండ్రి పుష్పా రెడ్డి (0.31)	
				పెరుమాల దుర్గా ప్రసాద్ తండ్రి గోపాల్ రావు (0.39)	
				రోడ్ (0.30)	
3	480	Dry/ K.K	1.23	వైనాల రాణి (0.01)	
				మంద లింగవ్వ (0.18)	
				Unknown extent (0.24)	
				రోడ్ (0.20)	
4	481	Dry/ Patta	0.56	వైనాల రాణి (0.07)	
				మంద లింగవ్వ (0.03)	
				Unknown extent (0.15)	
				రోడ్ (0.13)	
5	482	Dry/ Patta	0.29	Unknown extent (0.05)	
				రోడ్ (0.24)	
6	483	Dry/ Patta	0.21	ఒడితాల గణేష్ (0.02)	
				మాషమ్ రాధ (0.02)	
				వైనాల రాణి (0.05)	
				Unknown extent (0.05)	
				రోడ్ (0.07)	
విస్తీర్ణం			25.20		
గ్రామము : చౌటపల్లి మండలము : అక్కన్నపేట జిల్లా : సిద్దిపేట					
1	312	Govt. Land	83.36	ఎల్లందుల జాంపయ్య తండ్రి ఎల్లయ్య	5-ఉస్కచెట్లు 5-తాటి చెట్లు 1-టిన్ షెడ్ 5-వేపచెట్లు
				ఎల్లందుల విజయ్ తండ్రి రాజయ్య (3.21)	
				యమ అరిలక్ష్మి భర్త వెంకన్న (1.39)	2-బోర్ 1-టిన్ షెడ్
				వైనాల సారవ్వ భర్త కనకయ్య (0.25)	
				వైనాల శ్రీనివాస్ తండ్రి ఎల్లయ్య (0.21)	
				బోదసల వెంకయ్య తండ్రి మల్లయ్య (0.22)	
				కోనమల కొమురయ్య తండ్రి రాజయ్య	
				బోదమల సంపత్ తండ్రి రాజయ్య (0.21)	
				గూడపాటి సర్వయ్య తండ్రి బాలయ్య	
				గూడపాటి లక్ష్మి భర్త రాజయ్య (1.02)	
				కమాద్రి దేవమ్మ భర్త ఓదయ్య (0.10)	
				కమాద్రి ఎల్లయ్య తండ్రి ఎల్లయ్య (0.14)	
				కమాద్రి భూమయ్య తండ్రి వెంకయ్య (0.16)	
				గాదర్ల మల్లేశం తండ్రి హనుమయ్య (0.27)	
				వంశల హనుమయ్య తండ్రి మల్లయ్య (0.31)	
				కందుకూరి కొమురవ్వ భర్త వెంకయ్య (0.16)	
				కందుకూరి ఓదయ్య తండ్రి వీరమల్లయ్య	
				కందుకూరి ఉమయ్య తండ్రి వీరమల్లయ్య (0.19)	
				కొబుగూరి రాజయ్య తండ్రి ఐలయ్య (0.12)	
				పూదరి శ్రీనివాస్ తండ్రి సాయిలు (0.10)	
				బీంగి పద్మ భర్త కనకయ్య (0.26)	1-బోర్
				గాదర్ల భూదమ్మ భర్త లచ్చయ్య	3-బోర్లు 1-టిన్ షెడ్
				గాదర్ల వెంకటవ్వ తండ్రి ఎల్లయ్య	
				గాదర్ల ఉమాస్వామి తండ్రి వెంకటేశ్వర్లు (1.11)	
				గాదర్ల రాజమౌళి తండ్రి వెంకటేశం (0.10)	
				మంద యాదగిరి తండ్రి రాజయ్య	
				మంద లక్ష్మి భర్త మల్లయ్య	
				మంద సంపత్ తండ్రి రాజయ్య	
				మంద వెంకటస్వామి తండ్రి రాజయ్య (0.20)	
				మంద శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య (0.17)	
				ముదికి లక్ష్మి భర్త రాజయ్య	
				మంద స్వామి తండ్రి మైసయ్య (0.16)	
				కట్కూరి ఎల్లయ్య తండ్రి కనకయ్య (0.16)	
				మంద గాలయ్య తండ్రి రాజమల్లయ్య	
				మంద రేణుక భర్త రాజమల్లు	
				మంద రాజవ్వ భర్త లస్మయ్య (0.24)	
				గాదర్ల రాజమల్లయ్య తండ్రి మందయ్య (1.13)	
				మంద జలమ్మ భర్త ఈదయ్య (1.34)	1-బోర్
				పెరుమాల దుర్గా ప్రసాద్ (0.09)	
				సుద్దాల రమాదేవి భర్త రవీందర్ (3.20)	1-బోర్
				సుద్దాల మల్లయ్య తండ్రి పోచయ్య (1.22)	
				గాధలా కొమురవ్వ భర్త ఐలయ్య (0.12)	
				మాసం రాజవ్వ భర్త రాజయ్య (0.20)	
				మంద భూమయ్య తండ్రి వెంకయ్య (1.10)	
				మంద మరియమ్మ భర్త చంద్రయ్య (0.23)	
				మంద లస్మయ్య తండ్రి చంద్రయ్య (0.13)	
				మంద యాదగిరి తండ్రి రాజయ్య (0.13)	
				మంద వెంకటయ్య తండ్రి మల్లయ్య (0.13)	
				జనగపురం వెంకటయ్య తండ్రి నర్సయ్య (0.24)	
				మంద లచ్చయ్య తండ్రి మల్లయ్య (0.14)	
				మంద లచ్చవ్వ భర్త మల్లయ్య	1-బోర్
				మంద రాజయ్య తండ్రి సర్వయ్య	
				మంద యాదయ్య తండ్రి రాజయ్య	
				మంద సంపత్ తండ్రి రాజయ్య	
				మంద వెంకట్ స్వామి తండ్రి రాజయ్య (1.30)	
				ఎర్రవెల్లి వెంకటపతి తండ్రి రాజయ్య (0.13)	
				అన్నబోయిన మల్లయ్య తండ్రి నారాయణ (0.13)	
				గుడిపాటి లక్ష్మి భర్త రాజయ్య (0.34)	
				కమాద్రి రవి తండ్రి ఓదయ్య (0.09)	
				కమాద్రి రమేష్ తండ్రి మహేందర్ (0.08)	
				కమాద్రి లక్ష్మయ్య తండ్రి ఎల్లయ్య (0.12)	
				వైనాల సూరవ్వ భర్త కనకయ్య (0.12)	
				వైనాల శ్రీనివాస్ తండ్రి ఎల్లయ్య (0.12)	
				సూరినేని మధుసూధన్ రావు తండ్రి రాజేశ్వర్రావు (1.04)	
				మంద నరేష్ తండ్రి యాదగిరి (0.12)	
				మంద నవీన్ తండ్రి యాదగిరి (0.12)	
				ఎల్లందుల రమేష్ తండ్రి సమ్మయ్య	3-పశువుల షెడ్డు
				ఎల్లందుల యాదగిరి తండ్రి సమ్మయ్య	1-బావి
				ఎల్లందుల కుమారస్వామి తండ్రి సమ్మయ్య (3.14)	1-బోర్
				మర్రిపల్లి వీరభద్రరావు తండ్రి గోపాల్ రావు (0.05)	
				మద్దెల రాజవ్వ భర్త లింగయ్య (0.28)	
				మద్దెల రవీందర్ తండ్రి రాజయ్య (0.26)	
				మద్దెల లింగయ్య తండ్రి ఎల్లయ్య (0.20)	
				మద్దెల కుమారస్వామి తండ్రి వీరయ్య (0.22)	
				మద్దెల రాధా భర్త తిరుపతి రావు (0.23)	
				కామాద్రి రవీందర్ తండ్రి ఓదయ్య	
				కామాద్రి రమేష్ తండ్రి మొగిలి	
				కామాద్రి లక్ష్మి భర్త బాగయ్య	
				కామాద్రి మల్లేష్ తండ్రి మల్లయ్య (2.10)	
				పులికాసి రాజయ్య తండ్రి ముత్తయ్య	
				పులికాసి కనకయ్య తండ్రి ముత్తయ్య (0.21)	
				జనగపురం వెంకటయ్య తండ్రి నర్సయ్య (0.19)	
				మర్రిపల్లి మధుసూదన్ రావు తండ్రి రాజేశ్వర్ రావు (0.1250)	
				కొత్తకొండ పోశెట్టి తండ్రి పర్వతయ్య (0.10)	
				కామాద్రి కొమురయ్య తండ్రి ఐలయ్య	
				కామాద్రి ఐలయ్య తండ్రి వీరయ్య (0.23)	
				బోదమల్ల సంపత్ తండ్రి రాజయ్య (0.0750)	
				బోదమల్ల వెంకటయ్య తండ్రి లింగయ్య (0.3850)	
				మంద లక్ష్మి భర్త ఐలయ్య (0.20)	
				మంద తిరుపతి తండ్రి దుర్గయ్య	
				మంద కొమురయ్య తండ్రి వీర యల్లయ్య	
				మంద లక్ష్మి భర్త ఐలయ్య (0.1650)	
				మంద పోచవ్వ భర్త రాజయ్య (0.06)	
				కందుకూరి పద్మ భర్త సంపత్ (0.2750)	
				మంద సుగుణ భర్త వెంకటయ్య (0.20)	1-పైపులైను
				మంద సంపత్ తండ్రి కొమురయ్య (0.1050)	1-పైపులైను
				ముక్కెర ఆగన్న భర్త కనకయ్య (0.0750)	
				ముక్కెర మల్లికా భర్త సంపత్ (0.1050)	
				జమలంతల వెంకటయ్య (0.12)	
				మంద పోశవ్వ భర్త రాజయ్య (0.32)	1-సిమెంట్ వాటి
				మంద పీరమల్లయ్య తండ్రి ఐలయ్య (0.19)	1-బావి
				మంద లక్ష్మణ్ తండ్రి మల్లయ్య (0.32)	
				మంద సోమయ్య తండ్రి రాజమల్లు (1.33)	
				మంద సోమయ్య తండ్రి రాజమల్లు (0.11)	
				మంద పోశవ్వ భర్త రాజయ్య (0.10)	
				మంద రాములు (0.0950)	
				మంద లక్ష్మక్క (0.0950)	
				కొలకని రాజమణి భర్త ఐలయ్య (0.16)	
				మంద జలవ్వ (0.1250)	
				మంద సంపత్ (0.1250)	
				మంద రామయ్య తండ్రి మల్లయ్య (0.04)	
				మంద శంకరయ్య తండ్రి వీరయ్య (0.12)	1-బావి, 3-వేపచెట్లు 2-ఉసిరిచెట్లు
				మంద రాజకుమార్ (0.19)	
				మంద రామయ్య తండ్రి మల్లయ్య (0.04)	
				గాదల రాజు మల్లయ్య (0.14)	
				మంద కొమురయ్య తండ్రి ఓదయ్య (0.08)	
				మంద వెంకటయ్య తండ్రి పోచయ్య (0.19)	
				మంద శంకరయ్య తండ్రి వీరయ్య (0.23)	
				కందుకూరి సంపత్ తండ్రి వెంకటయ్య (0.08)	
				మంద వెంకటయ్య తండ్రి దుర్గయ్య (0.32)	
				పెద్దమ్మ దేవాలయం (0.20)	
				మల్లన్న దేవాలయం (0.12)	
				మడలయ్య దేవాలయం (0.08)	
				మందిరిపల్లి రాజ్యలక్ష్మి	
				సాయి కరుణా, పులికాసి కొమురయ్య	
				పల్లె కొమురయ్య	
				అవుల విష్ణు లచ్చవ్వ (2.13)	
				గంటల సారయ్య తండ్రి వెంకటయ్య (0.16)	
				గంటల ఎల్లయ్య తండ్రి మల్లయ్య (0.16)	
				గంటల మల్లేశం తండ్రి రాజయ్య (0.16)	
				గంటల రాజయ్య తండ్రి దుర్గయ్య (0.16)	
				తిగుళ్ల సంపత్ (0.11)	
				తిగుళ్ల లింగస్వామి (0.11)	
				మంద రామయ్య తండ్రి పోచయ్య (0.15)	
				మంద పోశమ్మ భర్త రాజయ్య (0.18)	
				కొయ్యడ దుర్గయ్య తండ్రి కొమురయ్య (0.17)	
				మంద కొమురయ్య తండ్రి ఓదయ్య (0.10)	
				మంద ఐలయ్య తండ్రి దుర్గయ్య (0.31)	1-బావి
				మంద రాములు (0.10)	
				ఎలవెల్లి రాజమ్మ భర్త రాజయ్య (0.19)	
				మంద రామయ్య తండ్రి మల్లయ్య (0.09)	
				గద్దల కొమురయ్య	
				గద్దల అశోక్ తండ్రి అగయ్య (0.11)	
				మంద మైసయ్య తండ్రి లక్ష్మీపతి (0.08)	
				మంద దుర్గవ్వ భర్త మైసయ్య	
				మంద స్వప్న భర్త సంపత్	
				మంద రామయ్య తండ్రి పోచయ్య	
				మంద సుత్రయ్య తండ్రి పోచయ్య	
				మంద కమల భర్త దామోదర్ (0.25)	
				పెల్లకాసి రాజయ్య తండ్రి రామయ్య (0.22)	
				గాజుల లక్ష్మి భర్త రామస్వామి (0.21)	
				గాజుల తిరుపతి తండ్రి రాజేశం (0.11)	
				ఎరుపుల లింగమూర్తి తండ్రి వెంకటయ్య (0.11)	
				అవుల లచ్చయ్య తండ్రి దొందయ్య (0.10)	
				అవుల కనకయ్య తండ్రి మల్లయ్య (0.11)	
				మంద రాజయ్య తండ్రి లింగయ్య (0.11)	
				ముక్కెర సంపత్ తండ్రి కొమురయ్య (2.24)	1-బోర్
				ముక్కెర కనకయ్య తండ్రి పోచయ్య (0.18)	
				మంద సేంత తండ్రి దుర్గయ్య (0.15)	
				మంద కిరణ్ కుమార్ తండ్రి దుర్గయ్య (0.15)	
				ఈసం కమల భర్త దాశాద్రి (0.12)	
				గంగాధర శ్రీనివాస్ తండ్రి వీరయ్య (0.10)	
				రోడ్ (4.36)	
				ప్రభుత్వం భూమి (2.12)	
విస్తీర్ణం			83.36		
గ్రామము : జనగాం మండలము : అక్కన్నపేట జిల్లా : సిద్దిపేట					
1	73	Dry/ Patta	0.28	దుద్దాల శ్రీనివాస్ రెడ్డి తండ్రి పుష్పా రెడ్డి	
				పూదారి నారాయణ తండ్రి వీరయ్య (0.28)	
2	74	Dry/ Patta	2.14	దుద్దాల శ్రీనివాస్ రెడ్డి తండ్రి పుష్పా రెడ్డి	
				పూదారి నారాయణ తండ్రి వీరయ్య (2.14)	
3	75	[illegible]	0.26	పూదారి నారాయణ తండ్రి వీరయ్య (0.26)	
4	76	Dry/ Patta	5.01	పూదారి బలయ్య తండ్రి మల్లయ్య (2.10)	
				పూదారి శ్రీనివాస్ తండ్రి సాయన్న (0.21)	
				చందా శ్రీనివాస్ తండ్రి నందయ్య (2.10)	
5	77	Dry/ Patta	0.13	పూదారి బలయ్య తండ్రి మల్లయ్య	
				పూదారి శ్రీనివాస్ తండ్రి వెంకయ్య	
				పూదారి శ్రీనివాస్ తండ్రి బలయ్య	
				పూదారి ఎంకవ్వ భర్త భూమయ్య (0.13)	
6	78	[illegible]	0.25	పూదారి శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య (0.25)	
7	79	Dry/ Patta	0.39	పూదారి శ్రీనివాస్ తండ్రి సాయన్న (0.30)	
				చందా శ్రీనివాస్ తండ్రి నందయ్య (0.09)	1-గొలుసు బావి
8	812	[illegible]	0.25	పూదారి నారాయణ తండ్రి వీరయ్య (0.25)	
9	813	[illegible]	2.03	పూదారి నారాయణ తండ్రి వీరయ్య (2.03)	
10	814	[illegible]	1.24	పూదారి శ్రీనివాస్ తండ్రి సాయన్న (1.24)	
11	815	[illegible]	0.22	పూదారి శ్రీనివాస్ తండ్రి సాయన్న (0.22)	
విస్తీర్ణం			15.20		
మొత్తం విస్తీర్ణం			124.36		

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరావాస పునర్నిర్మాణ కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూయజమానులు చట్టప్రకారం భూనష్ట పరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారి చేయనైనది.

భూమి యొక్క ప్లాన్, మరియు వివరములు జిల్లా కలెక్టర్ సిద్దిపేట మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ పని వేళలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారు రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్ గారిని మరియు వారి సిబ్బంది ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్-12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదేని ప్రదేశములో ప్రవేశించి సర్వే జరిపి భూమి కొలతలను కొలిచే అధికారం, భూమిని త్రవ్వుటకు లేదా భూ స్వరూపం తెలుపు బోర్ వెయ్యుటకు మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టుటకు అనుమతింప నైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, సిద్దిపేట గారి అనుమతి లేకుండా, ప్రాథమిక నోటిఫికేషన్ జారి చేసిన తేదీ నుండి ఆ నోటిఫికేషన్ లో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎవరు ఎటువంటి కొనుగోలు /అమ్మకాలు/తాకట్టు సంబంధించిన చర్యలు చేపట్టరాదు.

ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అనంతరం పైన చూపిన భూములలో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైన భూసేకరణ పై సెక్షన్ 15(1) అభ్యంతరములు ఉన్నచో ఇట్టి నోటిఫికేషన్ జారి చేసిన (60) దినములలో భూసేకరణ అధికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి, హుస్నాబాద్. — సం/- అదనపు కలెక్టర్ సిద్దిపేట. — సం/- జిల్లా కలెక్టర్ సిద్దిపేట.

DIPR R.O.No.629/LA/PP/ADVT/AGENCY/2024-25

The Singareni Collieries Company Limited
(A Government Company)
Regd. Office: Kothagudem- 507101, Telangana.
E-PROCUREMENT TENDER NOTICE

Tenders have been published for the following Services / Material Procurement through e-procurement platform. For details, please visit https://tender.telangana.gov.in - or - https://scclmines.com

NIT/Enquiry No. - Description / Subject - Last date and time for Submission of bid(s).

- **EST24O0116** - Annual maintenance contract for 5 numbers of 250LPH RO plants and 3 numbers of 100LPH RO plants at 2x600MW, Singareni Thermal Power Plant, Jaipur, Mancherial, Telangana State on value based rate contract for a period of two years - **10.02.2025- 12.01 PM.** GM (E&M), STPP
- **E0424O0352** - Procurement of various sizes of W-Straps (Finished ready to use) against Open enquiry throuth Tender cum reverse - auction - **06.02.2025- 17:00 Hrs.**
- **E0224O0353** - Procurement of Tungsten Carbide Cutter Picks or 500 TPH Feeder Breakers on Rate Contract for a period of 2 years against Open Enquiry through Tender cum Reverse - Auction - **06.02.2025- 17:00 Hrs.**
- **E1724O0348** - Microsoft Exchange E-Mail Services on Cloud Platform for 2 (Two) Years - **07.02.2025 - 17:00 Hrs.**
- **E1324O0355** - Procurement of Nonels and Electronic Detonator (Factory set) for use in OB blasting at all the OCPs of SCCL for a period of 18 months - **07.02.2025 - 17:00 Hrs.**
- **E1724O0354** - Comprehensive Annual Maintenance Contract for HCI (Hyper Convergent Infrastructure) High End Servers for a period of 2 years - **11.02.2025 - 17:00 Hrs.** GM (MP)

PR/2025/ADVT/STPP/MP/06
DIPR RO No.9664-PP/CL/Advt/1/2024-25, Dt.27.01.2025

మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్

NIT No. టెండరు ప్రకటన నం. 02/EE/MRDCL/2024-25 — తేది : 28.01.2025

పని పేరు : 2025 సంవత్సరానికి తార్నాక ఆఫీస్ మరియు EnC (PH) బిల్డింగ్ ఆఫీస్, MRDCL వద్ద అధికారిక ప్రయోజనార్థం స్టేషనరీ, బిల్డింగ్ మెయింటెనెన్స్, మెటీరియల్స్, కంప్యూటర్ పెరిఫెరల్స్ మరియు ఇతర అనుబంధ వస్తువుల సేకరణ. బిడ్లు స్వీకరణకు చివరి తేది మరియు సమయం : టెండరు దాఖలుకు చివరి తేది : 04.02.2025న సా.4.30 గం.వరకు. అధికారి పేరు, చిరునామా మరియు సెల్ నం. : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, MRDCL, 7995009116. డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : 28.01.2025న సా.4.30 గం. నుండి. బిడ్లు దాఖలుకు చివరి తేది మరియు సమయం: 04.02.2025న సా.4.30 గం. వరకు. సాంకేతిక బిడ్లు తెరుచు తేది : 04.02.2025న సా.5.00 గం.కు. ధర బిడ్లు తెరుచు తేది : 05.02.2025న సా.5.00 గం.కు. గమనిక : బిడ్డర్లు టెండరు డాక్యుమెంటు డౌన్‌లోడ్ చేసుకొనేందుకు www.tender.telangana.gov.inను దర్శించాల్సిందిగా సూచించబడుచున్నారు. ఏవైనా విచారణలు musirdc@gmail.comకు పంపవలెను. ఏవైనా విచారణల కొరకు సంబంధిత అధికారి, MRDCL గారిని కార్యాలయవేళల్లో సంప్రదించండి. సంప్రదించు నం. 7995009116. MRDCL, 1వ అంతస్తు, O/o. ENC (PH), కళనా బిల్డింగ్, ఏసీ గార్డ్స్, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్–500004. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చును.

సం/– ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, MRDCL

DIPR RO No.9693-PP/CL/Advt/1/2024-25, Dt: 27.01.2025

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయతీరాజ్
(గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం యొక్క సంస్థ)
రాజేంద్రనగర్, హైదరాబాద్ - 500030

07-02-2025న వాక్ ఇన్ ఇంటర్వ్యూ

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (NIRDPR) (గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం పరిధిలోని స్వయంప్రతిపత్తి గల సంస్థ. నెలకు రూ.28,000/- కన్సాలిడేటెడ్ రెమ్యూనరేషన్‌తో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేయుటకు **పంప్ ఆపరేటర్** (1 ఉద్యోగం) కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించుటకు NIRDPRలోని CMU ప్రతిపాదిస్తోంది.
జాబ్ ప్రొఫైల్, అర్హతా ప్రమాణాలు మరియు ఇతర వివరాల కోసం దర్శించండి: **http://nirdpr.org.in/**

Advt.No.40/2024
File No: EE/CMU/ContractualStaff /202425/AE
Comp.no. 17315

సం/– అసిస్టెంట్ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ (సెక్షన్–I)

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ

Rc.No.1252/2019/S3 — **బహిరంగ కలప వేలం ప్రకటన** — తేది:22-01-2025

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా ఈ క్రింద తెలుపబడిన అటవీ జాతుల కలపను ఏటూరునాగారం ప్రభుత్వ కలప డిపో (Govt. Timber Depot) నందు బహిరంగ వేలం నిర్వహించబడును. ఈ క్రింద తెలుపబడిన తేదీలలో. DATE OF SALE, TIME: 30-01-2025, 10.00 AM, 10-02-2025, 10.00 AM, 20-02-2025, 10.00 AM, 28-02-2025, 10.00 AM, 10-03-2025, 10.00 AM, 20-03-2025, 10.00 AM, 30-03-2025, 10.00 AM. ఈ క్రింది తెలుపబడిన రకముల కలప. 1) యేగిస, 2) నల్లమద్ది, 3) బండారు, 4) బట్టగనం, 5) జిట్రేగి, 6) టేకు, 7) నారేప. పూర్తివివరములకు అటవీ క్షేత్రాధికారి, ఏటూరునాగారం నార్త్ రేంజ్ గారిని (ఫోన్ నంబర్: 9177720923) నందు సంప్రదించగలరు. Note: ఒకవేళ సమయం సరిపోకపోతే మరునటి రోజుకూడా సేల్స్ నిర్వహించబడును.

సం/- (ఎస్. రమేష్), డివిజనల్ అటవీ శాఖ అధికారి, ఏటూరునాగారం వన్యప్రాణి విభాగం, జిల్లా ములుగు.

DIPR Ro No.9687-PP/CL/Advt/1/2024-25, Dt: 27.01.2025

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
స్వర్ణజయంతి కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500038.

బహిరంగ ప్రకటన
ప్రణాళికా శాఖ
నం.013859/FLT/HMDA/3768/GHT/2024

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కీసర (మం), నాగారం (గ్రా) వద్ద గల సర్వే నం.లు 396/P, 397/P & 398/Pలోని 24315.83 చ.మీటర్ల విస్తీర్ణం గల ఓపెన్ ప్లాట్లతో ఇంతకుముందు ఆమోదించబడిన డ్రాఫ్ట్ లేఅవుట్ సైట్ ఏరియా విస్తీర్ణం 2224.5 చ.మీటర్లకు తగువిధంగా తగ్గిస్తూ మార్పులు/ చేర్పుల కొరకు M/s. మైల్‌స్టోన్ రియాల్టి. ప్రాతినిధ్యంవహిస్తున్న వారు గర్గం రామకృష్ణ మరియు ఇతరులు దరఖాస్తు దాఖలు చేశారు, దీని కోసం తగువిధంగా అంతర్గత మార్పులు చేస్తూ ఫైల్ నం.006227/LO/HMDA/1441/GHT/2024, తేది: 27-11-2024 ప్రకారం డ్రాఫ్ట్ లేఅవుట్ పర్మిషన్ ఆమోదించబడినదని తెలియజేయడమైనది.

అందువలన, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కీసర (మం), నాగారం (గ్రా) వద్ద గల సర్వే నం.లు 396/P, 397/P & 398/Pలోని 24315.83 చ.మీటర్ల విస్తీర్ణం గల ఓపెన్ ప్లాట్లతో ఆమోదిత డ్రాఫ్ట్ లేఅవుట్ పర్మిషన్ యొక్క ప్లాట్ల యజమానులు/ కొనుగోలుదారులు/ అగ్రిమెంట్ హోల్డర్లు, ఇంతకుముందు ఆమోదించబడిన డ్రాఫ్ట్ లేఅవుట్ పర్మిషన్‌కు చేసిన మార్పులకు సంబంధించి ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి (15) రోజుల్లోగా ఈ కార్యాలయానికి వారి అభ్యంతరాలు/ సూచనలు ఏవైనా ఉంటే వ్రాతపూర్వకంగా దాఖలు చేయవచ్చు. నిర్ణీత కాలంలోగా ఎటువంటి అభ్యంతరాలు/ సూచనలు అందనట్లయితే, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కీసర (మం), నాగారం (గ్రా) వద్ద గల సర్వే నం.లు 396/P, 397/P & 398/Pలో సైట్ ఏరియా విస్తీర్ణం 2224.5 చ.మీటర్లకు తగువిధంగా తగ్గిస్తూ, ఆమోదిత డ్రాఫ్ట్ లేఅవుట్ పర్మిషన్ మార్పు యొక్క ఆమోదం కొరకు దరఖాస్తుదారు అభ్యర్థన ఈ కార్యాలయం వద్ద లభించే మెటీరియల్ పేపర్స్ ఆధారంగా పరిశీలించబడుతుంది.

సం/- మెట్రోపాలిటన్ కమిషనర్, డైరెక్టర్ ప్లానింగ్-I, HMDA తరఫున

DIPR RO No.9701-PP/CL/Advt/1/2024-25, Dt.27.01.2025

Biotechnology Research and Innovation Council
A Department of Biotechnology Organization

डी एन ए फिंगरप्रिंटिंग एवं निदान केन्द्र (ब्रिक-सीडीएफडी)
CENTRE FOR DNA FINGERPRINTING AND DIAGNOSTICS (BRIC-CDFD)
(जैव प्रौद्योगिकी अनुसंधान और नवाचार परिषद, जैव प्रौद्योगिकी विभाग, विज्ञान एवं प्रौद्योगिकी मंत्रालय, भारत सरकार के तहत अनुसंधान संस्थान)
(A Research Institute under Biotechnology Research and Innovation Council, Department of Biotechnology, Ministry of Science & Technology, Government of India) इनर रिंग रोड, उप्पल, हैदराबाद, तेलंगाना, भारत / Inner Ring Road, Uppal, Hyderabad – 500039, Telangana, India दूरभाष / Tel : +91-40-2721 6000 / 6011, फैक्स / Fax: +91-40-2721 6006 वेबसाइट / Website: http://www.cdfd.org.in

ADVERTISEMENT NO. 01/2025
RECRUITMENT OF CONSULTANTS ON TEMPORARY BASIS

The Centre for DNA Fingerprinting and Diagnostics (CDFD), Hyderabad is a Research Institute under Biotechnology Research and Innovation Council, Department of Biotechnology, Ministry of Science and Technology, Government of India, that has been established to provide services in DNA fingerprinting and diagnosis of genetic disorders, and to undertake high quality basic research in frontier areas of modern biology. CDFD wishes to recruit the following Consultants on temporary basis;

1. **Consultant – Science Communication & Content Creator – 01 post**
2. **Consultant – Research Management – 01 post**

Please visit CDFD website www.cdfd.org.in for further details. Sd/-
प्रमुख– प्रशासन / Head – Administration

తెలంగాణ రాష్ట్ర విద్య మరియు సంక్షేమ మౌలికసదుపాయాల అభివృద్ధి సంస్థ
4వ అంతస్తు, రాజీవ్ విద్యా మిషన్ బిల్డింగ్, SECERT కాంపౌండ్, హైదరాబాద్–500001

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

టెండరు ప్రకటన నం. TGEWIDC/SE(Projects)/NIT 1 to 3/2024-25, — తేది:25.01.2025

దిగువ పనుల కోసం నమోదిత సంస్థలు మరియు కాంట్రాక్టర్ల నుండి ఇ–ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. **1. పని పేరు:** తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ (YIIRS) కాంప్లెక్స్‌ల కొరకు భవనాలు నిర్మించుట. **2. అంచనా కాంట్రాక్ట్ విలువ (సుమారు):** లొకేషన్, ECV (సుమారు) కోట్లలో, ECVలో 1% చొప్పున బయానా లక్షల్లో వరుసగా: 1) వికారాబాద్‌లో కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం - రూ.135.00 కోట్లు - రూ.135.00 లక్షలు, 2) ఖమ్మంలో మధిర అసెంబ్లీ నియోజకవర్గం - రూ.135.00 కోట్లు - రూ.135.00 లక్షలు, 3) సూర్యాపేటలో హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం - రూ.135.00 కోట్లు - రూ.135.00 లక్షలు. **3. బయానా (EMD):** ECVలో 1%. **4. టెండర్ల ప్రారంభ తేది, సమయం:** 01.02.2025న సా.5.00 గం. నుండి. **5. ప్రి–బిడ్ సమావేశ తేది, సమయం:** 11.02.2025న ఉ.11.00 గం.కు మేనేజింగ్ డైరెక్టర్, TGEWIDC, హైదరాబాద్ వారి కార్యాలయం వద్ద. **6. టెండర్ల స్వీకరణకు చివరి తేది, సమయం:** 18.02.2025న మ.3.30 గం.వరకు. **7. సాంకేతిక బిడ్ తెరుచు తేది:** 21.02.2025న సా.4.00 గం.కు. **8. ధర బిడ్ తెరుచు తేది:** 28.02.2025న మ.2.00 గం.కు. **9. టెండరు కోరుతున్న అధికారి:** పి.శశిధర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), TGEWIDC, హైదరాబాద్. ఫోన్ నం.040–29701041.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్), TGEWIDC, హైదరాబాద్

DIPR RO No.9696-PP/CL/Advt/1/2024-25, Dt. 27.01.2025

బిరబిరా సొంతూరికి

2 గంటల్లో 2 లక్షల మంది

గాజా బాటపట్టిన పాలస్తీనియన్లు

డెయిర్ అల్ బాలాహ్: పదిహేను నెలల భీకర యుద్ధానికి తాత్కాలిక ముగింపు పలికిన ఇజ్రాయెల్ ఎట్టకేలకు ఉత్తరగాజా ప్రాంతాలకు స్థానికులు రావొచ్చని అనుమతి మంజూరుచేయడంతో గతంలో దాడుల్లో ప్రాణభయంతో పారిపోయిన లక్షలాది మంది పాలస్తీనియన్లు ఇప్పుడు తిరిగి స్వస్థలాలకు పయనమయ్యారు. దీంతో సోమవారం ఉదయం 7 గంటలకు నెట్‌జారిమ్ కారిడార్ గుండా ఉత్తరగాజాకు శరణార్థులు పోటెత్తారు. అనుమతి ఇచ్చిన తొలి రెండు గంటల్లోనే ఏకంగా రెండు లక్షల మంది ఉత్తరగాజాకు తిరిగొచ్చేశారని అధికారులు వెల్లడించారు. దాడుల ధాటికి ఎక్కడి వస్తువులు అక్కడే వదిలేసి ప్రాణభయంతో వలసపోయిన పాలస్తీనియన్లు ఇప్పుడు లక్షలాదిగా తిరిగొస్తున్న దృశ్యాలు.. స్థానికుల సొంతూరిపై ప్రేమను కళ్లకు కడుతున్నాయి. దీంతో జాతీయరహదారి పొడవునా జనం బారులుతీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. అయితే ఇజ్రాయెల్ భూతల, గగనతల దాడుల్లో నేలమట్టమై నామరూపాల్లేకుండా పోయిన ఇళ్లు, ధ్వంసమై గుంతలుగా మారిన రహదారులే ఇప్పుడు తిరిగొస్తున్న పాలస్తీనియన్లకు స్వాగతం పలుకుతున్నాయి. దాదాపు తమ సర్వస్వం తుడిచిపెట్టుకుపోయినా.. శరణార్థులుగా టెంట్‌లలో బిక్కుబిక్కుమంటూ బతికేకన్నా సొంత స్థలాల్లో ఎలాగైనా బతికేద్దామన్న మొండి ఆశ తిరిగొచ్చిన పాలస్తీనియన్ల కళ్లలో కనిపిస్తోంది. దాడులప్పుడు వెంటతీసుకెళ్లిన ఆ కొద్దివస్తువులను, చంటి పిల్లలను చంకనేసుకుని కిలోమీటర్ల దూరం నడిచొస్తున్న దృశ్యాలు హృదయవిదారకంగా మారాయి. తమ ఇల్లుకాదుకదా తమ వీధి కూడా గుర్తుపట్టలేనంతగా నాశనమైన విధంచూసి తిరిగొచ్చిన పాలస్తీనియన్లు రోదిస్తున్న దృశ్యాలు తోటి వారిని సైతం కంటతడిపెట్టిస్తున్నాయి. ఉండటానికి ఇల్లులేక, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు అదృశ్యమైన ఈ మరుభూమిలో బతకడం ఎలాగబ్బా అన్న సందేహాలతో కొందరు నిర్వేదంలోకి జారిపోయారు. ఇజ్రాయెల్ అరాచకాలను ఆదినుంచి తీవ్రంగా ప్రతిఘటించిన పాలస్తీనియన్లలో చాలా మంది మాత్రం ఒక్కో ఇటుక మళ్లీ పేర్చి తమ ఇళ్లు, ప్రాంతాలను అభివృద్ధి చేసుకుంటామని ప్రతిజ్ఞచేశారు.

కొందరిలో బాధ, కొందరిలో తెగింపు

తిరిగొచ్చాక తమ ప్రాంతాలను చూసి గుండెలవిసేలా ఏడుస్తున్న వాళ్లు కొందరైతే, మరుభూమిలా మారిన తమ ప్రాంతాన్ని మళ్లీ పాత యథాస్థితికి తీసుకొస్తామన్న ధీమా, తెగింపు మరికొందరిలో కనిపించింది. '' జబాలియాలో ఇప్పుడు మన ఇల్లు లేదు. మొత్తం నాశనమైంది. నువ్వు ఖాన్ యూనుస్ పట్టణంలోనే ఉండిపో. అనవసరంగా ఇక్కడిదాకా రావొద్దు. ఇక్కడ సాయపడటానికి ఎవరూ లేరు. అందరం నడిరోడ్డుపై పడుకుంటున్నాం'' అని ఒక వ్యక్తి దక్షిణగాజాలో ఉన్న తన సోదరి ఖలీద్ రాబాకు ఫోన్‌లో చెప్పి కంటతడిపెట్టుకున్నారు. '' అసలు ఇక్కడ ఏం మిగిలింది?. ఇజ్రాయెల్ మా ఇళ్లను కుప్పకూల్చింది. ఇన్నాళ్లూ మేం దక్షిణగాజా టెంట్‌లో ఉన్నాం. ఇకపై ఉత్తరగాజా టెంట్‌లో ఉంటాం'' అని చంకలో పిల్లాడిని ఎత్తుకుని ఒక మహిళ రోదిస్తూ చెప్పింది. '' మా ఇల్లు ఉందో లేదో, ఒక వేళ ఉంటే మేం నివసించేందుకు అనువుగా ఉందోలేదోన్న ఆలోచనల మధ్యే మేం బయల్దేరాం. సొంత ప్రదేశానికి వెళ్లడం మినహా మాకు మరో అవకాశం లేదు'' అని 42 ఏళ్ల మహిళ వఫా హౌసానా చెప్పారు. '' నాడు నేనొక్కదాన్నే వలసపోయా. నా భర్త ఇక్కడే ఉండిపోయారు. ఇజ్రాయెల్ అనుమతించడంతో ఎట్టకేలకు మళ్లీ ఉత్తరగాజాకు వచ్చి ఏడాది తర్వాత భర్తను కలుసుకున్నా. ఇక్కడంతా నాశనమైంది. అదృష్టవశాత్తు మా ఇల్లు బాగానే ఉంది. తిరిగొచ్చే వాళ్లకు మొత్తం ఇల్లుకాకపోయినా ఒక్క గది బాగా ఉన్నా చాలు'' అని 44 ఏళ్ల సబ్రీన్ జనౌన్ ఆనందం వ్యక్తంచేశారు. తొలిరోజు తిరిగొచ్చిన వాళ్లకు ఆశ్రయం కల్పించాలన్న 1,35,000 టెంట్‌లు అవసరంకానున్నాయి. ఇందుకోసం గాజాలోని పాలస్తీనియన్ అధికారులు 5,500 మంది సహాయక సిబ్బందిని రంగంలోకి దింపారు. గాజా సిటీలో దాదాపు 75 శాతం నిర్మాణాలు నేలమట్టమయ్యాయని శాటిలైట్ ఉపగ్రహాల చిత్రాలను బట్టి అర్థమవుతోంది. మట్టికొట్టుకుపోయిన రోడ్డు మినహా మరేం మిగలలేదన్న బాధ తిరిగొచ్చిన వాళ్లలో కనిపిస్తోంది.



గాజా వైపు పోటెత్తిన జనం





ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాలో సోమవారం సతీసమేతంగా పూజలు చేస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా. ఈ సందర్భంగా యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, యోగా గురు బాబా రాందేవ్ తదితరులతో కలిసి త్రివేణి సంగమంలో ఆయన పుణ్యస్నానం ఆచరించారు. అనంతరం అక్కడి అక్షయవటాన్ని, షా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. సనాతన ధర్మ తత్త్వానికి కుంభమేళా ప్రతీక అని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు.

అధికార పక్షం సవరణలకు ఆమోదం

- విపక్షాల ప్రతిపాదనలకు తిరస్కరణ
- వక్ఫ్ సవరణ బిల్లుకు జేపీసీ ఓకే
- రేపు అధికారికంగా ఆమోదం

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లును సమీక్షించేందుకు ఏర్పడిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) తన పని దాదాపు పూర్తిచేసింది. కమిటీలో సభ్యులుగా ఉన్న ఎన్‌డీఏ కూటమి నేతలు సూచించిన ప్రతీ సవరణకే జేపీసీ ఆమోదముద్ర వేసింది. ఇక వక్ఫ్(సవరణ) బిల్లులోని మొత్తం 44 క్లాజుల్లోనూ సవరించాల్సిన అంశాలపై సోమవారం విపక్షసభ్యులు చేసిన దాదాపు 500కుపైగా ప్రతిపాదనలను జేపీసీ తిరస్కరించింది. అధికార బీజేపీ, మిత్రపక్షాలైన టీడీపీ, జేడీ(యూ) కలిపి మొత్తంగా చేసిన 32 సవరణలకు కమిటీ ఆమోదముద్ర వేసింది. సభ్యులు ఏదైనా భూమి వివాదంలో లేకపోతే, అది ప్రభుత్వ సంబంధ కార్యకలాపాలతో ముడిపడి లేకపోతే అలాంటి వాటిని మాత్రం వక్ఫ్ సొంతంగా తమవిగా ప్రకటించుకోవచ్చని, మిగతా వాటికి ప్రభుత్వ జోక్యం ఉంటుందనే అంశానికి జేపీసీ ఆమోదముద్ర వేసింది. అయితే, ముస్లింల మతసంబంధ వ్యవహారాల పట్ల క్రూరంగా వ్యవహరిస్తున్న బిల్లు 'పూర్వ' స్వభావాన్ని జేపీసీ ఏమాత్రం రూపుమాపలేకపోయిందని విపక్ష సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. వితంతువులు, అనాథల సంక్షేమంపై ఇప్పటికే వక్ఫ్ అనుసరిస్తున్న విధానాల జోలికి జేపీసీ వెళ్లలేదు. సోమవారం ఢిల్లీలో బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ సారథ్యంలో సమావేశమైన కమిటీలోనూ విపక్ష సభ్యుల అభ్యంతరాలతో కమిటీ భేటీ వాడీవేడీగా కొనసాగింది. సుదీర్ఘ మంతనాలు, చర్చోపచర్చల తర్వాత కమిటీ తన తుది నివేదికను బుధవారం ఆమోదించనుంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జనవరి 31వ తేదీన ప్రారంభంకానున్న నేపథ్యంలో ఈ సెషన్ ప్రథమార్థంలోనే బిల్లును ఆమోదింపజేసుకుని చట్టంగా మార్చాలని పాలక ఎన్‌డీఏ ప్రయత్నిస్తోంది. బిల్లులో ప్రతిపాదించినప్పుడు వక్ఫ్ బోర్డ్‌లో ఇద్దరు ముస్లిమేతరులు ఉండొచ్చని సూచించగా ఇప్పుడా సంఖ్య నాలుగుకు పెరగడంతో దీనిపై ముస్లిం సంఘాలు, విపక్షపార్టీలు త్వరలో మరింతగా ఆందోళనలు, నిరసనలు చేసే వీలుంది. ఎక్స్‌-అఫీషియో సభ్యులు ఇంతమంది ఉంటారని గతంలో పేర్కొనగా ఇప్పుడు ఆ పదంలో బిల్లులో లేదు. కనీసం ఐదేళ్ల నుంచి ఇస్లామ్ మతాన్ని ఆచరిస్తున్నట్లు నిరూపించగల్గితేనే అతనికి చెందిన ఆస్తులను వక్ఫ్ తన ఆస్తులుగా పరిగణించేందుక అధికారం లభిస్తుంది. లేదంటే వాటిని మత, దాతృత్వ కార్యక్రమాలకు వినియోగించడానికి వీలులేదు అనే అంశాన్ని బిల్లులో ప్రస్తావించారు. ఏదైనా భూమి వక్ఫ్‌దా, ప్రభుత్వానిదా అన్న వివాదం తలెత్తితే జిల్లా కలెక్టర్, ఆపై స్థాయి అధికారి ఆధ్వర్యంలో విచారణ, దర్యాప్తునకు ఆదేశించాలని ప్రతిపాదనకు జేపీసీ ఆమోదముద్ర వేసింది. దీనిపై ముస్లిం సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశాయి. హోదా రీత్యా జిల్లా రెవెన్యూ రికార్డులకు అధిపతి అయిన కలెక్టర్ స్వతహాగా తన ఆఫీస్ రికార్డుల ప్రకారమే తుది నిర్ణయం తీసుకుంటారని ముస్లిం సంఘాలు జేపీసీ ఆమోదాన్ని తప్పుబట్టాయి. ఏవైనా భూములు వక్ఫ్ పరిధిలోకి వస్తే వాటిని ఖచ్చితంగా రిజిస్టర్ చేయించాలన్న ప్రతిపాదనకూ జేపీపీ ఓకే చెప్పింది. వక్ఫ్ తమవిగా చెప్పుకునే భూముల్లో ముస్లిమేతరులు నివసించడం లేదా దుకాణాలు నడుపుకోవడం జరిగితే ఆ ప్రాంతాలకు క్లియర్ టైటిల్ లేకుంటే ఈ అంశంలో వక్ఫ్‌బోర్డ్‌కు హక్కులు ఉండబోవని తెలుస్తోంది. ఈ లెక్కన స్వాతంత్ర్యంవేళ దేశ విభజన తర్వాత పాకిస్తాన్‌కు వెళ్లిన ముస్లింలకు చెందిన పాత ఢిల్లీలోని ప్రాంతాల్లో దుకాణాలు నడుపుకుంటున్న ముస్లిమేతరులకు భారీ లబ్ధిచేకూరే అవకాశముంది. ముస్లింల చట్టాలపై పూర్తి అవగాహన ఉన్న ఎవరైనా ఒక 'వ్యక్తి'ని సంబంధిత ట్రిబ్యునళ్లలో సభ్యునిగా నియమించాలన్న సవరణకూ జేపీసీ ఆమోదముద్ర వేసింది.

తీవ్రంగా తప్పుబట్టిన విపక్షాలు

'' ఇన్ని రోజుల సమీక్షతర్వాత కూడా పాత బిల్లు అలాగే ఉంది. ముస్లింల మతసంబంధ వ్యవహారాల్లో బిల్లు జోక్యం చేసుకుంటోంది. విపక్షసభ్యుల సూచనలకు కమిటీలో విలువేలేదు. ఎన్‌డీఏ సభ్యులు ఇక్కడ అంతా ఒక పథకం ప్రకారంచేశారు. ఏమైనా చెప్పడానికి కూడా మాకు అనుమతించలేదు. ఒక్కో క్లాజ్‌వారీగా చర్చిద్దామంటే వినిపించుకోలేదు. మా అభ్యంతరాలను పట్టించుకోకుండా చైర్మన్ తనకు నచ్చిన సవరణలకే ఆమోదముద్ర వేశారు'' అని తృణమూల్ కాంగ్రెస్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ ఆగ్రహం వ్యక్తంచేశారు. డీఎంకే, కాంగ్రెస్‌సహా జేపీసీలో సభ్యులుగా ఉన్న విపక్షపార్టీలన్నీ కమిటీ వైఖరిని తప్పుబట్టాయి. అప్రజాస్వామికంగా కమిటీ కొనసాగిందని ధ్వజమెత్తాయి.

ఉత్తరాఖండ్‌లో అమల్లోకి

ఉమ్మడి పౌరస్మృతి

- యూసీసీ పోర్టల్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి పుష్కర్
- దేశంలో తొలిసారిగా యూసీసీని తెచ్చిన రాష్ట్రంగా ఉత్తరాఖండ్ రికార్డ్

డెహ్రాడూన్: మతాలకతీతంగా మహిళలకు నిజమైన సాధికారతే లక్ష్యంగా, పౌరులందరికీ సమాన హక్కులు, బాధ్యతలు దఖలుపరిచే లక్ష్యంతో తీసుకొచ్చిన ఉమ్మడి పౌరస్మృతి చట్టం (యూసీసీ) ఉత్తరాఖండ్‌లో సోమవారం అమల్లోకి వచ్చింది. దీంతో దేశంలో యూసీసీని అమలుచేసిన తొలి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ రికార్డులకెక్కింది. అన్ని మతాల్లో లింగభేదం లేకుండా పౌరులందరికీ ఉమ్మడి చట్టం అమలుచేయడమే యూసీసీ ముఖ్యోద్దేశం. చట్టం అమలుతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మతాల వారికి ఒకే తరహా వివాహ, విడాకుల, ఆస్తుల చట్టాలు అమలవుతాయి. ఇస్లామ్‌ను ఆచరించే వారికి ఇకపై విడిగా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ లాంటివి చెల్లుబాటుకావు. ముస్లిం మహిళలకు ట్రిపుల్ తలాక్ అంటూ ఏకపక్షంగా ఇచ్చే విడాకులు చెల్లవు. షెడ్యూల్ తెగలను మాత్రం యూసీసీ నుంచి మినహాయించారు. వాళ్ల గిరిజన సంప్రదాయాలు, కట్టుబాట్లను ప్రభుత్వం గుర్తించి విలువ ఇస్తుంది. సోమవారం యూసీసీ రాష్ట్రంలో అమల్లోకి వచ్చిందని డెహ్రాడూన్‌లోని అధికార నివాసంలో ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ప్రకటించారు. కేబినెట్ మంత్రులు, నాటి యూసీసీ ముసాయిదా కమిటీ సభ్యుల సమక్షంలో ఆయన యూసీసీ పోర్టల్‌ను ప్రారంభించారు. వివాహాలు చేసుకున్నా, విడాకులు తీసుకున్నా, సహజీవనం చేసినా ప్రతీదీ ఈ పోర్టల్ ద్వారా ఖచ్చితంగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ కోసం నమోదుచేసుకోవాల్సిందే. పెళ్లికాకుండా సహజీవనం కారణంగా పుట్టిన పిల్లలకూ వారసత్వ హక్కులు దక్కేలా యూసీసీ చట్టంలో మార్పులుచేసి అమల్లోకి తెచ్చారు. పోర్టల్ ద్వారా ముఖ్యమంత్రి ధామీ తన వివాహాన్ని రిజిస్టర్ చేసుకున్నారు. పోర్టల్ ద్వారా జారీ అయిన తొలి డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాధా సీఎం ధామీకి అందజేశారు. '' మతాలకతీతంగా పౌరులందరికీ యూసీసీ ద్వారా సమాన హక్కులు, బాధ్యతలు ఉంటాయి. మూడేళ్ల క్రితం యూసీసీపై మాటిచ్చా. ఇన్నాళ్లకు ఇది సాకారమైంది. ఈ ఘనత రాష్ట్ర ప్రజలదే. విభిన్న ఆచార వ్యవహారాలు, జీవనం సాగించే ఎస్టీలను యూసీసీ పరిధిలోకి తెచ్చి వారిని ఇబ్బంది పెట్టొద్దని నిర్ణయించుకున్నాం. అందుకే వారిని యూసీసీ నుంచి మినహాయించాం'' అని సీఎం స్పష్టంచేశారు. చట్టం ప్రకారం ఇకపై ఉత్తరాఖండ్‌లో అన్ని మతాలకు చెందిన స్త్రీ, పురుషులకు కనీస వివాహ వయస్సు ఒకేలా ఉంటుంది. అన్ని మతాల్లో బహుభార్యత్వం విధానాన్ని నిషేధించారు. హలాల్ విధానాన్ని సైతం రద్దుచేశారు. '' యూసీసీ అమలుతో భారత రాజ్యాంగ చరిత్రలో మరో సువర్ణాధ్యాయాన్ని లిఖించాం'' అని సీఎం అన్నారు.

ట్రంప్‌కు మోదీ ఫోన్

- అధ్యక్షుడయ్యాక తొలి సంభాషణ
- పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చలు
- ప్రపంచ శాంతికి సమష్టిగా కృషి



న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షునిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయనతో ఫోన్‌లో మాట్లాడారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక వారిద్దరూ సంభాషించుకోవడం ఇదే తొలిసారి. పలు ద్వైపాక్షిక అంశాలపై నేతలిద్దరూ చర్చలు జరిపారు. ఇరు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే చర్యలపై లోతుగా చర్చించినట్లు సమాచారం. పరస్పర విశ్వాసాన్ని మరింతగా పెంచుకునేందుకు భారత్, అమెరికా పూర్తిగా కట్టుబడి ఉన్నట్టు చర్చల అనంతరం మోదీ తెలిపారు. ''నా మిత్రుడు ట్రంప్‌తో మాట్లాడినందుకు ఆనందంగా ఉంది. ఇరు దేశాల ప్రజల సంక్షేమంతో పాటు ప్రపంచ భద్రత, శాంతి, ప్రగతి కోసం కృషి చేయాలని నిర్ణయించాం'' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అక్రమ వలసలు, టారిఫ్‌లు ప్రస్తావనకు వచ్చిందీ లేనిదీ తెలియ రాలేదు. వాటిపై ఉక్కుపాదం మోపుతానని ట్రంప్ ప్రకటించడం తెలిసిందే. అక్రమ వలస దారులను సొంత దేశాలకు పంపుతుండటం కలకలం రేపుతోంది. భారత్ ప్రధాన భాగస్వామిగా ఉన్న బ్రిక్స్ కూటమిపై 100 శాతం టారిఫ్‌లు విధిస్తానని కూడా ట్రంప్ హెచ్చరించారు. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తదితరులతో చర్చలు జరిపిన వారంలోపే ట్రంప్, మోదీ ఫోన్ సంభాషణ జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది.

మళ్లీ మానస సరోవర యాత్ర

చైనాకు నేరుగా విమాన సర్వీసులు

- సంబంధాల బలోపేతానికి చర్యలు
- జల వనరుల సమాచార మార్పిడి
- మిస్రీ పర్యటనలో కీలక ఒప్పందాలు
- మంత్రులతో వరుస భేటీలు, చర్చలు

న్యూఢిల్లీ: భారత్‌–చైనా సంబంధాల మెరుగుదల దిశగా మరిన్ని కీలక అడుగులు పడ్డాయి. ఈ వేసవి నుంచి కైలాస మానస సరోవర యాత్ర పునఃప్రారంభం కానుంది. ఇరుదేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను కూడా పునరుద్ధరించనున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం బీజింగ్ వెళ్లిన విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ సోమవారం చైనా విదేశాంగ శాఖ ఉప మంత్రి సన్ వెయ్‌డాంగ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు జరిగాయి. ఒప్పందాలు కుదిరాయి. అంతర్జాతీయ నదుల విషయమై పరస్పరం మరింతగా సహకరించుకునేందుకు, జల వనరులకు సంబంధిత డేటాను పూర్తిస్థాయిలో ఇచ్చిపుచ్చుకునేందుకు ఇరు దేశాలూ అంగీకరించాయి. భారత్‌-చైనా నిపుణుల స్థాయి బృందం దీనిపై వీలైనంత త్వరగా చర్చలు జరపనుంది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ, చైనా కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ శాఖ మంత్రి లియూ జియాంచవోలతోనూ మిస్రీ సమావేశమయ్యారు. పలు కీలకాంశాలపై వారితో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తీసుకున్న పలు నిర్ణయాలను విదేశాంగ శాఖ వెల్లడించింది. ''ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు ఉన్నతస్థాయిలో చర్చలు జరపాలని గత అక్టోబర్‌లో కజాన్‌లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీలో నిర్ణయించడం తెలిసిందే. తాజా చర్చలు అందులో భాగమే'' అని వివరించింది. ''ఇరుదేశాల దౌత్య బంధానికి 75 ఏళ్లు పూర్తవుతున్నాయి. ఈ సందర్భంగా విశ్వాస కల్పనకు మరిన్ని చర్యలు తీసుకోవాలని నిర్ణయం జరిగింది. ఆర్థిక, వర్తక రంగాల్లో ఇరుదేశాల్లో నెలకొన్న పరస్పర ఆందోళనలు, సందేహాలు కూడా సన్‌–మిస్రీ చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయి. దీర్ఘకాలిక ప్రాతిపదికన విధాన పారదర్శకత, విశ్వసనీయతే గీటురాళ్లుగా ముందుకు సాగాలని అంగీకారం కుదిరింది'' అని వెల్లడించింది. మానస సరోవర యాత్ర, చైనాకు నేరుగా విమాన సర్వీసులు 2020లో రద్దయ్యాయి.

జమిలిపై చర్చ...చాలా కీలకం

న్యూఢిల్లీ: 'ఒక దేశం, ఒకే ఎన్నిక' ప్రతిపాదనపై దేశవ్యాప్తంగా జరుగుతున్న చర్చ భారత ప్రజాస్వామ్య ప్రస్థానానికి చాలా కీలకమైనదని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్‌ఎస్‌ఎస్ వలెంటీర్లు, యువత అందులో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇది వారి భవిష్యత్తుతో నేరుగా ముడిపడ్డ అంశమని గుర్తుంచుకోవాలన్నారు. సోమవారం ఇక్కడ ఎన్‌సీసీ ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ''మన దేశంలో పదేపదే ఎన్నికలు జరుగుతున్నాయి. నిత్యం ఏదో ఒక మూల ఎన్నికల వాతావరణం నెలకొని ఉంటోంది. దాంతో పాలన, అభివృద్ధి పనుల వేగం మందగిస్తోంది. లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలూ ఒకేసారి జరిగితే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. మొదట్లో దేశమంతటా ఒకేసారి ఎన్నికలు జరిగేవి. తర్వాతి కాలంలో ఆ ప్రక్రియకు విఘాతం కలిగింది. అమెరికా వంటి అగ్ర రాజ్యాల్లో ఎన్నికలు నిర్ణీత కాలావధిలోనే జరుగుతాయి'' అని గుర్తు చేశారు. కనీసం లక్షమంది యువతీ యువకులు రాజకీయాల్లోకి రావాలని పునరుద్ఘాటించారు. ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలోనూ ఇదే మాట చెప్పానని గుర్తు చేశారు.

ట్రంప్ బెదిరింపులకు దిగొచ్చిన కొలంబియా

- తమ వలసదారులకు దేశంలోకి ఎంట్రీ
- అంతకుముందు రోజంతా హైడ్రామా
- అధ్యక్షుల సోషల్ మీడియా వార్
- పోటాపోటీ సుంకాల ప్రకటనలు

బొగోటా/వాషింగ్టన్: అక్రమ వలసలపై అమెరికా, కొలంబియా మధ్య ఆదివారం హై డ్రామా నడిచింది. అమెరికా నుంచి కొలంబియా వలసదారులతో వచ్చిన రెండు విమానాల ల్యాండింగ్‌కు ఆ దేశం అనుమతి నిరాకరించడంతో వివాదం రాజుకుంది. పరస్పర హెచ్చరికలు, పోటాపోటీ సుంకాల ప్రకటనలతో తారస్థాయికి చేరింది. ఇరు దేశాల అధ్యక్షులు ఒకరినొకరు లక్ష్యం చేసుకుంటూ సోషల్ మీడియా పెట్టిన పోస్టులు వైరల్‌గా మారాయి. చివరికి కొలంబియా తమ వలసదారులను స్వదేశంలోకి అనుమతించినట్టు అమెరికా ప్రకటించింది. దాంతో ఆ దేశంపై ప్రకటించిన 50 సుంకాల పెంపు ఉత్తర్వులను నిలిపేయనున్నట్లు పేర్కొంది. అలా వివాదం సద్దుమణిగింది.

గౌరవంగా పంపితేనే...

అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వారం రోజుల్లోనే డొనాల్డ్ ట్రంప్ తన తొలి అంతర్జాతీయ టారిఫ్ వివాదాన్ని తెరపైకి తెచ్చారు. అయితే చైనా, మెక్సికో, కెనడా కాకుండా దక్షిణ అమెరికాలో అత్యంత మిత్రదేశమైన కొలంబియాను ఆయన లక్ష్యంగా చేసుకోవడం విశేషం. ఆ దేశానికి చెందిన వలసదారులను ఆదివారం రెండు విమానాల్లో వెనక్కు పంపారు. కానీ అవి సైనిక విమానాలు కావడం కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోకు ఆగ్రహం తెప్పించింది. తమ పౌరులను అమెరికా నేరస్తుల్లా సైనిక విమానాల్లో పంపడం ఏమిటంటూ మండిపడ్డారు. వారిని గౌరవంగా పౌర విమానాల్లో పంపితేనే స్వీకరిస్తామని స్పష్టం చేశారు. సదరు విమానాల లాండింగ్‌కు నిరాకరించడంతో వివాదం మొదలైంది. దీనిపై ట్రంప్ కన్నెర్రజేశారు. కొలంబియా ప్రభుత్వం ఇలా బాధ్యతలను ఉల్లంఘించడాన్ని అనుమతించబోమంటూ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. ఇప్పటికే అప్రతిష్ఠపాలైన పెట్రో ఇలాంటి చర్యలతో కొలంబియా భద్రతనే ప్రమాదంలోకి నెడుతున్నారని హెచ్చరించారు. కొలంబియా నుంచి అమెరికాలోకి వచ్చే అన్ని వస్తువులపై తక్షణం ఆంక్షలు, 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. వాటిని వారం రోజుల్లో 50 శాతానికి పెంచుతామన్నారు. కొలంబియా ప్రభుత్వాధికారులు, వారి కుటుంబాలపై వీసా ఆంక్షలకు అనుమతిస్తున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ప్రకటించారు. కొలంబియా రాజధాని బొగోటాలోని అమెరికా రాయబార కార్యాలయంలో వీసాల ప్రాసెసింగ్‌ను నిలిపేస్తూ ఉత్తర్వులిచ్చారు. కొలంబియా తన పౌరులను వెనక్కు తీసుకోవడానికి ఒప్పుకునేదాకా ఆంక్షలు కొనసాగుతాయని రుబియో చెప్పారు.

ట్రంప్‌ది అత్యాశ: పెట్రో

ట్రంప్ పోస్ట్‌పై కొన్ని గంటల్లోనే పెట్రో కూడా స్పందించారు. ఎక్స్‌లో సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ''యూఎస్‌కు ప్రయాణించడం నాకిష్టం లేదు. అది కొంచెం బోరింగ్. దాని బదులు ఏదో ఒక రోజు కలిసి గ్లాసు విస్కీ తాగుదాం'' అని కామెంట్ చేశారు. అమెరికాపై 25 శాతం ప్రతీకార సుంకాలు విధిస్తామని ప్రకటించారు. ''కొలంబియన్లను తక్కువ జాతిగా అమెరికా అధ్యక్షుడు పరిగణిస్తున్నారు. ట్రంప్ తన ఆర్థిక బలం, అహంకారం, అత్యాశతో మానవ జాతినే తుడిచిపెట్టేస్తారు. న్యాయం కోసం మరణానికైనా సిద్ధం. కొలంబియా పక్కన బానిసలు వద్దు' అన్నారు. తనను గద్దె దించేందుకు ప్రయత్నించాలని ట్రంప్‌కు సవాల్ విసిరారు. తమ పౌరులను సగౌరవంగా వెనక్కు రప్పించేందుకు అధ్యక్ష విమానాన్నే సిద్ధం చేసినట్టు పెట్రో తెలిపారు. చివరికి యూఎస్ సైనిక విమానాలలో పంపిన వలసదారులను తీసుకునేందుకు కొలంబియా అంగీకరించినట్టు వైట్‌హౌస్ తెలిపింది. ''అమెరికా సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ట్రంప్ కట్టుబడి ఉన్నారు. అన్ని దేశాలూ అమెరికాలో అక్రమంగా ఉన్న వారి పౌరులను వెనక్కు రప్పించుకునేందుకు పూర్తిగా సహకరిస్తాయని ఆశిస్తున్నాం'' అని చెప్పింది. కొలంబియా అధికారులపై వీసా ఆంక్షలు, ఆ దేశ దిగుమతులపై కఠినతర కస్టమ్స్ తనిఖీలు కొనసాగుతాయని చెప్పింది.

మావాళ్లను సంకెళ్లతో పంపుతారా?

అమెరికాది అమానవీయ వైఖరి: బ్రెజిల్

రియోడిజనీరో: అమెరికా తమ వలసదారుల చేతులకు సంకెళ్లు వేసి తీవ్ర నేరస్తుల మాదిరిగా వెనక్కు పంపిందంటూ బ్రెజిల్ తీవ్రంగా ఆగ్రహించింది. వారిని పంపిన విమానంలో కనీసం తాగడానికి మంచి నీళ్లు, ఏసీ కూడా లేకపోవడం దారుణమంటూ మండిపడింది. ''వలసదారుల పట్ల అమెరికా తీరు మానవ హక్కుల ఉల్లంఘనే. దీనిపై ట్రంప్ సర్కారును వివరణ కోరతాం'' అని బ్రెజిల్ విదేశాంగ శాఖ పేర్కొంది. విమానంలో నీళ్లివ్వకపోగా కాళ్లు, చేతులు కట్టేశారని, టాయిలెట్‌కు కూడా వెళ్లనివ్వలేదని ఓ వలసదారు వాపోయాడు. ''వేడికి తాళలేక పలువురు స్పృహ తప్పారు. విమానంలో నాలుగు గంటలు పీడకలలా గడిచాయి'' అని చెప్పాడు.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 28 । జనవరి । 2025



నేరాలకు అడ్డాగా ఓఆర్ఆర్

నగరానికి మణిహారంగా ఉన్న ఔటర్ రింగు రోడ్డు ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. సర్వీస్ రోడ్లు, అండర్‌పాస్‌లు నేరాలకు నిలయాలుగా మారుతున్నాయి.

-8లో



నుమాయిష్.. కల్చరల్ జోష్

నుమాయిష్‌లో సాంస్కృతిక కార్యక్రమాల సందడి కొనసాగుతోంది. సంగీత, నృత్య, హాస్య కార్యక్రమాలు కళాభిమానులకు బాగా ఆకట్టుకుంటున్నాయి.

- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/16.0

నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళల్లో పొగమంచు వాతావరణం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. రాత్రికి చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఒక వాహనం..3 నెంబర్ ప్లేట్లు



వాహనాన్ని సీజ్ చేసిన ఆర్టీఏ అధికారులు

ఉప్పల్: ఒక వాహనానికి మూడు నెంబర్ ప్లేట్లు తయారు చేయించి..ఎక్కడికక్కడే ఆ ప్లేట్‌ను మారుస్తూ..మూడు రాష్ట్రాల్లో వాహనాన్ని తిప్పుతున్న వ్యక్తిని ఉప్పల్ రవాణా శాఖ అధికారులు పట్టుకున్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఉత్తరప్రదేశ్ ప్రాంతానికి చెందిన మ్యాక్సీ క్యాబ్ వాహనాన్ని (యూపీ 64టీ 9495) సురేశ్‌బాబు అనే డ్రైవర్ ఆర్టీఏ అధికారుల కళ్లుగప్పి ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో తిప్పుతున్నాడు. రవాణా అధికారులకు దొరక్కుండా ఉండేందుకు, పన్నులు ఎగవేసేందుకు ఏ రాష్ట్రానికి వెళ్తే అక్కడి నెంబర్ ప్లేట్‌ను మార్చి వాహనాన్ని అక్రమంగా నడుపుతున్నాడు. రెగ్యులర్ చెకింగ్‌లో భాగంగా సోమవారం ఉప్పల్ ఎంవీఐ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఇక్కడి రిజిస్ట్రేషన్ లేదని గ్రహించి వివరాలు కోరడంతో అసలు విషయం బయటపడింది. దీంతో అధికారులు వాహనాన్ని సీజ్ చేసి నాగోల్ కేంద్రానికి తరలించారు.

పెళ్లి కోసం దొంగగా మారి..

- ఓ ఇంట్లో రూ.52 లక్షలు చోరీ..
- చివరికి పోలీసులకు చిక్కి కటకటాల్లోకి..



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: పెళ్లి కోసం ఓ యువకుడు ఏకంగా దొంగగా మారాడు. వివాహానికి డబ్బు అవసరం పడడంతో సులువుగా సంపాదించేందుకు పథకం రచించాడు. ఇందుకు దొంగతనం చేయాలని ప్లాన్ చేసి ఓ ఇంట్లో రూ.52 లక్షలు దోచుకెళ్లాడు. చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. 12 గంటల్లోనే పేట్‌బషీరాబాద్ పోలీసులు ఈ కేసును ఛేదించారు. సోమవారం మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తెల్పిన మేరకు..కొంపల్లి పరిధిలోని లక్ష్మీనగర్ గేటెడ్ కమ్యూనిటీలో వెలగపూడి భవానీశంకర్ తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. కాగా తన ఇంట్లో దాచి ఉంచిన రూ.52.50 లక్షలు నగదు కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించి ఈ నెల 26వ తేదీన రాత్రి పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే సీఐ విజయవర్ధన్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి స్థానికంగా పనిచేసి వెళ్లిన వారి వివరాలను ఆరా తీశారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే ఆనంద్ అనే యువకుడు ఇంటి వద్దకు వెళ్లినట్లు స్పష్టమైంది. ఆ దిశగా కేసు దర్యాప్తు చేయగా ఈ నెల 24వ తేదీన దొంగతనం చేసినట్లు తేలింది. కిటికీ గ్రిల్స్ తొలగించి ఇంట్లోకి వెళ్లి బెడ్‌రూమ్‌లో ఉన్న నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. చోరీ సొత్తులో రూ.9 లక్షలు అప్పుల వాళ్లకు ఇచ్చి.. మరికొంత ఖర్చు చేస్తూ వచ్చాడు. మెదక్ జిల్లాలో ఉన్న ఆనంద్ ఇంటికి సోమవారం పోలీసులు వెళ్లి తనిఖీ చేయగా రూ.43 లక్షల నగదు దొరికింది. దీంతో అతన్ని అదుపులో తీసుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఏమైనా దొంగతనాలు చేశాడా అన్న విషయం పై ఆరా తీస్తున్నట్లు డీసీపీ తెలిపారు. కాగా చోరీపై విచారించగా..తన పెళ్లి ఖర్చుల కోసమే దొంగతానికి పాల్పడినట్లు ఆనంద్ వెల్లడించాడని పోలీసులు పేర్కొన్నారు. 12 గంటల్లో కేసును ఛేదించిన సిబ్బందిని అధికారులు అభినందించారు.



సిటీ ఇన్ ఫ్రేమ్

జంక్షన్ల సుందరీకరణలో భాగంగా వివిధ కూడళ్లలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేస్తున్న అందమైన రూపాలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. తాజాగా నారాయణగూడ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫొటో ఫ్రేమ్ నిర్మాణం అందర్నీ ఆకర్షిస్తోంది. రెండు చేతులతో ఫ్రేమ్‌ను పట్టుకున్నట్లుగా ఉన్న రూపాన్ని వాహనదారులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. - సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

రోలును తిరగేసి.. పాత్రంతో పొడిచేసి!

- భార్య ఎముకలు మాయం చేసేందుకు గురుమూర్తి చేసింది ఇదే..
- 'మీర్‌పేట' మర్డర్ కేసులో వెలుగులోకి వస్తున్న కీలకాంశాలు

సాక్షి, సిటీబ్యూరో: 'భార్యను చంపి, ఉడకబెట్టిన' కేసులో కొత్త అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితుడు గురుమూర్తి భార్య మృతదేహాన్ని ముక్కలు చేశాక..ఉడకబెట్టడానికి కాస్టిక్ సోడాను, ఎముకలను పొడి చేయడానికి రోలు, పాత్రం వినియోగించాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్టు తెలిసింది. భార్యను చంపిన తర్వాత మృతదేహాన్ని మాయం చేయడానికి ఓ సినిమాతోపాటు ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేయడం ద్వారా లభించిన వీడియోలను చూసి ఈ ప్లాన్ అమలు చేశాడని గుర్తించినట్టు సమాచారం. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఇదే పనిలో ఉన్నాడని తేల్చినట్టు తెలిసింది. రాచకొండ పోలీసు కమిషనరేట్‌లోని మీర్‌పేట పరిధి జిల్లెలగూడలో జరిగిన వెంకట మాధవి హత్య కేసులో పోలీసులు ఒక్కో చిక్కుముడి విప్పుతున్నారు. ఆధారాలు సేకరించడానికి ఉన్న అవకాశాలపై దృష్టి పెట్టారు. దేశవ్యాప్తంగా ఉన్న ఫోరెన్సిక్ నిపుణులను సంప్రదిస్తూ సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు.

బయటికెళ్లి సామగ్రి కొనుక్కొచ్చి..

ఈ నెల 14న రాత్రి గొడవ జరగడంతో గురుమూర్తి మాధవి తలను బలంగా గోడకేసి కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి, కాసేపటికే మరణించింది. గురుమూర్తి మరుసటి రోజున ఐదుసార్లు ఇంట్లోంచి బయటికి వెళ్లి వచ్చినట్టు సీసీ కెమెరాల్లో రికార్డయింది. అలా వెళ్లి వస్తూ మాంసం కొట్టే మొద్దు, కత్తి, కాస్టిక్ సోడా, కొత్త వాటర్ హీటర్ కొనుక్కువచ్చినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని బాత్‌రూమ్‌లోకి లాక్కుపోయిన గురుమూర్తి..అక్కడే మాంసం కొట్టే మొద్దుపై కత్తితో ముక్కలు చేశాడు. పెద్ద బకెట్‌లో హీటర్ పెట్టి నీళ్లు మరిగిన తర్వాత ముక్కల్ని అందులో వేశాడు. మాంసం పూర్తిగా ఉడికిపోయి విడిపోవడానికి అందులో కాస్టిక్ సోడా కలిపి ఉంటాడని.. ఉడికిపోయాక కమోడ్‌లో వేసి ఫ్లష్ చేసి ఉంటాడని ఫోరెన్సిక్ నిపుణులు చెప్తున్నారు. ఇక ఎముకలను స్టవ్ మీద పెట్టి కాల్చి..తర్వాత రోలుపై పెట్టి పాత్రంతో కొట్టి పొడిగా మార్చాడని పోలీసులు నిర్ధారించినట్టు తెలిసింది. తర్వాత ఎముకల పొడి, కత్తిని జిల్లెలగూడ చెరువులో పారేసినట్టు సమాచారం. మృతదేహాన్ని మాయం చేయడం పూర్తయ్యాక ఆధారాలేవీ చిక్కకుండా రోలు, పాత్రం, మొద్దును, బాత్‌రూమ్‌ను పలుమార్లు కడిగేశాడని...పదే పదే నీటిని ఫ్లష్ చేస్తూ డ్రైనేజీలోనూ ఎలాంటి ఆనవాళ్లు మిగలకుండా చేశాడని పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. అయితే ఫోరెన్సిక్ నిపుణులు స్టవ్‌పై చిన్న మాంసం ముక్క, వెంట్రుకలతోపాటు మాధవి తలను గోడకు కొట్టిన చోట రక్తపు మరకల్ని గుర్తించారని..డీఎన్ఏ పరీక్షలు చేయించాలని నిర్ణయించారని సమాచారం.



- అన్ని అంశాలు సమగ్రంగా విచారణ చేస్తారు
- ఆ సమయంలో అవసరమైన పత్రాలు చూపండి
- బాధితులకు చెప్పిన హైడ్రా కమిషనర్ రంగనాథ్
- ప్రజావాణిలో 78 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరణ

అధికారులే మీ వద్దకు వస్తారు

సాక్షి, సిటీబ్యూరో: జలవనరులు, ప్రభుత్వ స్థలాలు, ప్రజావసరాలకు ఉద్దేశించిన ప్రాంతాల ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులే ఫిర్యాదుదారుల వద్దకు వచ్చి విచారిస్తారని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. సోమవారం ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదులు అందించడానికి వచ్చిన బాధితులకు ఈ విషయం స్పష్టం చేసిన ఆయన విచారణ చేస్తున్న సమయంలో అవసరమైన పత్రాలు చూపాలని చెప్పారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన ప్రజావాణికి పెద్దఎత్తున ఫిర్యాదుదారులు హాజరయ్యారు. వీరికి టోకెన్లు జారీ చేసిన సిబ్బంది ఆ ప్రకారం రంగనాథ్ వద్దకు పంపారు. ఇలా మొత్తం 78 మందితో మాట్లాడిన ఆయన వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులకు సంబంధించి రెండు వారాల్లో అధికారులు ఫిర్యాదుదారుల వద్దకే వచ్చి విచారణ చేపడతారని, గరిష్ఠంగా నాలుగు వారాల్లో సమస్య పరిష్కారం కాకుంటే తానే స్వయంగా రంగంలోకి దిగుతానని రంగనాథ్ స్పష్టం చేశారు. ముందుగా విచారణ జరిపి, వెలుగులోకి వచ్చిన అంశాలను బట్టి కబ్జాదారులపై కేసులు పెట్టాలని అధికారులకు సూచించారు. పరిరక్షించిన ప్రభుత్వ భూములు, పార్కుల చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో పాటు వాటిలో ప్రొటెక్టెడ్ బై హైడ్రా అని బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

హైడ్రాకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

→ సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామం సర్వే నంబరు 119 నుంచి 220 వరకూ ఉన్న 408 ఎకరాల్లో అక్రమ అమ్మకాలు జరుగుతున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. గతంలో 3800 మంది అక్కడ గ్రామపంచాయతీ లే ఔట్‌లో ఇంటి స్థలాలు కొని రిజిస్టర్ చేసుకున్నామని, ఆపై ఆ భూమి ప్రభుత్వానిది అని తేల్చితే.. తామంతా కోర్టును ఆశ్రయించామని హైడ్రా కమిషనర్‌కు వివరించారు. హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చినప్పటికీ అక్కడ వారు అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసి ఇంటి స్థలాలుగా అమ్మేస్తున్నారని పేర్కొన్నారు. ఇలా 700కు పైగా ఇళ్ల నిర్మాణం జరిగాయని.. ప్రభుత్వ శాఖలు కూడా కరెంటు, తాగు నీరు, రహదారుల సౌకర్యం కల్పిస్తున్నాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.

→ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం కుంట్లూర్ (పెద్ద చెరువు) చెరువులో 2 ఎకరాల స్థలాన్ని కబ్జాచేశారని, 59 జీవో ప్రకారం రెగ్యులరైజ్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నారని, వెంటనే ఆ భూమిని కాపాడాలంటూ ఫిర్యాదు అందింది.

→ నిజాంపేట మున్సిపాలిటీలోని మొదటి డివిజన్‌లో ఉన్న 2900 గజాల పార్కును స్థానికులు కబ్జా చేస్తున్నారని కేవీఆర్ రెయిన్‌బో కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ పార్కులో వ్యాయామానికి సంబంధించిన పరికరాలు అమర్చితే వాటిని తొలగించి కబ్జా చేయబోగా తాము అడ్డుకున్నామని, అక్కడ హైడ్రా బోర్డు పెడితే పార్కును కాపాడటం సాధ్యమని ఫిర్యాదు చేశారు.

→ రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం చింతలకుంట ప్రాంతంలోని మన్సూరాబాద్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని పెంచేశారని, తమ స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వడంలేదని వాసవి గ్రాడ్యుయేట్స్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. గతంలో ఉన్న గ్రామపంచాయతీ లే ఔట్‌ను 1993లో హుడా ఆమోదించిన విషయాన్ని గుర్తు చేశారు.

అగ్గి..అంతా బుగ్గి!

హైరైజ్ బిల్డింగుల్లోనూ అగ్ని ప్రమాదాలు

నాసిరకం విద్యుత్ కేబుళ్లు, పరికరాల వినియోగం..తనిఖీ చేయాల్సిన విభాగంలో అవినీతి పేరుకుపోవడం వల్ల ఇటీవల నగరంలోని హైరైజ్ బిల్డింగ్స్‌లోనూ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా..పకడ్బందీగా..అత్యధిక వ్యయాలతో నిర్మిస్తున్న ఆకాశహర్మ్యాలలోనూ విద్యుత్ ప్రమాదాలు జరగడంపై విస్మయం వ్యక్తమవుతోంది.



- నాసిరకం విద్యుత్ పనులతో షార్ట్ సర్క్యూట్లు
- నామమాత్రంగా సీఈఐజీ తనిఖీలు.. అక్రమ వసూళ్లు
- పీరియాడికల్ తనిఖీలు చేసిన వాటిలోనూ ప్రమాదాలు

సాక్షి, సిటీబ్యూరో: ఖానామెట్‌లోని 18 అంతస్తుల మీనాక్షి స్కైలాంజ్ అపార్ట్‌మెంట్‌లో విద్యుత్ తీగల డక్ట్ నుంచి ఇటీవల ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ షార్ట్‌సర్క్యూట్‌కు నాసిరకం కేబుల్లే కారణమని అగ్నిమాపకశాఖ నిర్ధారించింది. 14వ అంతస్తులో చిక్కుకుపోయిన ఇద్దరిని బ్రాంటో స్కైలిఫ్ట్ సహాయంతో కాపాడే ప్రయత్నంలో ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది అస్వస్థతకు గురికావాల్సి వచ్చింది. విషయం ఏమిటంటే..ఈ భవనంలో విద్యుత్ పనులకు సంబంధించి తెలంగాణ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్స్‌పెక్టరేట్ అధికారి (సీఈఐజీ) నుంచి నిరభ్యంతర పత్రం కూడా పొందింది.

- రాయదుర్గం నాలెడ్జ్‌సిటీ సత్వా ఎలిగ్జిర్ భవనం ఐదో అంతస్తులోని డిస్టిక్స్ 150 బార్ అండ్ రెస్టారెంట్‌లో డిసెంబర్ 22న అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కావూరిహిల్స్ కృష్ణాస్ కిచెన్ రెస్టారెంట్‌లోని ఏసీ బ్లోయర్‌లో(షార్ట్‌సర్క్యూట్)మంటలు చెలరేగి దట్టమైన పొగ కమ్మేసింది. అప్పటికే హోటల్లో భోజనం చేస్తున్న వాళ్లంతా ఊపిరాడక ఉక్కిరిబిక్కిరికి లోనయ్యారు.
- చందానగర్ ఐడీబీఐ బ్యాంక్ సెల్లార్‌లోని జనరేటర్‌లో ఇటీవల షార్ట్‌సర్క్యూట్ వెలుగు చూసింది. బ్యాంకుపై అంతస్తుల్లో కాలేజీ విద్యార్థులు చదువుతుండగా, అప్పటికప్పుడు వారిని ఖాళీ చేయించాల్సి వచ్చింది.
- కొండాపూర్‌లోని గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లో డిసెంబర్ 31న విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ తేజశ్వీనీనగర్‌లోని ఓ డ్రైక్లీనింగ్ దుకాణంలో ఉన్నట్టుండి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వెలుగు చూసింది. రూ.10 లక్షల విలు వైన చీరలు, ఇతర దుస్తులు పూర్తిగా దగ్ధం అయ్యాయి.

..హైరైజ్ భవనాలు, పెద్ద పెద్ద అపార్టుమెంట్లలో ఇటీవల విద్యుత్ ప్రమాదాలు అధికమవుతున్నాయనడానికి పైన చెప్పిన ఉదంతాలు నిదర్శనం.

హైరైజ్ బిల్డింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన కోకాపేట్, నార్సింగి, మణికొండ, నానక్‌రాంగూడ, తుక్కుగూడలలోని బహుళ అంతస్తు భవనాల్లో ఇటీవల విద్యుత్ సంబంధిత అగ్నిప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ 20 నుంచి 50 అంతస్తుల భవనాలు ఉన్నాయి. వీటిల్లో అగ్నిప్రమాదాలను నియంత్రించే యంత్రాలు, యంత్రాంగం కూడా మన దగ్గర సరిగా లేదనే చెప్పొచ్చు. తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్‌లో 54 మీటర్ల వరకు (18 ఫ్లోర్లు) వెళ్లగలిగే క్రేన్లు (బ్రోంటో స్కైలిఫ్ట్‌లు) మాత్రమే ఉన్నాయి. ఆపై అంతస్తుల్లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే..వెళ్లలేని పరిస్థితి.

థర్డ్‌పార్టీ కాంట్రాక్టర్లే కీలకం

మెజార్టీ హైరైజ్ భవనాలను థర్డ్‌పార్టీ కాంట్రాక్టర్లే నిర్మిస్తున్నారు. అంతర్గత విద్యుత్ పనులు సైతం ఆ కాంట్రాక్టర్లతోనే చేయిస్తున్నారు. వీరు భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం తాత్కాలిక అవసరం కోసం లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. నాసిరకం కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు వాడుతున్నారు. కంటికి కన్పించే ప్లగ్‌లు, స్విచ్‌బోర్డులు, లైట్లు మినహా గోడలు, స్లాబులో వాడే వైర్లు నాసిరకంగా ఉంటున్నాయి. సామర్థ్యానికి మించి ఏసీలు, వాషింగ్ మిషన్లు, గ్రీజర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించడం వల్ల ఒత్తిడికి గురై కేబుళ్ల జాయింట్ల వద్ద షార్ట్ సర్క్యూట్‌లు జరుగుతున్నాయి. సాధారణ భవనాలతో పోలిస్తే..సీఈఐజీ అనుమతులు, పీరియాడికల్ ఇన్‌స్పెక్షన్లు పొందిన బహుళ అంతస్తుల భవనాల్లోనే ఈ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లు ఎక్కువ జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

అక్రమ వసూళ్లకు అడ్డాగా సీఈఐజీ

విద్యుత్ కేబుళ్లు, పరికరాల నాణ్యతను పరిశీలించి, వాటికి అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా 'చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టు గవర్నమెంట్ (సీఈఐజీ)' విభాగాన్ని ఏర్పాటు చేసింది. పరిశ్రమలతో పాటు 15 మీటర్ల ఎత్తు దాటిన ప్రతి వాణిజ్య, గృహ సముదాయానికి విద్యుత్ తనిఖీ అధికారి ఎన్‌ఓసీ తప్పని సరిచేసింది. భవిష్యత్తు విద్యుత్ అవసరాలు, ఎంపిక చేసిన విద్యుత్ సామర్థ్యం, ఇన్‌కమింగ్ లైన్, అంతర్గత విద్యుత్ లైన్లు, వినియోగించే కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు, ఎర్తింగ్ సిస్టం సహా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు(డీటీఆర్) వంటివన్నీ పక్కాగా ఉన్నట్లు నిర్ధారించిన తర్వాతే ఆయా భవనాలకు నిరభ్యంతర పత్రం జారీ చేయాల్సి ఉంది. కానీ మెజార్టీ భవనాలకు కనీస తనిఖీ చేయకుండానే ఎన్‌ఓసీలు జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం ఒక్కో అపార్ట్‌మెంట్‌కు ఎంపిక చేసిన విద్యుత్ లోడును బట్టి రూ.60 వేల నుంచి రూ.లక్షన్నర వరకు వసూలు చేస్తున్నారని, వాణిజ్య భవనాలు, పరిశ్రమలైతే ఏకంగా రూ.ఏడు నుంచి పది లక్షల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

ఏజెంట్ల ద్వారా వస్తేనే...

సీఈఐజీ అనుమతుల కోసం ఆయా అపార్ట్‌మెంట్‌లు, పరిశ్రమలు డ్రాయింగ్ అప్రూవల్స్‌ను టీఎస్ఐపాస్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. సీఈఐజీ కనుసన్నల్లో మెలిగే ఏజెంట్ల ద్వారా వచ్చిన వాటికే అనుమతులు ఇస్తూ..ఇతర మార్గాల ద్వారా వచ్చే ఫైల్స్‌కు వివిధ సాంకేతిక అంశాలను సాకుగా చూపించి తిరస్కరిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో ఆయా వినియోగదారులు సీఈఐజీ ఏజెంట్లను ఆశ్రయించి అనుమతులు పొందాల్సిన దుస్థితి నెలకొంది.

ఆపరేషన్ అజయ్!

- హుస్సేన్‌సాగర్ బోటు అగ్నిప్రమాదం ఘటనలో యువకుడి గల్లంతు
- సాగర్‌లో గాలింపు చేపట్టిన పోలీసులు, డీఆర్ఎఫ్ బృందాలు
- గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమం..కోలుకున్న ముగ్గురు



హుస్సేన్‌సాగర్‌లో గాలిస్తున్న డీఆర్ఎఫ్ పోలీసులు



అజయ్ (ఫైల్)

రాంగోపాల్‌పేట్: హుస్సేన్ సాగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక యువకుడు అదృశ్యమయ్యాడు. భారతమాతకు మహా హారతి కార్యక్రమం సందర్భంగా హుస్సేన్‌సాగర్‌లో బోటు నుంచి బాణసంచా కాల్చడంతో అగ్ని ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నలుగురు గాయపడగా, కుషాయిగూడ నాగారానికి చెందిన సిల్వేరు అజయ్ (21) అనే బీటెక్ విద్యార్థి రాత్రి నుంచి అదృశ్యం అయ్యారు. ఉదయం నుంచి ఆ యువకుడి కోసం లేక్ పోలీసులు, డీఆర్ఎఫ్ బృందాలు, గజ ఈతగాళ్ల గాలింపు చేపట్టినా ఆచూకీ మాత్రం దొరక లేదు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన గణపతి అనే వ్యక్తి సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈయన పరిస్థితి విషమంగా ఉండగా..ప్రణీత్‌కుమార్, సునీల్ అదే ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. వీర వెంకట సత్యనారాయణ అనే వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా డిశ్చార్జ్ చేశారు.

స్నేహితుడితో కలిసి వచ్చి...

కుషాయిగూడ నాగారానికి చెందిన ఆటో డ్రైవర్ జానకిరాం, నాగలక్ష్మి దంపతుల కుమారుడు అజయ్ గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజ్‌లో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అజయ్ స్నేహితుడు రాఘవేంద్రకు టపాకాయల వ్యాపారి మణికంఠ డబ్బులు ఇచ్చేది ఉంది. ఆదివారం సాయంత్రం మణికంఠకు రాఘవేంద్ర ఫోన్ చేయగా తాను ట్యాంక్‌బండ్ దగ్గర ఉన్నానని, ఇక్కడికి వస్తే డబ్బు ఇస్తానని చెప్పాడు. దీంతో మరో స్నేహితుడు సాయి సందీప్‌తో కలిసి ఆదివారం రాత్రి 7.30 గంటలకు ట్యాంక్ బండ్‌కు చేరుకున్నారు. ఆ తర్వాత మణికంఠకు ఫోన్ చేయగా బోటులో సాగర్ లోపల నుంచి ఒడ్డుకు వచ్చి వారికి డబ్బులు చెల్లించాడు. తాము బోటులో లోపలికి వస్తామని చెప్పడంతో అందరూ కలిసి బాణసంచా కాల్చే దగ్గరకు వెళ్లగా అదే సమయంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఘటన సమయంలో బోటు సిబ్బందితో పాటు మరికొంత మంది బోటు సిబ్బంది అక్కడ ఉన్నారు. బాణసంచాను కచాప్‌లో ఉంచగా దానికి అనుసంధానంగా మెకనైజ్డ్ బోటు, మరో స్పీడ్ బోటు ఉన్నాయి. మెకనైజ్డ్ బోటుకు కూడా మంటలు అంటుకోవడంతో అందరూ అందులో నుంచి కిందకు నీళ్లలోకి దూకేశారు. అక్కడే ఉన్న బోటు సిబ్బంది నీళ్లలోకి దూకి కొందర్ని రక్షించగా..అజయ్ మాత్రం గల్లంతయ్యారు. అజయ్‌తో పాటు వచ్చిన రాఘవేంద్ర, సాయి సందీప్‌లకు ఈత రావడంతో కొద్ది దూరం ఈదుకుంటూ రాగా అక్కడికి వచ్చిన స్పీడ్ బోట్ సిబ్బంది వారిని రక్షించి బయటకు తీసుకువచ్చారు.



విలపిస్తున్న అజయ్ కుటుంబ సభ్యులు

తెల్లవారు జామున గుర్తించిన స్నేహితులు

గాయపడిన వారిని మొదట పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ తెల్లవారు జామున 2 గంటలకు రాఘవేంద్ర, సాయిసందీప్‌లు కలుసుకుని అజయ్ గురించి ఆరాతీశారు. అయితే అప్పుడు అజయ్‌కి ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ ఉంది. అదే విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియచేశారు.

కుటుంబ సభ్యుల ఆందోళన..

విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తెల్లవారు జామున హుస్సేన్ సాగర్ వద్దకు చేరుకుని అజయ్ కోసం ఆరా తీశారు. తమ కుమారుడు కనిపించక పోవడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదించారు. కాగా అజయ్ కోసం లేక్ పోలీసులు, డీఆర్ఎఫ్‌లకు చెందిన 5 బృందాలు సోమవారం ఉదయం నుంచి హుస్సేన్ సాగర్‌లో గాలింపు చేపట్టాయి. ఉదయం నుంచి బోట్లు, గజ ఈత గాళ్ల సహాయంతో సాగర్ మొత్తం సాయంత్రం 6.30 గంటల వరకు గాలించినా యవకుడి ఆచూకీ మాత్రం కనిపించ లేదు. మంగళవారం మరో మారు గాలింపు చేపడతామని పోలీసులు తెలిపారు. ప్రమాద ఘటనపై లేక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా..సోమవారం అజయ్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హన్మంతు తెలిపారు.

లేటుగా వస్తానని చెప్పి..

రాత్రి 8.30కి ఫోన్ చేస్తే ట్యాంక్‌బండ్‌పై ఉన్నా..కొద్దిగా లేటుగా వస్తాను అని చివరి మాటలు చెప్పాడంటూ అజయ్ తల్లి నాగలక్ష్మి, తండ్రి జానకిరాం కన్నీరుమున్నీరుగా రోదించారు.

తెలుగు వారికి సేవలందించడం అభినందనీయం



అవార్డులను అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



కళాకారుల నృత్య ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: మహారాష్ట్రలో ఉన్న తెలుగువారి కోసం ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర చేస్తున్న కృషి అభినందనీయమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం రాత్రి రవీంద్రభారతిలో వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు సాహిత్య రంగానికి మహారాష్ట్ర ప్రభుత్వం రూ. కోటి కోటి నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. వాణిజ్య, సాంస్కృతిక పరంగా తెలుగువారికి సేవలందిస్తూ వివిధ రంగాలలో సేవలందిస్తున్నవారిని సన్మానించుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు తెలుగు ప్రముఖులను ఘనంగా సన్మానించారు. సినీ నటుడిగా 50 సంవత్సరాలు పూర్తిచేసుకున్న డైలాగ్ కింగ్ సాయికుమార్‌ను ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సంస్థ అధ్యక్షుడు గంజి జగన్‌బాబు, ప్రధాన కార్యదర్శి కె.అశోక్, కోశాధికారి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్ స్టేడియం ఖాళీకి సన్నాహాలు



వేలం ప్రక్రియలో పాల్గొన్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ స్టేడియం ఉన్న ప్రాంతానికి తరలించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. దీన్ని పరిగణనలోకి తీసుకున్న నగర కొత్వాల్ సీవీ ఆనంద్ అవసరమైన చర్యలకు ఆదేశించారు. దీంతో సీఏఆర్ హెడ్-క్వార్టర్స్ అధికారులు స్టేడియంలో ఉన్న పాత వాహనాలను విక్రయించే ప్రక్రియను వేగవంతం చేశారు. వివిధ ఠాణాల పరిధిలో లభించిన గుర్తుతెలియని వాహనాలు, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్నవి ఇక్కడే ఉంచుతాను. నిర్ణీత సమయం తర్వాత వేలం ద్వారా విక్రయిస్తారు. ఇందులో భాగంగానే వేలం ప్రక్రియ సోమవారం స్టేడియంలో జరిగింది. స్క్రాప్‌గా మారిన 537 వాహనాలను ఖరీదు చేసుకోవడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన 150 మంది బిడ్డర్లు పోటీ పడ్డారు. దాదాపు ఐదు టన్నుల బరువు ఉన్న వీటి విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.56.1 లక్షలు చేకూరిందని డీసీపీ రక్షిత కృష్ణమూర్తి తెలిపారు.

ఓఆర్ఆర్.. నేరాలకు అడ్డా

సర్వీస్‌రోడ్లు, నిర్మానుష్య ప్రదేశాలే అసాంఘిక కార్యకలాపాలకు కేంద్ర బిందువు

- కానరానీ సీసీ కెమెరాలు, రాత్రిళ్లు అంధకారం
- ఇదే అదునుగా మలుచుకుంటున్నవైనం

మేడ్చల్‌రూరల్: హైదరాబాద్‌కు మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. ప్రయాణికులకు ఆహ్లాదకర వాతావరణం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఓఆర్ఆర్ ఇరువైపులా దాని పరిధిలోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటగా ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి. దీనికితోడూ ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్డులో ఎక్కడా సీసీ కెమెరాలు లేకపోవడం, రాత్రుల్లో చీకటిగా ఉండడంతో ఇదే అదునుగా కొందరు అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు.



ఔటర్ సర్వీసు రోడ్డు



సర్వీస్‌రోడ్డు పక్కనే ఖాళీ స్థలంలో పెరిగిన చెట్లు

కానరానీ సీసీ కెమెరాలు, హైమాస్ట్ లైట్లు..

- ఓఆర్ఆర్ ప్రధాన రహదారిలో ప్రభుత్వం విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసింది. కానీ సర్వీస్ రోడ్డులో మాత్రం చిన్నపాటి లైట్లు కూడా లేవు. దీంతో పాదచారులు, సమీప గ్రామాల వారు రాత్రి వేళల్లో సర్వీస్‌రోడ్డు వైపు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ముఖ్యంగా ఓఆర్ఆర్ అండర్ పాస్ బ్రిడ్జిల కింద ప్రేమికులు, వివాహేతర సంబంధాలు గల వారు రాత్రి వేళల్లో ఇక్కడే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో సర్వీస్‌రోడ్డు ఉండడంతో పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు సైతం నిఘా పెట్టకపోవడంతో వారిని అడ్డుకునే వారే లేకుండా పోయారు.
- గతంలో మేడ్చల్ పరిధిలోని కండ్లకోయ చౌరస్తా సమీపంలోని సర్వీస్ రోడ్డు పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో చెట్లు పెరిగి నిర్మానుష్య ప్రదేశంగా మారడంతో కొందరు వ్యభిచారులు పట్టపగలే చెట్లపొదల చాటున తమ దందా సాగించారు. ఇదే విషయమై 'సాక్షి' పలు కథనాలు ప్రచురించగా పోలీసులు వాటికి అడ్డుకట్ట వేశారు. కొన్ని నెలల పాటు పెట్రోలింగ్ చేయడంతో ఆగినా.. ప్రస్తుతం సర్వీస్ రోడ్డులో పోలీసుల లేకపోవడంతో పోకిరీలు మళ్లీ రెచ్చిపోతున్నారు.

సీసీ కెమెరాలు లేక నానాతంటాలు..

మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ఒక్క చోట కూడా సీసీ కెమెరాలు లేకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. సర్వీస్ రోడ్డులో ఏ ప్రమాదం, నేరాలు జరిగినా పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. కేసు దర్యాప్తులో కీలంగా వ్యవహరించే సీసీ కెమెరాలు లేక నిందితులను పట్టుకునేందుకు పోలీసులు నానా తంటాలు పడాల్సి వస్తోంది. ఈనెల 24న ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్డు పక్కన కల్వర్టు కింద జరిగిన దారుణ హత్య ఘటనను ఛేదించడంలో పోలీసులు మూడు రోజుల పాటు శ్రమించాల్సి వచ్చింది. చివరకు హత్యకు గురైన మహిళ చేతిపై పచ్చబొట్టుతో వేయించుకున్న పేర్లు, ఇతర ఫొటోలతో పాటు జిల్లాల్లో లుక్‌అవుట్ నోటీసులు అంటించగా వాటిని చూసిన మృతురాలి బంధువులు పోలీసులను ఆశ్రయిస్తేనే హత్య కేసు నిందితుడిని పట్టుకోగలిగారు.



ఇటీవల మహిళ హత్యకు గురైన ఓఆర్ఆర్ కల్వర్టు

విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..

ఓఆర్ఆర్ సమీపంలో జరిగిన హత్యతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. నిర్మానుష్యం, రాత్రి వేళల్లో వీధి లైట్లు, సీసీ కెమెరాలు లేకపోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. సర్వీస్‌రోడ్డు పక్కనే కంపెనీలు, వ్యాపార సముదాయాల వారు సైతం కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా పోలీసులు చర్యలు చేపట్టాలని, ప్రభుత్వం, హెచ్ఎండీ ఇప్పటికైనా స్పందించి సర్వీస్‌రోడ్డులో విద్యుత్ దీపాలు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ

- నిందితుడిని పట్టించిన సెల్‌ఫోన్ సిగ్నల్స్
- వివరాలు వెల్లడించిన మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్ రూరల్: మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మునీరాబాద్ ఓఆర్ఆర్ వద్ద జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు గురైన మహిళ నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన శివానంద(45)గా గుర్తించారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు. శివానంద భర్త సాయిలుతో గొడవపడి కుటుంబానికి దూరంగా ఉంటోంది. ప్రస్తుతం కొంపల్లిలో నివాసం ఉంటోంది. మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇదిలా ఉండగా కరీంనగర్ జిల్లా కమలాపూర్‌కు చెందిన షేక్ ఇమామ్ (37)సిటీకి వచ్చి మేడ్చల్‌బస్ స్టాప్ వద్ద శివానందను చూసి మాటలు కలిపాడు. అనంతరం ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై మునీరాబాద్ గ్రామ శివార్లలో నిర్మానుష్య ప్రదేశమైన ఓఆర్ఆర్ కల్వర్టు కిందకు వెళ్లారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యా డబ్బువిషయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో షేక్ ఇమామ్ మృతురాలు శివానంద గొంతును నులుమడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. పక్కనే ఉన్న బండరాయితో తలపై కొట్టడంతో మరణించింది. అనంతరం నిందితుడు మునీరాబాద్ వెళ్లి పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొనుగోలు చేసి తిరిగి ఘటనా స్థలికి వచ్చాడు. మృతురాలిపై పెట్రోల్ పోసి నిప్పంటించి పరారయ్యాడు. ఈ నెల 24న సాయంత్రం మేడ్చల్ పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని పలు ఆధారాలు సేకరించారు. మెట్టెల ఆధారంగా మృతురాలు వివాహితగా గుర్తించారు.

నోటీసులతో వీడిన మిస్టరీ..

హత్య కేసులో గుర్తు తెలియని మహిళ హత్యకు గురైనట్లు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి చేతులపై ముగ్గురి పేర్లున్న పచ్చబొట్టు ఉండడంతో జిల్లాల్లోని పలు పోలీస్‌స్టేషన్లకు పంపించారు. ఈ విషయం తెలుసుకున్న శివానంద కుటుంబసభ్యులు పోలీసులను సంప్రదించారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడు షేక్ ఇమామ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

విదేశీ గంజాయి విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

శంషాబాద్: విదేశీ గంజాయిని విక్రయిస్తున్న బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను శంషాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం అరెస్ట్ చేసింది. శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణ ప్రియ తెలిపిన మేరకు.. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న తూర్పు గోదావరి రాయవరం గ్రామానికి చెందిన శివరాం(28) బెంగళూరుకు చెందిన కర్ర అజయ్ నుంచి కాలిఫోర్నియాకు చెందిన విదేశీ గంజాయి (ఓజీ కుష్) కొనుగోలు చేశాడు. ఒక గ్రాము రూ. 1500 కొనుగోలు చేసి దానిని నగరంలో రూ. 3 వేల చొప్పున విక్రయిస్తున్నాడు. ప్రతి శని, ఆదివారాలు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో తెచ్చి హైదరాబాద్‌లో అవసరమైన వారికి విక్రయిస్తున్నాడు. ఆదివారం రాత్రి 175 గ్రాముల విదేశీ గంజాయితో పాటు కిలో గంజాయి పొడి తీసుకుని గచ్చిబౌలి వరకు వచ్చాడు. ఈ సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని శేరిలింగంపల్లి పోలీసులకు అప్పగించారు.

ఓయూ ఇంజినీరింగ్ కాలేజీలో అమృత్ శివలెంక గోల్డ్ మెడల్



ప్రిన్సిపల్‌కు చెక్‌ను అందచేస్తున్న కళ్యాణ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టర్ అమృత్ శివలెంక గోల్డ్ మెడల్‌ను ప్రవేశపెట్టారు. ఓయూలో ఇంజినీరింగ్ పూర్తి చేసి అమెరికాలోని ఫ్లోరిడాలో ఓర్లాండ్‌ఓల యూనివర్సల్ స్టూడియోస్ పని చేస్తున్న ఆయన తన పేరు మీద గోల్డ్‌మెడల్ కోసం రూ.5 లక్షలను అందచేశారు. సోమవారం కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్‌కు డా.అమృత్ సోదరుడు కళ్యాణ్ శివలెంక రూ.5 లక్షల చెక్‌ను అందచేశారు. బీఈ మెకానికల్ ఇంజినీరింగ్‌లో అత్యంత మార్కులు సాధించిన విద్యార్థికి డా.అమృత్ శివలెంక గోల్డ్‌మెడల్‌ను ప్రదానం చేయనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ పేర్కొన్నారు.

'బీదర్ దోపిడీ' కాల్పుల బాధితుడికి శస్త్ర చికిత్స



సాక్షి, సిటీబ్యూరో: కర్ణాటకలోని బీదర్‌లో ఇటీవల జరిగిన దోపిడీ ఘటనలో గాయపడ్డ బాధితుడు శివకుమార్‌కు హైటెక్ సిటీలోని కేర్ హాస్పిటల్‌లో సర్జన్లు విజయవంతంగా చికిత్స అందించారు. శస్త్రచికిత్స తరువాత శివకుమార్ కోలుకున్నారని వైద్యులు తెలిపారు. బుల్లెట్ ఎడమ ఊపిరితిత్తుల గుండా వెళ్లి, డయాఫ్రాగమ్ కడుపుని ఛిద్రం చేసిందని, ప్లీహము కిడ్నీకి గాయాలయ్యాయన్నారు. అంతర్గత గాయాలను సైతం వేసిందన్నారు. బాధితుడి పరిస్థితి దృష్ట్యా అత్యవసర లాపరోటమీని కూడా నిర్వహించామన్నారు. ఆసుపత్రికి చెందిన శస్త్రచికిత్సా బృందం అత్యంత నైపుణ్యంతో ఆయనకు సర్జరీలను విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. ఈ శస్త్ర చికిత్స బృందానికి డా.ముస్తాఫా హుస్సేన్ రజ్వీ సారథ్యం వహించారు.

తిరుమల బ్యాంక్‌కు రూ. 2.45 కోట్ల టోకరా

ఈక్విటాస్ బ్యాంక్ మేనేజర్‌పై కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: అధిక వడ్డీ చెల్లిస్తామంటూ తిరుమల కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌కు రూ.2.45 కోట్ల టోకరా వేశారు. ఈక్విటాస్ బ్యాంక్ ఏఎస్ రావు నగర్ బ్రాంచ్ మేనేజర్ హరిప్రసాద్ తదితరులు ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారు. తిరుమల బ్యాంక్ సీఈఓ ఫిర్యాదు మేరకు సోమవారం నగర సీసీఎస్‌లో కేసు నమోదైంది. మలక్‌పేట కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న తిరుమల కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 2016 నుంచి ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తూ వస్తోంది. ఈక్విటాస్ బ్యాంక్‌కు ఏఎస్‌రావ్ నగర్ బ్రాంచ్ మేనేజర్‌గా జి.హరిప్రసాద్ వ్యవహరిస్తున్నారు. తమ వద్ద ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తే అధిక మొత్తం వడ్డీ ఇస్తామని హరిప్రసాద్ చెప్పడంతో తిరుమల బ్యాంక్ పది దఫాలుగా రూ.3.5 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసింది. వీటి గడువు పూర్తయినప్పటికీ తిరిగి చెల్లించడంలో ఈక్విటాస్ సంస్థ విఫలమైంది. దీంతో తిరుమల బ్యాంక్ సంబంధీకులు ప్రశ్నించగా డిపాజిట్లను రెన్యువల్ చేయాలని కోరారు. ఆరా తీయగా రూ.1.05 కోట్లకు సంబంధించిన డిపాజిట్లు మాత్రమే తమ రికార్డుల్లో ఉన్నాయని, మిగిలిన రూ.2.45 కోట్లకు సంబంధించి అకౌంట్స్‌లో లేవని ఈక్విటాస్ ఉన్నతాధికారులు చెప్పారు. అయితే ఈక్విటాస్ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్స్ కోసం బదిలీ చేసిన మొత్తం బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్‌ల్లో ఉన్న ఖాతాల్లోకి వెళ్లిందని తేలింది. అయితే అవి ఈక్విటాస్ బ్యాంక్‌ను పోలిన పేరుతో తెరిచినవిగా వెలుగులోకి వచ్చింది. దీంతో హరిప్రసాద్ తదితరులు ఉద్దేశపూర్వకంగా మోసం చేసినట్లు గుర్తించారు. దీంతో తిరుమల బ్యాంక్ సీఈఓ శోభనాద్రి సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

29 నుంచి అంతర్జాతీయ సదస్సు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్-సీఆర్ఐడీఏ)లో ఈ నెల 29 నుంచి మూడు రోజుల పాటు వర్షాధార వ్యవసాయంపై అంతర్జాతీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సదస్సుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులతో సహా దాదాపు 700 మంది హాజరు కానున్నారన్నారు.

'మనూ'లో 29 నుంచి సదస్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఈనెల 29, 30 తేదీలలో నిర్వహిస్తున్నట్లు 'మనూ' ఆంగ్ల విభాగాధిపతి ప్రొఫెసర్ కె నాగేంద్ర సోమవారం తెలిపారు. 'భారత దేశంలో ఆంగ్ల భాషా విద్య చరిత్ర: పరస్పర చర్యలు, అమలు' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తామన్నారు. ప్రొఫెసర్ ప్రకాశం అధ్యక్షతన జరిగే సదస్సులో ఇంగ్లీష్ ప్రొఫెసర్ వి.రాజేంద్ర ప్రసాద్, ప్రొఫెసర్ పరిమళవిరావు, ప్రొఫెసర్ సల్మాఫారూఖీ, ప్రొఫెసర్ ఇంతియాజ్ హస్నైన్ పాల్గొంటారన్నారు.

30 నుంచి ఓయూ పీహెచ్‌డీ దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ కేటగిరి-2 ప్రవేశాలకు ఈ నెల 30 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ. పాండురంగారెడ్డి సోమవారం తెలిపారు. మార్చి చివరి వారం నుంచి 45 సబ్జెక్టుల్లో 446 సీట్లకు జరిగే పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్-2025కు అర్హత గల అభ్యర్థులు ఈ నెల 30 నుంచి మార్చి 1 వరకు, రూ.2000 అపరాధ రుసుముతో మార్చి 11 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేయవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడాలని పేర్కొన్నారు.

రూ.15 లక్షల రుణం కోసం రూ.5.5 లక్షలు చెల్లించింది

ఉపాధ్యాయురాలికి టోకరా వేసిన సైబర్ నేరగాళ్లు

సాక్షి, సిటీబ్యూరో: వ్యక్తిగత రుణం కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేసిన ఓ ఉపాధ్యాయురాలు రూ.5.5 లక్షలు నష్టపోయారు. రూ.15 లక్షల రుణం కోసం ప్రయత్నించి, ఆ మొత్తం మంజూరు చేస్తామన్న వారికి ఈ మొత్తం చెల్లించడం గమనార్హం. నగరానికి చెందిన బాధితురాలు పర్సనల్ లోన్ కోసం ఆన్‌లైన్‌లో వెతికారు. అందులో దొరికిన ఓ నెంబర్‌కు సంప్రదించగా.... మహేష్ అని చెప్పుకున్న వ్యక్తి మాట్లాడాడు. తనకు రూ.15 లక్షల రుణం కావాలని ఆమె కోరగా... మధ్యవర్తిత్వం వహించడానికి అతడు అంగీకరించాడు. అప్పటి నుంచి ప్రాసెసింగ్ ఫీజు, ఇతర పన్నులతో సహా వివిధ పేర్లు చెప్తూ ఆమె నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్నారు. రూ.2 వేలతో మొదలుపెట్టి మొత్తం రూ.5.5 లక్షలు డిపాజిట్ చేయించుకున్నాడు. అయినప్పటికీ రుణం మంజూరు కాకపోవడంతో తాను మోసపోయానని గుర్తించిన బాధితురాలు సోమవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

ప్రమాదం అనుకున్నారు కానీ.. అది ఆత్మహత్య



ప్రమాదంలో మరణించిన గుర్తు తెలియని వ్యక్తి

మేడ్చల్ రూరల్: లారీ వేగంగా వస్తున్న సమయంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతున్నట్లు వెళ్లి ఒక్కసారిగా రోడ్డుపై పడుకున్నాడు. దీంతో లారీ అతనిపై వెళ్లడంతో మృతి చెందాడు. పోలీసులు ముందు దీనిని రోడ్డు ప్రమాదం అని భావించారు.అయితే సీసీ కెమెరాల్లో మాత్రం అసలు నిజం బయటపడింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఆదివారం రాత్రి మేడ్చల్ పట్టణంలో రోడ్డు ప్రమాదం జరిగింది. నగరం వైపు వెళ్తున్న లారీ ఓ గుర్తు తెలియని వ్యక్తి పైనుండి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోలీసులు ఘటన తీరును తెలుసుకునేందుకు సమీపంలోని పలు సీసీ కెమెరాలు పరిశీలించారు. మృతుడు రోడ్డు దాటుతున్నట్లుగా వెళ్లి లారీ వచ్చే సమయంలో ఒక్కసారిగా రోడ్డుపై పడుకోవడంతో లారీ అతని శరీరంపై నుండి వెళ్లింది. దీంతో మృత్యువాత పడ్డాడు. సీసీ కెమెరాలో నమోదైన ఘటన దృశ్యాలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

పట్టణ ప్రాంతాలలో పచ్చదనం పెంపుపై శిక్షణ



గచ్చిబౌలి: పట్టణ ప్రాంతాలలో రోజు రోజుకూ పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులపై తీసుకోవాల్సి చర్యలపై అటవీ శాఖ అధికారులు చర్చించారు. సోమవారం గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐలో 'అటవీ పట్టణ నమూనాలు ఉత్తమ పద్ధతులు'అనే అంశంపై ఐదు రోజుల వర్క్‌షాప్‌ను తెలంగాణ పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ ప్రారంభించారు. పట్టణ ప్రాంతాలలో పచ్చదనం పెంపుపై చర్చించారు. అటవీ పట్టణ నమూనాలపై అభిప్రాయాలు వెల్లడించారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: రాజీవ్‌నగర్, బీఎస్‌పురి 11కెవీ ఫీడర్లు మోతీనగర్ సబ్‌స్టేషన్ పరిధిల్లో జరుగుతున్న విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు రాజీవ్‌నగర్, బీఎస్‌పురి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా హిందూ 11కెవీ ఫీడర్, గ్రీన్‌లాండ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల ఉదయం 11నుంచి 12.30 వరకు వెంకట ప్లాజా, ఓర్రా జువెలరీ, కృష్ణా జువెలరీ, ఎక్సైడ్ బ్యాటరీ ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందన్నారు. పీసీబీ, అమీర్‌పేట 11 కెవీ ఫీడర్లు ఆల్విన్, మైత్రీవన్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3.30 వరకు సనత్‌నగర్ బస్టాప్ వెనక, అశోక్‌నగర్‌కాలనీ, ఆర్‌ఎస్ బ్రదర్స్, కాకతీయ మెస్, అమీర్‌పేట మెయిన్‌రోడ్డు, దుర్గానగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

ప్రజావాణికి స్పందన కరువు

గంటలోపే తతంగం పూర్తి

వెంగళరావునగర్: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరవవుతోంది. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ సర్కిల్–19 కార్యాలయంలోని డీఎంసీ చాంబర్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే ప్రజల నుంచి అరకొర సమస్యలు మాత్రమే వచ్చాయి. ఇందులో భాగంగా ఎస్పీఆర్ హిల్స్‌లో మురుగునీటి పారుదల, రహమత్‌నగర్ నుంచి శానిటేషన్, వెంగళరావునగర్ డివిజన్ నుంచి వీధిదీపాల సమస్యలకు పలువురు వినతి పత్రాలను అందించారు. ఈ తతంగం మొత్తం గంటలోపే పూర్తయింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా డీఎంసీ మినహా ఇతర అధికారులు హాజరైనప్పటికీ ప్రజల నుంచి స్పందన కనబడలేదు. ఈ సందర్భంగా ఏఎంసీ బాల్‌రాజు మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

ఫిలింనగర్: భర్తపై అలిగి భార్యాపిల్లలు వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... అస్సాంకు చెందిన బితుల్ గొగాయ్ (31) గచ్చిబౌలి ఇనార్బిట్ మాల్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ ఫిలింనగర్‌లోని బసవతారకనగర్ బస్తీలో ఉంటున్నాడు. కొంతకాలంగా బితుల్ మరో యువతితో ప్రేమాయణం సాగిస్తుండటంతో అతడి భార్య ఘర్షణ పడి పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురైన బితుల్ తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫిలింనగర్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి కూలీ మృతి



మృతి చెందిన సదానంద్

ఫిలింనగర్: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి జారిపడి ఓ దినసరి కూలీ మృతి చెందిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...ఒడిశాకు చెందిన సదానంద్ కొన్ని నెలల క్రితం పొట్టకూటి కోసం నగరానికి వచ్చి కూకట్‌పల్లిలో భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు.సోమవారం భార్యతో కలిసి ఫిలింనగర్ రోడ్డునెంబర్–3లో అపోలో చౌరస్తా ఐసీఐసీఐ బ్యాంక్ పక్కన ఓ భవన నిర్మాణానికి కూలీగా వచ్చాడు. మధ్యాహ్న సమయంలో సదానంద్ రెండో అంతస్తుకు ఇసుక తీసుకుని వెళ్తుండగా ప్రమాదవశాత్తూ జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. భవన యజమాని శ్రీధర్‌రెడ్డిని ఫిలింనగర్ పోలీసులు విచారిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లైఓవర్‌పై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



ఫిలింనగర్: షేక్‌పేట ఫ్లైఓవర్‌పై నుంచి దూకి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... ఈ నెల 24న ఉదయం 10.10 గంటల సమయంలో టోలిచౌకి నుంచి గచ్చిబౌలి వెళ్లే మార్గంలో షేక్‌పేట ఫ్లైఓవర్‌పై నుంచి దూకి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ వ్యక్తి కుడి చేయిపై జైశ్రీరామ అని ట్యాటు ఉంది. మృతునికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ విజయ్‌కుమార్ 87126 60457, 87126 65182 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

టోలిచౌకిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ఫిలింనగర్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఫిలింనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... టోలిచౌకి ఫాతిమానగర్ జానకినగర్ రోడ్డులో ఓ వ్యక్తి పడిఉన్నాడని డయల్ 100కు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని సదరు వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అయితే మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు దాటితే..అంధకారమే..!

- 30 శాతం వెలగని వీధిదీపాలు
- డార్క్‌స్పాట్లను పట్టించుకోని జీహెచ్ఎంసీ
- ఏజెన్సీ నిర్లక్ష్యంతో జనాలకు ఇబ్బందులు
- చీకట్లతో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో స్ట్రీట్‌లైట్ల సమస్య స్థానికులు, వాహనదారులను తీవ్రంగా వేధిస్తోంది. రాత్రి ఆరుదాటితే చాలు బయటకు వెళ్లాలంటే స్థానికులు ఇబ్బందులు పడటంతోపాటు అటుగా ప్రయాణాలు సాగించే ప్రయాణికులు కూడా సరిగా రోడ్డు కనిపించక ఇబ్బందులు పడుతూ పలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఓ ప్రమాద ఘటనలో కేసు పరిశోధనకు వెళ్లిన పోలీసులు కూడా చీకట్లో ఏమీ కనిపించకపోవడం ఇబ్బందులు పడ్డారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.



బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10 బసవతారకం ఆస్పత్రి రోడ్డులో లైట్లు లేక చీకట్లోనే కేసు ఆధారాలు సేకరిస్తున్న బంజారాహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో స్ట్రీట్‌లైట్ల సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లో సాయంత్రం ఆరు దాటిందంటే అంధకారం నెలకొంటోంది. మొత్తం లైట్లలో సుమారుగా 25–30 శాతం వరకు లైట్లు వెలగడం లేదు. దీంతో సాయంత్రం ఆరు దాటితే మెయిన్‌రోడ్లతో పాటు కాలనీలు, బస్తీలు అంధకారంలో చిక్కుకుంటున్నాయి. చాలాచోట్ల రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. మరోవైపు టైమర్లు సరిగా పనిచేయక కొన్నిచోట్ల లైట్లు రేయింబవళ్లు వెలుగుతూనే ఉన్నాయి. ఏడేళ్ల క్రితం స్ట్రీట్ లైట్ల నిర్వహణ బాధ్యతలను జీహెచ్ఎంసీ ఏజెన్సీకి అప్పగించింది. అయితే సదరు ఏజెన్సీ గడువు త్వరలో ముగియనున్న నేపథ్యంలో నిర్వహణను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జరిమానాలు వేసినా సదరు సంస్థ అంతగా స్పందించడం లేదని విమర్శలు ఉన్నాయి. నిర్వహణలో ఎలాంటి మార్పు లేకపోగా నాలుగైదు నెలలుగా సమస్య తీవ్రమైంది. జీహెచ్ఎంసీకి ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో 30శాతం వరకు స్ట్రీట్ లైట్లకు సంబంధించినవే ఉంటున్నాయి. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సోమాజీగూడ, వెంకటేశ్వరకాలనీ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఇటీవల ఎమ్మెల్యే దానం నాగేందర్ రివ్యూ మీటింగ్ నిర్వహించగా ఇందులో ఎక్కువగా వీధి దీపాలు వెలగడం లేదనే ఫిర్యాదులే అందాయి. స్థానిక కార్పొరేటర్లకు కూడా నిత్యం 25–30 చొప్పున తమ ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్లు వెలగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. లైట్లు వెలగని చోట్ల సదరు సంస్థ కొత్తవి కూడా ఏర్పాటు చేయకపోవడంతో చీకట్లు కమ్ముకుంటున్నాయి.

డార్క్ స్పాట్లలో ప్రమాదాలు...

గడిచిన రెండునెలల కాలంలో బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా కేబీఆర్ పార్కును ఆనుకుని రెండు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా ఒకరు మృతి చెందగా, 10 మందికి గాయాలయ్యాయి. ఇక్కడ డార్క్ స్పాట్లు ఉన్నా జీహెచ్ఎంసీ అధికారులు గుర్తించలేదు. ఇక్కడ లైట్లు వెలగకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చీకట్లోనే బంజారాహిల్స్ పోలీసులు ప్రమాద ఘటనపై దర్యాప్తు చేసి ఆధారాలు సేకరించడం చాలా కష్టమైంది. చాలాచోట్ల హైమాస్ట్ లైట్లు కూడా వెలగడం లేదు. ట్రాఫిక్ పోలీసులు పలుమార్లు బల్దియాకు చెప్పినా వినిపించుకోవట్లేదని పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు రివ్యూ మీటింగ్‌లు పెడుతూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా వీధి దీపాల నిర్వహణను పట్టించుకోవడం లేదు. జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో 23,551 స్ట్రీట్ లైట్లు ఉండగా ఇందులో 780 లైట్లు వెలగడం లేదని డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తెలిపారు. అయితే వెలగని వీధి దీపాల సంఖ్య 10 వేల పైచిలుకు ఉంటుందని, ఆయా డివిజన్ల కార్పొరేటర్లకు వస్తున్న ఫిర్యాదుల ద్వారా తెలుస్తోంది.

జెడ్సీ ప్రశ్నించాలి...

వీధిదీపాల విషయంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ కఠిన వైఖరిని అవలంబించాల్సిన అవసరం ఉంది. సర్కిల్–17, సర్కిల్–18 స్ట్రీట్‌లైట్స్ ఈఈ, ఏఈలతో సమావేశం ఏర్పాటు చేసి ఎందుకు లైట్లు వెలగడం లేదని ప్రశ్నించి ఫిర్యాదు అందిన తర్వాత ఎన్ని రోజుల్లో లైట్లు వెలుగులకు నోచుకుంటున్నాయో ఆరా తీయాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసిత జూబ్లీహిల్స్ డివిజన్‌లోనే 400లకు పైగా వీధీ దీపాలు వెలగడం లేదు.

ఆరునెలలుగా జీతాలు రాకపోతే
ఎలా బతకాలి

జీతాల కోసం వీధిదీపాల విభాగం సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న వీధి దీపాల విభాగం సిబ్బంది

బంజారాహిల్స్: ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నామని, కుటుంబాల పోషణ కష్టంగా మారిందని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలంటూ వీధి దీపాల విభాగంలో పనిచేసే సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్‌లో విధులు నిర్వహిస్తున్న వీధి దీపాల విభాగం ఎనర్జీ ఎఫీషియన్సీ సేవింగ్ సర్వీసెస్ లిమిటెడ్ కింద పని చేస్తున్న సిబ్బంది సోమవారం జూబ్లీహిల్స్‌లోని జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రెక్కాడితే డొక్కాడని జీవితాలు తమవని తమకు జీతాలు రావడం లేదని ఎంతమంది అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీని అడిగితే సంబంధిత ఏజెన్సీని అడగాలని ఏజెన్సీ దగ్గరికి వెళ్తే మాకు బిల్లులు రాకుండా జీతాలు ఎలా చెల్లిస్తామంటూ దాట వేస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీలోని ఒక్కో సర్కిల్‌లో వీధి దీపాల విభాగంలో 13 మంది సిబ్బంది వరకు ఉంటారని ఈ సమస్యను త్వరలోనే సీఎం దృష్టికి కూడా తీసుకుపోతామని తెలిపారు. ఏడేళ్ల క్రితం జీహెచ్ఎంసీలో ఉన్న తమను ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్‌లోకి మార్చారని అప్పటి నుంచి తమది ఇదే పరిస్థితి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్, ప్రదీప్, సురేందర్, కృష్ణ, వాజిద్, వెంకట్, హరి, తదితరులు పాల్గొన్నారు.

'ఐవీఆర్'కు గవర్నర్ ఎక్స్‌లెన్స్ అవార్డు

గవర్నర్, సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఐవీఆర్ హెడ్ డాక్టర్ బ్యూలా క్రిస్టీ



గవర్నర్, ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బ్యూలా క్రిస్టీ

బంజారాహిల్స్: దివ్యాంగుల సాధికారతకు కృషి చేస్తున్న ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌లోని ఇనిస్టిట్యూట్ ఫర్ విజన్ రిహాబిలిటేషన్ (ఐవీఆర్)కు గవర్నర్ ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. ఈ అవార్డును రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా ఐవీఆర్ హెడ్ డాక్టర్ బ్యూలా క్రిస్టీ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ హైకోర్టు కార్యనిర్వాహక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ అవార్డు సంస్థ నిబద్ధత, కృషి, పురోగతి, పనితీరుకు ప్రాతినిధ్యం వహిస్తుందని ఈ సందర్భంగా బ్యూలా క్రిస్టీ అన్నారు. గడిచిన ఐదేళ్లుగా దివ్యాంగుల యాక్సెసిబిలిటీని పెంపొందించడంలో, హక్కుల కోసం వాదించడంలో, దివ్యాంగులు స్వతంత్ర జీవితాలు గడిపేలా చేయడానికి ఇనిస్టిట్యూట్ అంకితభావంతో చేస్తున్న కృషికి గుర్తింపు లభించిందన్నారు. దివ్యాంగుల సంక్షేమం, అభ్యున్నతికి తోడ్పడేలా ఇతరులకు స్ఫూర్తి నింపడమే తమ లక్ష్యమన్నారు.

ఆకట్టుకుంటున్న కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన



చీరలను తిలకిస్తున్న మహిళలు

శ్రీనగర్‌కాలనీ: సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలతో పాటు ఫ్యాన్సీ వస్తువులు మహిళలను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. వెస్ట్ శ్రీనివాసనగర్‌కాలనీలో కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారులచే తయారు చేయబడిన పోచంపల్లి, మంగళగిరి, జందాన్ని శారీస్, కోటా, ఉప్పాడ, చీరలా, బెనారస్‌తో పాటు పలు సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీవస్తువులను సుమారు 40 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేతకళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు వికాస్ జైన్ తెలిపారు. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 10 వరకు కొనసాగనుందని పేర్కొన్నారు.

జాతీయ సమైక్యతను చాటిన విద్యార్థులు



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో ఉడాన్ పేరుతో నిర్వహించిన ఓపెన్‌హౌస్‌లో జాతీయ సమైక్యత వెల్లవిరిసింది. 3, 4 తరగతుల విద్యార్థులు దేశంలోని వివిధ రాష్ట్రాల కట్టూబొట్టూ, సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెబుతూ నిర్వహించిన కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థులు కనువిందు చేశారు. ఆయా రాష్ట్రాల పరిశ్రమలు, చేతి వృత్తులు, హస్తకళలు, సంప్రదాయ వస్త్రధారణ ఇందులో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ తిలకించి విద్యార్థులను అభినందించారు.

కల్తీ నెయ్యి తయారీ కేంద్రంపై దాడి

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లో అసలైన నెయ్యి పేరుతో నకిలీ, కల్తీ నెయ్యి విక్రయిస్తున్న కేంద్రంపై జీహెచ్ఎంసీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని ఫ్రైడ్ గి అండ్ కర్డ్ పేరుతో నిర్వహిస్తున్న ఈ కేంద్రంపై దాడులు చేసిన అధికారులకు విస్తుపోయే వాస్తవాలు తెలిశాయి. నెయ్యిలో ప్రమాదకర స్థాయిలో రసాయనాలు కలుపుతూ తయారు చేస్తున్నట్లు ఆనవాళ్లను గుర్తించారు. ఈ సందర్భంగా ప్రమాదకర రసాయనాలతో పాటు నెయ్యి శాంపిల్స్‌ను సేకరించి నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు.

అభయ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పద్మభూషణ్ చిన్నజీయర్‌స్వామి



సేవలు అందించిన పలువురిని అభినందిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

శ్రీనగర్‌కాలనీ: అభయ ఫౌండేషన్ పేద విద్యార్థుల చదువుకు, వారిలోని ప్రతిభను గుర్తించే స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు ప్రశంసనీయమని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పద్మభూషణ్ చిన్నజీయర్‌స్వామి అన్నారు. సోమవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 18వ ఎన్యువల్ థ్యాంక్స్ గివింగ్ సెర్మనీని నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా గవర్నర్ జిష్ణువేవ్ వర్మ, చిన్న జీయర్ స్వామి హాజరై ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి వందలాది మంది విద్యార్థులు ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌కు తోడుగా నిలిచిన పలు సంస్థల ప్రతినిధులు, విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అలాగే రంగ అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్‌ని రిటైర్డ్ ప్రొఫెసర్ నాగేశ్వరరావుకు అందజేశారు. విద్యార్థుల జానపద, సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కేవీ రామకృష్ణ, పద్మశ్రీ రమేష్ గెల్లి, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు పరిష్కార చర్యలు

కొత్తగా సీవరేజీ లైన్ పనులు



ఫిలించాంబర్ వద్ద కొనసాగుతున్న సీవరేజీ నిర్మాణ పనులు

ఫిలింనగర్: ఫిలించాంబర్ వద్ద గత కొద్ది రోజులుగా నిత్యం పారుతున్న మురుగు సమస్యకు అధికారులు పరిష్కార చర్యలను చేపట్టారు. ఫిలించాంబర్ గేటును ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కింద మ్యాన్‌హోల్ పూర్తిగా దెబ్బతిని మట్టి, ఇటుకలు పైపుల్లో ఇరుక్కుపోయి పూర్తిగా లైన్ దెబ్బతిన్నదని అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఇక్కడ 20 మీటర్ల మేర నూతన సీవరేజీ లైన్‌ను నిర్మిస్తున్నట్లు ఫిలింనగర్ జలమండలి ఇన్‌చార్జి మేనేజర్ రాంబాబు తెలిపారు. దీంతో పాటు మిగతా పైప్‌లైన్‌లో కూరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తే ఇక్కడ సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని ఈ పనులు మరో మూడు రోజుల్లో పూర్తవుతాయని తెలిపారు.

ఎమ్మెల్యే కాలనీలో ప్రభుత్వ స్థలం స్వాధీనం



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని వెంకటేశ్వర కో–ఆపరేటివ్ సొసైటీ ఎమ్మెల్యే కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతుండగా షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. ఎమ్మెల్యే కాలనీలోని ప్లాట్‌నెంబర్–38 యజమాని 502 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి స్విమ్మింగ్ పూల్ నిర్మాణంతో పాటు మరికొంత స్థలాన్ని కబ్జా చేశాడు. దీంతో ఫిర్యాదు అందుకున్న తహశీల్దార్ అనితారెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. 502 గజాల ప్రభుత్వ స్థలాన్ని తమ స్వాధీనంలోకి తీసుకుని హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశారు. సదరు ప్లాట్ యజమాని మళ్లీ ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మేయర్‌ను కలిసిన టీం ఇండియా మేనేజర్

బంజారాహిల్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ ఆర్.దేవరాజ్ వచ్చే ఐసీసీ చాంపియన్ ట్రోఫీకి టీం ఇండియా మేనేజర్‌గా నియమితులైన సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. దేవరాజ్‌కు మేయర్ అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరింతగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఖచ్చితంగా చాంపియన్స్ ట్రోఫీలో టీం ఇండియా విజయం సాధించాలని ఆకాంక్షించారు.



టీవీ, ఓటీటీలలో సింహభాగం
తెలుగు ఆర్టిస్టులకే ఇవ్వాలి



సమావేశానికి హాజరైన టీవీ ఆర్టిస్టులు

వెంగళరావునగర్: తెలుగు టెలివిజన్, ఓటీటీ పరిశ్రమలో అధికశాతం మంది తెలుగు నటీనటులకే అవకాశం ఇవ్వాలని ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టీవీ అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న కృష్ణకౌశిక్ డిమాండ్ చేశారు. తెలుగు టెలివిజన్ టెక్నీషియన్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అనుబంధ సంఘాల పీఎస్‌టీలతో ఆత్మీయ సమావేశం సోమవారం మధురానగర్‌కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణకౌశిక్ మాట్లాడుతూ తెలుగు నటులకే మేజర్ అవకాశాలు ఇవ్వాలనే నినాదంతో తాను ఎన్నికల బరిలో దిగుతున్నట్లు పేర్కొన్నారు. టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్‌లో 900 మంది కళాకారులు ఉండగా కేవలం 90 మందికి మాత్రమే సరైన పని లభిస్తుందన్నారు. మిగిలిన పాత్రలను ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తారతమ్యాలు ఇకమీదట ఉండకూడదని తాము పోరాటం చేస్తామని అన్నారు. అంతేగాకుండా మనం ప్యానల్‌లో ప్రధాన కార్యదర్శిగా విజయ్ రెడ్డి, కోశాధికారిగా మధులికలతో పాటుగా పలువురు ప్రముఖ నటీనటులు మిగిలిన పదవులకు పోటీ చేస్తున్నారని అన్నారు. మనం ప్యానల్‌ను గెలిపిస్తే 900 మంది ఆర్టిస్టులకు జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పిస్తామని, అకారణంగా ఫెడరేషన్ నుంచి వైదొలగిన ఆర్టిస్టులను ఫెడరేషన్ అనుబంధ సంఘంలో చేర్చుకుంటామని, పేద కళాకారులకు గృహాలు ఇప్పించడానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు రాకేష్ (నానీ), జనరల్ సెక్రటరీ విజయ్‌కుమార్, కోశాధికారి కె.నరేందర్‌రెడ్డి, ముఖ్య సలహాదారులు నర్సింగరావు, అనుబంధ సంఘాల నాయకులు మోహన్‌రాజు, ఆర్‌సీఎం రాజు, ఖద్దుస్, ఈశ్వర్, గిరి, నర్సింగ్, తాజుద్దీన్, ప్రసాద్, మహి పాల్, మధు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది అన్ని కేటగిరీల్లో సత్తా చాటాలి



బ్యాండ్ కోర్స్‌ను ప్రారంభిస్తున్న టీజీఎస్‌పీ ఇన్‌చార్జి డీఐజీ సన్నీ

వెంగళరావునగర్: పోలీసుశాఖలో విధులు నిర్వహించే సిబ్బంది అన్ని కేటగిరీల్లో తమ సత్తాను చాటాలని టీజీఎస్‌పీ ఇన్‌చార్జి డీఐజీ సన్నీ తెలియజేశారు. యూసుఫ్‌గూడలోని టీజీఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్‌లో సోమవారం బ్యాండ్ కోర్స్, ఆర్మ్మోర్ అప్‌గ్రేడింగ్ కేటగిరీలకు సంబంధించి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌చార్జి డీఐజీ సన్నీ మాట్లాడుతూ ఖాకీ చొక్కా వేసుకున్న నాడే మనం ప్రజలకు, సేవకు అంకితమవుతున్నామని అర్థమని, ఉద్యోగ ప్రారంభం నుంచి చివరి వరకు అలుపెరుగని, నిస్వార్థమైన సేవలను ప్రజలకు అందించాలని సూచించారు. బ్యాండ్ కోర్స్‌లో రాణించిన వారు ఢిల్లీ స్థాయిలో ప్రశంసా పత్రాలు, బహుమతులు అందుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఏ కమాండెంట్ సత్య శ్రీనివాస్, ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ పి.మురళీకృష్ణ, అడిషనల్ కమాండెంట్స్ టి.నరేందర్‌సింగ్, రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్స్ రాంబాబు, రవిచంద్ర, భాస్కర్, కెవీవీ ప్రసాద్, నరసింహ, ఆర్ఐలు ధర్మారావు, రవీందర్, రాజేష్, జాఫర్, శంకర్, నర్సయ్య, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్యాయం వల్లే 30 ఏళ్లుగా ఉద్యమం సజీవం

మా జాతి గెలుపునకు సాయపడితే జీవితాంతం రుణపడతాం : మందకృష్ణ మాదిగ

పంజగుట్ట: తమకు అన్యాయం జరిగిందన్న బలమైన భావన మాదిగల్లో ఉండడం వల్లే ఎమ్ఆర్‌పీఎస్ ఉద్యమం 30 సంవత్సరాలుగా సజీవంగా ఉందని ఎమ్ఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి, బ్రాహ్మణ, ఆర్యవైశ్య మిత్ర మండలి, బ్రాహ్మణ సంఘాలు, కురుమ రిజర్వేషన్ పోరాట సమితిలు ఎస్సీ వర్గీకరణ కోసం ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించనున్న లక్ష డప్పులు, వెయ్యి గొంతులు కార్యక్రమానికి సంఘీభావంగా సమావేశం ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ ప్రకటించడం, ఫిబ్రవరి 7న జరిగే కార్యక్రమం విజయవంతం కావాలని వేద బ్రాహ్మణులు మంత్రోచ్చారణతో ఆయనకు ఆశీర్వాదం పలికారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ ఎమ్ఆర్‌పీఎస్ ఏ కులానికి ఏ మతానికి వ్యతిరేకం కాదన్నారు. కులం అనేది మనం సృష్టించుకున్నది కాదని, అది వందల, వేల సంవత్సరాల నుంచి వస్తుందన్నారు. ఏ కులమైనా, ఏ మతమైనా మనం భారతీయులుగా కలిసిఉంటే అసమానతలు ఉడవని అన్నారు. మన మధ్య ఉన్న అసమానతలు మనమే పరిష్కరించుకుంటే అఖండ భారత్ సాధించుకోవచ్చునని అన్నారు. 59 కులాలు ఉన్న ఎస్సీల్లో 58 కులాలు వర్గీకరణ కోరుకుంటున్నాయని, మాలల్లో కూడా కొంత మంది స్వార్థపరులే దీన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తనకు సాయం చేసిన వర్గాలకు ఎప్పటికీ అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి అధ్యక్షులు ప్రేమ్ గాంధీ, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు నిరంజన్ దేశాయ్, రాంసుధాకర్, కురుమ సంఘం నాయకులు బింగి స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపు కామర్స్ టాలెంట్ టెస్ట్

ఖైరతాబాద్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల, ఆంబిషన్స్ కేరీర్ కౌన్సిల్, వాసవి క్లబ్ హైదరాబాద్ సంయుక్తంగా ఈ నెల 29న మధ్యాహ్నం 2 గంటలకు ఐఐఎంసీ కళాశాలలో కామర్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కామర్స్ టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. జూనియర్ కళాశాల విద్యార్థులు మాత్రమే ఈ పరీక్ష రాసేందుకు అర్హులని, ప్రతిభ కనబర్చిన వారికి నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 9052810304, 9493976082 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

ప్రజావాణికి వెల్లువలా ఫిర్యాదులు

సత్వరమే పరిష్కరించాలన్న మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను డీఆర్ఓ హరిప్రియతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డి స్వీకరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 90 ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్డీవో సాంబశివరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిష్కారంలో జాప్యం తగదు

లక్డీకాపూల్: ప్రజావాణిలో అర్జీల విషయంలో జాప్యం తగదని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ ఇలంబర్తి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డితో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ.. ప్రజావాణిలో ఆయా విభాగాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా అందుతున్నా వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. ఈ విషయంలో జాప్యం తగదని, ఆయా విభాగాల అధికారులు ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.

ఇళ్లకు దండిగా దరఖాస్తులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఇళ్ల కోసం ప్రజావాణికి దండిగా దరఖాస్తులు వస్తున్నాయి. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 1,411 దరఖాస్తులు అందగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 1,052 దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్ఓ ఈ.వెంకట చారి, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా అధికారులు ఆశన్న, ఆర్.రోహిణి, పవన్ కుమార్, కోటాజీ, సుబ్రహ్మణ్యం, ఇలియాజ్ అహ్మద్, రాజేందర్, శ్రీరామ్, రమేష్ పాల్గొన్నారు.

టీజీవోఎస్ డైరీ ఆవిష్కరణ



సాక్షి, మేడ్చల్‌జిల్లా: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డైరీని ఆ సంఘం కేంద్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఆవిష్కరించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, కార్యదర్శి కురుమూర్తి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

30న ఓయూలో గద్దర్ జయంతి

ఉస్మానియా యూనివర్సిటీ: దివంగత ప్రజా యుద్ధనౌక గద్దర్ 77వ జయంతిని ఈ నెల 30న ఓయూలో నిర్వహించనున్నట్లు ఓయూ జేఏసీ వ్యవస్థాపక సభ్యులు సునీల్ శెట్టి తెలిపారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, సూర్యకిరణ్ తదితరులు ఆవిష్కరించారు. ఆర్ట్స్ కాలేజీ రూమ్ నంబర్-57లో జరిగే కార్యక్రమానికి విద్యార్థులు, మేధావులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నేత చెన్నయ్య, విద్యార్థి జేఏసీ నాయకులు రవీంద్రనాయక్, మాందాల భాస్కర్, మంచాల లింగస్వామి, మాదాసు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో మెగా హ్యాకథాన్

రాయదుర్గం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి కోసం ఒక సిరీస్ ప్రారంభించడానికి మొదటి రౌండ్ 'ఏఐ హ్యాక్‌డే' పేరిట ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హ్యాకథాన్‌ను ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్, 'స్వేచ్ఛ డాట్ ఆర్గనైజేషన్' ద్వారా ట్రిపుల్ ఐటీలోని 'విశ్వమ్ డాట్ ఏఐ' పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో 20కిపైగా కళాశాలలు, 60కి పైగా అధ్యాపక సభ్యులు, 100కుపైగా పరిశ్రమ మార్గదర్శకులు, 600లకుపైగా బృందాలు పాల్గొన్నారు. 2వేలకు పైగా విద్యార్థులు ప్రాజెక్టులపై పనిచేస్తున్నారు. ఈ హ్యాకథాన్‌ను ఐఏఎస్ అధికారి భవేష్‌మిశ్రా ప్రారంభించి మాట్లాడుతూ దేశం ప్రత్యేక సవాళ్లను పరిష్కరించడానికి ఈ మెగా హ్యాకథాన్ నిర్వహించారన్నారు. ఏఐ విప్లవాన్ని ముందుగానే ఉపయోగించుకోవాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలన్నారు. దేశానికి అవసరమైన రీతిలో ఏఐ నమూనాలను కూడా ఎలా నిర్మించగలదో ఆయన వివరించారు. అనంతరం ట్రిపుల్‌ఐటీ ప్రొఫెసర్ రమేష్‌లోగనాథన్, ఓజోనెటెల్ సహ వ్యవస్థాపకుడు, సీటీఓ చైతన్య చొక్కారెడ్డి, విశ్వం ఏఐ అధిపతి కిరణ్‌చంద్ర, మైక్రాన్ టెక్నాలజీ ప్రతినిధి ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

31 నుంచి సంగీత, నృత్య మహోత్సవం

లక్డీకాపూల్: శంకరానంద కళాక్షేత్రం, నాట్యారంభ సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు సంగీత, నృత్య మహోత్సవం 'రామాయణ కల్పవృక్షం' నిర్వహించనున్నట్లు ప్రముఖ నర్తకి డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ తెలిపారు. శ్రీరాముడి ఆధ్యాత్మిక చైతన్యాన్ని నిత్య జీవితంలోకి తీసుకురావడమే లక్ష్యంగా మూడు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవం భారతీయ సంప్రదాయ కళలు, కళారూపాల జ్ఞానాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ముఖ్యంగా రాముడి జీవితాన్ని నృత్యం, సంగీతం, హరికథలు తదితర ప్రదర్శనల ద్వారా ఆవిష్కరించే అపూర్వ కార్యక్రమం అన్నారు. ప్రఖ్యాత కళాకారులు, పండితుల ప్రసంగాలు, భారతీయ జ్ఞానంపై వర్క్‌షాప్‌లు, ప్రదర్శనలు, హస్తకళలు వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. మాదాపూర్‌లోని సీసీఆర్‌టీ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ఈ ఉత్సవాన్ని ఎంపీ తేజస్వి సూర్య ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

స్పెషల్.. ఫోకస్

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- 45 రోజుల కార్యాచరణ ప్రణాళిక
- ఉదయం, సాయంత్రం స్పెషల్ క్లాసులు
- వచ్చేనెల 15 నుంచి ప్రాక్టీస్ పేపర్
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- హైదరాబాద్ సర్కారు బడుల్లో 9,912 మంది విద్యార్థులు



సాక్షి, సిటీబ్యూరో: సర్కారు బడుల్లో పది పరీక్షల్లో మెరుగైన ఫలితాల కోసం హైదరాబాద్ విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. గత విద్యా సంవత్సరం పదవ తరగతిలో 81 శాతం ఉత్తీర్ణత మాత్రమే దక్కడంతో ఈసారి 95 నుంచి 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా 45 రోజులు ప్రత్యేక కార్యాచరణకు దిగింది. హైదరాబాద్ జిల్లా పరిధిలో పదో తరగతి పరీక్షలకు సుమారు 72,900 మంది విద్యార్థులు హాజరు కానుండగా, అందులో 9,9912 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు. అయితే ఈసారి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు సర్కారు బడుల్లో ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌లో స్పెషల్ క్లాసులకు శ్రీకారం చుట్టింది. ఈ తరగతుల నిర్వహణ ద్వారా ప్రతిరోజూ విషయాలను వివరించడం, అవగాహన కల్పించడం, మరుసటి రోజు ఉదయాన్నే వాటిపై స్లిప్‌టెస్ట్ నిర్వహించి విద్యార్థుల తప్పులను సరిదిద్దే పనిలో పడింది. ముఖ్యంగా విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం నింపడం, పబ్లిక్ పరీక్షల బ్లూప్రింట్ నమూనాలో పరీక్షలకు సిద్ధమైంది. పట్టుదల, శ్రద్ధ ఆయుధమైతే విజయం సొంతమవుతుందని విద్యార్థులకు నూరిపోస్తున్నారు. ఇప్పటికే పదో తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. మార్చి 6 నుంచి 15 వరకు పరీక్షలు జరుగుతాయి.

రెండు దశల్లో 90 తరగతులు

పదో తరగతి పరీక్షల కోసం ప్రత్యేకంగా 90 తరగతులను విద్యాశాఖ ప్లాన్ చేసింది. వచ్చేనెల 2వ తేదీ నుంచే స్కూల్ వేళలను ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మొత్తం మీద ఉదయం 45, సాయంత్రం 45 తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. రెండు పూటల్లో కలిపి ఫస్ట్ లాంగ్వేజీ 11, సెకండ్ లాంగ్వేజి 9, ఇంగ్లిష్ 11, గణితం 17, ఫిజిక్స్ 14, బయోసైన్స్ 13, సోషల్ 15 తరగతులు నిర్వహించనున్నారు. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులు కడుపు మాడ్చుకోకుండా దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అల్పాహారాన్ని అందజేస్తోంది.

స్లిప్ టెస్టులు

పదవ తరగతి వార్షిక పరీక్షల తరహాలో రెండు పర్యాయాలు విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహిస్తోంది. మొదటి పర్యాయం స్లిప్ టెస్టులు మూడు రోజుల క్రితమే ప్రారంభం కాగా, ఇప్పటికే ఫస్ట్ లాంగ్వేజీ, సెకండ్ లాంగ్వేజి, ఇంగ్లిష్ పరీక్షలు పూర్తి కాగా, 29న గణితం, 30న ఫిజిక్స్, 31న బయోసైన్స్, 1న సోషల్ పరీక్షలు జరగనున్నాయి. ఆ తర్వాత వచ్చేనెల 15న నుంచి 22 వరకు పూర్తిస్థాయి సెలబస్‌పై ప్రాక్టీస్ పేపర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం టైమ్ టేబుల్ కూడా విడుదల చేశారు. 15న ఫస్ట్ లాంగ్వేజి, 17న సెకండ్ లాంగ్వేజి, 18న ఇంగ్లిష్, 19న గణితం, 20 ఫిజిక్స్, 21 బయోసైన్స్, 22న సోషల్ పరీక్ష నిర్వహిస్తారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక తరగతుల సందర్భంగా నిర్వహిస్తున్న పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా వారిని గ్రేడ్‌లుగా విభజిస్తారు. స్థాయిలవారీగా విద్యార్థులను సమూహాలుగా విభజించి, రోజువారి లక్ష్యాలతో బోధించనున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు కొందరు విద్యార్థులను దత్తత తీసుకొని నిత్యం ఉదయం 5 గంటలకు తల్లిదండ్రులకు ఫోన్ చేసి విద్యార్థులు చదివేలా బాధ్యత చేపట్టనున్నారు. దీంతో ఈసారి మెరుగైన ఫలితాలు సాధించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భక్తిశ్రద్ధలతో షబే-ఏ-మేరాజ్

- ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు
- మసీదుల్లో మేరాజ్ సందేశమిచ్చిన మతగురువులు

సాక్షి, సిటీబ్యూరో: షబే-ఏ-మేరాజ్‌ను సోమవారం రాత్రి ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున మసీదుల్లో సామూహికంగా ఇషా నమాజ్ ప్రార్థనలు నిర్వహించారు. నమాజ్ అనంతరం నగరంలోని వివిధ మసీదుల్లో మతగురువులు మేరాజ్ రాత్రి ప్రాముఖ్యత గురించి వివరించారు. షబే మేరాజ్ రాత్రి రంజాన్ మాసం ప్రారంభానికి 33 రోజుల ముందు వస్తుంది. ఈ రాత్రి రాకతో నగరంలో రంజాన్ సందడి ప్రారంభమవుతుంది. ఇప్పటి నుంచే ఆయా మసీదుల్లో రంజాన్ నెల కోసం తరావీ నమాజుల కోసం ఏర్పాట్లు ప్రారంభిస్తారు. రోజుకు ఐదుసార్లు నమాజ్ విధిగా చేయాలని మతగురువులు చెప్పారు. మహ్మద్ ప్రవక్త ఈ రాత్రి స్వర్గ నరకం దర్శించారని, ప్రవక్త సూచనలకు అనుగుణంగా ఇహలోక జీవితం గడిపిన వారికి స్వర్గం, లేని వారికి నరక యాతన ఉంటుందని మతగురువులు తమ ప్రసంగాల్లో చెప్పారు. మేరాజ్ రాత్రి సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక నఫీల్ నమాజులు చేస్తూ.. ప్రత్యేక దువాలు, తహజ్జు నమాజ్‌లు చేస్తూ గడిపారు. మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

నగరంలో నేడు

- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఇన్నోవేటివ్ హ్యాండ్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- చిలుకూరు బాలాజీ దేవాలయం రోడ్డులోని ప్రొద్దుటూరులో నిర్మించిన ఎక్స్‌పీరియం పార్క్‌ను ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

అరుదైన దర్శకుడు శ్యామ్ బెనగళ్



శ్యామ్ బెనగళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం తదితరులు

గన్‌ఫౌండ్రీ: శ్యామ్ బెనగళ్ అరుదైన దర్శకుడని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. నిజాం కళాశాలలో బాలీవుడ్ దర్శకుడు శ్యామ్ బెనగల్ జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఆయన జ్ఞాపకార్థం కళాశాలలో మొక్క నాటారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ.. అరుదైన సినీ దర్శకుల్లో ఆయన ఒకరని కొనియాడారు. ఓయూ వైస్ చాన్స్‌లర్ ఎం.కుమార్ మాట్లాడుతూ.. దేశంలో గొప్ప దర్శకుడైన శ్యామ్ బెనగల్ ఓయూ పూర్వ విద్యార్థి కావడం ఓయూకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు బి.నర్సింగ్‌రావు, నటుడు శంకర్ మెల్‌కోటే, శ్యామ్ బెనగల్ సతీమణి నీరా శ్యామ్, కూతురు ప్రియా, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏపీ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

31న ప్రజాయుద్ధనౌక గద్దర్ జయంతి ఉత్సవం



గద్దర్ జయంతి వేడుకల పోస్టర్ ఆవిష్కరిస్తున్న గద్దర్ ఫౌండేషన్ ప్రతినిధులు

పంజగుట్ట: గద్దర్ ఫౌండేషన్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో 31వ తేదీన ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు రవీంద్రభారతిలో ప్రజాయుద్ధనౌక గద్దర్ 77వ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గద్దర్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, గద్దర్ కుమారుడు, ఫౌండేషన్ వ్యవస్థాపకులు సూర్యకిరణ్, కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్, సినీ డైరెక్టర్ శంకర్ కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ వాగ్గేయకారుడు గద్దర్ అని, ఆయన ఆశయాన్ని, వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. గద్దర్ పేరుతో సాంస్కృతిక సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, స్థలం కోసం చూస్తున్నారని అద్దంకి దయాకర్ అన్నారు. గద్దర్ జయంతి ఉత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరు కానున్నట్లు తెలిపారు. గద్దర్‌కు నక్సల్ బ్యాక్‌గ్రౌండ్ ఉందని, ఆయనకు పద్మ అవార్డు ఎందుకు ఇస్తారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అనాడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు గద్దర్ ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

ఐ బ్యాంకుకు కళ్లు దానం



పద్మారాణి(ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే వైద్య విభాగంలో చీఫ్ ఫార్మసిస్టుగా పనిచేస్తున్న పద్మారాణి(59) ఆదివారం రైల్వే ఆస్పత్రిలో కన్నుమూశారు. ఆమె కోరిక మేరకు రెండు కళ్లను వాసన్ ఐ బ్యాంక్‌కు దానం చేసినట్లు ఆమె భర్త రాంబాబు, కుమార్తె రమ్య ఒక ప్రకటనలో తెలిపారు. పద్మారాణి రైల్వే డిపార్ట్‌మెంట్‌లో చీఫ్ ఫార్మసిస్టుగా పనిచేస్తూనే కవయిత్రిగా, కార్టూనిస్టుగా రాణించారు.

రియల్ వ్యాపారులకు అనుకూలంగా మాస్టర్ ప్లాన్

సాక్షి, సిటీబ్యూరో: శరవేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ పరిసరాల్లో క్రమపద్ధతిలో అభివృద్ధి జరగాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు డా.ఎస్.మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ జోన్ల విభజన బడాబాబులు, రియల్ వ్యాపారులకు తప్ప రైతులకు అనుకూలంగా లేదని అన్నారు. దీంతో సుమారు 50 వేల మంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎండీఏ స్థానిక సంస్థల మధ్య సమన్వయం లేకపోవడంతో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోందని ఆరోపించారు. హెచ్ఎండీఏ ఔటర్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు తప్ప గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. బీజేపీ అర్బన్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోనె మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు నల్ల రామచంద్రారెడ్డి, గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్యామ్‌రావు, బీజేపీ దుండిగల్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ స్థాయిలో క్రీడాభివృద్ధి

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



మాట్లాడుతున్న శివసేనారెడ్డి

కవాడిగూడ: గ్రామీణ స్థాయిలో క్రీడాభివృద్ధికి కృషిచేస్తానని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడారంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో అంతర్‌జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ పోటీలను తెలంగాణ జిల్లాల రూరల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన టోర్నమెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో కొత్తగా క్రీడా అకాడమీలు, స్పోర్ట్స్ హాస్టల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. జిల్లాస్థాయిలో 50 ఎకరాలు, మండలస్థాయిలో 5 ఎకరాల విస్తీర్ణంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి, నారాయణ్‌ఖేడ్ మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్, తెలంగాణ జిల్లాల గ్రామీణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, దోమలగూడ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామిరెడ్డి, పాలమూరు యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్, ఓయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సోమేశ్వర్ రావు, రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య, ఆర్గనైజర్ భాస్కర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

పౌర సంబంధాలతోనే సంస్థలకు గుర్తింపు

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి
- నిష్ణాతులకు ఎమినెంట్ ప్రొఫెషనలిస్ట్ అవార్డులు

నాంపల్లి: పౌర సంబంధాలతోనే ఏ సంస్థకైనా గుర్తింపు, గౌరవం లభిస్తుందని, లేదంటే ఆ సంస్థకు వచ్చే నష్టాలు, కష్టాలను ఊహించుకోలేమని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ కెఎల్ఎన్.ప్రసాద్ ఆడిటోరియంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన పలువురు లబ్ధ ప్రతిష్టులకు పబ్లిక్ రిలేషన్స్ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ టీమ్ (ప్రాప్స్) సంస్థ ఆధ్వర్యంలో ఎమినెంట్ ప్రొఫెషనలిస్ట్ అవార్డ్స్-2024 సోమవారం రాత్రి ప్రదానం చేశారు. ప్రాప్స్ సంస్థ అధ్యక్షుడు పీఎస్.భానుప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో ఎంపిక చేసిన ప్రముఖులను వేదికపైకి ఆహ్వానించి ఎమినెంట్ ప్రొఫెషనలిస్ట్ అవార్డులతో సత్కరించి ప్రసంగించారు. జర్నలిజం, పబ్లిక్ రిలేషన్స్(పౌర సంబంధాలు) కవల పిల్లల వంటివని ఆయన అన్నారు. ఈ రెండింటిదీ విడదీయలేని బంధమని పేర్కొన్నారు. జర్నలిజం 1990 వరకు బాగానే ఉన్నా ప్రస్తుతం జర్నలిజాన్ని ప్రజలు ఆదరించడం లేదన్నారు. అదేవిధంగా వర్కింగ్ జర్నలిస్టులకు రక్షణ లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాప్స్ ప్రధాన కార్యదర్శి ఎస్.చక్రపాణి, అడ్వైజరీ బోర్డు చైర్మన్ బీఎస్‌వీవీఎస్.మూర్తి, వ్యవస్థాప ఉపాధ్యక్షులు వీఎస్ఆర్. నాయుడు, కెఎంకె.రావు తదితరులు పాల్గొన్నారు. పబ్లిక్ రిలేషన్స్ విభాగంలో కళాకారుడు సామల వేణు, అడ్వైర్‌టైజ్‌మెంట్ విభాగంలో ఆర్‌బీసీ వరల్డ్ వైడ్ సంస్థ ఎండి టి.రమాకాంత్, తెలుగు జర్నలిజంలో సాక్షి దినపత్రిక తెలంగాణ రాష్ట్ర బ్యూరో ఇన్‌చార్జి కె.శ్రీకాంత్‌రావు, ఇంగ్లిష్ జర్నలిజంలో ది హిందూ దినపత్రిక సీనియర్ అసిస్టెంట్ ఎడిటర్ స్వాతి వడ్లమూడి, ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ విభాగంలో గురుస్ సంస్థ అధినేత్రి దాల్జిత్ కౌర్ తదితరులు అవార్డులు అందుకున్నారు.

సమాచార హక్కు పరిరక్షణకు కృషి చేయాలి



కేలండర్ ఆవిష్కరిస్తున్న ప్రెస్ అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి

కాచిగూడ: సమాచార హక్కు వికాస సమితి తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ యర్రమాద కృష్ణరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కే.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అవినీతి నిర్మూలన కోసం సమాచార హక్కు చట్టాన్ని ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేస్తున్న వికాస సమితి కృషి అభినందనీయం అన్నారు. ఉమ్మడి ఏపీ రాష్ట్ర మాజీ ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వ పథకాలు అర్హులు పొందాలని, ప్రజా సంక్షేమ పథకాలు సద్వినియోగం అయ్యేలా సమాచార కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చూడాలన్నారు. డాక్టర్ కాచం సత్యనారాయణ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వై.హేమలత, కోడుమూరి దయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారులు

లాలాపేట: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తార్నాకలో తెలంగాణ ఉద్యమకారుల మహిళా వేదిక సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో భాగస్వామ్యమైన మహిళా ఉద్యమకారులకు ఇప్పటి వరకు ఎలాంటి గుర్తింపు లభించలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తమను పూర్తిగా విస్మరించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, దాని ద్వారా రూ.30 వేల పెన్షన్, 4 గదుల ఇంటి నిర్మాణం, రూ.20 లక్షల బీమా తదితర డిమాండ్లను అమలు చేయాలన్నారు. మహిళా వేదిక అధ్యక్షురాలు మాధవి, ఉపాధ్యక్షురాలు లావణ్య, అరుణ, ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, సహాయ కార్యదర్శి ఇందిర, నాయకులు సరిత, వెంకటలక్ష్మి, అంజలి, సుజీ, లక్ష్మీకాంతమ్మ, పద్మ, కమల, దేవిక, చంద్రకళ తదితరులు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచడంలో జాప్యం ఎందుకు?

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: అసెంబ్లీలో బిల్లు పెట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్రం అగ్ని గుండంగా మారుతుందని, అవసరమైతే రిజర్వేషన్ల సాధన కోసం ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో కుటుంబ సర్వే పూర్తయ్యిందని, సర్వేలో బీసీల జనాభా 55 శాతం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 20 నుంచి 42 శాతానికి రిజర్వేషన్లు పెంచడంలో జాప్యం ఎందుకని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, వార్డు మెంబర్లలో బీసీ రిజర్వేషన్లు 42శాతానికి పెంచకపోతే ప్రభుత్వంతో యుద్ధమే జరుగుతుందని హెచ్చరించారు. జనాభా ఆధారంగా విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 50శాతానికి పెంచాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీరామ్ జ్ఞానేశ్వర్‌ను నియమిస్తూ ఆర్.కృష్ణయ్య నియామకపు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నీల వెంకటేష్, తంగెళ్ల ముడి నందగోపాల్, వేముల రామకృష్ణ, జిల్లాపెల్లి అంజి, సి.రాజేందర్, మట్ట జయంతి, రాజునేత, వేణు, ఆశీష్, గణేష్, రఘుపతి, నరేష్, నిఖిల్, శ్రీవాణి, మనుదీప పాల్గొన్నారు.

మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ పోస్టులు పెంచాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



కోఠి డీఎంహెచ్ఎస్‌లో ధర్నా నిర్వహిస్తున్న 2వ ఏఎన్ఎంలు

సుల్తాన్‌బజార్: ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(ఫిమేల్) పరీక్ష నోటిఫికేషన్‌కు సంబంధించి ఖచ్చితంగా పోస్టులు పెంచాల్సిందేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోఠి డీఎంహెచ్ఎస్ వద్ద సోమవారం 2వ ఏఎన్ఎంలు ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా 2వ ఏఎన్ఎంలతో పని చేయించుకున్న ప్రభుత్వాలు చివరకు రిటైర్‌మెంట్ సమయంలో ఒట్టి చేతులతో ఇంటికి పంపడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. నూతన ఆర్థిక విధానాలతో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వంటి పేర్లతో ఉద్యోగాలను సృష్టించి అరకొర జీతాలు ఇస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2001వ సంవత్సరంలో పీఆర్సీ అమల్లోకి వస్తే ఇప్పటి వరకు పీఆర్సీ బకాయిలు చెల్లించకపోవడం అధికారుల లోపమే అన్నారు. గత ప్రభుత్వంపై 2వ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని పోరాటం చేశామని, అది సాధ్యం కాదని అప్పటి ప్రభుత్వం తేల్చి చెప్పిన కారణంగా కనీసం 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని తాము ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, రాష్ట్ర 2వ ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు జక్కుల పద్మ, శ్యామల, జయమ్మ, నాగేశమ్మ, సుమతి, రాణి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

గతం.. భవిష్యత్తు గాంధీజీయే..

- ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సతీష్‌కుమార్‌రాయ్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ సతీష్‌కుమార్‌రాయ్

రాయదుర్గం: జాతిపిత మహాత్మా గాంధీ గతం మాత్రమే కాదని, భవిష్యత్తు కూడా అని ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సతీష్‌కుమార్‌రాయ్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ గాంధీయన్ స్టడీస్(ఐఎస్‌జీఎస్) 45వ వార్షిక సదస్సును 'మనూ' మాస్ కమ్యూనికేషన్, జర్నలిజమ్ విభాగం, ఐఎస్‌జీఎస్ సంయుక్తంగా నిర్వహించింది. 'మహాత్మాగాంధీ జర్నలిజమ్, ఆధునిక యుగంలో దాని ఔచిత్యం' అనే అంశంపై మూడు రోజుల సదస్సును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభేదాలను నమ్మేవారు పరస్పర చర్చల ద్వారా వాటిని పరిష్కరించే సూత్రాన్ని గమనించాలన్నారు. గాంధీజీ పేరు లేకుండా జాతీయ, అంతర్జాతీయ చర్చల్లో ఎలాంటి సానుకూలమైన పని జరగదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత కాలంలో జర్నలిజమ్ పరిస్థితిని మెరుగుపర్చడానికి గాంధీ ఆలోచనలు ఉపయోగపడతాయన్నారు. 'మనూ' వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, కాశీ విద్యాపీఠం గాంధీయన్ స్టడీస్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్ ద్వివేది, భారత్ న్యూస్ ఎక్స్‌ప్రెస్ సీఎండీ ఉపేంద్రరాయ్, బీహర్ యూనిటీ అండ్ పీస్ ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ షానవాజ్ ఆలమ్, డాక్టర్ సైమాసుహ్రావర్దీ, పీఆర్ఓ డాక్టర్ మహ్మద్ ముస్తఫా అలీ సర్వారి, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్, ప్రొఫెసర్ సీతారామ్ పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 28, జనవరి, 2025

నగరంలో 84వ ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ నుమాయిష్ జోరుగా సాగుతోంది. జనవరి 3న ప్రారంభమైన ఈ ఈవెంట్ ఫిబ్రవరి 18 వరకూ కొనసాగనుంది. ఎప్పటి నుంచో షాప్ హోలిక్స్‌కు ఫేవరెట్ స్పాట్‌గా ఉన్న ఈ వస్తూత్పత్తుల ఉత్సవం.. గత కొంత కాలంగా సాంస్కృతిక కార్యకలాపాల వేదికగానూ వర్ధిల్లుతోంది. కళలను అభిమానించేవారికి చిరునామాగా మారుతోంది.

- సాక్షి, సిటీబ్యూరో





నుమాయిష్.. కల్చరల్..జోష్..

కూచిపూడి నృత్యాల నుంచి గజల్ గీతాల వరకు

హాస్య కదంబాల నుంచి మూకాభినయం వరకు	వైవిధ్యభరిత సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక	నాంపల్లి గ్రౌండ్స్‌లో కల్చరల్ ఈవెంట్ల సందడి

నుమాయిష్‌కి వెళ్లొచ్చాను అనగానే.. ఏం కొన్నావ్? ఏం తిన్నావ్? అనే ప్రశ్నలే ఎదురవుతాయి తప్ప ఎవరి పాటలు ఎంజాయ్ చేశావ్! ఎవరి నృత్యాభినయాన్ని ఆస్వాదించావ్? అనే ప్రశ్నలు అరుదే. ప్రధానంగా షాపింగ్ ప్రియుల కోసం ఏర్పాటైన ప్రదర్శన కావడం వల్ల నుమాయిష్‌ని ఒక కల్చరల్ ఈవెంట్స్‌కి కేరాఫ్‌గా పరిగణనలోకి తీసుకోరు. అయితే ఇప్పుడిప్పుడే ఆ పరిస్థితి మారుతోంది. మంచి సంగీతాన్ని, నృత్యాన్ని, హాస్య కార్యక్రమాన్ని ఆస్వాదించడానికి కూడా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అవకాశం ఉంటుందనే ఆలోచన నగరవాసుల్లో వస్తోంది.



రోజుకు 6 గంటలపైనే..

నుమాయిష్ షాపింగ్ ప్రధాన ఆకర్షణ అయితే, దానితో పాటే అంతకు మించిన అనుభవాన్ని, వినోదాత్మక కార్యక్రమాలను కూడా అందిస్తోంది. రోజూ సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ వీటిని నిర్వహిస్తున్నారు. దీని కోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రత్యేకంగా పండల్, లాన్స్‌లో 2 వేదికలు ఏర్పాటు చేశారు. నుమాయిష్‌ని సందర్శించాలని ప్లాన్ చేసే కళాభిమానులు తమకు నచ్చిన ఈవెంట్ ఉన్న రోజును ఎంచుకోవడానికి వీలుగా షాపింగ్‌తో పాటే పలు రకాల అద్భుతమైన ఈవెంట్‌ల జాబితా కూడా నిర్వాహకులు సిద్ధంగా ఉంచారు. మంత్ర ముగ్ధులను చేసే నృత్య ప్రదర్శనల నుంచి మనోహరమైన ముషైరా సెషన్స్ వరకు, ప్రతి ఒక్కరికీ నచ్చేలా వైవిధ్యభరిత ప్రదర్శనలను అందుబాటులోకి తెచ్చారు.




కూచిపూడితో కూడి..

సంప్రదాయ సౌరభాలను ఆస్వాదించేవారికి నుమాయిష్ ఒక మంచి ఎంపికగా చెప్పొచ్చు. కూచిపూడి వంటి సంప్రదాయక నృత్యకళలకు ఇక్కడ ఎక్కువగా పట్టం గడుతున్నారు. అలాగే గజల్స్, సూఫీ సంగీతం వంటివి ప్రముఖ కళాకారులు అందిస్తున్నారు. ఆసక్తి కలిగిన వారు నుమాయిష్ అధికారిక వెబ్‌సైట్‌లో ఆయా ఈవెంట్లకు సంబంధించిన తేదీలు, వేదికలు, కళాకారుల వివరాలతో కూడిన ఈవెంట్‌ల జాబితాను పరిశీలించుకోవచ్చు.



ప్రముఖ స్టార్స్ ఈవెంట్స్..

గత సంవత్సరం, బాలీవుడ్ స్టార్ సింగర్ జావేద్ అలీ అద్భుతమైన లైవ్ పెర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన విషయం చాలా మంది నగరవాసులకు మధురమైన జ్ఞాపకం. ఈ ఏడాది ఇప్పటి వరకూ అలాంటి సంచలనాత్మక ప్రకటన ఏమీ రానప్పటికీ.. రానున్న రోజుల్లో ఉండొచ్చని నిర్వాహకులు, సందర్శకులు అంటున్నారు. ఏదేమైనా ఈ కార్యక్రమాలు ఓ వైపు సందర్శకులను సేదతీరుస్తూనే, మరోవైపు స్థానిక ఔత్సాహిక కళాకారులకు అనువైన వేదికలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నాయని చెప్పాలి.



నేడు, రేపు..ఇలా..

ఈ వారాంతం వరకూ ఒకసారి పరిశీలిస్తే.. నేడు (మంగళవారం) కూచిపూడి నృత్యం (ఎం.భిక్షపతి) కామెడీ కార్యక్రమం (షాబుద్దీన్), బుధవారం సినిమా పాటలు (జాఫర్ ఉజ్ జమా), కూచిపూడి నృత్యం (రాజ్‌కుమార్), లయన్స్ క్లబ్ మ్యూజికల్ ప్రోగ్రామ్ అలాగే గురువారం భువనవిజయం ప్రదర్శన, శుక్రవారం విశ్వప్రభ కూచిపూడి నృత్యం, శ్రీకృష్ణ మ్యూజిక్ అండ్ డ్యాన్స్, గజల్ గీతాలు (అద్నాన్ సలీమ్)జిందా దిలాన్‌ఏ హైదరాబాద్ (ముషాయిరీ).. ఇలా పలు వైవిధ్యభరితంగా సందర్శకులను అలరించే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి.

ఇంటెలీ‘జెమ్’



జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే టీసీఎస్ ఐఆన్ ఇంటెలీజెమ్ పోటీల్లో నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన సంస్కృతి కొండూరు విజేతగా నిలిచింది. ఈ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ నుంచి ఏకైక విజేతగా నిలవడంతో పాటు వరుసగా మూడో సంవత్సరం గ్రాండ్ ఫినాలేకు చేరుకుని ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ సారి జరిగిన 7వ ఎడిషన్ టీసీఎస్ ఐఆన్ ఇంటెలీజెమ్ పోటీల్లో ‘కమ్యూనికేషన్ స్కిల్స్’ సీనియర్-కేటగిరీలో విజేతగా నిలిచింది. అంతేకాకుండా ‘యూనివర్సల్ వాల్యూస్’ సీనియర్-కేటగిరీలో ద్వితీయ స్థానాన్ని పొందింది. దేశవ్యాప్తంగా ఈ విభాగంలో 8వ తరగతి నుంచి పోటీపడిన విద్యార్థుల్లో టాప్ రెండో స్థానాన్ని పదిలం చేసుకుంది.

సాక్షి, సిటీబ్యూరో

సంస్కృతి కొండూరు..

ప్రతిష్టాత్మక టీసీఎస్ ఐఆన్ ఇంటెలీజెమ్ పోటీల్లో విజేత

కమ్యూనికేషన్ స్కిల్స్, యూనివర్సల్ వాల్యూస్ సీనియర్-కేటగిరీలో ప్రతిభ

టీసీఎస్ ఐఆన్ ఇంటెలీజెమ్ పోటీల్లో భాగంగా సంస్కృతి 2023లో యూనివర్సల్ వాల్యూస్ - జూనియర్ విభాగంలో నేషనల్ టైటిల్ గెలుచుకుంది. 2024లో యూనివర్సల్ వాల్యూస్, ఫైనాన్షియల్ లిటరసీ విభాగాల్లో రన్నరప్‌గా నిలిచింది. ప్రతి యేటా వరుసగా సాధిస్తున్న ఈ విజయాల కారణంగానే హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ‘స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు’ను గెలుచుకునేలా చేశాయి. 5 నుంచి 9వ తరగతి విద్యార్థుల కోసం 21వ శతాబ్దపు నైపుణ్యాలను అంచనా వేయడానికి ఈ జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తారని సంస్కృతి తెలిపింది. ఇందులో క్వాలిఫైయర్స్, ప్రీ-ఫైనల్స్, జాతీయ స్థాయి గ్రాండ్ ఫినాలే ఉంటాయి. యూనివర్సల్ వాల్యూస్, కమ్యూనికేషన్ స్కిల్స్, గ్లోబల్ సిటిజన్‌షిప్, క్రియేటివిటీ అండ్ ఇన్నోవేషన్, ఫైనాన్షియల్ లిటరసీ అనే ఐదు విభాగాల్లో పోటీపడి కేవలం 36 మంది విద్యార్థులు మాత్రమే గ్రాండ్ ఫినాలేకు చేరుకుంటారు. అయితే ఈ ఐదు విభాగాల్లో తాను సెమీ-ఫైనల్స్‌కు చేరుకోవడం గొప్ప అనుభూతని సంతోషాన్ని వ్యక్తం చేసింది.

ప్రతి ఏడాదీ విజేతగానే..



వృద్ధాప్యం.. ఉత్సాహం..

నిత్య వినోద, క్రీడాంశాలతో నవ యవ్వనంగా వయోధికులు..

ఆట ఏదైనా ప్రతిభను చాటుతున్న మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్..

వయసుకే వృద్ధాప్యం..మనసుకు మాత్రం కాదు.. అన్నట్లు హుషారైన వాతావరణం అక్కడి వారి సొంతం. ఆట ఏదైనా సై అంటూ రంగంలోకి దిగి తమదైన శైలిలో ప్రతిభను చాటుతుంటారు మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్. ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీకి చెందిన సీనియర్ సిటిజన్స్ అంతా ఒకచోట చేరి సందడిగా గడుపుతున్నారు. అలాంటి హుషారైన వేదికకు అసోసియేషన్ కార్యాలయం.. సీనియర్ సిటిజన్స్ ఆనందానికి నెలవైంది.

- సనత్‌నగర్

వయస్సు మీద పడింది కదా.. అని ఏదో మూలన కూర్చోవడం ఒకప్పటి మాట. ఇక్కడ సీనియర్ సిటిజన్స్ మాత్రం ఆటలతో అదరగొట్టేస్తున్నారు. కేరమ్స్, చెస్ వంటి ఆటలతో మానసికోల్లాసం పొందడమే కాకుండా ట్రెడ్‌మిల్‌పై సాధన చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటారు. చాలా కుటుంబాల్లో తమవారంతా కార్యాలయాలకో, పిల్లలు స్కూళ్లకో, కళాశాలలకో వెళ్లిపోతుండగా.. సీనియర్ సిటిజన్స్ ఇక్కడికి వచ్చి ఎవరికి ఇష్టమైన గేమ్‌లో వారు ఆడుతూ ఒంటరితనాన్ని దూరం చేసుకుంటున్నారు.





రెండు వేల పుస్తకాలతో..

ఆడుకునేవారు ఆడుకుంటుంటే.. మరి కొందరు ఇక్కడి లైబ్రరీలో పుస్తకాలతో కుస్తీ పడుతూ విజ్ఞాన సముపార్జన చేస్తుంటారు. సాహిత్యం, ఆధ్యాత్మికం, హిస్టరీ.. ఇలా దాదాపు నాలుగు వేల పుస్తకాలు అందుబాటులో ఉంచారు. కాలనీవాసులు ఇంటికీ తీసుకెవెళ్లేందుకు కూడా అనుమతిస్తారు. అలాగే దినపత్రికలు, మ్యాగజైన్స్ చదువుతూ కొత్త విషయాలు తెలుసుకుంటుంటారు. ప్రతిరోజూ ఇక్కడికి నాలుగు రకాల పత్రికలతో పాటు వివిధ రకాల వీక్లీ మ్యాగజైన్స్ వస్తుంటాయి. వాటిని చదువుతూ ప్రపంచ విశేషాలను తెలపడమే కాదు.. ఇంటికెళ్లి తమ వారితో పంచుకుంటుంటారు.

ఆటల పోటీల్లో..

జనవరి 26, ఆగస్టు 15, అక్టోబర్ 1 (సీనియర్ సిటిజన్స్ డే) సందర్భంగా ఆసరా కమిటీ సహకారంతో జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్‌లోని సీనియర్ సిటిజన్స్ పలు క్రీడాంశాల్లో పోటీ పడుతుంటారు. కేరంబోర్డు, చదరంగం, బ్రిస్క్ వాకింగ్, టగ్ ఆఫ్ వార్, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహిస్తూ బహుమతులు ప్రదానం చేస్తారు.



70 ఏళ్లు పైబడిన వారికి సన్మానం..

ఏడు పదులు దాటిన వయోధికులకు మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతియేటా సన్మానిస్తూ ఎప్పటికప్పుడు వారిలో నూతనోత్తేజాన్ని నింపుతోంది. భవిష్యత్తు తరాలకు సీనియర్ సిటిజన్స్‌కు ఏవిధమైన గౌరవం, ఆప్యాయత చూపించాలో కళ్లకు కట్టినట్లు చూపిస్తుండడం విశేషం.

ఆత్మాభిమానంతో బతకాలి..



ఏ సమాజంలో వృద్ధులు తల ఎత్తుకుని ఆత్మాభిమానంతో మనుగడ సాగిస్తారో ఆ సమాజమే నాగిరిక సమాజం. ఆ సమాజం సర్వతోముఖాభివృద్ధి చెందుతోంది. అన్ని రంగాల్లో ముందంజవేసి భావితరాలకు కరదీపికగా నిలుస్తుంది. ఇది ఒక భావన, ఆకాంక్ష, స్వప్నం. దీనిని సాకారం చేసుకోవాలంటే కలలో నుంచి ఇలలోకి రావాలి. నేటి సమాజంలోని వృద్ధుల స్థితిగతులను సామాజిక, శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాలి.

– జేఎస్‌టీ శాయి, ప్రధాన కార్యదర్శి, మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్

ఎవరెస్ట్ అధిరోహణే లక్ష్యం..





అకాన్కాగువా పర్వతాన్ని అధిరోహించిన 16 ఏళ్ల నగర బాలుడు

ఇప్పటికే పూర్తి చేసిన ఎల్బ్రస్, కిలిమంజారో, ఐస్‌లాండ్ పీక్..

తదుపరి లక్ష్యం మౌంట్ ఎవరెస్ట్ : విశ్వనాథ్

సాక్షి, సిటీ బ్యూరో: దక్షిణ అమెరికాలోని ఎత్తైన శిఖరం అకాన్కాగువా (22,837 అడుగులు)ను అధిరోహించి మరో సారి చరిత్ర సృష్టించాడు నగరానికి చెందిన 16 ఏళ్ల బాలుడు పడకంటి విశ్వనాథ్ కార్తికే. ఇప్పటికే వివిధ ఖండాల్లోని ఎత్తైన పర్వతాలు, శిఖరాగ్రాలను చేరుకుని భారతీయ జెండాను సగర్వంగా ఎగురవేసిన విశ్వనాథ్ కార్తికే తన ఖాతాలో మరో ప్రపంచ ఎత్తైన పర్వతాన్ని చేర్చాడు. నగరంలోని రెసొనెన్స్ జూనియర్ కళాశాలలో 11వ తరగతి చదువుతున్న విశ్వనాథ్ కార్తికే, అనుభవజ్ఞుడైన పర్వతారోహకుడు భరత్ తమ్మినేని, భారత సైనిక అధికారి లెఫ్టినెంట్ రోమిల్ బార్తోత్వల్ మార్గదర్శకత్వంలో నాలుగు సంవత్సరాలుగా ఎత్తైన పర్వతారోహణకు కఠిన శిక్షణ పొందుతున్నాడు. ఈ ప్రయత్నంలో భాగంగానే బూట్స్- క్రాంపన్స్ బృందంతో పాటుగా అకాన్కాగువా పర్వతాన్ని అధిరోహించి సురక్షితంగా బేస్ క్యాంప్‌కు తిరిగి చేరుకున్నాడు. 22,837 అడుగుల (6,961 మీటర్లు) ఎత్తులో ఉన్న అకాన్కాగువా పర్వతం ఆసియా వెలుపల ఎత్తైన పర్వతంగా గుర్తింపు పొందింది. అక్కడి వాతావరణం విపత్కంగా ఉండటంతో పాటు అధిక గాలులు, విపరీతమైన చలి తన లక్ష్యానికి కఠిన సవాలుగా నిలిచిందని విశ్వనాథ్ తెలిపాడు. అర్జెంటీనాలోని ఆండీస్ పర్వత శ్రేణిలోని ఈ శిఖరం భూతలానికి అత్యంత ఎత్తైన శిఖరం.

ఖండాంతరాలను దాటి..

మౌంట్ అకాన్కాగువానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఎత్తైన పర్వతాలు.. డెనాలి (ఉత్తర అమెరికా), ఎల్బ్రస్ (యూరప్), కిలిమంజారో (ఆఫ్రికా), కోస్కియుస్కో (ఆస్ట్రేలియా), విన్సన్ మాసిఫ్ (అంటార్కిటికా), ఐస్‌లాండ్ పీక్ (నేపాల్), భారత్‌లోని కాంగ్ యాట్సే 1, 2 పర్వతాలతో పాటు డిజో జోంగో, ఫ్రెండ్‌షిప్ పీక్, కాలా పత్తర్, ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వంటి వాటిని ఇప్పటికే అధిరోహించి చరిత్ర సృష్టించాడు. తన తదుపరి లక్ష్యం ఎవరెస్ట్ పర్వతం (29,032 అడుగులు)అని, ఈ లక్ష్యాన్ని ఈ ఏడాది మేలో పూర్తిచేయడానికి సన్నద్ధమవుతున్నానని పేర్కొన్నాడు. ఈ లక్ష్యాన్ని చేరుకుని యువ సాహసికులకు విశ్వనాథ్ స్ఫూర్తిగా నిలవనున్నాడని శిక్షకులు భరత్ తమ్మినేని సంతోషం వ్యక్తం చేశారు.

నగరానికి ‘నియో’ ఫైర్ వాటర్..

సాక్షి, సిటీబ్యూరో : అంతర్జాతీయంగా పేరొందిన ప్రీమియం ఫైన్-డైనింగ్ రెస్టారెంట్, ఫైర్‌వాటర్ నియో బార్ అండ్ కిచెన్ నగరంలో కొత్త రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసింది. గచ్చిబౌలిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నెలకొల్పిన ఈ పార్టీ ప్లేస్‌లో 150-సీటర్ రెస్టో బార్, 120 సీట్ల మల్టీపర్పస్ హాల్ ఉన్నాయని, యూరోపియన్, ఆసియా, భారతీయ వంటకాలను, వినూత్న ఫ్యూజన్ వంటకాలు, అలాగే హైదరాబాద్ రుచులతో సహా అందిస్తున్నామని మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.



రాజ్యాంగ పరిరక్షణకర్త..

➤ సుప్రీంకోర్టు దేశంలో సర్వోన్నత న్యాయస్థానం. సమాఖ్య కోర్టుగా, రాజ్యాంగ పరిరక్షణకర్తగా, అత్యున్నత ధర్మాసనంగా విధులు నిర్వర్తిస్తోంది. రాజ్యాంగంలోని 5వ భాగంలో అధికరణలు 124 నుంచి 147 వరకు సర్వోన్నత న్యాయస్థానం కూర్పు, అధికార పరిధిని తెలియజేస్తాయి. ముఖ్యంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని హైకోర్టులు ఇచ్చే తీర్పులపై అప్పీళ్లను స్వీకరిస్తుంది. అందుకే దీన్ని పునర్విచారణ ధర్మాసనం అని కూడా అంటారు. తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనల కేసుల్లో ఒరిజినల్ పిటిషన్లను, తక్షణ పరిష్కారం అవసరమైన తీవ్రమైన వివాదాల కేసులపైనా నేరుగా విచారణ జరుపుతుంది. తొలుత భారత సమాఖ్య న్యాయస్థానంగా పార్లమెంట్ భవనంలోని ప్రిన్సెస్ చాంబర్‌లో ప్రారంభించారు. ప్రిన్సెస్ చాంబర్‌లో 1937 నుంచి 1950 వరకు నడిపారు. భారతదేశం సార్వభౌమ, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా ప్రకటించిన రెండు రోజుల తరువాత సర్వోన్నత న్యాయస్థానం 1950, జనవరి 28న ఏర్పాటైంది. సుప్రీంకోర్టుగా రూపాంతరం చెందిన తర్వాత 1958 వరకు పాత పార్లమెంట్ భవనంలోని ఓ భాగంలో నడిపారు.

ఇండో-బ్రిటిష్ వాస్తు శైలిలో..

➤ సుప్రీంకోర్టు భవన ప్రధాన భాగం 17 ఎకరాల స్థలంలో ఇండో-బ్రిటిష్ వాస్తు శైలిలో నిర్మించారు. ప్రముఖ వాస్తుశిల్పి గణేశ్ భికాజీ డియోలాలీకర్ దీని నమూనా రూపొందించారు. శ్రీధర్ కృష్ణ జోగ్లేకర్ భవన నిర్మాణానికి నేతృత్వం వహించారు. ప్రస్తుత భవనంలోకి 1958లో న్యాయస్థానం మారింది. త్రాసు ఆకారాన్ని ప్రతిబింబించేలా భవన నమూనా రూపొందించారు. భవన మధ్య భాగం త్రాసుకోలను ప్రతిబింబిస్తుంది. 1979లో తూర్పు, పశ్చిమ భాగాలను ఈ సముదాయానికి జోడించారు. మొత్తం 19 కోర్టు గదులున్నాయి. ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం పెద్దగా, మధ్య భాగంలో ఉంటుంది.

న్యాయమూర్తుల సంఖ్య పెరిగిందిలా..

➤ సుప్రీంకోర్టును ఓ ప్రధాన న్యాయమూర్తి, ఏడుగురు న్యాయమూర్తులతో ఏర్పాటు చేసేందుకు 1950లో రాజ్యాంగం వీలు కల్పించింది. తదుపరి పరిస్థితుల మేరకు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే అవకాశాన్ని పార్లమెంట్‌కు దఖలుపరిచింది. న్యాయమూర్తుల సంఖ్య (చీఫ్ జస్టిస్‌తో కలిపి) 1956లో 11కు, 1960లో 14కు, 1978లో 18కి, 1986లో 26కు, 2008లో 31కి, 2019లో 34 మందికి పెరిగింది. తొలుత సింగిల్ బెంచ్ విచారణలు ఉండగా.. ఆ తర్వాత ఇద్దరు, ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనాల విచారణలు ప్రారంభమయ్యాయి. అత్యంత కీలకమైన వివాదాల సమయంలో ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం (రాజ్యాంగ ధర్మాసనం) కొలువుదీరుతుంది. అవసరం మేరకు ఏ చిన్న ధర్మాసనమైనా పెద్ద ధర్మాసనానికి కేసును బదిలీ చేయొచ్చు. న్యాయమూర్తులను నియమించేందుకు సర్వోన్నత న్యాయస్థానంతో రాష్ట్రపతి తప్పనిసరిగా సంప్రదింపులు జరపాలి. ఇవి ఎటువంటి రాజకీయ ప్రయోజనం లేకుండా జరుగుతాయి. న్యాయమూర్తుల పదవీ విరమణ వయసు 65 ఏళ్లు. భారతీయుడై ఉండి ఐదేళ్ల పాటు హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన అనుభవం ఉండాలి.

సర్వోన్నత న్యాయస్థానం ఏర్పాటై నేటికి 75 ఏళ్లు పూర్తి

ప్రజాప్రయోజనాలను కాపాడటంలో 'సుప్రీం' కమాండర్

రాజ్యాంగం, సమానత్వ పరిరక్షణలో కీలక భూమిక

1950, జనవరి 28న ఎనిమిది మంది జడ్జీలతో ఏర్పాటు

ప్రస్తుతం సీజేతో కలిపి 34కు పెరిగిన న్యాయమూర్తుల సంఖ్య

ప్రధాన న్యాయమూర్తి పీఠమెక్కిన తెలుగువారిగా జస్టిస్ కోకా సుబ్బారావు, జస్టిస్ ఎన్వీ రమణకు ఖ్యాతి

అరవింద్‌రెడ్డి గంద్రాతి

సామాజిక న్యాయానికి విఘాతం కలిగినా.. రాజ్యాంగానికి భంగం వాటిల్లినా.. ప్రజాప్రయోజనాలు హరించినా.. రాజకీయాలు హద్దు దాటినా.. దేశ సర్వోన్నత న్యాయస్థానం జోక్యం చేసుకుంటుంది. రాజ్యాంగ పరిరక్షణకు ఉపక్రమిస్తుంది. పౌర హక్కులను, సమానత్వాన్ని, ప్రజా స్వేచ్ఛను కంటికి రెప్పలా కాపాడుతుంది. సామాన్యుడి నుంచి దేశాధినేత వరకు అందరినీ సమానంగా పరిగణిస్తుంది. ప్రజా ప్రయోజనాలు కాపాడటంలో 'సుప్రీం' కమాండర్‌గా, రాజ్యాంగం, సమానత్వ పరిరక్షణలో కీలక భూమిక పోషిస్తున్న సుప్రీంకోర్టు ఏర్పాటై జనవరి 28తో 75 ఏళ్లు పూర్తయింది. 1950, జనవరి 28న 8 మంది (సీజేతో కలిపి)తో ప్రారంభమైంది.. నేడు 34కి చేరింది. ఇప్పటివరకు ఇద్దరు తెలుగు వారు జస్టిస్ కోకా సుబ్బారావు, జస్టిస్ ఎన్వీ రమణ ప్రధాన న్యాయమూర్తి పీఠాన్ని అధిష్ఠించారు.



హక్కుల రక్షణలో 'సుప్రీం'

అవీ ఇవీ...

➤ హైకోర్టు న్యాయమూర్తినిగాని, సుప్రీంకోర్టు లేదా హైకోర్టుల్లో పదవీ విరమణ చేసిన న్యాయమూర్తిని గానీ సుప్రీంకోర్టులో తాత్కాలిక (ప్రత్యేక) న్యాయమూర్తిగా నియమించేందుకు అవకాశం ఉంది.

➤ అత్యున్నత న్యాయస్థానంలో అన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పిస్తారు.

➤ మతం, కులంతో సంబంధం లేకుండా న్యాయమూర్తుల నియామకం జరుగుతుంది.

➤ ప్రధాన న్యాయమూర్తి పదవీకాలం ముగియడానికి నెల రోజుల ముందే తర్వాతి సీజేను ప్రకటించాలి.

➤ ప్రసుత్తం 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



జస్టిస్ సంజీవ్ ఖన్నా

➤ మాస్టర్ ఆఫ్ ది రోస్టర్‌గా ప్రధాన న్యాయమూర్తి వ్యవహరిస్తారు. అంటే.. ఏ బెంచ్ ఏ కేసు విచారణ చేపట్టాలనేది నిర్ణయించే అధికారం సీజేకు ఉంటుంది.

➤ ప్రస్తుతం 33 మంది న్యాయమూర్తులున్న సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తులు ఇద్దరు మాత్రమే. సుప్రీంకోర్టు ఏర్పాటు నుంచి దాదాపు 277 మంది న్యాయమూర్తులు నియమితులు కాగా, వీరిలో 11 మంది (దాదాపు 4 శాతం) మాత్రమే మహిళలు.

➤ కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (1973) కేసును అత్యధికంగా 13 మంది జడ్జీలతో కూడిన ధర్మాసనం విచారించింది.

సుప్రీం కోర్టులో తొలిసారి..	తొలి ప్రధాన న్యాయమూర్తి	తొలి మహిళా న్యాయమూర్తి	తొలి దళిత న్యాయమూర్తి	తొలి దళిత ప్రధాన న్యాయమూర్తి
	జస్టిస్ హరిలాల్ జె. కానియా (1947, ఆగస్టు 14 - 1951, నవంబర్ 5)	జస్టిస్ ఫాతిమా బీవీ (1989)	జస్టిస్ కేజీ బాలకృష్ణన్ (2000)	జస్టిస్ కేజీ బాలకృష్ణన్ (2007)

బార్ నుంచి తొలిసారి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన వ్యక్తి	బార్ నుంచి న్యాయమూర్తిగా పదోన్నతి పొంది సీజే అయిన వ్యక్తి
జస్టిస్ ఎస్ఎం సిక్రి (1971)	జస్టిస్ యూయూ లలిత్ (2022, ఆగస్టు 27)

అత్యధిక కాలం పనిచేసిన టాప్-5 సీజేలు

1. **జస్టిస్ వైవీ చంద్రచూడ్** – ఏడేళ్ల 139 రోజులు (1978, ఫిబ్రవరి 22 నుంచి 1985, జూలై 11 వరకు)
2. **జస్టిస్ భువనేశ్వర్ ప్రసాద్ సిన్హా** – నాలుగేళ్ల 122 రోజులు (1959, అక్టోబర్ 1 నుంచి 1964, జనవరి 31 వరకు)
3. **జస్టిస్ అజిత్ నాథ్ రే** – మూడేళ్ల 276 రోజులు (1973, ఏప్రిల్ 26 నుంచి 1977, జనవరి 28 వరకు)
4. **జస్టిస్ సుధీ రంజన్ దాస్** – మూడేళ్ల 241 రోజులు (1956, ఫిబ్రవరి 1 నుంచి 1959, సెప్టెంబర్ 30 వరకు)
5. **జస్టిస్ కేజీ బాలకృష్ణన్** – మూడేళ్ల 117 రోజులు (2007, జనవరి 14 నుంచి 2010, మే 11 వరకు)

ప్రధాన న్యాయమూర్తులుగా తెలుగువారు

1) **జస్టిస్ కోకా సుబ్బారావు** – తొమ్మిదో చీఫ్ జస్టిస్ – 1966, జూన్ 30 నుంచి 1967, ఏప్రిల్ 11 వరకు (285 రోజులు)

2). **జస్టిస్ ఎన్వీ రమణ** – 48వ చీఫ్ జస్టిస్ – 2021, ఏప్రిల్ 24 నుంచి 2022, ఆగస్టు 26 వరకు (సంవత్సరం 124 రోజులు)

22వ ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన కమల్ నారాయణ్ సింగ్ అతి తక్కువ కాలం సీజే గా వ్యవహరించారు. 17 రోజులు మాత్రమే సీజే గా ఉన్నారు.

ప్రస్తుతం సుప్రీంకోర్టులో తెలుగు న్యాయమూర్తులు

1. జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ
హైదరాబాద్‌కు చెందిన ఈయన 1988లో న్యాయవిద్య పూర్తి చేసి న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2021, ఆగస్టు 31న నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

2. జస్టిస్ సంజయ్‌కుమార్
హైదరాబాద్‌కు చెందిన ఈయన 1988లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2008లో ఏపీ హైకోర్టు అడిషనల్ న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. 2010లో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2019లో తెలంగాణ హైకోర్టుకు కేటాయించబడిన ఈయన 2019లో పంజాబ్-హరియాణా హైకోర్టుకు బదిలీ అయ్యారు. 2021లో మణిపూర్ చీఫ్ జస్టిస్‌గా బాధ్యతలు చేపట్టారు. 2023, ఫిబ్రవరిలో సుప్రీంకోర్టుకు పదోన్నతిపై వెళ్లారు.

3. జస్టిస్ నరసి వెంకటనారాయణ భట్టి
ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈయన 1987లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. 2013లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి బాధ్యతలు చేపట్టారు. విభజనలో భాగంగా ఏపీ హైకోర్టుకు వెళ్లారు. 2019లో కేరళకు బదిలీపై వెళ్లి 2023 జూన్‌లో చీఫ్‌గా పదోన్నతి పొందారు. 2023, జూలైలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.

నేరుగా బార్ నుంచి సుప్రీం కోర్టు జడ్జీలుగా పదోన్నతి పొందిన వారు..
జస్టిస్ ఎస్ఎం సిక్రి (1971లో- 9.1 ఏళ్లు), జస్టిస్ ఎస్‌సీ రాయ్ (1971లో-3 నెలలు), జస్టిస్ కుల్‌దీప్‌సింగ్ (1988లో-8.1 ఏళ్లు), జస్టిస్ సంతోష్ హెగ్డే (1999లో-6.4 ఏళ్లు), జస్టిస్ రోహింటన్ నారిమన్ (2014లో-7.1ఏళ్లు), జస్టిస్ యూయూ లలిత్ (2014లో-8.2 ఏళ్లు), జస్టిస్ నాగేశ్వర్‌రావు (2016లో-6.1ఏళ్లు), జస్టిస్ ఇందు మల్హోత్రా (2018లో -2.8 ఏళ్లు), జస్టిస్ కేవీ విశ్వనాథన్ (2023లో-8 ఏళ్లు), జస్టిస్ పీఎస్ నరసింహ (2021లో-6.6 ఏళ్లు) (జస్టిస్ విశ్వనాథన్, జస్టిస్ నరసింహ ప్రస్తుతం న్యాయమూర్తులుగా కొనసాగుతున్నారు)

తెలుగు రాష్ట్రాలకు సంబంధించి కీలక తీర్పులు కొన్ని..

1993 – ఉన్నికృష్ణన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్
ప్రాథమిక హక్కుల్లో విద్యాహక్కు లేకపోతే జీవించే హక్కుకు, వ్యక్తి గౌరవానికి అర్థం లేదని.. ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. లాభాపేక్ష లేకుండా, సమాజానికి ఉప యోగకరంగా విద్యాసంస్థల నిర్వహణ ఉండాలి. ఆర్టికల్ 19(1) ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థలను నెలకొల్పే హక్కు ఉన్నా..19(6) ప్రకారం నియంత్రించే హక్కు సర్కార్‌కు ఉంది.

1997 – సమతా వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్
దేశంలోని షెడ్యూల్ట్ ప్రాంతాల్లో నివసించే గిరిజన, ఆదివాసీల జీవనోపాధి హక్కులను రక్షిస్తూనే స్థిరమైన అభివృద్ధికి అనుకూలంగా తీర్పు వెలువరించింది. అటవీ భూములకు భంగం కలగకుండా, పర్యావరణం దెబ్బతిన కుండా గిరిజనులు వ్యక్తిగతంగా లేదా సంఘంగా షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఖనిజాలను వెలికితీయొచ్చని పేర్కొంది. గిరిజనేతరులకు హక్కులు ఉండవని స్పష్టం చేసింది. సమతా అనే స్వచ్ఛంద సంస్థ పిటిషన్ వేసి పోరాటం చేయడంతో ఆ పేరుతో ఈ కేసు ప్రసిద్ధికెక్కింది.



సహచర న్యాయమూర్తులతో తొలి చీఫ్ జస్టిస్ హరిలాల్ జె. కానియా

సుప్రీం స్వతంత్రతే మూలం..

➤ సుప్రీంకోర్టు విధుల నిర్వహణలో శాసన, కార్యనిర్వాహక విభాగాలు జోక్యం చేసుకోకూడదు. సర్వోన్నత న్యాయస్థానం స్వతంత్రతను పరిరక్షించకపోతే ప్రజాస్వామ్యం మనుగడ సాగించలేదు. దేశం పురోగతి సాధించదు. ప్రజల ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛను పరిరక్షించడానికి సుప్రీంకోర్టు ఏర్పాటైంది. అత్యున్నత న్యాయస్థానానికి విస్తృతాధికారాలు కల్పించడంలో రాజ్యాంగం కీలకపాత్ర పోషించింది. హైకోర్టులు బలంగా ఉంటేనే సుప్రీంకోర్టుపై భారం తగ్గుతుంది. మెరిట్‌పై మాత్రమే న్యాయమూర్తుల నియామకాలు జరగాలి. రాజకీయాలు దీన్ని ప్రభావితం చేయలేవని భావిస్తున్నా. న్యాయవ్యవస్థ స్వతంత్రత ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేలా చేస్తుంది.

- జస్టిస్ హరిలాల్ జె. కానియా (సుప్రీంకోర్టు ఏర్పాటు సందర్భంగా..)

ఆ రెండు సందర్భాల్లో

అమలవుతున్న సంప్రదాయం ప్రకారం.. పదవీ విరమణ చేయబోయే ప్రధాన న్యాయమూర్తి సిఫారసు చేసిన న్యాయమూర్తే తదుపరి ప్రధాన న్యాయ మూర్తి అవుతారు. దాదాపుగా సుప్రీం కోర్టులో రెండవ స్థానంలో ఉండే అత్యంత సీనియర్ న్యాయమూర్తిని ప్రధాన న్యాయమూర్తి పదవికి సూచిస్తారు. అయితే ఈ సంప్రదాయం రెండు సందర్భాల్లో అమలు కాలేదు. 1973లో జస్టిస్ ఎ.ఎన్.రే ముగ్గురు సీనియర్ న్యాయమూర్తులను అధిగమిస్తూ ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. అలాగే 1977లో జస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నా కాకుండా ఆయనకు జూనియర్ అయిన జస్టిస్ మీర్జా హమీదుల్లా బేగ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.


ధిక్కారాన్ని శిక్షించే అధికారం..


ఏ న్యాయస్థానాన్నైనా ధిక్కరించిన వారిని శిక్షించే అధికారం రాజ్యాంగంలోని 129, 142 అధికరణల ద్వారా సుప్రీంకోర్టుకు ఉంది. మహారాష్ట్ర మాజీ మంత్రి స్వరూప్ సింగ్ నాయక్‌పై సుప్రీంకోర్టు ఈ అధికారంతో ఒక అసాధారణ చర్య తీసుకుంది. 2006, మే 12న కోర్టు ధిక్కార నేరంపై ఆయనకు నెలరోజులపాటు జైలు శిక్ష విధించింది. మంత్రి పదవిలో ఉన్న వ్యక్తిని జైలుకు పంపడం దేశంలో ఇదే తొలిసారి.


హైదరాబాద్‌లో బెంచ్ ఎప్పుడో..

➤ సుప్రీంకోర్టు ప్రారంభించినప్పుడు దేశ జనాభా 36 కోట్లు మాత్రమే. ఇప్పుడది 140 కోట్లు దాటింది. ఇన్ని కోట్ల మందికి న్యాయం జరగాలంటే పలు రాష్ట్రాల్లో సుప్రీంబెంచ్ ఏర్పాటు చేయాలన్న అభిప్రాయం ఎప్పటి నుంచో ఉంది. సుప్రీంకోర్టును కాలాను గుణంగా విస్తరించవచ్చని అధికరణం 130లో బీఆర్ అంబేడ్కర్ క్లుప్తంగా పేర్కొ న్నారు. దక్షిణాన హైదరాబాద్, తూర్పున కోల్‌కతా, పశ్చిమాన ముంబైలో ప్రాంతీయ బెంచ్‌ల ఆవశ్యకత ఉందని 18వ లా కమిషన్ 2009లోనే కేంద్రానికి తెలిపింది. దీనిపై పార్లమెంట్‌లో 2023లో నాటి ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి ప్రైవేట్ బిల్లు పెట్టారు. ప్రాంతీయ బెంచ్‌ల ఏర్పాటుకు పార్లమెంట్‌లో సాధారణ మెజారిటీ సరిపోతుంది. సుప్రీంకోర్టు సీజే ప్రతిపాదిస్తే.. రాష్ట్రపతి ఆమోదించినా ఏర్పాటు చేయొచ్చు. తెలంగాణ సరిహద్దుగా ఏపీ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలు న్నాయి. ఏపీ సరిహద్దుగా తమిళనాడు, ఒడిశా ఉన్నాయి. హైదరాబాద్ బెంచ్‌తో ఈ రాష్ట్రాలకు 'న్యాయం' అందుతుందనే అభిప్రాయం ఉంది.

(నోట్: గణాంకాలు నేషనల్ జ్యుడిషియల్ డేటా గ్రిడ్ నుంచి జనవరి 27న సేకరణ)







దేశవ్యాప్త సంచలన తీర్పులు..

శంకరీ ప్రసాద్ సింగ్ X యూనియన్ ఆఫ్ ఇండియా X బిహార్ (1951)

పిటిషన్: పార్లమెంట్ రాజ్యాంగ సవరణ చేయడాన్ని సవాల్ చేస్తూ శంకరీ ప్రసాద్ సింగ్ పిటిషన్ దాఖలు చేశారు.
బెంచ్: జస్టిస్ హీరాలాల్ జె. కనియా, జస్టిస్ బీకే ముఖర్జీ, జస్టిస్ చంద్రశేఖర అయ్యర్
తీర్పు: 'ఆర్టికల్ 368 ప్రకారం రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతో సహా ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉంది'. తొలిసారిగా న్యాయ సమీక్షాధికారం వినియోగం.

స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ X బేలా బెనర్జీ (1953)

పిటిషన్: భూ సేకరణపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బెంగాల్ ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది.
బెంచ్: జస్టిస్ పతంజలి శాస్త్రి, జస్టిస్ మెహర్ చంద్ మహాజన్, జస్టిస్ గులాం హసన్, జస్టిస్ బి.జగన్నాథ దాస్
తీర్పు: 'ప్రజల ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పుడు మార్కెట్ విలువతో కూడిన నష్టపరిహారాన్ని చెల్లించాల్సిందే'

గోలక్‌నాథ్ X స్టేట్ ఆఫ్ పంజాబ్ (1967)

పిటిషన్: పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూ సంస్కరణలను సవాల్ చేస్తూ గోలక్‌నాథ్ పిటిషన్ వేశారు.
బెంచ్: జస్టిస్ కె.సుబ్బారావు, జస్టిస్ కెఎన్ వాంచూ, జస్టిస్ ఎం. హిదాయతుల్లా, జస్టిస్ జేసీ షా, జస్టిస్ ఎస్ఎం సిక్రి, జస్టిస్ ఆర్ ఎస్ బచావత్, జస్టిస్ వి.రామస్వామి, జస్టిస్ జేఎం షెలత్, జస్టి స్ విశిష్ఠ భార్గవ, జస్టిస్ జీకే మిట్టర్, జస్టిస్ సీఏ వైద్యలింగం.
తీర్పు: ''ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదు. రాజ్యాంగ సవరణలపైనా ఆర్టికల్ 13 ప్రకారం న్యాయసమీక్ష జరుగుతుంది. ఈ తీర్పు గత తీర్పులకు వర్తించదు. రాబోయే వాటికి వర్తిస్తుంది (దీన్ని 'ప్రాస్పెక్టివ్ ఎఫెక్ట్' అంటారు). రాజ్యాంగంలోని 1వ, 4వ, 17వ సవరణలు చెల్లుబాటు అవుతాయి. ప్రాథమిక హక్కులను పార్లమెంట్ సవరించాలంటే 'ప్రత్యేక రాజ్యాంగ పరిషత్'ను ఏర్పాటు చేయాలి''.

కేశవానంద భారతి X స్టేట్ ఆఫ్ కేరళ (1973)

పిటిషన్: ఐదు దశాబ్దాల క్రితం మఠం ఆస్తుల విషయంలో కేరళలోని కాసరగోడ్ జిల్లాలో ఎడనీర్ మఠాధిపతి కేశవానంద స్వామి పిటిషన్ వేశారు.
బెంచ్: జస్టిస్ ఎస్ఎం సిక్రి అధ్యక్షతన జస్టిస్ ఏఎన్ గ్రోవర్, జస్టిస్ ఏఎన్ రే, జస్టిస్ డీజీ పాలేకర్, జస్టిస్ హెచ్ఆర్ ఖన్నా, జస్టిస్ జేఎం షెలత్, జస్టిస్ కేకే మాథ్యూ, జస్టిస్ కేఎస్ హెగ్డే, జస్టిస్ ఎంహెచ్ బేగ్, జస్టిస్ పి.జగన్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్ఎన్ ద్వివేది, జస్టిస్ వైవీ చంద్రచూడ్, జస్టిస్ ఏకే ముఖర్జీ.
తీర్పు: 'రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, మౌలిక స్వరూ పాన్ని మార్చలేం. సుప్రీంకోర్టు వాటి రక్షణ బాధ్యతను నిర్వర్తిస్తుంది. రాజ్యాంగ సవరణలు చేసే అధికారం పార్లమెంటుకు ఉందిగానీ, మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం లేదు. రాజ్యాంగ ఆత్మను మార్చడం సాధ్యంకాదు.'

మేనకాగాంధీ X యూనియన్ ఆఫ్ ఇండియా (1978)

పిటిషన్: తన పాస్‌పోర్టును అధికారులు స్వాధీనం చేసుకోవడాన్ని సవాల్ చేస్తూ మేనకాగాంధీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.
బెంచ్: జస్టిస్ ఎం.హమీదుల్లా బేగ్, జస్టిస్ వైవీ చంద్రచూడ్, జస్టిస్ పీఎన్ భగవతి, జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్, జస్టిస్ ఎన్ఎల్ ఉంత్వాలియా, జస్టిస్ సయ్యద్ ముర్తజా ఫజలాలి, జస్టిస్ పీఎస్ కైలాసం
తీర్పు: 'ప్రజాప్రయోజనం అనేది బహుళ విస్తృతమైనది. పాస్‌పోర్టు చట్టం 1967 పేరుతో అధికారులు 14, 19, 21 అధికరణాలను ఉల్లంఘించారు. వ్యక్తుల ప్రాథమిక హక్కులను భంగపర్చలేరు. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛను చట్టబద్ధమైన ప్రక్రియతో ఆటంకపర్చలేరు'

మినర్వా మిల్స్ X యూనియన్ ఆఫ్ ఇండియా (1980)

పిటిషన్: ఇందిరాగాంధీ సర్కార్ చేసిన 42వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని మినర్వా మిల్స్ లిమిటెడ్ సవాల్ చేసింది.
బెంచ్: జస్టిస్ వైవీ చంద్రచూడ్, జస్టిస్ పీఎన్ భగవతి, జస్టిస్ ఏసీ గుప్తా, జస్టిస్ ఎన్ఎల్ ఉంత్వాలియా, జస్టిస్ పీఎస్ కైలాసం
తీర్పు: రాజ్యాంగ సవరణ చట్టాలను న్యాయస్థానాల్లో సవాల్ చేయకూడదంటూ అధికరణం 368(4), రాజ్యాంగ సవరణ అధికారంపై పార్లమెంట్‌కు ఎలాంటి పరిమితులు ఉండొద్దంటూ అధికరణం 368(5)కు చేసిన సవరణ రద్దు చేస్తున్నాం. ఈ క్లాజ్‌లు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధం.

మహమ్మద్ అహ్మద్ ఖాన్ X షా బానో బేగం (1985)

పిటిషన్: మహమ్మద్ అహ్మద్ ఖాన్ నుంచి భరణం కోరుతూ ట్రయల్ కోర్టును ఆశ్రయించిన 65 ఏళ్ల షాబానో బేగం. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, 1973లోని సెక్షన్ 123 ప్రకారం తనకు, తన ఐదుగురు పిల్లలకు భరణం ఇవ్వాలని కోరారు. అహ్మద్ ఖాన్ అప్పీల్‌పై విచారణ.
బెంచ్: జస్టిస్ వైవీ చంద్రచూడ్, జస్టిస్ మిశ్రా రంగానాథ్, జస్టిస్ డీఏ దేశాయ్, జస్టిస్ ఓ.చిన్నపరెడ్డి, జస్టిస్ ఈఎస్ వెంకటరామయ్య
తీర్పు: 'ముస్లిం మహిళలకు కూడా భరణం చెల్లించాల్సిందే. ఇద్దత్ గడువు (విడాకుల తర్వాత 3 నెలలు) ముగిసిన తర్వాత కూడా ముస్లిం భర్త.. భరణం చెల్లించాల్సిందే. భరణం చారిటీ కాదు.. హక్కు'

ఇందిరా సహానీ X యూనియన్ ఆఫ్ ఇండియా (1992)

పిటిషన్: మండల కమిషన్ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాల్లో వెనుకబడిన వర్గాలకు (ఓబీసీ) 27 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని సవాల్ చేశారు.
బెంచ్: జస్టిస్ ఎంహెచ్ కనియా, జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య, జస్టిస్ ఎస్.రత్నవేల్ పాండియన్, జస్టిస్ టీకే తొమ్మెన్, జస్టిస్ ఏఎం అహ్మదీ, జస్టిస్ కుల్‌దీప్ సింగ్, జస్టిస్ పీబీ సావంత్, జస్టిస్ ఆర్ఎం సహాయ్, జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి
తీర్పు: 'ఉద్యోగాల్లో వెనుకబడిన వర్గాలకు (ఓబీసీ) 27 శాతం రిజర్వేషన్లు సమర్థనీయం'

లిల్లీ థామస్ X యూనియన్ ఆఫ్ ఇండియా (2013)

పిటిషన్: రెండేళ్లు.. అంతకంటే ఎక్కువ కఠిన కారాగార శిక్ష పడిన వ్యక్తులు ఎన్నికల్లో పోటీకి అనర్హులని ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణ, సిట్టింగ్ చట్టసభల సభ్యులకు వర్తించదని పేర్కొనడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు.
బెంచ్: జస్టిస్ ఆర్‌పీ సేథి, జస్టిస్ ఎస్.సగీర్ అహ్మద్
తీర్పు: 'సిట్టింగ్ చట్టసభల సభ్యులకు ఇస్తున్న మినహాయింపు చెల్లదు'

ఎస్ఆర్ బొమ్మై X యూనియన్ ఆఫ్ ఇండియా (1994)

పిటిషన్: కర్ణాటక (1988-89)లో తన మద్దతుకు సంబంధించి జనతాదళ్ శాసనసభాపక్షం ఆమోదించిన తీర్మాన కాపీని నాటి సీఎం బొమ్మై అప్పటి గవర్నర్ పి.వెంకటసుబ్బయ్యకు సమర్పించినా అసెంబ్లీలో బలనిరూపణకు అవకాశం ఇవ్వలేదు. తీర్మాన కాపీని తిరస్కరిస్తూ రాష్ట్రపతి పాలన విధించాలన్న గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బొమ్మై పిటిషన్ వేశారు.
బెంచ్: జస్టిస్ కుల్‌దీప్ సింగ్, జస్టిస్ పీబీ సావంత్, జస్టిస్ కే రామస్వామి, జస్టిస్ ఎస్‌సీ అగర్వాల్, జస్టిస్ యోగేశ్వర్ దయాల్, జస్టిస్ బీపీ జీవన్‌రెడ్డి, జస్టిస్ ఎస్ఆర్ పాండియన్, జస్టిస్ ఏఎం అహ్మదీ
తీర్పు: 'సమాఖ్య వ్యవస్థ అనేది భారత రాజ్యాంగ మౌలిక స్వరూపం. రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసే ముందు అసెంబ్లీలో బల నిరూపణకు గవర్నర్ అవకాశం కల్పించాలి. రాజ్యాంగంలోని 356 అధికరణం కింద గవర్నర్ సర్కార్‌ను డిస్మిస్ చేయడం నిరంకుశత్వం. ప్రభుత్వం తన మెజారిటీని నిరూపించుకునేందుకు అసలైన వేదిక శాసనసభే. గవర్నర్ సొంత అభిప్రాయానికి తావు లేదు'

ఈ అమ్మల ఒడికి చేరిన పద్మాలు

@100

పోరాట స్వరం


లిబియా లోబో సర్దేశాయ్

పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించిన సందర్భంగా లిబియా లోబో సర్దేశాయ్ పేరు వార్తల్లోకి వచ్చింది. నిజానికి లిబియా లోబో సర్దేశాయ్ అనేది ఒక పేరు కాదు. స్వాతంత్య్ర పోరాట స్వరం. గోవా స్వాతంత్య్రోద్యమంలో కీలక పాత్ర పోషించిన లోబో సర్దేశాయ్ పోర్చుగీస్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించడానికి అటవీ ప్రాంతంలో 'వాయిస్ ఆఫ్ ఫ్రీడమ్' అనే రేడియో స్టేషన్‌ని ప్రారంభించారు.

పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించిన సందర్భంగా...

'పోర్చుగీస్ పాలన నుంచి గోవాకు విముక్తి లభించిన రోజు ఎంత సంతోషంగా ఉన్నానో, ఇప్పుడూ అంతే సంతోషంగా ఉన్నాను' అంటూ తన ఆనందాన్ని పంచుకుంది గోవా స్వాతంత్య్ర సమరయోధురాలు లిబియా లోబో సర్దేశాయ్.

గోవాకు విముక్తి లభించిన రోజున తన సహోద్యోగి, ఆ తర్వాత భర్త వామన్ సర్దేశాయ్‌తో కలిసి భారత వైమానిక దళం విమానంలో పనాజీ, గోవాలోని ఇతర ప్రాంతాల మీదుగా ప్రయాణించింది. అందులోని రేడియో ట్రాన్సిస్టర్‌కు లౌడ్ స్పీకర్ అమర్చి పోర్చుగీస్, కొంకిణి భాషల్లో ప్రకటనలు చేసి వారు కరపత్రాలు విసిరారు.

'పోర్చుగీసు వారు లొంగిపోయారు. 451 సంవత్సరాల వలస పాలన తరువాత గోవా స్వాతంత్య్రం పొందింది' అనేది ఆ ప్రకటనల సారాంశం.

'ఈరోజు కూడా అలాంటి సంతోషమే నాకు కలిగింది. ఇలాంటి క్షణాలు నా జీవితంలో అరుదు. ఈ అవార్డు ఆశ్చర్యకరమైన ఆనందాన్ని కలిగించింది. నేనెప్పుడూ ఊహించలేదు. కోరుకోలేదు. ఈ అవార్డు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని, స్ఫూర్తిని ఇస్తుందని ఆశిస్తున్నాను' అంటుంది లోబో సర్దేశాయ్.

గత ఏడాది మేలో ఆమె శతవసంతాన్ని పూర్తి చేసుకుంది.

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో లోబో సర్దేశాయ్... ఇటాలియన్ యుద్ధ ఖైదీలు రాసిన రహస్య లేఖలను అర్థం చేసుకుంటూ, సెన్సార్ చేస్తూ ట్రాన్స్‌లేటర్ గా పనిచేసింది. బొంబాయిలోని ఆల్ ఇండియా రేడియోలో స్టెనోగ్రాఫర్, లైబ్రేరియన్‌గా పనిచేసింది. తరువాత న్యాయవాద వృత్తిలోకి వచ్చింది. కాలేజీలో చదివే రోజుల్లో గోవా జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొనేది. విమోచనానంతరం న్యాయవాదిగా ప్రాక్టిస్ చేయడంతో పాటు మహిళా సహకార బ్యాంకును స్థాపించింది. రాష్ట్ర పర్యాటక రంగాన్ని తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన తొలి టూరిజం డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకుంది.

ఆమెకు 'పద్మ' పురస్కారం ప్రకటించిన సందర్భంగా గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లై పణజీలోని సర్దేశాయ్ నివాసానికి వెళ్లి ఆమెకు పుష్పగుచ్ఛాన్ని అందించి, అభినందించారు. ఆమె మరింతకాలం ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. సర్దేశాయ్ జీవన గాథను శ్రద్ధగా అధ్యయనం చేసి, దానినుంచి స్ఫూర్తిని పొందవలసిందిగా విద్యార్థులకు సూచించారు.

'మీరు చెబుతున్నంత గొప్పదాన్నేమీ కాదు, నా మార్గంలోకి ఏమి వచ్చిందో, నేను అదే చేసుకుంటూ పోయాను అంతే' అని నిండుగా నవ్వారామె.

@98

మేలు బొమ్మలు


భీమవ్వ

'తోలు బొమ్మలాట' ఆడిస్తూనే 98 ఏళ్లకు చేరుకున్న భీమవ్వ చిర్నవ్వు నవ్వింది. ఆమెకు 'పద్మశ్రీ' ప్రకటించారు. టీవీలు, సినిమాలు, ఓటీటీలు వచ్చినా భారతీయ సంప్రదాయకళను ఏ ప్రయోజనం ఆశించక ఆమె కాపాడుకుంటూ వచ్చింది. ఇప్పుడు 'పద్మశ్రీ' ఇస్తే ఆమె చేతి వేళ్లు కదిలి తోలుబొమ్మలు చప్పట్లు కొట్టొచ్చు. కాని నిజమైన చప్పట్లు జనం నుంచి ఆమెకు ఎప్పుడో దక్కాయి. భీమవ్వ లాంటి వాళ్లు రుషులు. పురస్కారాలకే వీరి వల్ల గౌరవం.

భక్తులకు పుణ్యక్షేత్రాలు ఉంటాయి. కానీ 'తోలుబొమ్మలాట'కు ఒక పుణ్యక్షేత్రం ఉందీ అంటే అది కర్నాటకలోని కొప్పల్ జిల్లాలోని 'మొరనాల' అనే పల్లెలో ఉన్న భీమవ్వ ఇల్లే. ఆ ఇంట్లో ఎవర్ని కదిలించినా తోలుబొమ్మలాట వచ్చు అని చెబుతారు. భీమవ్వకు ఇప్పుడు 96 సంవత్సరాలు. ఆమె కొడుకు కేశప్ప, మనవలు, మునిమనవలు అందరూ తోలుబొమ్మలాటలో నిమగ్నమై ఉన్నారు. ఎందుకంటే వారి వంశం కనీసం రెండు వందల ఏళ్లుగా తోలుబొమ్మలాట ఆడిస్తూ ఉంది. 'నేను 14 ఏళ్ల వయసులో తోలుబొమ్మలాట నేర్చుకున్నాను' అంటుంది భీమవ్వ. ఆమెకు 'పద్మశ్రీ' ప్రకటన వచ్చాక ఆమె ఇల్లు, ఊరు మాత్రమే కాదు మొత్తం కొప్పల్ జిల్లా సంబరం చేసుకుంటూ ఉంది. ఎందుకంటే భీమవ్వ ఆట కట్టని పల్లె ఆ జిల్లాలో లేదు. కర్నాటకలో లేదు. భీమవ్వ అందరికీ తెలుసు. ఉత్సవాలకు, జాతర్లకు భీమవ్వ ఆట ఉందంటే జనం బండ్లు కట్టుకుని వచ్చేవారు ఒకప్పుడు. ఇప్పుడూ ఆ ఘనత చెరగలేదు.


తోలుబొమ్మలు ఆడిస్తున్న భీమవ్వ

'నేను రామాయణ, మహాభారతాలను పొల్లు పోకుండా పాడగలను. భారతంలోని పద్దెనిమిది పర్వాలకూ ఆట కడతాను. అయితే కురుక్షేత్రం, కర్ణ పర్వం, ద్రౌపది వస్త్రాపహరణం, ఆది పర్వం ఇవి ఎక్కువగా చెప్తాను. జనం వీటిని బాగా అడుగుతారు. రామాయణంలో లవకుశుల కథ చాలా మందికి ఇష్టం' అని చెప్పింది భీమవ్వ.

గ్రామీణ కళ, జానపద కళ అయిన తోలుబొమ్మలాటను కర్నాటకలో 'తొగలు గొంబెయాట' అంటారు. తెలుగులో ఒకప్పుడు ప్రసిద్ధంగా ఉన్నట్టే కర్నాటకలో కూడా ఈ కళ ప్రసిద్ధం. అయితే భీమవ్వ వంశం దాని కోసం జీవితాలను అంకితం చేసింది. కనుక అక్కడ ఇంకా ఆ ఆట వైభవం కొనసాగుతూ ఉంది. 'తోలు బొమ్మలాటలో నేనే రాముణ్ణి, సీతను, లక్ష్మణున్ని. అందరి పాటలూ పాడతాను. నా ఆట గొప్పదనం తెలిసిన ప్రపంచ దేశాలు నన్ను పిలిచి ఆట చూపించమన్నాయి. అమెరికా, పారిస్, ఇటలీ, ఇరాన్, ఇరాక్, స్విట్జర్లాండ్ ఈ దేశాలన్నింటికి వెళ్లి తోలుబొమ్మలాట ఆడాను' అందామె. అదొక్కటే కాదు ఆమె దగ్గర 200 ఏళ్ల కిందటి తోలుబొమ్మలు భద్రపరిచి ఉన్నాయి.

శిక్షణ ఇస్తున్నా

తనకు తెలిసిన విద్య తన వాళ్లకే అనుకోలేదు భీమవ్వ. ప్రతి ఏటా కొంతమంది యువతను ఎంపిక చేసి తోలుబొమ్మలాటలో శిక్షణ ఇస్తుంది. అది నేర్చుకున్నవారు ఆటను కొనసాగిస్తున్నారు. కర్నాటక ప్రభుత్వం ఈ కృషిని గుర్తించి ఎన్నో పురస్కారాలు ఇచ్చింది. జనం భీమవ్వను గుండెల్లో పెట్టుకున్నారు. 'ఇది మనదైన విద్య. దీనిని పోగొట్టుకోకూడదు. మన గ్రామీణ కళల్లో నీతి ఎంతో ఉంటుంది. మనిషికి నీతి చెప్పడానికైనా ఇలాంటి కళలను కాపాడుకోవాలి' అంది భీమవ్వ.

భీమవ్వ ఎన్నోసార్లు విమానం ఎక్కింది. కాని ఈసారి ఎక్కబోయే విమానం ఆమెను 'పద్మశ్రీ' ఇవ్వనుంది. ప్రధాని, కేంద్ర మంత్రులు, పెద్దలు కరతాళధ్వనులు చేస్తుండగా రాష్ట్రపతి చేతుల మీద ఆమె పద్మశ్రీ అందుకుని తోలు బొమ్మల ఆటకు కిరీటం పెట్టనుంది.


కార్లా సోఫియా గాస్కాన్

నేను నటినే!

కార్లా సోఫియా గాస్కాన్... ఆస్కార్ నామినేషన్స్‌లో మొట్టమొదటి ట్రాన్స్‌గా స్థానం దక్కించుకొని, చరిత్ర సృష్టించింది. మ్యూజికల్ క్రైమ్ ఫిల్మ్ 'ఎమీలీయా పెరెజ్' చిత్రంలో టైటిల్ క్యారెక్టర్ పోషించి, ఉత్తమ నటిగా కార్లా ఆస్కార్‌కు ఎన్నికైంది. మొత్తం ప్రపంచ చలన చిత్ర పరిశ్రమనే తనవైపు తిప్పుకున్న, కార్లా పుట్టింది స్పెయిన్‌లోని ఆల్కోబెండాస్‌లో. పదహారేళ్ల వయసులో నటుడిగా ఎంట్రీ ఇచ్చి, లండన్‌లో లింగ మార్పిడి ఆపరేషన్ చేయించుకొని నటిగా మారింది. హాస్య చిత్రం 'ది నోబుల్ ఫ్యామిలీ' విజయంతో ఇక వెనుతిరిగి చూడలేదు. వరుస సినిమాలు, సిరీస్‌లు చేస్తూ ఎప్పటికప్పుడు తన సత్తా చాటుతూనే ఉంది. 2024లో విడుదలైన 'ఎమిలియా పెరెజ్' చిత్రంతో విమర్శకుల ప్రశంసలతో పాటు, ఉత్తమ నటిగా 'కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డు', 'యూరోపియన్ ఫిల్మ్ అవార్డు'లను సాధించింది. ఇప్పుడు ఇదే సినిమాకు ఆస్కార్ బరిలోనూ నిలిచింది. అయితే, కాలం మారినా, సమాజం మారలేదు అన్నట్లు సోషల్ మీడియాలో 'ఆమె 'ఉత్తమ నటి' లేదా 'ఉత్తమ నటుడు'గా నామినేట్ చేశారో తెలియటం లేదు' అని ప్రశ్నించిన ఒక అభిమానికి కార్లా ''మేడమ్, నేను నటిని! సినిమాల్లో రాక్షసుడిగా, కుక్కగా ఇలా ఏ పాత్రలో నటించినా, నేను 'నటి'గానే నామినేట్ అవుతాను'' అని స్పందించింది.

వికసించిన వ్యవసాయ పద్మాలు

● రైతు శాస్త్రవేత్తలు సుభాష్ శర్మ, హరిమన్ శర్మ, హాంగ్‌థింగ్‌లకు పద్మశ్రీ పురస్కారాలు

సాగుబడి
శ్రవణ కార్తె : జనవరి 24 నుంచి ఫిబ్రవరి 6 వరకు

వ్యవసాయ రంగంలో విశేష కృషి చేస్తున్న ప్రసిద్ధ రైతు శాస్త్రవేత్త సుభాష్ శర్మ (మహారాష్ట్ర)తో పాటు హరిమన్ శర్మ (హిమాచల ప్రదేశ్), ఎస్. హాంగ్‌థింగ్ (నాగాలాండ్)లకు కేంద్ర ప్రభుత్వం తాజాగా పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించింది. సుభాష్ శర్మ పత్తి రైతుల ఆత్మహత్యలకు నిలయమైన యవత్‌మాల్ జిల్లాలో అనేక దశాబ్దాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ, రైతులకు ఆచరణాత్మక శిక్షణ ఇస్తున్నారు. హిమాచలప్రదేశ్‌కు చెందిన హరిమన్ శర్మ ఆపిల్ సాగును కొండ ప్రాంతాల నుంచి మైదాన ప్రాంతాల్లోకి తీసుకొచ్చారు. సాధారణ ఉష్ణోగ్రతలోనూ పండే ఆపిల్ వంగడాలను అభివృద్ధి చేశారు. నాగాలాండ్‌కు చెందిన హాంగ్‌థింగ్ అధికాదాయాన్నిచ్చే కొత్త పంటలను అక్కడి రైతులకు అందుబాటులోకి తెచ్చారు. పద్మశ్రీ పురస్కారాన్ని అందుకోబోతున్న ఈ భూమిపుత్రులకు తెలుగు రైతుల తరఫున శుభాకాంక్షలు చెబుతోంది 'సాక్షి సాగుబడి'. వారి కృషి గురించి కొన్ని వివరాలు.

(సుభాష్ శర్మ, హరిమన్ శర్మల కృషిపై ఐదారేళ్ల క్రితమే 'సాగుబడి' పేజీలో ఇంటర్వ్యూ, కథనాలు ప్రచురించాం. వాటిని పాఠకుల సౌకర్యార్థం ప్రతి బుధవారం 'సాక్షి ఈ–పేపర్'లో ప్రచురితమవుతున్న 'సాగుబడి ప్లస్' పేజీలో రేపు (29న) పునర్ముద్రిస్తున్నాం – ఎడిటర్)


తన పొలంలో పాలకూర ఆకులను చూపుతున్న సుభాష్ శర్మ

కరువు సీమలో కాంతిరేఖ.. సుభాష్ శర్మ!

అధిక దిగుబడి, అధిక నికరాదాయం!

ప్రకృతి సేద్యంలోని శాస్త్రీయతను అర్థం చేసుకొని రైతులు అనుసరించినప్పుడే సత్ఫలితాలు సాధించగలుగుతారు. పత్తి 2 సాళ్లు వేసి.. ఆ పక్కనే 3 సాళ్లలో పచ్చిరొట్ట పంటలను సాగు చేస్తే.. భూసారంతో పాటు దిగుబడి కూడా పెరగడం, బెట్టను తట్టుకోవడం వంటి ఎన్నో ప్రయోజనాలు నెరవేరతాయి. చీడపీడల బెడద కూడా తీరిపోతుంది. పచ్చిరొట్ట సాగుకు స్థలం వృథా అవుతున్నదని పొరబడకూడదు. శాస్త్రీయతను అర్థం చేసుకోవాలి. ప్రకృతి సేద్యంలో అధిక దిగుబడి, అధిక నికరాదాయం పొందటం ముమ్మాటికీ సాధ్యమే.

– సుభాష్ శర్మ
ప్రకృతి వ్యవసాయ నిపుణులు, మహారాష్ట్ర

మహారాష్ట్ర.. విదర్భ.. యవత్‌మాల్.. ఈ పేరు వినగానే అప్పుల్లో కూరుకుపోయి బలవన్మరణాల పాలైన ఎందరో పత్తి రైతుల విషాద గాథలు మదిని బరువెక్కిస్తాయి. అయితే, యవత్‌మాల్ వ్యవసాయ కథ అంతటితో ముగిసిపోలేదు. ఎడారిలో ఒయాసిస్సు మాదిరిగా సేద్యాన్ని ఆనందమయంగా మార్చుకున్న ప్రసిద్ధ రైతు శాస్త్రవేత్త, సీనియర్ ప్రకృతి వ్యవసాయ నిపుణులు సుభాష్ శర్మ కూడా అక్కడ దీర్ఘకాలంగా సేద్యం చేస్తున్నారు. యవత్‌మాల్ జిల్లా వితస గ్రామ వాస్తవ్యుడైన శర్మ.. నేలతల్లికి ప్రణమిల్లుతూ భూసారాన్ని పరిరక్షించుకుంటూనే అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

సుభాష్ శర్మకు 67 ఏళ్లు. ఆరుతడి పంటల సాగులో 47 ఏళ్ల అనుభవం ఉన్న రైతు. రసాయనిక సేద్యపు చేదు అనుభవాల నుంచి గుణపాఠాలు నేర్చుకొని దిశను మార్చుకున్నారు. సేద్యంలో గడ్డు సమస్యలకు అద్భుతమైన పరిష్కారాలను వెదికిన తలపండిన ప్రకృతి వ్యవసాయదారుడాయన. అంతేకాదు, నల్లరేగడి పొలాల్లో అనేక వినూత్న సుస్థిర వ్యవసాయ పద్ధతులను స్వీయానుభవంలో కనుగొని, అనుసరిస్తున్న విశిష్ట రైతు శాస్త్రవేత్త కూడా. క్షేత్రస్థాయిలో వ్యవసాయ సమస్యలను లోతుగా పరిశీలిస్తూ.. తన అనుభవంతో, ప్రజ్ఞతో మెట్ట ప్రాంతాల్లో ప్రకృతి సేద్యానికి అనుగుణమైన సాగు పద్ధతులను సుభాష్ శర్మ రూపొందించుకున్నారు.

30 ఏళ్లుగా ప్రకృతి సేద్యం

సుభాష్ శర్మకు 13 ఎకరాల నల్లరేగడి భూమి ఉంది. 1975 నుంచి వ్యవసాయం చేస్తున్న ఆయనకు 20 ఏళ్ల పాటు రసాయనిక ఎరువులు, పురుగుమందులతోనే వ్యవసాయం చేశారు. ఫలితంగా ఆర్థికంగా నష్టాలపాలవటమే కాకుండా భూసారం సర్వనాశనమైపోయింది. 1986 తర్వాత ఖర్చులు పెరుగుతున్నా దిగుబడులు తగ్గిపోతూ వచ్చాయి. ఆ దశలో రసాయనిక వ్యవసాయ పద్ధతే నష్టదాయకమైనదన్న సత్యాన్ని గ్రహించారు. 1994 నుంచి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వైపు మళ్లారు. నిశిత పరిశీలనతో ప్రకృతికి అనుగుణమైన ఆచరణాత్మక సుస్థిర వ్యవసాయ పద్ధతులను రూపొందించుకొని అనుసరిస్తూ మంచి నికరాదాయాన్ని పొందుతున్నారు.

13 ఎకరాల నల్లరేగడి భూమిలో 3 ఎకరాలను ఆవులు, ఎద్దుల మేతకు కేటాయించి మిగతా పది ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ముఖ్యంగా కంది, పత్తి, కూరగాయలు, ఆకుకూరలను ఏడాది పొడవునా సాగు చేస్తుంటారు. మార్కెట్‌లో ఎప్పుడు, ఏయే పంట ఉత్పత్తులకు గిరాకీ ఉంటుందో గమనించుకుంటూ రైతులు బహుళ పంటలు సాగుకు ప్రణాళికను రూపొందించుకుంటే మంచి ఆదాయం పొందవచ్చంటారాయన.

పత్తి సాగులో వినూత్న పద్ధతి

ప్రకృతి వ్యవసాయంలో ఆచ్ఛాదన అతి ముఖ్యపాత్ర పోషిస్తుంది. అయితే, ఆచ్ఛాదనగా వేయడానికి గడ్డీ గాదం ఎక్కడ దొరుకుతుంది అని రైతులు ప్రశ్నిస్తుంటారు. ఈ సమస్యకు సుభాష్ శర్మ అద్భుతమైన పరిష్కారాన్ని కనుగొన్నారు. రెండు సాళ్లు పత్తి వేస్తారు (కందిని కూడా ఇలాగే సాగు చేయవచ్చు). ఆ పక్కనే 3 సాళ్లలో పచ్చిరొట్ట మొక్కలు పెంచి, వాటినే కత్తిరించి ఆచ్ఛాదనగా వేస్తారు. పత్తిని, కందిని కూడా ఈ పద్ధతిలోనే సాగు చేయడం ఆయన ప్రత్యేకత. అధిక దిగుబడిని సాధించే ఈ వినూత్న పద్ధతిని గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయదారుడిగా, పరిశోధకుడిగా ప్రయోగాలు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్న సుభాష్ శర్మ పై ప్రత్యేక కథనాన్ని 2018 డిసెంబర్‌లోనే 'సాక్షి సాగుబడి' ప్రచురించింది.

సుభాష్ శర్మ తన యూట్యూబ్ చానల్‌లో వీడియోలు అందుబాటులో ఉంచారు.

@naturalfarmingbysubhashsharma9
@KrishiTV



కొత్త పంటల హాంగ్‌థింగ్

నాగాలాండ్‌లోని కోక్లక్‌కు చెందిన ఎల్. హాంగ్‌థింగ్ అనే 58 ఏళ్ల రైతు శాస్త్రవేత్త అధికాదాయాన్నిచ్చే కొత్త ఉద్యాన పంటలను రైతులకు అందుబాటులోకి తేవటంలో విశేష కృషి చేశారు. ఆ ప్రాంత రైతాంగానికి తెలియని లిచి, నారింజ వంటి కొత్త పండ్ల రకాలను వారికి అందుబాటులోకి తెచ్చారు. 30 ఏళ్లుగా ఉద్యాన తోటలను సాగు చేస్తున్నారు. ఆయన కృషి వల్ల 40 గ్రామాల్లో 200 మంది రైతులు కొత్త రకాల పండ్ల చెట్ల పెంపకం ద్వారా తమ ఆదాయాన్ని పెంచుకోగలిగారు. తిని పారేసిన పండ్ల విత్తనాలను సేకరించి మొలకెత్తించటం వంటి ప్రయోగాలను ఆయన బాల్యం నుంచే చేపట్టటం విశేషం. ఆయన రూపొందించిన అనేక మెళకువలను వందలాది మంది రైతులు అనుసరిస్తూ ఆదాయం పెంచుకుంటున్నారు.

29న వనపర్తిలో సేంద్రియ సంత

గ్రామ భారతి, విశ్వక్సేన గోశాల, అంజనీ బాలకృష్ణ మెమోరియల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29 (బుధవారం)న వనపర్తిలోని విశ్వక్సేన గోశాలలో ప్రకృతి వ్యవసాయోత్పత్తుల సంత జరుగుతుంది. ఈ సందర్భంగా రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కార్యక్రమం ఉంటుంది. వివరాలకు.. 93473 19232, 90001 67775.

ఫిబ్రవరి 1,2 తేదీల్లో తిరుపతిలో సేంద్రియ సంత

తిరుపతి పద్మావతిపురంలోని శిల్పారామంలో ఫిబ్రవరి 1, 2 తేదీల్లో ఉ. 9 గం. నుంచి రా. 8.30 గం. వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆహారోత్పత్తులతో పాటు చేనేత వస్త్రాలు, హస్తకళాకృతులు, పంచగవ్య ఆయుర్వేద ఉత్పత్తులతో కూడిన 'తిరుపతి సిరి సంత' కనెక్ట్ 2 ఫార్మర్స్ సంస్థ ఆధ్వర్యంలో జరగనుంది. మిల్లెట్ రాంబాబు తదితరులు ఆరోగ్యదాయక ఆహారంపై అవగాహన కలిగిస్తారు. వివరాలకు.. 84650 52294, 77997 73638.

ఆపిల్ సాగును దేశవ్యాప్తం చేసిన హరిమన్



ఆపిల్ పండ్ల తోటలను హరిమన్ శర్మ మంచు కొండల మీద నుంచి మైదాన ప్రాంతాల్లోకి తీసుకొచ్చారు. హిమాచల్ ప్రదేశ్‌లోని గల్లసిన్ గ్రామంలో 1956లో ఆయన పుట్టారు. మూడేళ్ల వయసులో తల్లిని కోల్పోయిన ఆయన వ్యవసాయ పనులు చేస్తూ పెరిగారు. కష్టాల్లో పెరిగినప్పటికీ వ్యవసాయంలో కొత్త పోకడలను కనిపెట్టాలన్న తపన ఆయనలో ఉండేది. 1992లో విపరీతమైన మంచు వల్ల ఆ ప్రాంతంలో మామిడి చెట్లు నాశనమైనప్పుడు ఆపిల్ సాగు గురించి ఆలోచించారు. చల్లని కొండ ప్రాంతాల్లో మాత్రమే ఆపిల్ చెట్లు పెరుగుతాయని మనకు తెలుసు. అయినా, తమ ప్రాంతంలో వాటిని ఎందుకు పెంచకూడదన్న ఆలోచనతో హరిమన్ ప్రయోగాలు చేయటం ప్రారంభించారు.

పట్టువిడవకుండా కృషి చేసి సముద్రతలం నుంచి 700 మీటర్ల ఎత్తులోని మైదాన ప్రాంతాల్లో, వేసవిలో 40–45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే వాతావరణంలో కూడా, ఆపిల్ పండ్లను సాగు చేయవచ్చని రుజువు చేశారు. 2007లో హెచ్‌ఆర్‌ఎంఎన్–99 అనే గ్రాఫ్టెడ్ ఆపిల్ వంగడాన్ని రూపొందించారు. అప్పటి ముఖ్యమంత్రి ప్రేమ్‌కుమార్ ధుమల్ దృష్టికి వెళ్లటంతో ప్రాచుర్యంలోకి వచ్చారు. ఈ రకం ఆపిల్ పండ్లను ఇప్పుడు దేశంలో తెలుగు రాష్ట్రాలు సహా 29 రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, జర్మనీలోనూ సాగు చేస్తున్నారు.

కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖకు అనుబంధంగా ఉన్న నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ జాతీయ పురస్కారాన్ని అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి అందుకున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో రైతులకు శిక్షణ ఇవ్వటంతో పాటు లక్ష గ్రాఫ్టెడ్ ఆపిల్ మొక్కలను అందించిన ఘనత ఆయనది.

టెస్టుల్లో బుమ్రా... వన్డేల్లో స్మృతి

ఐసీసీ వార్షిక అవార్డులు గెల్చుకున్న భారత స్టార్ క్రికెటర్లు

దుబాయ్: గత ఏడాది అంతర్జాతీయ క్రికెట్‌లో నిలకడగా రాణించినందుకు భారత క్రికెటర్లు జస్‌ప్రీత్ బుమ్రా, స్మృతి మంధానలకు తగిన గుర్తింపు లభించింది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 2024 వార్షిక పురస్కారాల్లో బుమ్రా పురుషుల విభాగంలో 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'... స్మృతి మహిళల విభాగంలో 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికయ్యారు. పురుషుల విభాగంలో అఫ్గానిస్తాన్ ప్లేయర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు గెల్చుకున్నాడు.


స్మృతి


బుమ్రా

గత ఏడాది బుమ్రా 13 టెస్టులు ఆడి ఏకంగా 71 వికెట్లు పడగొట్టాడు. మొత్తం 357 ఓవర్లు వేయగా అందులో 85 మెయిడెన్లు ఉండటం విశేషం. గత సంవత్సరం మొత్తం ఐదు దేశాలపై బుమ్రా టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. ఆస్ట్రేలియాతో 4 టెస్టులు ఆడి 30 వికెట్లు... బంగ్లాదేశ్‌తో 2 టెస్టులు ఆడి 11 వికెట్లు... ఇంగ్లండ్‌తో 4 టెస్టులు ఆడి 19 వికెట్లు... న్యూజిలాండ్‌తో 2 టెస్టులు ఆడి 3 వికెట్లు... దక్షిణాఫ్రికాతో 1 టెస్టు ఆడి 8 వికెట్లు తీసుకున్నాడు. బుమ్రాతో కలిసి 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కోసం జో రూట్, హ్యారీ బ్రూక్ (ఇంగ్లండ్), కమిందు మెండిస్ (శ్రీలంక) పోటీపడ్డారు.

6 ఐసీసీ 'టెస్టు క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం గెల్చుకున్న ఆరో భారతీయ క్రికెటర్‌గా బుమ్రా గుర్తింపు పొందాడు. గతంలో రాహుల్ ద్రవిడ్ (2004), గౌతమ్ గంభీర్ (2009), వీరేంద్ర సెహ్వాగ్ (2010), రవిచంద్రన్ అశ్విన్ (2016), విరాట్ కోహ్లి (2018) ఈ అవార్డు సొంతం చేసుకున్నారు.

గత సంవత్సరం స్మృతి మంధాన అద్భుత ఆటతీరు కనబరిచింది. 2024లో స్మృతి 13 వన్డేలు ఆడి 747 పరుగులు సాధించింది. ఇందులో 4 సెంచరీలు, 3 అర్ధ సెంచరీలు ఉండటం విశేషం. గతేడాది స్మృతి మొత్తం 95 ఫోర్లు, 6 సిక్స్‌లు కొట్టింది. ఆస్ట్రేలియాతో 4 వన్డేలు ఆడి 151 పరుగులు చేసిన స్మృతి... న్యూజిలాండ్‌పై 105 పరుగులు (3 వన్డేల్లో), దక్షిణాఫ్రికాపై 343 పరుగులు (3 వన్డేల్లో), వెస్టిండీస్‌పై 148 పరుగులు (3 వన్డేల్లో) సాధించింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లపై ఒక్కో శతకం సాధించిన స్మృతి దక్షిణాఫ్రికాపై రెండు సెంచరీలు నమోదు చేసింది.

2 ఐసీసీ 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు గెల్చుకోవడం స్మృతి మంధానకిది రెండోసారి. 2018లోనూ ఆమెకు ఈ పురస్కారం లభించింది. భారత్ నుంచి ఈ అవార్డు సాధించిన ఏకైక మహిళా క్రికెటర్ కూడా స్మృతినే కావడం విశేషం.

అఫ్గానిస్తాన్ నుంచి తొలిసారి...



పురుషుల విభాగంలో 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు అఫ్గానిస్తాన్ ఆల్‌రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్‌కు లభించింది. 24 ఏళ్ల అజ్మతుల్లా 2024లో 14 వన్డేలు ఆడి 417 పరుగులు సాధించాడు. అంతేకాకుండా 17 వికెట్లు కూడా తీసుకున్నాడు. 'వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు గెల్చుకున్న తొలి అఫ్గానిస్తాన్ ప్లేయర్ అజ్మతుల్లానే కావడం విశేషం.



'హ్యాట్రిక్'తో హోరెత్తిస్తారా!

ఇంకా కెప్టెన్ సూర్యకుమార్ '360 డిగ్రీ' బ్యాటింగ్ బాకీ ఉంది. సంజూ సామ్సన్ మెరుపు జోరు కనబర్చలేదు. హార్దిక్ పాండ్యా అసలు ఆట మిగిలుంది. అయినాసరే భారత్ వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గింది. ఇప్పుడు సిరీస్ సాధించే పనిలో ఉంది. ఒకవేళ ఈ ముగ్గురు గనక రాణిస్తే మూడో మ్యాచ్‌తోనే భారత్ ఐదు టి20ల సిరీస్‌ను గెలుచుకునే అవకాశముంది. ఇప్పటికే ఒత్తిడిలో కూరుకుపోయిన ప్రత్యర్థి ఇంగ్లండ్‌పై 'హ్యాట్రిక్' విజయం, సిరీస్ కైవసం ఏమంత కష్టం కాకపోవచ్చు.

నేడు ఇంగ్లండ్‌తో భారత్ మూడో టి20 మ్యాచ్

- గెలిస్తే సిరీస్ టీమిండియా సొంతం
- తీవ్ర ఒత్తిడిలో బట్లర్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

రాజ్‌కోట్: వరుస విజయాలతో జోరుమీదున్న టీమిండియా ఇప్పుడు సిరీస్‌పైనే కన్నేసింది. రాజ్‌కోట్‌లో జరిగే మూడో టి20లో నెగ్గి ఇక్కడే సిరీస్ గెలవాలనే పట్టుదలతో బరిలోకి దిగుతోంది. స్టార్ ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో తమ వైఫల్యాల్ని అధిగమిస్తే ఇంగ్లండ్‌కు మూడో పరాజయం తప్పదేమో! ఇప్పటికే రెండు మ్యాచ్‌ల్లో ఓటమి బట్లర్ బృందాన్ని కుంగదీసింది. ఇప్పుడు సిరీస్‌లో నిలవాలంటే తప్పక గెలవాల్సిన క్లిష్టమైన పరిస్థితుల్లో ఉంది. అయితే ఇది పొట్టి ఫార్మాట్. ఏ క్షణంలోనైనా, ఏ ఓవర్లైనా ఉన్నపళంగా మార్చేయగలదు. కాబట్టి ఏ జట్టు తప్పక గెలుస్తుందనే గ్యారంటీ లేదు. గత రెండు మ్యాచ్‌ల్లోనూ ఇంగ్లండ్ ఓపెనింగ్ జోడీ సాల్ట్–డకెట్ విఫలమైంది. వారి ఓపెనింగ్ 'పవర్ ప్లే' కనబడితే భారత్‌కు సవాళ్లు తప్పవు. ఈ నేపథ్యంలో గత రెండో టి20లాగే ఉత్కంఠరేపే సమరం జరిగొచ్చు.


బట్లర్

టాపార్డర్ రాణిస్తే...

ఓపెనర్లలో అభిషేక్ శర్మ తొలి మ్యాచ్‌లో మెరిపించాడు. కానీ సామ్సన్ నుంచే ఆ మెరుపులు కరువయ్యాయి. కెప్టెన్ సూర్యకుమార్ కూడా టి20కి కాదు కదా... వన్డేకు సరిపడా ఆటకూడా చూపించలేకపోయాడు. ఈ ముగ్గురు మూకుమ్మడిగా రాణిస్తే మిడిలార్డర్ సంగతి చూసుకునేందుకు తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, ధ్రువ్ జురేల్ ఉన్నారు. బ్యాటింగ్‌కు అచ్చొచ్చే పిచ్‌పై లోయర్ ఆర్డర్‌లో వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లు కూడా దంచేసే అవకాశాన్ని పిచ్ కల్పిస్తుంది. గత మ్యాచ్‌ల్ని నిశితంగా గమనిస్తే... బ్యాటింగ్ కన్నా కూడా మన బౌలింగ్ దళం గట్టి ప్రభావమే చూపింది. ఇంగ్లండ్ టాపార్డర్‌ను తేలిగ్గా కూల్చేస్తుంది. అర్ష్‌దీప్, పాండ్యాలకు జతగా మరో సీమర్‌ను తీసుకోవాలనుకుంటే స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ని పక్కన బెట్టొచ్చు.

భారమంతా బ్యాటర్లపైనే...

ఇంగ్లండ్ కూడా గత మ్యాచ్‌లో బౌలింగ్‌తో ఆకట్టుకుంది. హిట్టింగ్ ఓపెనర్లను కూల్చి, మిడిలార్డర్‌ను దెబ్బతీసి మ్యాచ్‌ను గెలిచేస్థితికి వచ్చేసింది. అయితే తిలక్ వర్మ పోరాటమే వారి శ్రమను నీరుగార్చింది. లేదంటే చెన్నైలోనే భారత్‌కు 1–1తో చెక్ పెట్టేది. కార్స్, మార్క్‌వుడ్, ఆర్చర్, రషీద్‌లతో కూడిన బౌలింగ్ దళం పటిష్టంగానే ఉంది. అయితే పరిస్థితి చక్కబెట్టాల్సింది... ఎదురుదాడికి దిగాల్సింది... బ్యాటర్లే! ఫిల్ సాల్ట్, డకెట్‌లు ఆషామాషీ ఓపెనర్లు కాదు. కానీ వారి ఫ్లాప్‌షో ముగిసి 'ఫాస్ట్ షో' మొదలైతే మాత్రం పరుగుల తుఫాన్ ఖాయం. బట్లర్, బ్రూక్, లివింగ్‌స్టోన్, స్మిత్, ఓవర్టన్, కార్స్, ఆర్చర్ ఇలా చెప్పుకుంటూ పోతే తొమ్మిదో వరుస బ్యాటింగ్ దాకా పరుగుల బాదే ఆటగాళ్లే జట్టుకు అందుబాటులో ఉన్నారు. కాబట్టి ఇంగ్లండ్ భారమంతా బ్యాటర్లపైనే ఉంది.

పిచ్, వాతావరణం

రాజ్‌కోట్ పిచ్ ఎప్పుడైనా బ్యాటింగ్‌కు స్వర్గధామం. ప్రత్యేకించి టి20ల్లో పరుగుల వరద, మెరుపుల సరదా ఖాయం. బ్యాటర్ ఫ్రెండ్లీ వికెట్‌పై బౌలర్లకు కష్టాలు తప్పవు. గత రెండు మ్యాచ్‌ల్లో నమోదైన మోస్తరు స్కోరును సులువుగా అధిగమిస్తుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), సంజూ సామ్సన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, ధ్రువ్ జురేల్, హార్దిక్ పాండ్యా, సుందర్, అక్షర్, అర్ష్‌దీప్, రవి బిష్ణోయ్/షమీ, వరుణ్ చక్రవర్తి. ఇంగ్లండ్: బట్లర్ (కెప్టెన్), సాల్ట్, డకెట్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, జేమీ స్మిత్, ఓవర్టన్, కార్స్, ఆర్చర్, ఆదిల్ రషీద్, మార్క్‌వుడ్.

5 రాజ్‌కోట్‌లో భారత జట్టు ఇప్పటి వరకు 5 టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 4 మ్యాచ్‌ల్లో (2013లో ఆస్ట్రేలియాపై; 2019లో బంగ్లాదేశ్‌పై; 2022లో దక్షిణాఫ్రికాపై; 2023లో శ్రీలంకపై) గెలిచిన టీమిండియా ఒక మ్యాచ్‌లో (2017లో న్యూజిలాండ్ చేతిలో) ఓడిపోయింది. ఈ మైదానంలో చివరిసారి 2023 జనవరి 7న శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 228 పరుగులు చేసింది. ప్రస్తుతం కెప్టెన్‌గా ఉన్న సూర్యకుమార్ యాదవ్ (51 బంతుల్లో 112 నాటౌట్; 7 ఫోర్లు, 9 సిక్స్‌లు) ఈ మ్యాచ్‌లో సెంచరీ చేయడం విశేషం.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జట్ల పరాజయం

నేటి నుంచి జాతీయ క్రీడలు

రుద్రాపూర్ (ఉత్తరాఖండ్): జాతీయ క్రీడలు నేడు అధికారికంగా ప్రారంభంకానున్నా... కొన్ని క్రీడాంశాల్లో ఇప్పటికే పోటీలు మొదలయ్యాయి. బీచ్ హ్యాండ్‌బాల్‌లో సోమవారం జరిగిన లీగ్ మ్యాచ్‌ల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జట్లకు ఓటమి ఎదురైంది. పురుషుల విభాగం పూల్ 'ఎ'లో ఆతిథ్య ఉత్తరాఖండ్ జట్టు 36–18 గోల్స్ తేడాతో తెలంగాణ జట్టును ఓడించగా... పూల్ 'బి'లో ఉత్తరప్రదేశ్ జట్టు 41–37 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది.

మహారాష్ట్ర జట్టుకు స్వర్ణం

మూడు అంశాల సమాహారమైన ట్రయాథ్లాన్ (స్విమ్మింగ్, రన్నింగ్, సైక్లింగ్) ఈవెంట్‌లో మణిపూర్, మహారాష్ట్ర క్రీడాకారులు స్వర్ణ పతకాలు సాధించారు. మిక్స్‌డ్ రిలే ఈవెంట్‌లో పార్థ్ సచిన్, డాలీ దేవిదాస్ పాటిల్, కౌశిక్ వినయ్ మలాండర్కర్, మాన్సిలతో కూడిన మహారాష్ట్ర బృందం పసిడి పతకం సొంతం చేసుకుంది. ఈ ఈవెంట్‌లో భాగంగా నలుగురు వేర్వేరుగా ముందుగా 300 మీటర్ల స్విమ్మింగ్ చేయాలి. ఆ తర్వాత 6.8 కిలోమీటర్లు సైక్లింగ్ చేయాలి. చివరగా 2 కిలోమీటర్లు రన్నింగ్ చేయాలి. ఈ మూడు ఈవెంట్లను కలిపి తక్కువ సమయంలో పూర్తి చేసిన మూడు జట్లకు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు లభిస్తాయి. మహారాష్ట్ర బృందం 2గం:12ని:06 సెకన్లలో ముగించి విజేతగా నిలిచింది. మధ్యప్రదేశ్ జట్టుకు రజతం, తమిళనాడు జట్టుకు కాంస్యం లభించాయి. పురుషుల ట్రయాథ్లాన్ వ్యక్తిగత ఈవెంట్‌లో మణిపూర్‌కు చెందిన సరుంగమ్ మెతీ స్వర్ణం... తెలీబా సోరమ్ రజతం... మహారాష్ట్ర ప్లేయర్ పార్థ్ కాంస్యం గెలిచారు. మహిళల ట్రయాథ్లాన్ వ్యక్తిగత ఈవెంట్‌లో డాలీ పాటిల్ (మహారాష్ట్ర) స్వర్ణం, మాన్సి (మహారాష్ట్ర) రజతం, ఆద్యా సింగ్ (మధ్యప్రదేశ్) కాంస్యం సాధించారు.

ఫిబ్రవరి 14 వరకు...

38వ జాతీయ క్రీడలు నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అధికారికంగా మొదలవుతాయి. ఫిబ్రవరి 14వ తేదీ వరకు జరిగే ఈ క్రీడలనున ఉత్తరాఖండ్‌లోని ఏడు నగరాల్లో నిర్వహిస్తున్నారు. మొత్తం 32 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతాయి.


జాతీయ క్రీడల ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు డెహ్రాడూన్‌కు వచ్చిన భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషకు స్వాగతం పలుకుతున్న ఉత్తరాఖండ్ క్రీడల మంత్రి రేఖా ఆర్య

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అడ్డంగా నువ్వు బుక్కయ్యావా...


బ్రహ్మానందం, రాజా గౌతమ్

బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బ్రహ్మ ఆనందం'. ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ హీరోయిన్లు. సావిత్రి, ఉమేష్ కుమార్ సమర్పణలో రాహుల్ యాదవ్ నక్కా నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. శాండిల్య పిసపాటి సంగీతం అందించారు. ఈ చిత్రంలోని రెండో సాంగ్‌ని సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి విడుదల చేశారు. సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించిన ఈ పాటని రామ్ మిరియాల పాడారు. 'అయ్యో అడ్డంగా నువ్వు బుక్కయ్యావా.. ఓరయ్యో ఘోరంగా చిరిగి చాటయ్యావా... గురిచూసి బాగా దెబ్బేశాడా నిన్నే తాతయ్యా...' అంటూ గ్రామీణ నేపథ్యంలో ఈ పాట సాగుతుంది. 'వెన్నెల' కిశోర్, సంపత్ రాజ్, రాజీవ్ కనకాల కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కెమేరా: మితేష్ పర్వతనేని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: డి.వంశీకృష్ణా రెడ్డి, పి.దయాకర్ రావు.

సినిమాలు వదిలేయాలనుకున్నాను

- అప్సరా రాణి


అప్సరా రాణి, వరుణ్ సందేశ్, విజయ శంకర్


''నాకు ఒకే రకమైన పాత్రలు వస్తుండటంతో సినిమాలు వదిలేయాలనుకున్నాను. ఆ సమయంలో దేవుడు 'రాచరికం' టీమ్‌ని నా వద్దకి పంపించాడని అనిపించింది. ఈ చిత్రంలో మంచి పాత్ర చేశాను'' అని అప్సరా రాణి తెలిపారు. విజయ్ శంకర్, అప్సరా రాణి, వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రాచరికం'. సురేశ్ లంకలపల్లి దర్శకత్వంలో ఈశ్వర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న రిలీజ్ కానుంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ శంకర్ మాట్లాడుతూ–''రాయలసీమ అంటే ఏంటో 'రాచరికం' చూపిస్తుంది'' అన్నారు. ''ఈ చిత్రంలో నెగటివ్ రోల్ చేశాను'' అని పేర్కొన్నారు వరుణ్ సందేశ్. ''విజయ్‌గారు చాలా అంకితభావంతో ఈ మూవీ కోసం పని చేశారు'' అని సురేశ్ లంకలపల్లి చెప్పారు. ''ఈ మూవీ బడ్జెట్ పెరిగిపోతోన్న ప్రతిసారి నా మిత్రులే నన్ను సపోర్ట్ చేశారు'' అన్నారు ఈశ్వర్. మ్యూజిక్ డైరెక్టర్ వెంగి, 'ఆదిత్య మ్యూజిక్' నిరంజన్, కెమేరామేన్ ఆర్య సాయి తదితరులు మాట్లాడారు.

జహాపన

'ప్రేమించుకుందాం రా, సూర్యవంశం, మనసంతా నువ్వే' లాంటి చిత్రాల్లో బాలనటుడుగా చేసిన ఆనంద్ వర్ధన్ హీరోగా నటించిన తొలి చిత్రం 'నిదురించు జహాపన'. నవమి గయాక్, రోష్ని సాహోతా హీరోయిన్స్‌గా నటించారు. ప్రసన్న కుమార్ దేవరపల్లి దర్శకత్వంలో ఏఆర్ ఎంటర్ టైన్మెంట్స్‌పై సామ్ నిర్మించిన ఈ మూవీ ఫిబ్రవరి 14న రిలీజ్ కానుంది. ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. 'మనిషి నిద్రపోయే వరకు సైన్స్ అయితే.. నిద్రపోయాక ఏం జరుగుతుందనేది మాయ, సింపుల్‌గా చెప్పాలంటే నీ లైఫ్‌లో పదిహేడేళ్ల జీవితాన్ని మిస్ అయిపోయావు' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం: అనూప్ రూబెన్స్.


రోష్ని, ఆనంద్ వర్ధన్

లుక్ అదుర్స్


ప్రభాస్

విష్ణు మంచు కలల ప్రాజెక్ట్‌గా రూపొందిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ బాబు, మోహన్ లాల్, శరత్ కుమార్, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్ వంటి వారు ఇతర కీలక పాత్రల్లో నటించారు. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మంచు మోహన్ బాబు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 25న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఇదిలా ఉంటే.. ఈ చిత్రంలో స్టార్ హీరో ప్రభాస్ నటించడంతో ఆయన ఏ పాత్ర చేశారు? లుక్ ఎలా ఉంటుంది? అనే ఆసక్తి ఇటు ఇండస్ట్రీ వర్గాల్లో, అటు ప్రేక్షకుల్లో నెలకొంది. ఈ మూవీ నుంచి ఇప్పటికే ఒక్కొక్కరి పాత్రల్ని పరిచయం చేస్తూ లుక్స్ విడుదల చేసిన మేకర్స్.. సోమవారం ఓ క్రేజ్ అప్‌డేట్ ఇచ్చారు. ఫిబ్రవరి 3న ప్రభాస్ పాత్ర లుక్‌ని రిలీజ్ చేస్తామని ప్రకటించి, ఆయన ప్రీ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. నుదుటన విబూది, త్రిశూలం, పదునైన చూపులతో ఉన్న ప్రభాస్ ప్రీ లుక్ అదుర్స్ అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు పోస్ట్ చేస్తున్నారు ఆయన అభిమానులు.



కాజల్

దీ ఇండియా స్టోరీ ప్రారంభం

'ది ఇండియా స్టోరీ'ని మొదలెట్టారు హీరోయిన్ కాజల్ అగర్వాల్. శ్రేయాస్ తల్పాడే, కాజల్ అగర్వాల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మూవీ 'ది ఇండియా స్టోరీ'. చేతన్ డీకే దర్శకత్వంలో సాగర్ బి. షిండే నిర్మిస్తున్న ఈ మూవీ చిత్రీకరణ పుణేలో ప్రారంభమైంది. ''ది ఇండియా స్టోరీ' తొలి షెడ్యూల్‌ని పుణేలో ప్రారంభించాం. ఇప్పటి వరకు ఎవరూ చెప్పని, ఓ ప్రభావితమైన కథను చూపించబోతున్నాం. ఆగస్టు 15న థియేటర్స్‌లో కలుద్దాం'' అని 'ఎక్స్' వేదికగా కాజల్ అగర్వాల్ పేర్కొన్నారు. కాగా.. 'ది ఇండియా స్టోరీ' లోని ఓ మేజర్ షెడ్యూల్ చిత్రీకరణ కొల్హాపూర్‌లో జరగనుందని బాలీవుడ్ సమాచారం. రైతుల కష్టాలు, వ్యవసాయ రంగంలో కొన్ని పురుగులమందు వ్యాపార సంస్థలు చేసే మోసాలు వంటి అంశాల నేపథ్యంలో ఈ మూవీ ఉంటుందని టాక్.

డీల్ విత్ డెవిల్ !

మోహన్ లాల్ హీరోగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎల్2ఈ: ఎంపురాన్'. టోవినో థామస్, మంజు వారియర్, నందు, సానియా అయ్యప్పన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. లైకా ప్రొడక్షన్స్, ఆశీర్వాద్ మూవీస్‌పై సుభాస్కరన్, ఆంటోని పెరుంబవూర్ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో మార్చి 27న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ని కేరళలో నిర్వహించారు మేకర్స్. 'ఏదో ఒకరోజు నీ చుట్టూ ఉన్నవాళ్లందరూ మోసగాళ్లు అనిపించినప్పుడు ఈ నాన్న లేకుంటే, నిన్ను ఆదుకోగలిగినవాడు ఒక్కడే ఉంటాడు స్టీఫెన్, ఈ యుద్ధం మంచికీ చెడుకీ మధ్య కాదు.. చెడుకీ చెడుకీ మధ్య..., హి ఈజ్ కమింగ్ బ్యాక్, దిస్ డీల్ విత్ ది డెవిల్' వంటి డైలాగ్స్ తెలుగు టీజర్‌లో ఉన్నాయి. ఈ సినిమాకు దీపక్ వాసుదేవ్ సంగీతం అందించగా, సుజిత్ వాసుదేవ్ సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేశారు. కాగా మోహన్ లాల్ హీరోగా, పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో 2019 లో వచ్చిన మలయాళ బ్లాక్‌బస్టర్ మూవీ 'లూసీఫర్'కు సీక్వెల్‌గా 'ఎల్2ఈ: ఎంపురాన్' సినిమా రూపొందిన సంగతి తెలిసిందే.


మోహన్ లాల్

సస్పెన్స్ థ్రిల్లర్

'బిగ్ బాస్' ఫేమ్ రోహిత్ సహాని, అబిద్ భూషణ్(నటుడు నాగభూషణం మనవడు), రియా కపూర్, మేఘనా రాజ్‌పుత్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'మిస్ టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకత్వం వహించారు. ఉష, శివాని సమర్పణలో ఆష్లీ క్రియేషన్స్‌పై జయ్ వల్లందాస్(యూఎస్ఏ) నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మహి కోమటి రెడ్డి మాట్లాడుతూ–''సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'మిస్ టీరియస్'. అద్భుతమైన కథ, స్క్రీన్ ప్లే ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని తెలిపారు. ''మా సినిమా ఆరంభం నుంచి చివరి వరకు ప్రేక్షకుల్లో ఉత్కంఠ తగ్గదు. మహి కోమటిరెడ్డి వంటి విజన్ ఉన్న దర్శకుడితో ఈ చిత్రం నిర్మించడం సంతోషం. ఎమ్ఎల్ రాజా అద్భుతమైన సంగీతం అందించారు'' అని జయ్ వల్లందాస్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమేరా: పరవస్తు దేవేంద్ర సూరి (దేవా), ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రామ్ ఉప్పు.


రియా కపూర్

ఓటీటీ
ఇది చూడొచ్చు

ఇరుగుపొరుగు చూస్తున్నారు జాగ్రత్త!

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం సూక్ష్మదర్శిని ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ ప్రపంచంలో దాచలేనిది ఏదైనా ఉందీ అంటే అది రహస్యమే. కానీ మనిషి తన రహస్యాన్ని బంధించగలనని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తుంటాడు. ఇప్పుడు కాకపోతే మరెప్పటికైనా రహస్యమనేది బహిర్గతమవ్వాల్సిందే. కాకపోతే ఆ రహస్యాన్ని మన ఊహకు కూడా అందనివాళ్లు బయటపెడితే అది పెద్ద విడ్డూరం. మన రహస్యాన్ని మన ఇరుగుపొరుగు వారు బయటపెడితే మనకెలా ఉంటుంది.. ఆ పంథాన రూపొందించిన సినిమానే 'సూక్ష్మదర్శిని'. ఓ రకంగా చెప్పాలంటే ఇదో వినూత్న కథ, కథతో పాటు స్క్రీన్‌ప్లే కూడా అంతే వైవిధ్యంగా నడుస్తుంది. 'సూక్ష్మదర్శిని' ఓ మళయాళ సినిమా. హాట్ స్టార్‌లో తెలుగు డబ్బింగ్ వెర్షన్ అందుబాటులో ఉంది. ఇక కథ విషయాని కొస్తే... ఇది ఓ కాలనీకి సంబంధించినది. ప్రియ తన భర్త ఆంటోని, కూతురు కాణితో అదే కాలనీలో నివసిస్తుంటుంది. ప్రియ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుంటుంది. ప్రియకి అదే కాలనీలో ఉంటున్న స్టెఫీ, అస్మా మంచి స్నేహితులు. ఓ రోజు ఆ కాలనీలోని ఓ ఇంట్లోకి మాన్యుల్ తన తల్లితో కొత్తగా చేరతాడు. తన తల్లికి అల్జీమర్స్ వ్యాధి ఉందని చెప్పి కొంత వింతగా ప్రవర్తిస్తుంటాడు మాన్యుల్. తన ప్రవర్తన ప్రియకి అనుమానాస్పదంగా అనిపిస్తుంది. ఈ విషయంపై ప్రియ ఫోకస్ చేసి స్టెఫీ, అస్మాతో కలిసి అసలు నిజం బయటపెడుతుంది. మాన్యుల్ ప్రవర్తించిన తీరు ఏంటి, ప్రియ వాళ్లు ఇన్వెస్టిగేట్ చేసి బయట పెట్టిన సంగతేంటి అన్న విషయాలు మాత్రం 'సూక్ష్మదర్శిని'లో చూస్తే తెలిసిపోతుంది. సినిమా ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతూ ఆఖరున వచ్చే అద్భుతమైన ట్విస్టులతో ప్రేక్షకులను అలరిస్తుంది. ఈ సినిమాకి దర్శకుడు యం.సి. జితిన్. ఈ చిత్రంలో నజ్రియా నజీమ్, బాసిల్ జోసెఫ్ వంటి వారు ప్రధాన పాత్రల్లో నటించారు. ఆఖరుగా ఒక్క మాట... ఇరుగు పొరుగు వారు మనతో కలిసి ఉంటే మంచిదే, అలాగే వాళ్లు మనల్ని ప్రత్యేకంగా గమనిస్తున్నారో లేదో కూడా తెలుసుకోవాలి. అప్పుడే మనల్ని ఏ సూక్ష్మదర్శిని ఏమీ చేయదు. వర్త్‌ఫుల్ వాచ్ ఫర్ ది వీకెండ్.

– ఇంటూరు హరికృష్ణ

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	824	75,366
నిఫ్టీ ▽	263	22,829

విదేశీ సూచీలు (సోమ రెండు శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	19,276	▽	682
డోజోన్స్	44,473	△	49
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,504	△	1
డాక్స్	21,282	▽	113
షాంఘై	3,251	▽	2
నికాయ్	39,565	▽	366

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	80,397
బంగారం (99.5 స్వచ్ఛత)	80,075
వెండి (కేజీ)	90,274

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.05	87.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.20	108.00
€	యూరో	ఎస్‌బీఐ	88.77	91.39
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.62	55.98
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.19	55.39
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.95	65.62
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.13	23.69
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.19	23.74
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.01	12.83



డీప్‌సీక్.. మార్కెట్ షేక్!

- 76,000 దిగువకు సెన్సెక్స్
- 23,000 స్థాయి కోల్పోయిన నిఫ్టీ
- టెక్ షేర్లను కుదిపేసిన డీప్‌సీక్
- ఇన్వెస్టర్లకు రూ.9.28 లక్షల కోట్ల నష్టం

ముంబై: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల విధింపు భయాలు, చైనా ఏఐ స్టార్టప్ డీప్‌సీక్ ప్రభావంతో దేశీయ స్టాక్ సూచీలు సోమవారం ఒక శాతం నష్టపోయాయి. సెన్సెక్స్ 824 పాయింట్లు క్షీణించి 76వేల స్థాయి దిగువన 75,366 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 23,000 స్థాయిని కోల్పోయింది. మార్కెట్ ముగిసే సమయానికి 263 పాయింట్లు పతనమై 22,829 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే నష్టాలతో మొదలయ్యాయి. అన్ని రంగాల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో ఒక దశలో సెన్సెక్స్ 923 పాయింట్లు క్షీణించి 75,267 వద్ద, నిఫ్టీ 306 పాయింట్లు పతనమై 22,786 వద్ద కనిష్టాలు తాకాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 9 పైసలు క్షీణించి 86.31 స్థాయి స్థిరపడింది.

➡ ప్రధాన సూచీలు ఒకశాతమే పడినా.. మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు భారీగా క్షీణించాయి. అధిక వాల్యుయేషన్ల భయాలతో విక్రయాలు వెల్లువెత్తాయి. బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 3.5%, మిడ్‌క్యాప్ సూచీ 2.7% పడింది.

➡ స్టాక్ మార్కెట్ భారీ పతనంతో రూ.9.28 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.410.23 లక్షల కోట్ల(4.75 ట్రిలియన్ డాలర్లు)కు దిగివచ్చింది. ఈ సూచీలోని మొత్తం 30 షేర్లలో ఆరు మాత్రమే లాభాలతో గట్టెక్కాయి.

➡ ఐటీసీ లిమిటెడ్ నుంచి విడదీసిన ఐటీసీ హోటల్స్ షేర్లు జనవరి 29న స్టాక్ ఎక్సే్ఛంజీల్లో లిస్ట్ కానున్నాయి. ఈ విషయాన్ని కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. ఈ ఏడాది జనవరి 1న ఐటీసీ నుంచి ఐటీసీ హోటల్స్ ప్రత్యేక సంస్థగా విడిపోయింది. ప్రతి పది ఐటీసీ షేర్లకు ఒక ఐటీసీ హోటల్ షేరు ధరను కేటాయించారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
పాత కారు టాప్ గేరు! యూజ్డ్ కార్లు @ కోటి
భారత్‌లో క్రెడిట్ కార్డుల జోరు

ఎందుకీ పతనం...

➜ అమెరికాలోని అక్రమ వలసదారులను వారి స్వదేశాలకు పంపే చర్యల్లో భాగంగా ట్రంప్ తాజాగా కొలంబియాపై 25% సుంకాలు విధించారు. ఇప్పటికే మెక్సికో, కెనడాలపై ఫిబ్రవరి 1 నుండి 25% వాణిజ్య సుంకాల విధింపును ప్రకటించారు. ఇది అంతర్జాతీయ వాణిజ్య యుద్ధాలకు దారితీయొచ్చనే భయాలు పెరిగాయి.

➜ చైనా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ డీప్‌సీక్ ఆర్1 ప్రపంచవ్యాప్తంగా టెక్ పరిశ్రమను కుదిపేస్తుంది. అమెరికా దిగ్గజ టెక్ కంపెనీల షేర్లు భారీగా పతనమయ్యాయి. ఈ ప్రభావం మన స్టాక్ మార్కెట్‌పై పడింది.

➜ అమెరికా ఫెడరల్ రిజర్వ్ బుధవారం వడ్డీ రేట్ల కోతపై నిర్ణయం వెలువరించనుంది. ఈ దఫా వడ్డీరేట్ల తగ్గింపు ఉండదని అంచనాలున్నాయి.

➜ ఇప్పటి వరకు వెల్లడైన కార్పొరేట్ డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక త్రైమాసిక ఫలితాలు నిరాశపరిచాయి.

మైక్రోసాఫ్ట్, మెటా, ఒరాకిల్, గూగుల్ తదితర యూఎస్ టెక్నాలజీ దిగ్గజాలు వందల కోట్ల డాలర్లు వెచ్చించి రూపొందించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మోడల్స్, చాట్‌జీపీటీకి పోటీగా చైనా రంగంలోకి దిగింది. స్టార్టప్ డీప్‌సీక్.. అమెరికా ఏఐలకు దీటుగా ఆర్1ను విడుదల చేస్తోంది. దీంతో టెక్నాలజీ వర్గాల్లో ఆందోళనలకు తెరలేచింది. చైనా కారుచౌకగా ఏఐ సేవలు అందించనున్న అంచనాలు యూఎస్ ఇన్వెస్టర్లలో భయాలను కల్పించింది. దీంతో టెక్ కంపెనీలు లిస్టయిన నాస్‌డాక్ ఇండెక్స్ ప్రారంభంలోనే 3 శాతం పతనమైంది. మ్యాగ్నిఫిషియంట్ 7గా పేర్కొనే ఎన్‌విడియా, మైక్రోసాఫ్ట్, ఏఎండీ తదితరాలు అమ్మకాలతో డీలా పడ్డాయి. ప్రధానంగా ఏఐ అవకాశాలపై అంచనాలతో ఇటీవల భారీ ర్యాలీ చేస్తున్న ఎన్‌విడియా షేరు 17 శాతం పతనంకాగా.. మైక్రోసాఫ్ట్ 3 శాతంపైగా క్షీణించింది. ఫలితంగా ఒక్కరోజులోనే ఎన్‌విడియా మార్కెట్ విలువలో సుమారు 500 బిలియన్ డాలర్లు ఆవిరైంది.

ఆర్1 ఎఫెక్ట్..: చైనా ఏఐ స్టార్టప్ డీప్‌సీక్ అభివృద్ధి చేసిన ఆర్1.. అమెరికా టెక్ కంపెనీలు అభివృద్ధి చేస్తున్న చాట్‌జీపీటీ, ఓపెన్ ఏఐ తదితరాలకు తీవ్ర పోటీతో చెక్ పెట్టనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు. ఏఐలో చైనా వేగాన్ని నిలువరించేందుకు వీలుగా ఇప్పటికే అమెరికా ఆధునిక సెమీ కండక్టర్ టెక్నాలజీలను ఎగుమతి చేయకుండా నిషేధించింది. ఎన్‌విడియా రూపొందిస్తున్న ఏఐ చిప్స్ తదితరాలపై ఆంక్షలు విధించింది. డీప్‌సీక్ అభివృద్ధి చేసిన తాజా ఏఐ మోడల్‌ను గత వారమే మార్కెట్లో విడుదల చేసింది. ఇది ఓపెన్‌ఏఐ, మెటా ప్లాట్‌ఫామ్స్‌కు దీటైన పోటీని ఇవ్వనున్నట్లు టెక్నాలజీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రధానంగా అమెరికా టెక్ దిగ్గజాలు వందల కోట్ల డాలర్లు వెచ్చించి అభివృద్ధి చేస్తున్న ఏఐ సేవలకు దీటుగా చైనీస్ ఏఐ చౌకగా సేవలు అందించే వీలుందని విశ్లేషకులు అంటున్నారు. ఇది తీవ్ర పోటీకి తెరతీయడంతో యూఎస్ టెక్ దిగ్గజాల పెట్టుబడులపై ఆశించిన స్థాయిలో రిటర్నులకు తెరపడవచ్చని ఆందోళన నెలకొంది. ఫలితంగా ఉన్నట్టుండి టెక్ కౌంటర్లలో అమ్మకాలు నమోదవుతున్నట్లు నిపుణులు తెలియజేశారు.


– సాక్షి, బిజినెస్ డెస్క్

- యూఎస్ టెక్ దిగ్గజాలలో కలవరం
- యూఎస్ ఏఐకు పోటీగా చైనీస్ ఆర్1
- టెక్నాలజీ షేర్లలో భారీ అమ్మకాలు
- 3 శాతం పతనమైన నాస్‌డాక్
- చాట్‌జీపీటీకి పోటీగా చైనీస్ డీప్‌సీక్



ఆందోళనలు.. 'డీప్'

గత వారమే విడుదలైన డీప్‌సీక్ తాజా ఏఐ మోడల్.. అమెరికా ఐఫోన్ల టెక్ దిగ్గజం యాపిల్ ఇంక్ యాప్ స్టోర్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరినట్లు తెలుస్తోంది. దీంతో క్వాంట్ ఫండ్ చీఫ్ లియాంగ్ వెన్‌ఫెంగ్ ఏర్పాటు చేసిన ఈ ఓపెన్ సోర్స్‌డ్ ప్రొడక్ట్.. ఓపెన్ ఏఐ, మెటా ప్లాట్‌ఫామ్స్‌కు పోటీగా నిలుస్తుందన్న అంచనాలు పెరిగాయి. వెరసి అడ్వాన్స్‌డ్ చిప్స్, అత్యున్నత కంప్యూటింగ్ పవర్‌లపై ఆధారపడిన ప్రస్తుత యూఎస్ ఏఐ బిజినెస్ మోడల్‌ను ఆర్1 దెబ్బతీయవచ్చన్న ఆందోళనలు వ్యాప్తిస్తున్నాయి. ఏఐ విస్తృతిలో ప్రధానంగా ఎన్‌విడియాకు భారీ అవకాశాలు లభించాయి. అయితే ఆర్1 సెగ ఎన్‌విడియాకు అధికంగా తగులుతుందనేది నిపుణులు మాట.



'బ్యాంకింగ్'కు బూస్ట్ ఇస్తారా?



దేశ బ్యాంకింగ్ రంగం.. ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనన్ని సవాళ్లను ఎదుర్కొంటోంది. రుణాల్లో వృద్ధి బలహీనపడింది. డిపాజిట్లకు కస్టమర్లు మొహం చాటేస్తున్నారు. ద్రవ్య లభ్యత (లిక్విడిటీ) తగ్గడంతో, అధిక రేట్లపై డిపాజిట్లను ఆకర్షించాల్సిన పరిస్థితి. ఫలితంగా బ్యాంకులకు నిధుల సమీకరణ వ్యయాలు పెరిగిపోయాయి. వీటికి పరిష్కార చర్యలు బడ్జెట్‌లో ఉంటాయన్న ఆశలు బ్యాంకింగ్ వర్గాల్లో నెలకొన్నాయి. ముఖ్యంగా లిక్విడిటీ పెంపు, రుణాల వృద్ధికి ఉద్దీపన చర్యలను ఈ రంగం ఆశిస్తోంది. దేశ ఆర్థిక వృద్ధి ఏడు త్రైమాసికాల కనిష్ట స్థాయి 5.4 శాతానికి సెప్టెంబర్ త్రైమాసికంలో (2024–25) పడిపోవడం తెలిసిందే. ఈ ప్రభావం బ్యాంకు రుణ ఆస్తుల నాణ్యతపైనా ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. ముఖ్యంగా అన్ సెక్యూర్డ్ రుణాల్లో స్థూల, నికర నిరర్థక ఆస్తులు పెరిగిపోతున్నాయి. వీటికి గణనీయమైన కేటాయింపులతో బ్యాంకుల లాభాలు తరిగిపోతున్న పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. దీంతో రానున్న బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించే చర్యలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

డిపాజిట్లకు ప్రోత్సాహకాలు

➜ ఇన్వెస్టర్లు అధిక రాబడులను ఇచ్చే ఈక్విటీ తదితర సాధనాల వైపు మళ్లిపోతుండడంతో, తిరిగి సంప్రదాయ బ్యాంక్ డిపాజిట్ల వైపు వారిని ఆకర్షించేందుకు చర్యలు అవసరమని నిపుణులు భావిస్తున్నారు. గృహ ఆర్థిక ఆస్తుల్లో బ్యాంకుల డిపాజిట్లు 2019–20 నాటికి 56.4 శాతంగా ఉంటే, 2024 మార్చి నాటికి 45.2 శాతానికి పడిపోవడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో బ్యాంక్ డిపాజిట్లపై తక్కువ పన్ను రేటును ప్రవేశపెట్టాలని ఈ రంగం కోరుతోంది. పన్ను ఆదా ఎఫ్‌డీపై ఐదేళ్ల లాకిన్ పీరియడ్‌ను తగ్గించినట్టయితే ఆకర్షణీయంగా మారుతుందని బ్యాంకర్లు అంటున్నారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

- డిపాజిట్లకు పన్ను ప్రోత్సాహకాల డిమాండ్లు
- ఎంఎఫ్‌ఐలకు ప్రత్యేక నిధుల విండో తెరవాలి
- నిధుల లభ్యత పరిస్థితులు మెరుగుపడాలి
- మూలధన వ్యయాల పెంపుతో కార్పొరేట్ రుణ వృద్ధి
- ఉద్దీపన చర్యలపై బ్యాంకింగ్ వర్గాల్లో అంచనాలు

➡ ఆదాయపన్ను ఉపశమనంతో ప్రజల చేతుల్లో ఖర్చు చేసే ఆదాయం పెరుగుతుంది. ఇది డిపాజిట్లు, రుణాలకు డిమాండ్‌ను పెంచుతుందున్న అంచనాలున్నాయి.

➡ హోల్‌సేల్ రుణాలు, బ్యాంకింగ్ రంగం నుంచి నిరర్థక రుణ ఆస్తులను సొంతం చేసుకోవడంపైనా పన్ను రాయితీలు కల్పించాలని నిపుణులు కోరుతున్నారు.

➡ సూక్ష్మ రుణాల విభాగంలో రుణ ఎగవేతలు ఇటీవల ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో రుణ, నిర్వహణ వ్యయాల భారం ఎగసింది. ఈ పరిస్థితుల్లో అందుబాటు రేట్లపై ప్రత్యేక నిధుల విండోను ప్రకటించొచ్చని యాక్సిస్ సెక్యూరిటీస్ అనలిస్టులు భావిస్తున్నారు.

➡ అంతేకాదు మౌలికరంగ వసతుల కల్పన ప్రాజెక్టులకు కేంద్రం గణనీయమైన ప్రాధాన్యం ఇస్తోంది. రోడ్లు, రైల్వేలు, పట్టణాభివృద్ధిపై ప్రభుత్వం చేసే మూలధన వ్యయాలతో.. అన్ని రంగాల్లోనూ కంపెనీలు పెట్టుబడులతో ముందుకు వస్తాయని, ఇది బ్యాంకుల రుణ డిమాండ్‌ను పెంచుతుందని భావిస్తున్నారు. రానున్న బడ్జెట్‌లో 14 శాతం అధికంగా 11.3 లక్షల కోట్లను మూలధన వ్యయాల కింద కేటాయించొచ్చని ఎలారా క్యాపిటల్ పేర్కొంది.



రిటైల్ కస్టమర్ల నుంచి డిపాజిట్ల సమీకరణ విషయంలో బ్యాంకులు సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. కొన్ని ప్రోత్సాహకాలు కల్పించినట్టయితే బ్యాంక్‌లు తమ రుణ అవసరాలకు అనుగుణంగా తక్కువ వ్యయాలపై నిధులు సమీకరించగలుగుతాయి. ముఖ్యంగా లిక్విడిటీ కవరేజ్ రేషియోలో ప్రతిపాదిత మార్పుల నేపథ్యంలో ఇది ఎంతో అవసరం.

– సచిన్ సచ్‌దేవ, ఇక్రా ఫైనాన్షియల్ రంగం రేటింగ్స్ హెడ్, వైస్ ప్రెసిడెంట్

విద్య, ఉద్యోగ సమాచారం

సీఐఎస్ఎఫ్‌లో 1124 కానిస్టేబుల్/డ్రైవర్ పోస్టులు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్).. దేశవ్యాప్తంగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కానిస్టేబుల్/డ్రైవర్ కమ్ పంప్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1124.
» **పోస్టుల వివరాలు:** కానిస్టేబుల్/డ్రైవర్–845, కానిస్టేబుల్/డ్రైవర్–కమ్–పంప్–ఆపరేటర్(డీసీపీవో) (డ్రైవర్ ఫర్ ఫైర్ సర్వీస్)–279.
» **అర్హత:** మెట్రిక్యులేషన్ లేదా తత్సమాన విద్యార్హతలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, డ్రైవింగ్ అనుభవం తప్పనిసరిగా ఉండాలి.
» **వయసు:** 04.03.2025 నాటికి 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100.
» **ఎంపిక విధానం:** ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్(పీఎస్‌టీ), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్(పీఈటీ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, ట్రేడ్ టెస్ట్, రాతపరీక్ష(ఓఎంఆర్/సీబీటీ), డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.02.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.03.2025
» **వెబ్‌సైట్:** https://cisfrectt.cisf.gov.in

బీహెచ్‌ఈఎల్‌లో 400 ఇంజనీర్ ట్రైనీ పోస్టులు

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బీహెచ్‌ఈఎల్)... ఒప్పంద ప్రాతిపదికన ఇంజనీర్ ట్రైనీ, సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 400.
» **పోస్టుల వివరాలు:** ఇంజనీర్ ట్రైనీలు–150, సూపర్‌వైజర్ ట్రైనీ–250.

విభాగాల వారీగా ఖాళీలు

» **ఇంజనీర్ ట్రైనీలు:** మెకానికల్–70, ఎలక్ట్రికల్–25, సివిల్–25, ఎలక్ట్రానిక్స్–20, కెమికల్–05, మెటల్లర్జీ–05.
» **సూపర్‌వైజర్ ట్రైనీలు:** మెకానికల్–140, ఎలక్ట్రికల్–55, సివిల్–35, ఎలక్ట్రానిక్స్ –20.
» **అర్హత:** ఇంజనీర్ ట్రైనీ పోస్టులకు ఇంజనీరింగ్/టెక్నాలజీలో ఫుల్‌టైం బ్యాచిలర్ డిగ్రీ లేదా సంబంధిత విభాగంలో ఇంటిగ్రేటెడ్ మాస్టర్ డిగ్రీ,డ్యూయల్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. సూపర్‌వైజర్ పోస్టులకు సంబంధిత విభాగంలో రెగ్యులర్ ఇంజనీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» **బేసిక్ పే:** ఇంజనీర్ ట్రైనీ పోస్టులకు నెలకు రూ.50,000, సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టులకు నెలకు రూ.32,000.
» **వయసు:** 01.02.2025 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.02.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**28.02.2025.
» **పరీక్ష తేదీలు:** 11.04.2025, 12.04.2025, 13.04.2025.
» **వెబ్‌సైట్:** https://www.bhel.com

యూసీఐఎల్, ఆంధ్రప్రదేశ్‌లో 32 అప్రెంటిస్‌లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్సార్ కడప జిల్లా, మబ్బుచింతలపల్లిలో ఉన్న యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(యూసీఐఎల్).. అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 32.
» **ట్రేడుల వారీగా ఖాళీలు:**ఫిట్టర్–09,ఎలక్ట్రీషియన్–09,వెల్డర్–04,టర్నర్/మెషినిస్ట్–03,డీజిల్ మెకానిక్–03, కార్పెంటర్–02, ప్లంబర్–02.
» **అర్హత:** పదో తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 13.01.2025 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.02.2025.
» **వెబ్‌సైట్:** https://ucil.gov.in/job.html

ఐఐటీల్లో ఎంబీఏ.. ప్లేస్‌మెంట్స్‌లో జోరు

ఐఐటీలు.. ఇంజనీరింగ్, టెక్నాలజీ విద్యకు కేరాఫ్‌గా గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్స్! ఈ విద్యాసంస్థలు సాంకేతిక విద్యకే పరిమితం కాకుండా.. పీజీ స్థాయిలో మేనేజ్‌మెంట్ కోర్సులను సైతం అందిస్తున్నాయి. ఈ ఇన్‌స్టిట్యూట్స్‌ల ఎంబీఏ విద్యార్థులు ఐఐఎంలకు దీటుగా క్యాంపస్ డ్రైవ్స్‌లో ఆఫర్లు సొంతం చేసుకుంటున్నారు. ఇటీవల ఐఐటీల్లో 2023-25 బ్యాచ్ ఎంబీఏ విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్స్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. ఎంబీఏ కోర్సును అందిస్తున్న ఐఐటీలు, తాజా ప్లేస్‌మెంట్ ట్రెండ్స్, టాప్ రిక్రూటర్స్, ప్యాకేజీలు, అవసరమవుతున్న స్కిల్స్ తదితర వివరాలు..

» పలు ఐఐటీల్లో ఎంబీఏ కోర్సు
» ఐఐఎంలకు దీటుగా క్యాంపస్ ఆఫర్స్
» ఇప్పటికే ఎస్‌పీఓలలో ఆకర్షణీయ స్టయిఫండ్స్
» ఫైనల్ ప్లేస్‌మెంట్స్‌దీ అదే తీరు

ఏడు ఐఐటీల్లో ఎంబీఏ

- దేశంలో ప్రస్తుతం ఏడు ఐఐటీలు ఎంబీఏ కోర్సును అందిస్తున్నాయి.
- ఐఐటీ ఖరగ్‌పూర్‌లో వినోద్ గుప్తా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పి.. ఎంబీఏ, ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. క్యాట్‌లో నిర్దేశిత కటాఫ్ పర్సంటైల్ పొందిన అభ్యర్థులకు రిటెన్ అనాలిసిస్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి అడ్మిషన్ కల్పిస్తుంది.
- ఐఐటీ–చెన్నై.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో రెండేళ్ల వ్యవధిలో ఎంబీఏ కోర్సును అందిస్తోంది. ఫైనాన్స్, హెచ్‌ఆర్ అండ్ ఓబీ, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఇంటిగ్రేటివ్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్, ఆపరేషన్స్ స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి.
- ఐఐటీ కాన్పూర్‌లో ఇండస్ట్రియల్ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ 21 నెలల వ్యవధిలో ఎంబీఏ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ఇక్కడ ఆపరేషన్స్, సిస్టమ్స్, మార్కెటింగ్, ఫైనాన్స్, హెచ్‌ఆర్‌ఎం, మాన్యుఫ్యాక్చరింగ్ మేనేజ్‌మెంట్, సర్వీస్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్లు ఎంచుకోవచ్చు.
- ఐఐటీ–ముంబై శైలేశ్ జె.మెహతా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి.. ఎంబీఏ ప్రోగ్రామ్‌లను అందిస్తోంది. ఇందులో భాగంగా ఆపరేషన్స్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, క్వాంటిటేటివ్ టెక్నిక్స్, అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, జనరల్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఆర్ అండ్ ఓబీ, ఇంటర్నేషనల్ బిజినెస్, ఎకనామిక్స్ అండ్ స్ట్రాటజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్టివ్స్ అందుబాటులో ఉన్నాయి.
- ఐఐటీ–ఢిల్లీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ పరిధిలో ఎంబీఏ, ఎంబీఏ(టెలికం సిస్టమ్స్ మేనేజ్‌మెంట్) కోర్సులను అందిస్తోంది. ఎంబీఏ కోర్సులో భాగంగా ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఫైనాన్స్, మార్కెటింగ్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్లను ఎంచుకోవచ్చు.
- ఐఐటీ–రూర్కీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ పరిధిలో ఎంబీఏ కోర్సు అందిస్తోంది. మార్కెటింగ్, ఫైనాన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఆపరేషన్స్, హెచ్‌ఆర్‌ఎం స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి.
- ఐఐటీ జోథ్‌పూర్ కూడా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పి ఎంబీఏ కోర్సును అందిస్తోంది.

ప్లేస్‌మెంట్స్ జోరు

ఐఐటీల్లో ఎంబీఏ విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ఆఫర్ల జోరు కొనసాగుతోంది. ఇక్కడ ఐఐఎంలకు దీటుగా ఆఫర్లు లభిస్తున్నాయి. నూటికి తొంభై శాతం మందికి ఉద్యోగాలు ఖరారవుతున్నాయి. వేతనాలు కూడా ఐఐఎంలకు దీటుగా అందుతున్నాయి. ఐటీ, కోర్ మాన్యుఫ్యాక్చరింగ్ విభాగాల్లో నియామకాలు జరిపే కంపెనీలకు ఈ స్కిల్స్‌తోపాటు నిర్వహణ నైపుణ్యాలున్న విద్యార్థులు ఐఐటీల్లో లభిస్తున్నారు. ఐఐటీల్లో ఎంబీఏ అభ్యర్థులకు ఐటీ, ఐటీఈఎస్, అనలిటిక్స్ ప్రొఫైల్స్‌లో ఎక్కువ ఆఫర్లు లభిస్తుండటమే ఇందుకు నిదర్శనం.

తాజా బ్యాచ్ ఎస్‌పీఓల హవా

- 2023–25 ఎంబీఏ బ్యాచ్‌కు సంబంధించి సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్లు(ఎస్‌పీవో) హవా కొనసాగింది. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో రూ.5.35 లక్షలతో అత్యధిక స్టయిఫండ్ లభించగా.. సగటు స్టయిఫండ్ రూ.4.61 లక్షలుగా ఉంది. ఐఐటీ–ముంబైలో అత్యధిక స్టయిఫండ్ రూ.5 లక్షలుగా.. సగటు స్టయిఫండ్ రూ.2.92 లక్షలుగా నమోదైంది.
- ఐఐటీ–చెన్నైలో అత్యధిక స్టయిఫండ్ రూ.4.4 లక్షలు కాగా, సగటు స్టయిఫండ్ రూ.1.05 లక్షలు. ఐఐటీ–కాన్పూర్‌లో అత్యధిక స్టయిఫండ్ రూ.1.7 లక్షలుగా.. సగటు స్టయిఫండ్ రూ.80 వేలుగా నమోదైంది. ఐఐటీ–రూర్కీలో అత్యధిక స్టయిఫండ్ రూ.2.3 లక్షలు, సగటు స్టయిఫండ్ రూ.89 వేలుగా ఉంది. ఐఐటీ–ఢిల్లీలో రూ.4.04 లక్షలు అత్యధిక స్టయిఫండ్ కాగా..రూ.2.63 లక్షల సగటు స్టయిఫండ్ లభించింది. ఐఐటీ–జోథ్‌పూర్‌లో అత్యధిక స్టయిఫండ్ రూ.80వేలు కాగా, సగటున రూ.44 వేల స్టయిఫండ్ అందింది.



ప్లేస్‌మెంట్స్ ట్రెండ్స్

ఫైనల్ ప్లేస్‌మెంట్స్‌దీ అదే తీరు

ఐఐటీల్లో ఎంబీఏ చదివిన వారికి ఐఐఎంలకు దీటుగా ఫైనల్ ఆఫర్లు లభించాయి. ఐఐటీ–ముంబైలో రూ.72 లక్షల అత్యధిక వేతనంతో ఆఫర్ నమోదైంది. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో అత్యధిక వేతనం రూ.38 లక్షలుగా, సగటు వేతనం రూ.20.65 లక్షలుగా ఉంది. ఐఐటీ ఢిల్లీలో రూ.41.13 లక్షలతో అత్యధిక ప్యాకేజ్ ఆఫర్ లభించింది.

ఐఐటీ కాన్పూర్‌లో రూ.24 లక్షల ప్యాకేజ్‌తో కొలువు ఖాయమైంది. ఐఐటీ రూర్కీలో రూ.26 లక్షలు అత్యధిక ప్యాకేజ్ కాగా, రూ.18.3 లక్షలు సగటు ప్యాకేజ్‌గా నమోదైంది. ఐఐటీ–చెన్నైలో రూ.29.6 లక్షలు, రూ.16.93 లక్షలుగా అత్యధిక, సగటు ప్యాకేజ్‌లు ఉన్నాయి. ఐఐటీ జోథ్‌పూర్‌లో అత్యధిక ప్యాకేజ్ రూ.24.81 లక్షలు, సగటు ప్యాకేజ్ రూ.11.77 లక్షలుగా ఉంది.

ఈ మూడు రంగాలదే

ఐఐటీల్లోని ఎంబీఏ ప్రోగ్రామ్ విద్యార్థులకు కన్సల్టింగ్, ఫైనాన్స్, జనరల్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఎక్కువ ఆఫర్లు లభించాయి. ఈ విభాగాలతో ఎక్కువగా కార్యకలాపాలు నిర్వహించే కన్సల్టింగ్ సంస్థలు భారీగా నియామకాలు చేపట్టాయి. అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గడించిన బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్, పీడబ్ల్యూసీ, డెలాయిట్, కేపీఎంజీ, ఈ అండ్ వై తదితర సంస్థలు ఆఫర్ల ఇవ్వడంలో ముందంజలో నిలిచాయి. వీటితోపాటు బీఎఫ్‌ఎస్‌ఐ, ఈ–కామర్స్, ఎడ్‌టెక్, ఫిన్‌టెక్, ఐటీ /ఐటీఈఎస్ సంస్థలు కూడా భారీ ఆఫర్లతో విద్యార్థులకు స్వాగతం పలికాయి. కొన్ని ఐఐటీల్లోని ఎంబీఏ విద్యార్థులకు డబుల్ ఆఫర్లు, ఇంటర్నేషనల్ ఆఫర్లు కూడా అందాయి. ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ అభ్యర్థులకూ మిడ్ లెవల్ పొజిషన్స్ అందాయి.

కన్సల్టింగ్.. కింగ్

ఆఫర్లు అందించడంలో కన్సల్టింగ్ సంస్థలు ముందంజలో నిలిచాయి. మొత్తం ఆఫర్లలో దాదాపు 40 శాతం ఆఫర్లు కన్సల్టింగ్ సంస్థల నుంచే ఉండడం ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. కంపెనీలు తగిన వ్యూహాల కోసం కన్సల్టింగ్ సంస్థలను సంప్రదిస్తున్నాయి. ఇదే ఇప్పుడు కన్సల్టింగ్ సంస్థల్లో నియామకాలు పెరగడానికి, క్యాంపస్ డ్రైవ్స్‌లో టాప్ రిక్రూటర్స్‌గా నిలవడానికి కారణంగా చెబుతున్నారు. మాన్యుఫ్యాక్చరింగ్ విభాగంలోనూ నియామకాలు ఆశాజనకంగానే కనిపించాయి. వీటిలోనూ అధిక శాతం జాబ్ ప్రొఫైల్స్ డేటా అనాలిసిస్, బిగ్ డేటా, మార్కెటింగ్, ఫైనాన్స్ విభాగాల్లోనే లభించాయి.

ఈ నైపుణ్యాలు తప్పనిసరి

ఐఐటీల్లోని ఎంబీఏ విద్యార్థులకు భారీ స్థాయిలో ఆఫర్లు ఖరారు చేసిన కార్పొరేట్ సంస్థలు.. కేవలం సర్టిఫికెట్లు, జీపీఏలే కాకుండా ఇతర ఎన్నో అంశాలను, నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకున్నాయి. ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, ఇంటర్ పర్సనల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి నైపుణ్యాలకు ప్రాధాన్యం ఇచ్చాయి. కోర్ స్కిల్స్ కోణంలో సబ్జెక్ట్ నాలెడ్జ్‌తోపాటు సదరు సబ్జెక్ట్‌కు సంబంధించి డిజిటల్ నైపుణ్యాలున్న విద్యార్థులను నియమించుకున్నాయి. అదే విధంగా బిజినెస్ అనలిటిక్స్, డేటా అనలిటిక్స్, డేటా మేనేజ్‌మెంట్ వంటి లేటెస్ట్ స్కిల్స్ ఉన్న విద్యార్థులకు పెద్ద పీట వేశాయని ఆయా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఐఐటీ–ఎంబీఏలో ప్రవేశం ఇలా

ఐఐటీల్లో ఎంబీఏ ప్రోగ్రామ్‌లో చేరాలంటే తప్పనిసరిగా క్యాట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అనంతరం ప్రతి ఐఐటీలోని మేనేజ్‌మెంట్ స్కూల్స్‌కు ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత మలిదశలో నిర్వహించే గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలలోనూ విజయం సాధించాలి. అప్పుడే ప్రవేశం ఖరారవుతుంది. అదే విధంగా కొన్ని ఐఐటీలు ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి బ్యాచిలర్ డిగ్రీలో 60 శాతం మార్కులు తప్పనిసరి అనే నిబంధన విధిస్తున్నాయి. 2025–26 ప్రవేశాలకు సంబంధించి క్యాట్–2024 ఉత్తీర్ణత ఆధారంగా.. ఐఐటీల్లో ఎంబీఏ కోర్సులో ప్రవేశ ప్రక్రియ మొదలైంది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- ఫిజిక్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- కంప్యూటర్ అవేర్‌నెస్



ఆర్టీసీలో సమ్మె నోటీసు

- ఆర్టీసీ ఈడీకి ఇచ్చిన కొన్ని కార్మిక సంఘాల నేతలు
- ఫిబ్రవరి 9వ తేదీలోగా డిమాండ్లు పరిష్కరించాలి
- సమ్మెకు దూరంగా మరికొన్ని కార్మిక సంఘాలు

సాక్షి, హైదరాబాద్: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల విషయంలో ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపిస్తూ ఆర్టీసీలోని కొన్ని సంఘాలు, మరికొన్ని సంఘాల్లోని చీలిక వర్గాలు సోమవారం సాయంత్రం సమ్మె నోటీసు జారీ చేశాయి. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సెలవులో ఉండటంతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్‌ను కలిసి నోటీసు, డిమాండ్ల జాబితాను అందజేశాయి. ఆర్టీసీ యాజమాన్యం స్పందించని పక్షంలో ఫిబ్రవరి 9 నుంచి లేదా, ఆ తర్వాత ప్రకటించే తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించాయి. ఎంప్లాయీస్ యూనియన్, టీఎంయూ థామస్‌రెడ్డి వర్గం, ఎస్ఎంయూ మౌలానా వర్గం, బీకేయూ, బీడబ్ల్యూయూ, కార్మిక పరిషత్‌లు సమ్మె నోటీసు జారీ చేశాయి.

21 డిమాండ్లతో..

పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ, బకాయిల చెల్లింపు, ఖాళీల భర్తీ జరగక ఉన్న సిబ్బందిపై అదనపు భారం, ఆర్టీసీలో అద్దె బస్సులు పెరిగి పోస్టుల సంఖ్య తగ్గిపోతుండటం, అద్దె ప్రాతిపదికన తీసుకునే ఎలక్ట్రిక్ బస్సుల నిర్వాహకులకు డిపోలు అప్పగించే యోచన, ఆర్టీసీ సొంతానికి వాడుకున్న సహకార పరపతి సంఘం, పీఎఫ్ ట్రస్టు నిధులను తిరిగి చెల్లించకపోవటం... ఇలా మొత్తం 21 డిమాండ్లను సంఘాలు ఆర్టీసీ అధికారుల ముందుంచాయి.

కార్మికుల్లో అయోమయం..

సమ్మె విషయంలో ఆర్టీసీలోని సంఘాలు ఐక్యంగా లేకపోవటం ఇప్పుడు కార్మికుల్లో అయోమయానికి కారణమైంది.

- గతంలో ప్రధాన సంఘాలుగా ఉన్న ఎంప్లాయీస్ యూనియన్ నుంచి ముఖ్యనేత రాజిరెడ్డి వైదొలిగి కాంగ్రెస్‌కు అనుబంధంగా ఉన్న ఎస్‌డబ్ల్యూయూలో ఉన్నారు. ఇప్పుడు ఆ సంఘం సమ్మెకు దూరంగా ఉంది.
- మరో ప్రధాన సంఘం టీఎంయూలో అశ్వత్థామరెడ్డి, తిరుపతి వర్గం సమ్మెకు దూరంగా ఉంది.
- ఎస్ఎంయూలో నరేందర్ వర్గం సమ్మెను వ్యతిరేకిస్తోంది. మిగతా సంఘాలు కూడా సమ్మెకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాయి.
- ఇప్పుడు సమ్మెకు దూరంగా ఉన్న ఎస్‌డబ్ల్యూయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్‌లు ఈనెల 24, 25 తేదీల్లో డిపోల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి.
- ప్రస్తుతం సమ్మెకు దూరంగా ఉన్న సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ ముఖ్యులను కలుస్తూ డిమాండ్ల పరిష్కారానికి వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. ఇలా రెండు వర్గాలుగా విడిపోయిన సంఘాలు, వాటి చీలిక వర్గాల నేతలు పరస్పరం విమర్శలు, ఆరోపణలతో కార్మికుల్లో కూడా చీలిక ఏర్పడుతోంది.

వచ్చే నెల 9 తర్వాత ఎప్పుడైనా సమ్మె మొదలు

'చాలాకాలంగా ఉన్న సమస్యల విషయంలో యాజమాన్యం తీరుతో విసిగిపోయి సమ్మె నోటీసు ఇచ్చాం. వచ్చే నెల 9 తర్వాత ఎప్పుడైనా సమ్మె ప్రారంభిస్తాం. ఇప్పటికే సగం డిపోల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించాం. మిగతా డిపోల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తాం'అని ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకన్న తెలిపారు.

హైదరాబాద్‌లో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'

ఎనర్జీ ట్రాన్సిషన్ రంగంలో ఏర్పాటుకు కేంద్రమంత్రి ఖట్టర్ సమక్షంలో ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: ఎనర్జీ ట్రాన్సిషన్ రంగంలో ప్రపంచ స్థాయి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ఏర్పాటుకు కేంద్రం హైదరాబాద్‌ను ఎంపిక చేసింది. ది ఎనర్జీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (టెరి) భాగస్వామ్యంతో కలిసి కేంద్ర విద్యుత్ శాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ (బీఈఈ) దీన్ని ఏర్పాటు చేయనుంది. కాలుష్య రహిత ఇంధనాల వినియోగం దిశగా అడుగులు వేసి 2070 నాటికి 'నెట్ జీరో'స్థాయికి పరివర్తన (ట్రాన్సిషన్) చెందాలని దేశం పెట్టుకున్న లక్ష్య సాధనలో సీఓఈ కీలకపాత్ర పోషించనుంది. కేంద్ర విద్యుత్ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల హైదరాబాద్‌లో సమావేశం కాగా, వారి సమక్షంలో బీఈఈ, టెరి ఒప్పందంపై సంతకాలు చేశాయి. బీఈఈ, టెరి ఉన్నతాధికారులు సోమవారం ఆన్‌లైన్ ద్వారా తెలంగాణ రెడ్కో వీసీ, ఎండీ అనీల, బీఈఈ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు ఎ.చంద్రశేఖర్‌రెడ్డితో సమావేశమై సీఓఈ ఏర్పాటుపై చర్చించారు. సీఓఈ ఏర్పాటుకు నిధులను బీఈఈ ఇస్తే.. పరిశోధన వ్యూహాలు, ఇంధన ఉత్పత్తి, సరఫరా, పంపిణీలో సామర్థ్యం పెంపుదల, నష్టాల తగ్గింపు, సాంకేతిక సహాయాన్ని తెలంగాణ జెన్‌కో అందించనుంది.

పదహారేళ్లలోపు పిల్లలను అనుమతించొద్దు

సినిమాల ప్రత్యేక ప్రదర్శనలపై హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: పదహారేళ్లలోపు పిల్లలను ఉదయం 11 గంటల్లోపు, రాత్రి 11 గంటల తర్వాత థియేటర్లలో సినిమాల ప్రత్యేక ప్రదర్శనకు అనుమతించవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వేళాపాళా లేని రాత్రి ప్రదర్శనలు పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయని స్పష్టం చేసింది. దీనిపై అన్ని వర్గాలతో చర్చించి చట్ట ప్రకారం వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ప్రభుత్వ నిర్ణయం తీసుకునే వరకు థియేటర్ల యజమానులు 16 ఏళ్లలోపు పిల్లలను ఆయా వేళల్లో సినిమా ప్రదర్శలనకు అనుమతించొద్దని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల 'గేమ్ చేంజర్' సినిమా ప్రత్యేక షోలకు వేకువజామున 4 గంటల నుంచి మొదలుకుని 6 షోలకు అనుమతివ్వడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన కూరగాయల వ్యాపారి గొర్ల భరత్‌రాజ్ లంచ్ మోషన్ రూపంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం మరోసారి విచారణ చేపట్టి.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. తదుపరి విచారణ ఫిబ్రవరి 22కు వాయిదా వేశారు.

యూజీసీ మార్గదర్శకాలు సరికాదు

దీనిపై లేఖ రాస్తాం: ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాల్లోని వర్సిటీలను తమ గుప్పిట్లోకి తీసుకునేలా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూపొందించిన ముసాయిదా మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాలపై ఆధిపత్యం చెలాయించడం రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. యూజీసీ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తూ లేఖ రాయబోతున్నామని తెలిపారు. యూజీసీ తీరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందన్నారు. ఫెడరల్ వ్యవస్థలో ప్రతి రాష్ట్రానికి, యూనివర్సిటీకి స్వేచ్ఛ ఉండాలని తెలిపారు.

సూర్యాపేటలో పరువు హత్య!

పెళ్లైన ఐదు నెలలకే యువకుడి దారుణ హత్య

- కులాంతర ప్రేమ వివాహమే కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్న పోలీసులు
- సోదరుడిపై మృతుడి భార్య ఆరోపణలు
- నలుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు



సూర్యాపేట జిల్లా ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కృష్ణ కుటుంబ సభ్యులు

సూర్యాపేట టౌన్: సూర్యాపేటకు చెందిన యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. మృతదేహాన్ని జనగామ రహదారి నుంచి పిల్లలమర్రికి వెళ్లే మూసీ కెనాల్ కట్టపై పడేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, కులాంతర ప్రేమ వివాహమే హత్యకు కారణం కావొచ్చనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడి ఫోన్‌తో బయటకు వెళ్లి.. శవంగా మారి..

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మామిళ్లగడ్డకు చెందిన వడ్లకొండ కృష్ణ (30) అలియాస్ మాల బంటి, సూర్యాపేట మండలం పిల్లలమర్రికి చెందిన నవీన్ స్నేహితులు. తరచూ నవీన్ ఇంటికి వస్తుండే కృష్ణ.. అతని సోదరి భార్గవిని ప్రేమించాడు. ఆమె విషయం తన తల్లిదండ్రులకు చెప్పింది. కులాలు వేరు కావడంతో వారు ఒప్పుకోలేదు. వేరే వ్యక్తితో పెళ్లి చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీంతో కృష్ణ, భార్గవి గత ఏడాది ఆగస్టులో నకిరేకల్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. కృష్ణ సూర్యాపేటలోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ భార్గవితో కలిసి ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో బైరు మహేశ్ అనే మిత్రుడి నుంచి అతనికి ఫోన్ కాల్ వచ్చింది. దీంతో ఇప్పుడే వస్తానంటూ బయటకు వెళ్లిన కృష్ణ అదే రాత్రి హత్యకు గురయ్యాడు. భార్గవి మహేశ్‌కు రాత్రి 11 గంటలకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. సోమవారం ఉదయం కెనాల్ కట్టపై మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి మెడకు ఉరి వేసి చంపినట్లుగా గుర్తులు, ఒంటిపై గాయాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కృష్ణకు ఉరేసి హత్య చేసిన దుండగులు, మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకొచ్చి పడేసి ఉంటారని భావిస్తున్నారు.

నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్, హత్య కేసు నమోదు


కులాంతర వివాహం చేసుకున్నందుకు కక్ష పెంచుకున్న సోదరుడు నవీన్ ఈ హత్య చేసినట్టు భార్గవి ఆరోపిస్తోంది. దీంతో పోలీసులు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణ తండ్రి డేవిడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. భార్గవి తండ్రి సైదులు, సోదరులు వంశీ, నవీన్, కృష్ణ స్నేహితుడు బైరు మహేశ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్య కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నలుగురు పరారీలో ఉండగా రెండు బృందాలు గాలింపు చేపట్టాయి. కృష్ణపై గతంలో రెండు హత్యాయత్నం కేసులు ఉండగా, బైరు మహేశ్‌పై రౌడీషీటర్ కేసు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో పాత కక్షలా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట డీఎస్పీ రవి చెప్పారు.

న్యాయం చేయాలని ధర్నా

కృష్ణ కుటుంబ సభ్యులకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేటలో మాలమహానాడు, దళిత సంఘాల నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉగ్రవాదం కొత్త పుంతలు తొక్కుతోంది

కేఎస్ వ్యాస్ స్మారక ఉపన్యాసంలో అలహాబాద్ సెంట్రల్ వర్సిటీ మాజీ వీసీ



అలహాబాద్ సెంట్రల్ వర్సిటీ మాజీ వీసీ రాజేన్ హర్షేకు జ్ఞాపిక అందిస్తున్న డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం కొత్తపుంతలు తొక్కుతోందని, ఉగ్రవాద సంస్థల్లో సాంకేతిక వినియోగం పెరిగిందని అలహాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ రాజేన్ హర్షే అభిప్రాయపడ్డారు. ఉగ్రవాదాన్ని రాజకీయ ప్రేరేపిత హింసగా ఆయన పేర్కొన్నారు. ప్రపంచీకరణలో భాగంగా ఇంటర్నెట్ సేవలు విస్తరించిన తర్వాత మిగతా రంగాలతోపాటు టెర్రరిజం సైతం వేగంగా విస్తరించిందన్నారు. సోమవారం దివంగత ఐపీఎస్ కేఎస్ వ్యాస్ 25వ స్మారక ఉపన్యాస కార్యక్రమంలో డీజీపీ జితేందర్‌తో కలిసి రాజేన్ హర్షే పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ప్రపంచీకరణ–ఉగ్రవాదం'అంశంపై ప్రసంగించారు. ప్రపంచ దేశాలన్నీ కలిసి సంఘటితంగా పనిచేస్తేనే ఉగ్రవాదాన్ని అడ్డుకోగలుగుతాయన్నారు. డీజీపీ డా.జితేందర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా మావోయిస్టుల ఏరివేతను మార్చి 2026 వరకు పూర్తి చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరోమారు స్పష్టం చేసినట్టు వెల్లడించారు. మావోయిస్టు ఆపరేషన్లలో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. కేఎస్ వ్యాస్ పోలీస్‌శాఖకు చేసిన సేవలను వక్తలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కేఎస్ వ్యాస్ భార్య అరుణవ్యాస్, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిస్త్, సీఐడీ డీజీ శిఖాగోయల్, ఆపరేషన్స్ అడిషనల్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల కట్టడికి 'షీల్డ్-2025'



షీల్డ్-2025 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శిఖా గోయల్, అవినాశ్ మహంతి తదితరులు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాలను అడ్డుకునే చర్యలు.. ఆన్‌లైన్ మోసాలపై ప్రజల్లో అవగాహన, సైబర్ భద్రత కోసం నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేలా భాగస్వాములందరినీ ఒకే వేదికపైకి తేవడం లక్ష్యంగా 'షీల్డ్-2025' సదస్సును నిర్వహించనున్నట్టు టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో ఫిబ్రవరి 18, 19 తేదీల్లో సైబర్ సెక్యూరిటీ కాన్‌క్లేవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో 'షీల్డ్-2025' పోస్టర్‌ను సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సెక్రటరీ జనరల్ రమేశ్ ఖాజాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శిఖాగోయల్ మాట్లాడుతూ, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ), టీజీసీఎస్‌బీ, సైబరాబాద్ పోలీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే కాన్‌క్లేవ్‌లో అన్ని రాష్ట్రాల నుంచి సైబర్ నిపుణులు, దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారులు, ఐటీ ఇండస్ట్రీ, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, ఎన్‌జీవోల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. పాల్గొనాలని ఆసక్తి ఉన్నవారు 'www.shieldconference.com'లో సంప్రదించవచ్చన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

చూడముచ్చటగా..






దొండపండులాంటి ఎర్రని ముక్కుతో అందంగా ఉండే రామచిలుకను చూస్తే మనసుకు ఎంతో ఆహ్లాదం కలుగుతుంది. పెద్దపల్లి శివారు కూనారం రోడ్డు ఈతచెట్టు తొర్రల్లో రామచిలుకలు సేద తీరుతూ.. ఈతకల్లు, గుజ్జు ఆస్వాదిస్తూ కొన్ని చెట్లపై జంటలుగా వాలుతూ ఇలా సాక్షి కెమెరాకు కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

కుట్రకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ పార్టీ

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, రాజేశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కుట్రకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ పార్టీ అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. గ్రామసభల్లో అల్లర్లు చేయడానికి కార్యకర్తలకు బీఆర్ఎస్ మద్యం తాగించి పంపిందని ఆరోపించారు. పాలమూరు జిల్లాను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది బీఆర్ఎస్ పార్టీనేనన్నారు. కాళేశ్వరంపైన ప్రత్యేక శ్రద్ధ చూపించి పూర్తి చేసిన కేసీఆర్.. పాలమూరు–రంగారెడ్డిని గాలికి వదిలేశారని విమర్శించారు. 2017లో కోయిల్ సాగర్‌కు హరీశ్‌రావు వచ్చి 50 వేల ఎకరాలకు అదనంగా నీళ్లు ఇస్తామని చెప్పాడని, ఇప్పటి వరకు ఒక్క ఎకరానికి కూడా అదనంగా నీళ్లు ఇవ్వలేదని తెలిపారు. దీనిపై దమ్ముంటే హరీశ్‌రావు తడిబట్టలతో కురుమూర్తి టెంపుల్‌కి రావాలని, తాను, తమ ఎమ్మెల్యేలు వచ్చి ప్రమాణం చేస్తామని సవాల్ విసిరారు. కేటీఆర్‌కు మైండ్‌కు దొబ్బిందని, సంక్షేమ పథకాలపైన మతి లేకుండా మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు.

మీ పాట పాడిన వారికే పద్మ అవార్డులా?

సంజయ్ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి: ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: బీజేపీ పాట పాడిన వారికి, ఆ పార్టీకి జై కొట్టిన వారికే పద్మ అవార్డులు ఇస్తారా? అని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. బండి సంజయ్ కేబినెట్ మినిస్టరా? కార్పొరేటరా? అని ఎద్దేవా చేశారు. ఈ మేరకు సోమవారం చామల ఓ ప్రకటన విడుదల చేశారు. బీజేపీ భావజాలం ఉన్న వారికే పద్మ అవార్డులు ఇస్తామని చెప్పడం రాష్ట్రపతి, ప్రధాన మంత్రులను చిన్నగా చేసినట్టు అవుతుందన్నారు. అంబేడ్కర్ కూడా ఓ భావజాలం కోసం పనిచేసిన వారేనని, గద్దర్ వెనుకబడిన వర్గాల కోసం ఉద్యమించారని గుర్తు చేశారు. నిష్పక్షపాతంగా ఇవ్వాల్సిన అవార్డుల విషయంలో ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చే విధంగా సంజయ్ వ్యాఖ్యలున్నాయని చామల మండిపడ్డారు. గద్దర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంజయ్ క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కాంగ్రెస్: సుధాకర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని బీజేపీ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేతకాక ప్రజా పరిపాలన పేరుతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు, 66 హామీలు, 400కి పైగా వాగ్దానాలు చేసిన కాంగ్రెస్.. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సంవిధాన్ బచావో యాత్ర పేరుతో రాజకీయ క్రీడకు తెరలేపిందని, సమాజంలో భేదాభిప్రాయాలు సృష్టించేలా ఓటు బ్యాంకు రాజకీయాలకు దిగిందని ధ్వజమెత్తారు. పీఎంఏవై కింద దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇళ్లు నిర్మించి ఇచ్చి గృహనిర్మాణానికి ప్రాధాన్యమిచ్చిన ఘనత నరేంద్ర మోదీ ప్రభుత్వానిదని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పలు కేంద్ర పథకాలను తమ స్కీములుగా ఫొటోలు పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం అనేక ఉల్లంఘనలకు పాల్పడుతోందన్నారు.

గాంధీ భవన్‌కు ఫినాయిల్ బాటిళ్లు: ఎర్రోళ్ల శ్రీనివాస్

అబద్ధాల నోళ్లను శుభ్రం చేసుకోవాలని హితవు



సాక్షి, హైదరాబాద్: అబద్ధాలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు విలువలు లేని రాజకీయాలు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. కేబినెట్ మంత్రులతో సహా అబద్ధాలు చెప్తున్న కాంగ్రెస్ నాయకులు తాము పంపే ఫినాయిల్‌తో నోళ్లు శుభ్రం చేసుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు బాలరాజు యాదవ్, వాసుదేవరెడ్డి తదితరులతో కలిసి సోమవారం తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు పూటకో గడువు చెప్తున్న కాంగ్రెస్ నాయకుల నోళ్లు మురికి కూపాలుగా మారాయి. 400 రోజులుగా హామీల అమలుకు గడువు విధిస్తూ ప్రజలను మోసగిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు తమ వైఖరి మార్చుకుని అర్థవంతమైన రాజకీయాలు చేయాలి' అని శ్రీనివాస్ హితవు పలికారు.

'వైద్య విద్యలో ఓబీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవాలి'

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్యలో ఓబీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకోవాలని ఓబీసీ ముఖ్య సలహాదారుడు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం గోవా మాజీ డిప్యూటీ సీఎం, కుర్వ యాదవ అధ్యక్షుడు బాబు కవ్లేకర్‌ను శ్రీనివాస్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. ఇతర రాష్ట్రాల్లో వైద్య విద్య రిజర్వేషన్ల మాదిరిగా గోవాలో కూడా అమలయ్యే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఓబీసీ సంక్షేమం కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణానికి సహకరించాలని కోరారు.

గద్దర్‌ను కేసీఆర్ ఎండలో కూర్చోబెట్టారు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: ప్రజా గాయకుడు గద్దర్‌ను గతంలో ప్రగతిభవన్ వద్ద ఎండలో కూర్చోబెట్టి మాజీ సీఎం కేసీఆర్ అవమానిస్తే.. గద్దర్‌కు పద్మ అవార్డు ఎలా ఇస్తామని కేంద్రమంత్రి బండి సంజయ్ అవమానించారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వామపక్ష భావజాలం ఉన్న నాయకులను బీజేపీ చేర్చుకొని ఎంపీలు, ఎమ్మెల్యేలు చేయలేదా? అని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కూడా వామపక్ష భావజాలం నుంచి వచ్చిన నాయకుడేనన్నారు. గద్దర్ తన పాటతో తెలంగాణ ఉద్యమంలో ఎంతో మందిని చైతన్య పర్చారని, గద్దర్‌కు పద్మ అవార్డు ఇవ్వొద్దనడం సరైందికాదని శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా 600 గ్రామాల్లో నాలుగు సంక్షేమ పథకాల అమలు విజయవంతంగా ప్రారంభమైందన్నారు. పదేళ్లలో ప్రజలకు రేషన్‌కార్డులు, లక్ష రుణమాఫీ చేయని హరీశ్‌రావే అసలైన డమ్మీ అని మండిపడ్డారు.

బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఇందిరా శోభన్



సాక్షి, హైదరాబాద్: గద్దర్‌ను అవమానకరంగా మాట్లాడిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని, తెలంగాణలో ఉండాలంటే ఆయన ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఇందిరా శోభన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'గద్దర్ బీజేపీ కార్యకర్తలను చంపించారు, అలాంటి వ్యక్తికి పద్మశ్రీ ఇవ్వాలా?' అని కేంద్ర సహాయ మంత్రి హోదాలో ఉన్న వ్యక్తి మాట్లాడే మాటలా? అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకోకపోతే బండి సంజయ్ హటావో నినాదాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని మోదీ కూడా తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువలేనిదని గద్దర్ మరణించినప్పుడు పంపిన సంతాప లేఖలో పేర్కొన్నారని తెలిపారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచిన వ్యక్తి గద్దర్ గురించి ఈ విధంగా మాట్లాడటం దుర్మార్గమన్నారు.

సామాజిక కోణమా.. సంస్థాగతమా?

CPIM

తెలంగాణ సీపీఎం కొత్త సారథి ఎంపికపై నేడు నిర్ణయం

రేసులో జూలకంటి, వీరయ్య, జాన్‌వెస్లీ, సుదర్శన్ • నేటితో ముగియనున్న పార్టీ రాష్ట్ర మహాసభలు

సాక్షి, హైదరాబాద్: వచ్చే మూడేళ్లపాటు తెలంగాణలో సీపీఎంను ఎవరు నడిపిస్తారనే విషయం మంగళవారం తేలనుంది. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న తమ్మినేని వీరభద్రం ఈసారి తప్పుకొనే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఆ స్థానంలో పార్టీ సీనియర్ నేతలు జూలకంటి రంగారెడ్డి, ఎస్. వీరయ్య, జాన్‌వెస్లీ, పోతినేని సుదర్శన్‌లలో ఒకరికి పార్టీ పగ్గాలు దక్కుతాయనే ప్రచారం జరుగుతోంది. సామాజిక, సంస్థాగత కోణంలో వారి పేర్లను పార్టీ పరిశీలిస్తోందని తెలుస్తోంది. తెలంగాణ ఏర్పాటైన తర్వాత మూడుసార్లు ఖమ్మం జిల్లాకు రాష్ట్ర కార్యదర్శి పదవి దక్కింది. ఖమ్మంతో పాటు నల్లగొండ జిల్లాలో పార్టీ సంస్థాగతంగా బలంగా ఉన్న నేపథ్యంలో ఆ జిల్లాకు చెందిన జూలకంటి రంగారెడ్డి పేరును కార్యదర్శి పదవి కోసం ప్రతిపాదించే అవకాశాలున్నాయని సమాచారం. ఆయనతో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన పోతినేని సుదర్శన్ పేరు కూడా వినిపిస్తోంది. సామాజిక కోణంలో చూస్తే బీసీ వర్గానికి చెందిన ఎస్.వీరయ్య, దళిత సామాజిక వర్గానికి చెందిన జాన్‌వెస్లీల పేర్లను కూడా కార్యదర్శి పదవి కోసం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ నలుగురిలో ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్, విజయ రాఘవన్, బి.వి.రాఘవులు సమక్షంలో మంగళవారం మధ్యాహ్నం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గం నిర్ణయం తీసుకోనుంది. గత కమిటీలో కార్యదర్శివర్గ సభ్యులుగా 15 మంది, రాష్ట్ర కమిటీకి 60 మందికిపైగా సభ్యులను తీసుకున్నారు. ఈసారి కూడా దాదాపు అదే సంఖ్యలో కార్యదర్శి వర్గాన్ని, రాష్ట్ర కమిటీని ఎంపిక చేస్తారని తెలుస్తోంది.

సొంత బలాన్నే నమ్ముకుందాం

రాష్ట్రంలో సొంత బలాన్నే నమ్ముకోవాలని.. పార్టీకి పూర్వ వైభవం తెచ్చేలా ఉద్యమ కార్యాచరణ రూపొందించాలని పార్టీ భావిస్తోంది. అలాగే వామపక్ష పార్టీలతో కలిసి పోరాటాలకు రూపకల్పన చేయడంతోపాటు బీజేపీని వ్యతిరేకించే పార్టీలను కలుపుకెళ్లాలనుకుంటోంది. అదే సమయంలో బీఆర్ఎస్‌తో కలిసి వెళ్లకూడదని, అధికార కాంగ్రెస్‌పై ఒత్తిడి తేవాలనుకుంటోంది. ఈ మేరకు రాజకీయ తీర్మానంలో పొందుపర్చనున్నట్లు సమాచారం. మరోవైపు సంగారెడ్డి కేంద్రంగా నాలుగు రోజులుగా జరుగుతున్న సీపీఎం 4వ మహాసభలు నేటితో ముగియనున్నాయి. నేడు పలు తీర్మానాలను ఆమోదించడంతోపాటు కొత్త కార్యదర్శి, కార్యదర్శివర్గం, రాష్ట్ర కమిటీ ఎన్నిక పూర్తి చేయడంతో మహాసభలు ముగియనున్నాయి.

భారత్ పర్వ్‌లో తెలంగాణ శకటం, పర్యాటకశాఖ పెవిలియన్

- ప్రారంభించిన తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్
- ఆకట్టుకుంటున్న రాణీరుద్రమ, రామప్ప దేవాలయాల నమూనా

సాక్షి, న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఎర్రకోట ప్రాంగణంలో కేంద్ర ప్రభుత్వం భారత్‌పర్వ్ పేరుతో శకటాలు ప్రదర్శిస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ శకటం, పర్యాటక శాఖ పెవిలియన్, ఫుడ్‌కోర్ట్‌లను సోమవారం తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ప్రారంభించారు. 'సర్ణిమ్ భారత్–విరాసత్–వికాస్' థీమ్‌తో జరుగుతున్న భారత్ పర్వ్‌లో తెలంగాణ ప్రభుత్వం రాణీరుద్రమ, రామప్ప దేవాలయం, తెలంగాణ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)ల నమూనాతో శకటాన్ని ప్రదర్శిస్తోంది. ఈ సందర్భంగా గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ 13వ శతాబ్దంలో రుద్రమదేవి దార్శనిక నాయకత్వం నుంచి ఉద్భవించిన తెలంగాణ వారసత్వం చరిత్రలో మహోన్నతంగా నిలిచిందని కొనియాడారు. క్రీ.శ.1213లో కాకతీయ రాజులు నిర్మించిన రామప్ప దేవాలయం ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో అధునాతన సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అలాగే తెలంగాణలోని సహజ, సాంస్కృతిక పర్యాటక ప్రదేశాలను కూడా ఇక్కడ ప్రదర్శిస్తున్నామని గౌరవ్ తెలిపారు. జాయింట్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, పి.రాజేంద్ర ప్రసాద్, పర్యాటక శాఖ అధికారులు రమాకాంత్, నితిన్, తదితరులు పాల్గొన్నారు. రాజ్ గోండ్ గిరిజనులు ప్రదర్శించిన గుస్సాడీ నృత్యం అలరించింది.

వర్సిటీల్లో బోధన సిబ్బంది పదవీ విరమణ వయసు పెంచొద్దు

తెలంగాణ వెటర్నరీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: యూనివర్సిటీల్లో బోధన సిబ్బంది పదవీ విరమణ వయసు పెంచే ఆలోచనను విరమించుకోవాలని తెలంగాణ వెటర్నరీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాటం శ్రీధర్ డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో పనిచేసే బోధన సిబ్బంది పదవీ విరమణ వయసు 65 ఏళ్లకు పెంచే విధంగా నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనను తీవ్రంగా తప్పుబడుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీల్లో ఇప్పటికే పీజీ, పీహెచ్‌డీలు చేసి ఎంతోమంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తుంటే, వారిని కాదని ఇప్పటికే ఉద్యోగాల్లో పనిచేస్తున్న వారికి పదవీ విరమణ వయసు పెంచడం బాధాకరమన్నారు. పదవీ విరమణ చేసిన వారిలో సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ అయిన వారిని ప్రభుత్వానికి సలహాదారులుగా పెట్టుకోవాలే తప్ప.. ఇలా సంవత్సరాల కొద్ది యూనివర్సిటీల్లో పని చేయిస్తూ జీతాలు ఇవ్వడం సరికాదని శ్రీధర్ అభిప్రాయపడ్డారు.

చందన్‌మిశ్రాను అలాఎలా అరెస్టు చేశారు?

- స్థానిక పోలీసులకు తెలియకుండా ఏపీ పోలీసులు జగద్గిరిగుట్టకు ఎలా వచ్చారు?
- తెలంగాణ సర్కార్‌ను ప్రశ్నించిన హైకోర్టుపూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ పోలీసులు జగద్గిరిగుట్టకు ఎలా వచ్చారు.. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వకుండా, స్థానిక మేజిస్ట్రేట్ నుంచి రవాణా అనుమతి పొందకుండా మావోయిస్టు చందన్ మిశ్రాను ఎలా అదుపులోకి తీసుకున్నారని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ప్రైవేట్ వాహనాలను ఎలా ఉపయోగించారనే దానిపై వివరణాత్మక కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా వేసింది. మిశ్రా, స్వాతిలను రంగారెడ్డి జిల్లా జగద్గిరిగుట్ట పోలీసులు అక్రమంగా నిర్బంధంలోకి తీసుకున్నారని, వారిని వెంటనే కోర్టులో హాజరుపర్చేలా పోలీసులకు ఉత్తర్వులు ఇవ్వాలంటూ రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తొలుత విచారణ చేపట్టిన హైకోర్టు సోమవారం (27)లోగా వారి ఆచూకీ తెలుసుకుని కోర్టుకు తెలపాలని ఆదేశించింది. ఈ హెబియస్ కార్పస్ పిటిషన్‌పై జస్టిస్ మౌషుమీ భట్టాచార్య, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావు ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది డి.సురేశ్‌కుమార్ వాదనలు వినిపించారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ స్వరూప్ వాదనలు వినిపిస్తూ.. చందన్ మిశ్రాను ఏపీ పోలీసులు అరెస్టు చేశారని, రాష్ట్ర పోలీసులు అరెస్టు చేయలేదని తెలిపారు. ఓ కేసులో శ్రీకాకుళం జిల్లా రంపచోడవరం మేజిస్ట్రేట్ పరిధిలోని చింటూరు పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. చందన్ మిశ్రా భార్య రేపాక స్వాతి సురక్షితంగా తన ఇంట్లోనే ఉన్నారని, భర్త అరెస్టు వివరాలను ఆమెకు వెల్లడించినట్లు పేర్కొన్నారు. లెనిన్‌నగర్‌లో ఉండే స్వాతిని హైకోర్టు ఆదేశాల మేరకు కూకట్‌పల్లి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చినట్లు, ఆ సమయంలో ఆమె సోదరుడు క్రాంతి వెంట ఉన్నారని చెప్పారు. ఏపీ పోలీసులు అరెస్టు చేస్తే ఇక్కడి సంబంధిత మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చాక పీటీ వారెంట్ పొందాలి కదా అని ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై వివరణాత్మక కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

నాలుగు రోజుల్లో 'పటాన్‌చెరు' నివేదిక

డీసీసీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జులతో మాట్లాడిన పీసీసీ కమిటీనేడు ఎమ్మెల్యేతో భేటీ కానున్న కమిటీ

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గంలో పాత, కొత్త కాంగ్రెస్ నేతల మధ్య జరుగుతున్న వివాదానికి చెక్‌పెట్టేందుకు టీపీసీసీ ఏర్పాటు చేసిన ద్విసభ్య కమిటీ ముమ్మర చర్చలు జరుపుతోంది. ఈ వివాదంపై నాలుగు రోజుల్లో పీసీసీకి నివేదిక ఇచ్చేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.జి.వినోద్‌రెడ్డిలతో కూడిన కమిటీ సిద్ధమవుతోంది. ఇప్పటికే సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిలతో కమిటీ సభ్యులు ఫోన్‌లో మాట్లాడారు. అమీన్‌పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పటాన్‌చెరు కీలక కాంగ్రెస్ నేతలతో భేటీ అయి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సమక్షంలో నేతల అభిప్రాయాలు తీసుకున్నారు. గతంలో బీఆర్ఎస్‌లో పనిచేసిన వారికే ఎమ్మెల్యే ప్రాధాన్యతనిస్తున్నారని పలువురు నేతలు ఈ సందర్భంగా కమిటీకి వివరించారు. అనంతరం సోమవారం కమిటీ సభ్యులు గాంధీభవన్‌కు కాట శ్రీనివాస్‌గౌడ్‌ను పిలిచారు. ఆయనతో గంటకు పైగా సమావేశమయ్యారు. ఎమ్మెల్యే వైఖరితో కేడర్ ఇబ్బంది పడుతున్నారని, అధికారులు కూడా సహకరించడం లేదని కమిటీ సభ్యులకు కాట వివరించినట్టు సమాచారం. కాగా, మంగళవారం ఈ కమిటీ పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో భేటీ కానుంది. ఆయనను కూడా గాంధీభవన్‌కు రావాలని కమిటీ ఆదేశించింది. ఎమ్మెల్యేతో భేటీ అనంతరం జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిలతో చర్చించిన తర్వాత నాలుగు రోజుల్లోపు పీసీసీకి నివేదిక సమర్పిస్తారని, సీఎం రేవంత్‌ను కలిసి అక్కడి పరిస్థితులను వివరిస్తారని సమాచారం.

అమెరికాలో తెలుగు విద్యార్థి ప్రతిభ

రిపబ్లిక్ డే ఉత్సవాల్లో వెంకటేశ్వరుడి వేషధారణతో ఆకట్టుకున్న రోషన్



సాక్షి, హైదరాబాద్: తెలుగు విద్యార్థి అమెరికాలో శ్రీవెంకటేశ్వరుడి వేషధారణతో అమెరికన్లను అబ్బుర పరిచాడు. సియాటెల్‌లో ఈనెల 26న వాషింగ్టన్ తెలుగు సమితి రిపబ్లిక్ డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల విద్యార్థులతో పలు వేషధారణ పోటీలు నిర్వహించింది. ఖమ్మం పట్టణానికి చెందిన ప్రవాస భారతీయుడు వనం నవీన్ కుమారుడు కార్తికేయ రోషన్ శ్రీవెంకటేశ్వరుడి వేషధారణతో పోటీ ఇచ్చాడు. రోషన్ అమెరికాలో నాలుగో తరగతి చదువుతున్నాడు. మొత్తం వంద మంది పాల్గొన్న ఈ పోటీల్లో రోషన్‌కు మొదటి బహుమతి వచ్చింది. తెలుగు సమితి అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ప్రవాస భారతీయులు రోషన్‌ను కొనియాడారు. అమెరికాలో ఉంటున్నప్పటికీ రోషన్ అన్నమయ్య కీర్తనలు, వెంకటేశ్వర సుప్రభాతంతో పాటు పలు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు చెందిన పద్యాలను స్పష్టంగా చెప్పడం విశేషం.

మొదలైన భరోసా

4,41,911 మంది రైతులు... 18,180 మంది వ్యవసాయ కూలీలకు లబ్ధి



సాక్షి, హైదరాబాద్: రైతాంగానికి పెట్టుబడి సాయం అందించే 'రైతుభరోసా' పథకం ప్రారంభమైంది. సోమవారం ఉదయం నుంచి ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతుల బ్యాంకు ఖాతాల్లో ఎకరానికి రూ. 6వేల చొప్పున బ్యాంకర్లు జమ చేశారు. హైదరాబాద్ మినహా 32 జిల్లాల్లోని 563 గ్రామీణ మండలాల్లోని 563 రెవెన్యూ గ్రామాల పరిధిలో రైతులకు రైతుభరోసా కింద రూ. 569 కోట్లు విడుదల కాగా, ఈ మొత్తాన్ని 4,41,911 మంది రైతుల ఖాతాల్లో జమచేశారు.

- 18,180 మంది కూలీల ఖాతాల్లోకి కుటుంబానికి రూ. 6,000 చొప్పున ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద జమ చేసినట్టు పంచాయతీరాజ్ శాఖ తెలిపింది. తొలి విడతగా రూ. 10.90 కోట్లు ఎంపిక చేసిన గ్రామాల్లోని వ్యవసాయ కూలీల ఖాతాలకు చేరాయి.

జిల్లాల వారీగా విడుదలైన నిధుల వివరాలు.

జిల్లా	మండలాలు	గ్రామాలు	రైతులు	రైతుభరోసా (రూ. కోట్లలో)
ఆదిలాబాద్	17	21	6,411	14.49
భద్రాద్రి కొత్తగూడం	23	25	22,242	39.07
హనుమకొండ	12	12	12,545	14.30
జగిత్యాల	20	20	22,242	39.07
జనగామ	12	12	12,320	15.91
భూపాలపల్లి	12	12	7,073	8.67
జోగులాంబ గద్వాల	13	13	7,829	12.47
కామారెడ్డి	22	24	9,062	8.35
కరీంనగర్	15	15	14,226	15.96
ఖమ్మం	21	21	20,802	28.42
ఆసిఫాబాద్	15	19	4,344	8.62
మహబూబాబాద్	18	19	14,611	18.14
మహబూబ్‌నగర్	16	16	14,575	17.27
మంచిర్యాల	16	17	7,143	8.72
మెదక్	21	21	14,833	14.06
మేడ్చల్	5	5	2,706	3.14
ములుగు	9	9	6,678	8.26
నాగర్‌కర్నూల్	20	20	16,806	23.05
నల్లగొండ	31	3	35,568	46.93
నారాయణపేట	13	13	9,348	13.87
నిర్మల్	18	18	7,912	10.56
నిజామాబాద్	31	31	35,568	46.93
పెద్దపల్లి	13	13	9,885	10.14
రాజన్న సిరిసిల్ల	12	12	9,724	12.26
రంగారెడ్డి	21	21	15,597	20.32
సంగారెడ్డి	25	25	19,933	24.15
సిద్దిపేట	26	26	31,170	36.76
సూర్యాపేట	23	23	29,352	37.84
వికారాబాద్	20	20	8,609	11.18
వనపర్తి	15	15	9,441	12.25
వరంగల్	11	11	11,386	12.86
యాదాద్రి భువనగిరి	17	17	17,576	26.95
మొత్తం	563	577	4,41,911	569



కోనసీమ అందాలు

ఇరువైపులా కొబ్బరితోటలు.. మధ్యలో పెద్ద కాలువ.. అందులో రంగుల తెరచాపలతో గాలివాటున పయనిస్తున్న పడవలు.. ఈ సుందర దృశ్యం ఏ కేరళలోదో అనుకుంటే పొరపాటే.. మన అందాల కోనసీమలోని మలికిపురం మండలం రాజులపాలెం వద్ద ఈ మనోహర దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. – సాక్షి ఫొటో గ్రాఫర్, రాజమండ్రి



పొద్దు పొడిచింది.. గువ్వ గూడు విడిచింది

పక్షుల కిలకిలారావాలతో తూరుపు తెల్లారింది. భానుడి లేలేత కిరణాల స్పర్శతో ప్రకృతి పరవశించింది. ఆహారాన్వేషణ కోసం పక్షుల గుంపు గూడు విడిచి వేటకి బయల్దేరింది. పుట్టపర్తి జిల్లా బుక్కపట్నం సమీపంలో ఈ సుందర దృశ్యాన్ని సాక్షి కెమెరా బంధించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



హాయి హాయిగా సాగిపోదాం

రోడ్డుకి ఇరువైపులా చెట్లు.. చుట్టూరా పంటపొలాలు.. పచ్చదనం పోగుపోసినట్లు కనిపించే గుట్టలు.. ఈ రహదారిలో ప్రయాణం ఒక మధురమైన అనుభూతి. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నుంచి కడపకు వెళ్లే ఈ రహదారిలో ప్రయాణించేవారు మధ్యలో వాహనాన్ని ఆపి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తుంటారు. – సాక్షి ఫొటో గ్రాఫర్, కడప

క్లుప్తంగా...

ఆర్టీసీ ఉద్యోగుల పీఆర్సీ బకాయిలు చెల్లించండి

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు పెండింగ్ పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) కోరింది. వివిధ కేటగిరీల్లో ఉన్న 10వేల పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆర్టీసీ ఎండీ సీహెచ్.ద్వారకా తిరుమలరావుకు ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య వినతిపత్రాన్ని సమర్పించినట్లు ఈయూ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది.

'బీసీ' యూనిట్లు గ్రౌండింగ్ చేయండి

సాక్షి, అమరావతి: రాబోయే రెండు నెలల్లో బీసీ కార్పొరేషన్ ద్వారా అందజేసే యూనిట్లు వంద శాతం గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశాలిచ్చారు. ఇటీవల రిటైరయిన బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పోలా భాస్కర్ స్థానంలో సత్యనారాయణను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సోమవారం బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు పథకాల అమలు తీరు తెన్నులపై చర్చించారు.

జనసేనను స్వప్రయోజనాల కోసం వాడుకోవద్దు..

సాక్షి, అమరావతి: స్వప్రయోజనాల కోసం జనసేన పార్టీని, రాజకీయాలను ఉపయోగించుకోవద్దు.. ప్రభుత్వంలో ఉన్నాం కాబట్టి ఏం చేసినా చెల్లుతుందనే భావన పెట్టుకోవద్దు.. అంటూ జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు పార్టీ నేతలకు సూచించారు. సోమవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

రెవెన్యూ మాన్యువల్ రూపకల్పనకు కమిటీ

సాక్షి, అమరావతి: రెవెన్యూ మాన్యువల్ తయారు చేసేందుకు భూ పరిపాలన శాఖ అదనపు కమిషనర్ (అదనపు సీసీఎల్ఏ) నేతృత్వంలో ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. అదనపు సీసీఎల్ఏ చైర్మన్‌గా, ముగ్గురు జేసీలు, ముగ్గురు డీఆర్వోలు, సీసీఎల్ఏ కార్యాలయంలో పనిచేసే తొమ్మిది మంది అధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు.

విద్యుత్ శాఖలో ఎస్టీ కోటా పాటించడంలేదు

సాక్షి, అమరావతి: విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల నియామకంలో ఎస్టీ కోటా పాటించడంలేదనే ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై విద్యుత్ శాఖాధికారులతో సమీక్షిస్తామని ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకర్రావు తెలిపారు. విజయవాడలోని ఎస్టీ కమిషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై వినతులు స్వీకరించారు.

ప్రభుత్వ విద్యను బలహీనపరిచే కుట్ర

సాక్షి, అమరావతి: ఇంటర్ విద్యలో సంస్కరణల పేరుతో ఇంటర్ విద్యా మండలి విడుదల చేసిన ప్రతిపాదనలు ప్రభుత్వ విద్యను బలహీనపరిచేలా ఉన్నాయని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ప్రతిపాదనలు కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాపార అభివృద్ధికి దోహదపడేవిగాను, ప్రభుత్వ విద్యాసంస్థలను బలహీన పరిచేవిగా ఉన్నాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సీఎంకు ఆర్యవైశ్య సంఘాలు కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజును ×మాఘ శుద్ధ విదియ× తిథి నాడు రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై ఆర్యవైశ్య సంఘాలు సీఎంకు కృతజ్ఞతలు తెలిపాయి. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు సోమవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీసీపీడీసీఎల్ సీఎండీగా భాస్కర్‌కు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) సీఎండీగా ఏపీ ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ ఎ.కె.వి.భాస్కర్‌కు ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించింది. ఈ మేరకు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.



కొండాకోనా చదునుచేసి, తుప్పా దొండా తగలబెట్టి పోడు కొట్టి నాలుగు గింజలు పండించి కడుపు నింపుకునే గిరిజనులు ఇప్పుడు పంథా మార్చారు. వాణిజ్య పంటల సాగుతో మైదాన ప్రాంత రైతులకు దీటుగా దూసుకుపోతున్నారు. పోడును పక్కన పెట్టి కాఫీ తోటల సాగుతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. దశాబ్దాల కిందట మన్యంలో ప్రారంభమైన కాఫీ సాగు ప్రస్తుతం ఇంతింతై వేల ఎకరాలకు విస్తరించింది. కేంద్ర కాఫీ బోర్డు, ఐటీడీఏల తోడ్పాటుతో గిరి రైతులు అద్భుతాలే చేస్తున్నారు.

మన్యంలో కాఫీ సిరులు

కొండపోడు వదిలేసి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న గిరిజనులు

- ఏటా ఎకరానికి రూ.50వేల వరకు ఆదాయం –1967 నుంచి ఏజెన్సీలో కాఫీతోటల సాగు
- కేంద్ర కాఫీ బోర్డు, ఐటీడీఏల సమగ్ర సహకారం
- మొదట్లో 3 ఎకరాలతో ప్రారంభం.. నేడు 2,59,947 ఎకరాల్లో సాగు
- కాఫీతోటల సాగులో 2,45,800 గిరిజన కుటుంబాలు
- మార్కెట్‌లోకి ఏటా 14వేల టన్నుల నాణ్యమైన కాఫీ గింజలు
- ఈ ఏడాది మన్యం కాఫీకి మరింత డిమాండ్

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): అడవిని నరికి పోడు వ్యవసాయం చేసుకుని దుర్భర జీవనం సాగించే గిరిజన రైతులు నేడు కాఫీ తోటల సాగుతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.1967లో జి.కే.వీధి మండలం ఆర్.వి.నగర్, అనంతగిరి, మారేడుమిల్లి ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా కేంద్ర కాఫీ బోర్డు మూడు ఎకరాల్లో అరబికా రకం కాఫీ తోటల సాగు ప్రారంభించింది. గిరిజనులకు భాగస్వామ్యం చేస్తూ కేంద్ర కాఫీ బోర్డు చేసిన ఈ ప్రయత్నం వృథా కాలేదు. గిరిజనులను పోడు వ్యవసాయం నుంచి దూరంగా పెట్టి వారితో కాఫీ మొక్కలకు నీడనిచ్చే సిల్వర్ ఓక్ మొక్కలు నాటించి అవి బాగా ఎదిగిన తరువాత ఆ మొక్కల మధ్య కాఫీ మొక్కలు నాటించారు. దీంతో 1967 నుంచి ఏటా మన్యంలో కాఫీ తోటలు విస్తరిస్తూ వచ్చాయి. కేంద్ర కాఫీబోర్డుతో పాటు పాడేరు ఐటీడీఏ కాఫీ తోటలు విస్తరించేందుకు గిరిజన రైతులకు మొక్కలతో పాటు అవి ఎదిగేంతవరకు ఆర్థిక భరోసా కల్పించాయి. కాఫీ రైతులకు పల్పింగ్ యూనిట్లు, ఇతర యంత్రాలు, ఇంటి ముందు సిమెంట్ కళ్లాలు కూడా నిర్మించాయి.

2,59,947 ఎకరాల్లో కాఫీ సాగు

పాడేరు డివిజన్‌లోని 11మండలాలతో పాటు రంపచోడవరం డివిజన్‌లోని మారేడుమిల్లి ప్రాంతంతో కలుపుకుని ప్రస్తుతం 2,59,947 ఎకరాల్లో కాఫీతోటలు సాగవుతున్నాయి. 2,45,800మంది గిరిజన రైతులు కాఫీ సాగు ద్వారా ఉపాధి పొందుతున్నారు. 1967లో జి.కే.వీధి మండలం ఆర్.వి.నగర్‌లో కేంద్ర కాఫీ బోర్డు కాఫీ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అప్పట్లో మూడు ఎకరాలతో ప్రారంభమైన కాఫీ సాగు ప్రస్తుతం వేల ఎకరాలకు విస్తరించడం వల్ల గిరిజనులకు ఉపాధి దొరకడంతో పాటు కొండపోడు భూములన్నీ ప్రస్తుతం పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

ఎకరానికి రూ.50వేల వరకు ఆదాయం

గిరిజన రైతులు కాఫీతోటలను సేంద్రియ పద్ధతిలోనే సాగు చేస్తుండడంతో ఇక్కడి కాఫీ నాణ్యతలో నంబర్ వన్‌గా నిలుస్తోంది. ఎకరానికి 500 కిలోల వరకు కాఫీపండ్ల దిగుబడి వస్తుంది. వీటిని పల్పింగ్ చేసి 80 నుంచి 160 కిలోల వరకు పాచ్‌మెంట్ కాఫీగింజలను గిరిజన రైతులు అమ్ముతారు. అలాగే కాయలను నేరుగా ఆరబెట్టి చెర్రీ రకంగాను అమ్ముతుంటారు.ప్రస్తుతం మొత్తం తోటల్లో 2,01,947 ఎకరాల కాఫీ తోటలు మాత్రమే ఏటా ఫలసాయం ఇస్తున్నాయి. 14 వేల మెట్రిక్ టన్నుల పాచ్‌మెంట్ కాఫీ గింజలను గిరిజన రైతులు ఉత్పత్తి చేస్తున్నారు. ఎకరానికి రూ.50 వేల వరకు ఆదాయం వస్తుండటంతో గిరిజన రైతులకు ఏటా కాఫీ పంట జీవనోపాధి కల్పించి ఆదుకుంటోంది. గత మూడేళ్లలో సాగు చేసిన కాఫీతోటలు కూడా వచ్చే ఏడాది నాటికి ఫలసాయం ఇవ్వనున్నాయి.

ఈ ఏడాది మరింత డిమాండ్

మన్యంలో గిరిజన రైతులు సాగు చేసే నాణ్యమైన కాఫీ గింజలకు బెంగళూరు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. అక్కడి మార్కెట్‌లో పాచ్‌మెంట్ కాఫీ గింజలకు కిలో రూ.450 వరకు ధర పలుకుతుండటంతో ఏజెన్సీలోని జీసీసీ, ఐటీడీఏతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఎన్‌జీవోలు, ప్రైవేట్ వ్యాపారులంతా పోటాపోటీగా గిరిజన రైతుల నుంచి కాఫీ పంటను కొనుగోలు చేస్తున్నారు. ఏజెన్సీలో పాచ్‌మెంట్ కాఫీ గింజల ధర కిలో రూ.350 పలుకుతోంది. దీంతో ఈఏడాది ఎకరానికి అదనంగా మరో రూ.20 వేలు ఆదాయం వస్తుందని గిరిజన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పాడేరు మండలం గుర్రగరువులో కాఫీ పండ్లను సేకరిస్తున్న రైతు



మోదపల్లిలో కాఫీ పండ్లు, కాయలను వేరు చేస్తున్న మహిళా రైతు



పల్పింగ్ తరువాత పాచ్‌మెంట్ కాఫీ గింజలను ఎండలో ఆరబెడుతున్న మోదాపల్లి గ్రామంలోని రైతు



కాఫీ –కాయలు, పండ్లు, పాచ్‌మెంట్, పప్పరకం, వేపిన కాఫీ గింజలు, కప్పులో కాఫీ నమూనా

పోడు వ్యవసాయం మానేసాం



పూర్వం మోదాపల్లి ప్రాంతంలో అడవిని నరికి పోడు వ్యవసాయం చేసేవాళ్లం.1975లో కాఫీ మొక్కలను తమ తండ్రులు నాటుకున్నారు.1980 నుంచి కాఫీతోటల ద్వారా ఆదాయం పొందుతున్నాం. మాకు మూడున్నర ఎకరాల కాఫీతోటలు ఉన్నాయి.నా ఇద్దరు కొడుకులకు.నాకు ఈ కాఫీతోటే ఆధారం. ప్రతి ఏడాది రూ.1లక్షా 50వేల వరకు ఆదాయం వస్తుంది.

– డిప్పల హసన్న, కాఫీ రైతు, మోదాపల్లి, పాడేరు మండలం

మార్కెటింగ్ సేవలు మరింత విస్తరించాలి



కాఫీతోటల సాగుతో ఏటా గిరిజన రైతులకు మంచి ఆదాయం వస్తున్నప్పటికీ, మార్కెటింగ్ సేవలను మరింత విస్తరించాలి. బెంగళూరు మార్కెట్‌లో ఈఏడాది పాచ్‌మెంట్ గింజలకు కిలో రూ.450 ధర ఉన్నప్పటికీ జీసీసీ, ఇతర సంస్థలన్నీ కిలో రూ.350 తోనే కొనడం వల్ల మరింత ఆదాయాన్ని కోల్పోతున్నాం. బెంగళూరు కాఫీ మార్కెట్ ధరలను పరిగణనలోకి తీసుకుని ఏజెన్సీలో కాఫీ గింజలను కొనుగోలు చేయాలి.

– పాలికి లక్కు, కాఫీ రైతుల సంక్షేమం సంఘం నేత, పాడేరు

దిగుబడులు పెంచేందుకు చర్యలు

ఏజెన్సీలో ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ పద్ధతుల ద్వారానే కాఫీపంట దిగుబడులు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కాఫీతోటలు గిరిజనులకు వరమనే చెప్పాలి.కాఫీతోటలు సాగు చేస్తున్న గిరిజన రైతులకు కేంద్ర కాఫీబోర్డు అన్ని విధాల ప్రోత్సహిస్తుంది. రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– సమల రమేష్ సీనియర్ లైజన్ అధికారి, కేంద్ర కాఫీబోర్డు మినుములూరు

సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ డైరెక్టర్‌గా సతీశ్

సాక్షి, అమరావతి: ఏపీ స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీ డైరెక్టర్‌గా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ సీడ్స్ డైరెక్టర్‌గా పనిచేస్తోన్న డాక్టర్ యడ్లపల్లి సతీశ్‌ను నియమిస్తూ వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్‌సర్టిఫికేషన్ అథారిటీ డైరెక్టర్‌గా కూడా వ్యవహరించనున్నారు. ఈ పోస్టుల్లో ఆయన ఏడాది పాటు కొనసాగనున్నారు.

మిర్చి యార్డు కార్యదర్శిగా చంద్రిక

గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చి యార్డు) సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా జీవీఎంసీ డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎ.చంద్రిక నియమితులయ్యారు. ఈమె రామచంద్రాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా కూడా వ్యవహరించనున్నారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంఐడీహెచ్ డిప్యూటీ డైరెక్టర్‌గా చంద్రశేఖర్‌రావు

ఉద్యాన శాఖలో కేంద్రం అమలు చేస్తోన్న మిషనల్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టీకల్చర్ (ఎంఐడీహెచ్) ప్రాజెక్ట్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఎస్‌వి.కె.చంద్రశేఖరరావు నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఎక్స్ అఫిషియో స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసేలా మార్గదర్శకాలు




సాక్షి, అమరావతి: ప్రభుత్వం జీవో 117 ఉపసంహరణ కోసం ఇటీవల విడుదల చేసిన మార్గదర్శకాలు ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసేలా ఉన్నాయని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలల్లో 20 మంది విద్యార్థులు దాటితే రెండో టీచర్ పోస్టు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ప్రాథమిక పాఠశాలల్లో 20 మంది విద్యార్థులు దాటిన తర్వాత రెండో టీచర్ పోస్టు ఉన్నా, కొన్ని గ్రామాల్లో విద్యార్థుల నమోదు తగ్గిందన్నారు. ప్రస్తుతం 117 జీవో రద్దు చేసి ఫౌండేషన్ పాఠశాలల్లో 1:30 ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిలో విభజిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. దీనివల్ల ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

మైనారిటీలపై కూటమి ప్రభుత్వం వివక్ష

ముస్లిం దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరి

సాక్షి, అమరావతి: ముస్లిం మైనారిటీలపై కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆంధ్రప్రదేశ్ ముస్లిం దూదేకుల జేఏసీ అధ్యక్షుడు షేక్ దస్తగిరి విమర్శించారు. రాజకీయ పదవుల నుంచి ఐఏఎస్, ఐపీఎస్ వంటి కీలక అధికారుల పోస్టింగ్‌ల వరకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఆరోపించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు పెద్దపీట వేసిందని ఆయన స్పష్టంచేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు ప్రభుత్వం పథకం ప్రకారం ముస్లిం సమాజాన్ని అణచివేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. మైనారిటీ వర్గానికి మంత్రి ఉన్నప్పటికీ ముస్లిం సమాజం గోడు పట్టించుకోని దుస్థితి నెలకొందన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా విద్య, ఉద్యోగాల్లో గొప్ప మేలు చేశారని దస్తగిరి గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ముస్లింలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా చేయూతనిచ్చారని వివరించారు. శాసన మండలి వైస్ చైర్‌పర్సన్‌గా, ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించడంతోపాటు అనేక రాష్ట్రస్థాయి కీలక నామినేటెడ్ పదవులను ఇచ్చారని గుర్తుచేశారు. ఓట్ల కోసమే ముస్లిం నేతలను వాడుకుని వదిలేసిన కూటమి ప్రభుత్వం నిజస్వరూపాన్ని ముస్లిం సమాజం గమనించాలని దస్తగిరి కోరారు.



శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,466 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,677 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.67 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 6 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తై అమావాస్య పూజలు రేపు

కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం తై అమావాస్య పూజలు, అభిషేకం నిర్వహించనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం పూజలు, అభిషేకం..సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

ఫిబ్రవరి 4న రథసప్తమి

కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకంలోని వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ ఆలయమైనా మణికంఠేశ్వర స్వామి ఆలయంలో ఫిబవరి 4వ తేదీన రథసప్తమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా సూర్య నారాయణ స్వామివారికి అభిషేక పూజలు జరుగుతాయన్నారు.

పల్లకిలో ఊరేగిన భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్: అన్నమయ్య జిల్లా రాయచోటిలోని శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకిలో ఊరేగాడు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధులలో భక్తులు ఊరేగించారు.


మహానందం... మహానందీశుడి పల్లకోత్సవం



మహానంది: నంద్యాల జిల్లా మహానందిలో పుష్యమాసం, బహుళ త్రయోదశి పురస్కరించుకుని సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవి శంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు... స్వామి, అమ్మవారి దంపతులను విశేషంగా అలంకరించి ముందుగా స్థానిక అలంకార మండపంలో శాస్త్రోక్త పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం కన్నుల పండుగగా చేపట్టారు.

నేత్రపర్వంగా శివయ్యకు రుద్రాభిషేకం

ద్వారకాతిరుమల : ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలో క్షేత్రపాలకునిగా విరాజిల్లుతున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం శివదేవునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.



31నుంచి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'బాల మహోత్సవ్'

చేబ్రోలు: చిన్నారుల కోసం మొట్టమొదటి సారిగా రాష్ట్రస్థాయిలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 1 వరకు రెండు రోజుల పాటు విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించే ×విజ్ఞాన్ బాల మహోత్సవ్-2025×ను విజయవంతం చేయాలని వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు పిలుపునిచ్చారు. యూనివర్సిటీలో సోమవారం ఆయన మాట్లాడుతూ 6వ తరగతి నుండి 10వ తరగతి లోపు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా ఖో-ఖో జట్ల ఎంపిక



నకరికల్లు: ఉమ్మడి గుంటూరు జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల, పురుషుల జిల్లా ఖో-ఖో జట్ల ఎంపిక పూర్తయింది. మహిళల, పురుషుల జిల్లా స్థాయి తుది జట్లను అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చింతా పుల్లయ్య ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులు ప్రకాశం జిల్లా జె.పంగలూరులో ఫిబ్రవరి 7,8,9 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున తలపడనున్నారు. క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి జిల్లా ప్రథమస్థానంలో నిలిచేలా కృషి చేస్తామని ఫిజికల్ డైరెక్టర్, ఖో-ఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చింతా పుల్లయ్య తెలిపారు.

సాక్షి ప్లస్
మంగళవారం ॥ 28-1-2025

హెల్త్

మంచి జీర్ణాశయంతో జీవిద్దాం!

ఒంటికి పట్టకపోవడం అనే కండిషన్ కొన్ని సాధారణ పరిస్థితుల కారణంగా రావచ్చు లేదా కొన్నిసార్లు కొన్ని శరీర నిర్మాణపరమైన కారణాల తోనూ ఇలా జరగవచ్చు.

ఆహారం తీసుకున్న తర్వాత అందులోని పోషకాలు ఒంటికి పట్టకపోవడం అన్న కండిషన్‌ను 'మాల్ అబ్జార్‌ప్షన్' అంటారు. జీర్ణవ్యవస్థలోని ఇన్ఫెక్షన్లు లేదా ఇతర అనేక కారణాల వల్ల ఆహారం జీర్ణమయ్యే ప్రక్రియలో అందులోని పోషకాలు ఒంటికి పట్టకపోవచ్చు. కొన్నిసార్లు ప్రత్యేకంగా ఏదో ఓ అంశమే ఒంటికి పట్టకపోవచ్చు కూడా. ఉదాహరణకు లాక్టేజ్ అనే ఎంజైము లోపం వల్ల పాలు ఒంటికి పట్టకపోవచ్చు. ఈ కండిషన్‌ను లాక్టోజ్ ఇన్‌టాలరెన్స్ అంటారు. కొందరిలో 'సీలియాక్ డిసీజ్' లేదా 'క్రోన్స్ డిజీస్' అనే రుగ్మతలు ఉన్నప్పుడు ఆహారంలోని అన్ని పోషకాలూ ఒంటికి పట్టకపోవచ్చు. అయితే కారణాలను బట్టి మాల్ అబ్జార్‌ప్షన్‌కు చికిత్స అందించాల్సి ఉంటుంది. పోషకాలు ఒంటికి పట్టని ఈ కండిషన్ గురించి తెలుసుకుందాం.

మాల్ అబ్జార్‌ప్షన్ ఎందుకు, ఎలా?
తిన్న ఆహారం ఒంటికి పట్టకపోవడం ఎందుకు జరుగుతుందో తెలుసుకునేందుకు పేగుల్లో ఆహారం జీర్ణమయ్యే ప్రక్రియ ఎలా జరుగుతుందనే పరిజ్ఞానం కొంత అవసరం. సాధారణ పరిస్థితుల్లో ఆహారం జీర్ణమై, ఒంటికి పట్టడాన్ని మూడు దశలుగా చెప్పవచ్చు. అవి...

1) ల్యూమినల్ 2) మ్యూకోజల్ 3) పోస్ట్ అబ్జార్‌ప్టివ్

ఈ మూడు దశల్లో ఎక్కడ లోపం జరిగినా అది మాల్ అబ్జార్‌ప్షన్‌కు దారితీయవచ్చు.

1 ల్యూమినల్ దశలో

ఆహారంలోని కొవ్వులు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు... ఇవన్నీ జీర్ణవ్యవస్థల్లోని ఎంజైములు, బైల్‌లో కలిసి, దాదాపు కరిగిన స్థితిలో ఉంటాయి.

- ల్యూమినల్ దశలో లోపాలకు
ఈ దశలో లోపాలకు ప్రధానంగా ప్యాంక్రియాస్ గ్రంథికి ఇన్ఫెక్షన్ వచ్చే ప్యాంక్రియాటైటిస్, ఏవైనా కారణాలతో ప్యాంక్రియాస్ గ్రంథి తొలగింపు, ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ లేదా దేహంలోని కణాలను దెబ్బతీసే సిస్టిక్ ఫైబ్రోసిస్ కారణంగా జరుగుతుంది. దీనివల్ల కొవ్వులను జీర్ణం చేసే లైపేజ్ అనే ఎంజైము తగ్గడంతో కొవ్వులు, ప్రోటీన్లు ఒంటికి పట్టవు.

అలాగే ఏవైనా చిన్నపేగు సర్జరీలు జరగడం వల్ల... పైత్యరసం (బైల్)తో పాటు ప్యాంక్రియాటిక్ ఎంజైములు... జీర్ణం కావాల్సిన ఆహారంతో సరిగా, పూర్తిగా కలవకపోవడంతోనూ జీర్ణప్రక్రియలో అంతరాయంతో ఆహారం ఒంటికి పట్టకపోవచ్చు.

ఇక చాలా అరుదుగా కొన్నిసార్లు ట్రిప్సినోజెన్, ఎంటిరోజైనేజ్ అనే ఎంజైములను ప్రేరేపించాల్సిన ప్రో-ఎంజైములు చురుగ్గా లేనందువల్ల తిన్న ఆహారం సరిగా జీర్ణం కాకపోవడం (అజీర్తి) లేదా తిన్నది ఒంటికి పట్టకపోవడం జరగవచ్చు.

- ఆహారపు ముద్ద... ఓ అరిగిపోయే ద్రవంగా రూపొందకపోవడం (ఇంపెయిర్‌డ్ మిసెల్లీ ఫార్మేషన్) : ఇది అనేక కారణాల వల్ల జరగవచ్చు. ఉదాహరణకు...
- కాలేయం దెబ్బతినడం వల్ల లేదా సిర్రోసిస్ కారణంగా తగినంత బైల్ సాల్ట్స్ ఉత్పన్నం కాకపోవడం.
- స్రవించాల్సిన పైత్య రసానికి (బిలియరీ జ్యూసెస్‌కు) ఏదైనా అడ్డంకి ఏర్పడటం లేదా కోలోయోస్టాటిక్ జాండీస్ అనే కామెర్ల కారణంగా.
- ఏవైనా కారణాలతో చిన్న పేగులను శస్త్రచికిత్సతో తొలగించిన పరిస్థితుల్లో పైత్యరస ప్రవాహం సరిగా లేకపోవడం (ఎంటరోపాథిక్ బైల్ సర్క్యులేషన్)
- చిన్నపేగుల్లో బ్యాక్టీరియా చాలా ఎక్కువగా పేరుకుపోవడంతో పైత్యరసంలో ఉండే సంక్లిష్టమైన నిర్మాణం లోంచి గ్లైసిన్ / టారిన్ అనే అమైనో యాసిడ్స్ తాలూకు మాలెక్యూల్స్‌ను తొలగించడం. దీన్నే బైల్ సాల్ట్ డీకాంజ్యుగేషన్ అంటారు.
- ఇక కొన్నిసార్లు చిన్నపేగుల నిర్మాణ లోపాలతో అక్కడ జీర్ణమైన ఆహారపు కదలికలు సరిగా లేకపోవడం వల్ల, ఆహారపు ముద్ద ఏదైనా కారణాలతో కలుషితం కావడం వల్ల (స్మాల్ బవెల్ కంటామినేషన్), ఆ ప్రాంతంలో బ్యాక్టీరియా అనూహ్యంగా చాలా ఎక్కువగా పెరిగిపోవడం వల్ల జరిగే అంతరాయాలతో... ఈ అన్ని కారణాలతో తిన్నది ఒంటికి పట్టకపోవచ్చు.
- జీర్ణమైన ఆహారాన్ని తీసుకునే లోపలి పొరలోని లోపాలతో లేదా అక్కడ ఉండే బ్యాక్టీరియా (ల్యూమినల్) పెరిగిపోయి, ఆహారం ఇంకడానికి అడ్డంకిగా మారడంతో కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, విటమిన్లు (ఉదాహరణకు విటమిన్-బి12, ఫోలేట్) లాంటివి జీర్ణమయ్యే సామర్థ్యం తగ్గడంతోనూ తిన్నది ఒంటికి పట్టకపోవచ్చు. ఇక విటమిన్ బి12 ఒంటికి పట్టకపోవడం అన్నది ప్యాంక్రియాటిక్ ఎంజైముల లోపం వల్ల జరగవచ్చు.

2 మ్యూకోజల్ దశలో

ఆహారాన్ని దేహంలోకి ఇంకింపజేసుకునేందుకు / లాక్కునేందుకు వీలుగా పేగుల్లోని ఎపిథీలియమ్ కణాలనేవి ఓ పొరలా ఏర్పడి ఉంటాయి. ఇవన్నీ మైక్రో విల్లై అనే చేతివేళ్లలాంటి నిర్మాణాలపై అమరి ఉంటాయి.

- ఆహారం జీర్ణమయ్యేందుకు చాలా ఎక్కువ ఉపరితలం అవసరమయ్యేలా మైక్రోవిల్లీ అనే వేళ్లవంటి నిర్మాణాల్లో లోపం వల్ల.
- డైశాకరైడేజ్ అనే ఎంజైము లోపం వల్ల డైశాకరైడ్స్ అనే చక్కెరలు సరిగా జీర్ణకాకపోవడం.
- ల్యాక్టేజ్ అనే ఎంజైము లోపంతో పాలు సరిగా అరగకపోవడం.
- ఇమ్యూనో గ్లోబ్యులిన్ ఎ లోపం వల్ల కొన్ని రకాల పిండి పదార్థాలు జీర్ణం కాకపోవడం.
- కార్బోహైడ్రేజ్ అనే ఎంజైము లోపం (సుక్రేజ్, ఐసోమాల్టేట్ వంటి వాటి లోపం)తో పిండిపదార్థాల్లోని చెక్కరలు సరిగా అరగకపోవడం.

పోషకాలు ఇంకే ప్రక్రియ సరిగా జరగకపోవడం (ఇంపెయిర్డ్ న్యూట్రియెంట్ అబ్జార్‌ప్షన్) :

- పుట్టుకతో వచ్చే కొన్ని జన్యులోపాలతోను లేదా ఆ తర్వాత వచ్చే మరికొన్ని సమస్యలతోనూ ఇలా పోషకాలు దేహంలోకి ఇంకే ప్రక్రియ సరిగా జరగకపోవచ్చు. పుట్టుకతోనే వచ్చే లోపాల గురించి చెప్పాలంటే అది గ్లుకోజు-గెలాక్టోజు సరిగా ఒంటబట్టకపోవడం వంటివి. ఇక ఆ తర్వాత వచ్చే సమస్యలంటే... జీర్ణమైన ఆహారాన్ని ఒంటిలోకి ఇంకేలా చేసే ఉపరితలం తగ్గిపోవడం.
- జీర్ణమైన ఆహారాన్ని దేహంలోకి ఇంకేలా చేసుకునే ఉపరితలం దెబ్బతినడం. (సీలియాక్ స్ప్రూ, ట్రాపికల్ స్ప్రూ, క్రోన్స్ డిసీజ్, ఎయిడ్స్ ఎంటిరోపతి అనే జబ్బుల్లోనూ అలాగే రేడియేషన్ చికిత్స తీసుకునేవారిలో ఇలా జరగవచ్చు.
- లింఫోమా వంటి క్యాన్సర్లలో దేహంలోకి జీర్ణాహారం ఇంకడం తగ్గుతుంది.
- జియార్డియా అనే పరాన్న జీవులూ లేదా ఇతర బ్యాక్టీరియా అనూహ్యంగా అపరిమితంగా పెరిగినప్పుడు జీర్ణమైన ఆహారం ఒంటికి పట్టదు. అలాగే విపుల్ డిసీజ్, క్రిప్టోస్పోరాడోసిస్, మైక్రోస్పోరిడియోసిస్ వంటి రుగ్మతల్లోనూ తిన్నది ఒంటికి పట్టదు.

3 అబ్జార్‌ప్టివ్ దశలో

కొవ్వులూ ఇంకా ఇతర కీలకమైన పోషకాలన్నీ లింఫాటిక్ ప్రవాహం నుంచి అలాగే ఎపిథీలియల్ కణాల ద్వారా రక్తప్రవాహంలోకి చేరి దేహంలోని అన్ని భాగాలకూ చేరుకునే ప్రక్రియ జరుగుతుంది.

ఒంటికి పట్టే దశ తర్వాతి అంశాల్లో (పోస్ట్ అబ్జార్‌ప్టివ్ ఫేజ్)...
లింఫాటిక్ ప్రవాహంలో ఏవైన లోపాలు ఉన్నప్పుడు (ఇలా పుట్టుకతోనే వచ్చే ఇంటస్టినల్ లింఫాంజియెక్టాసియా, మిల్రాయ్ డిసీజ్ వంటి వ్యాధుల కారణంగా జరగవచ్చు). అలాగే కైలోమైక్రోన్స్, లైపోప్రోటీన్స్ వల్ల తిన్నది ఒంటబట్టక ప్రోటీన్లను కోల్పోవాల్సి రావచ్చు.

మాల్ అబ్జార్‌ప్షన్ లక్షణాలు...
- కడుపు ఉబ్బుగా మారడం
- కడుపు పట్టేసినట్లుగా ఉండటం
- బరువు తగ్గడం
- కొన్నిసార్లు నీళ్ల విరేచనాలు (డయేరియా)
- విటమిన్లు, ఖనిజ లవణాల లోపం వల్ల రక్తహీనత (అనీమియా)
- చర్మం రంగు పాలిపోయి కనిపించడం
- జుట్టు ఊడిపోవడం
- రే-చీకటి
- విటమిన్ కె లోపం కారణంగా రక్తస్రావం జరగటం
- తీవ్రమైన అలసట, నీరసం, నిస్సత్తువ / మానసికంగానూ అలసట
- ఎముకలు గుల్లబారడం (ఆస్టియోపోరోసిస్)

నిర్ధారణలో ఇమేజింగ్

- స్మాల్ బవెల్ బేరియమ్ పరీక్షలతో చిన్నపేగుల పైభాగంలోని పోషకాలు ఒంట్లోకి సరిగా రావడం లేదని తెలుస్తుంది.
- బేరియల్ పరీక్షలోని ఫ్లాక్యులేషన్‌తో జీర్ణవ్యవస్థలోని లోపలి పొర (గట్ ల్యూమెన్) సరిగా లేదని తెలుస్తుంది.
- స్క్లీరోడెర్మా అనే కండిషన్ వల్ల చిన్న పేగులు వెడల్పు కావడం, డైవర్టిక్యులోసిస్ వంటి కండిషన్లు తెలుస్తాయి.
- ఇంకా ఈ ఇమేజింగ్ పరీక్షలో జీర్ణ వ్యవస్థలోనూ, చిన్నపేగుల్లోనూ ఏవైనా దేహనిర్మాణపరమైన లోపాలు ఉంటే తెలుస్తాయి.
- ఇక సీటీ స్కాన్ పరీక్షలో క్రానిక్ ప్యాంక్రియాటైటిస్ లేదా ప్యాంక్రియాస్ గ్రంథి కుంచించుకుపోవడం, ఆ గ్రంథిలో క్యాల్షియమ్ పేరుకుపోవడం తెలుస్తాయి. ఒకవేళ లింఫ్‌నోడ్స్ పెరిగిపోతే అది విపుల్ డిసీజ్‌కూ, లింఫోమా వ్యాధికి సూచనలనే విషయాలు తెలుస్తాయి.
- ఎమ్మారై : చిన్న పేగుల్లోని స్మాల్ బవెల్ మ్యూకోజల్ వ్యాధులూ, ఏవైనా క్యాన్సర్లు రాబోయే కండిషన్లు (నియోప్లాజమ్) వంటివి పొట్ట ఎమ్మారై పరీక్షల్లో తెలుస్తాయి.
- తిన్నది జీర్ణం కాకపోవడం, ఒంటికి పట్టకపోవడం తెలుసుకోడానికి కొన్నిసార్లు బయాప్సీ కూడా చేయాల్సి రావచ్చు.



డాక్టర్
విక్టర్ వినోద్ బాబు
సీనియర్ సర్జికల్
గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్

నిర్ధారణ పరీక్షలు

- కంప్లీట్ బ్లడ్ కౌంట్ (సీబీసీ) లో ఐరన్, విటమిన్- బి12, ఫోలేట్ వంటివి ఒంటికి పట్టపోవడం తెలుస్తాయి. అలాగే ఈ పరీక్షలో ప్రోత్రాంబిన్ టైమ్ చాలా పెరిగిపోవడం వల్ల విటమిన్-కే ఒంటికి పట్టకపోవడం తెలుస్తుంది.
- ఎలక్ట్రోలైట్స్ పరీక్షల్లో దేహంలో పొటాషియమ్, క్యాల్షియమ్, మెగ్నీషియమ్ వంటి వివిధ ఖనిజ-లవణాలు లోపం, దాంతో ఎలక్ట్రోలైట్స్ అసమతౌల్యత తెలుస్తాయి.
- ప్రోటీన్లు, ఆల్బుమిన్ వంటి లోపాలతో దేహంలోని కొవ్వులు, ప్రోటీన్లు సరిగా ఒంటబట్టడం లేదని తెలుస్తుంది.

చికిత్స

తిన్న ఆహారం సరిగా ఒంటబట్టకపోవడం జరుగుతున్నప్పుడు రెండు రకాల చికిత్సలు అందిస్తారు. మొదటిది... ఆహారంలో ఏవైనా పోషకాల లోపాలు ఉంటే వాటిని భర్తీ చేయడం. ఇందులో దేహంలో ఏవైనా పోషకాల లోపంతో ఇలా జరుగుతుంటే వాటిని ఆహారం ద్వారా భర్తీ చేస్తారు.

- ఇక రెండోది... దేహ నిర్మాణం వంటి ఏవైనా లోపాల కారణంగా ఇలా జరుగుతుంటే వాటిని చక్కదిద్దడం. వైద్య పరీక్షల్లో తేలిన లోపాన్ని బట్టి చికిత్స అందించాల్సి ఉంటుంది.



బిజినెస్ రీల్

ఈఎస్ఐ కిందకు కొత్తగా 16 లక్షల మంది

2024 నవంబర్‌లో చేరిక



న్యూఢిల్లీ: ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) నిర్వహించే బీమా పథకం 'ఈఎస్ఐ' కిందకు 2024 నవంబర్ నెలలో కొత్తగా 16.07 లక్షల మంది సభ్యులుగా నమోదయ్యారు. అంతక్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే ఒక శాతం అధికంగా సభ్యులు చేరినట్టు తెలుస్తోంది. 2023 నవంబర్‌లో కొత్త సభ్యుల నమోదు 15.92 లక్షలుగా ఉంది. ఈ వివరాలను కేంద్ర కార్మిక శాఖ విడుదల చేసింది. గతేడాది నవంబర్‌లో 20,212 సంస్థలు ఈఎస్ఐసీలో చేరాయి. తద్వారా ఆయా సంస్థల్లో పనిచేసే కార్మికులకు ఈఎస్ఐ రక్షణ లభించినట్టయింది. 16.07 లక్షల మందిలో 7.57 లక్షల మంది (47.11 శాతం) 25 ఏళ్లలోపు వయసున్నవారు కావడం గమనార్హం. 3.28 లక్షల మంది మహిళలు కాగా, 44 మంది ట్రాన్స్‌జెండర్లు కూడా కొత్త సభ్యుల్లో భాగంగా ఉన్నారు.

టీవీఎస్ నుంచి ఎలక్ట్రిక్ కార్గో వాహనాలు!



కోల్‌కతా: వాహన తయారీ దిగ్గజం టీవీఎస్ మోటార్ కంపెనీ ఎలక్ట్రిక్ కార్గో విభాగంలోకి ప్రవేశించాలని నిర్ణయించింది. కంపెనీ తాజాగా ఎలక్ట్రిక్ త్రీవీలర్‌ను కోల్‌కతా, యూపీ, బీహార్, జమ్ము మరియు కాశ్మీర్‌తోపాటు ఢిల్లీలో విడుదల చేసింది. డిసెంబర్ నాటికి ఎలక్ట్రిక్ కార్గో రోడ్డెక్కనుందని టీవీఎస్ మోటార్ కమర్షియల్ మొబిలిటీ బిజినెస్ హెడ్ రజత్ గుప్తా వెల్లడించారు. ప్రస్తుతం ప్రత్యామ్నాయ ఇంధన (సీఎన్‌జీ, ఎల్పీజీ, ఎలక్ట్రిక్) విభాగంలో కంపెనీ వాటా 10 శాతం ఉందని అన్నారు. తమిళనాడులోని హోసూర్ ప్లాంట్‌కు నెలకు 5,000 యూనిట్ల త్రిచక్ర వాహనాలను తయారు చేసే సామర్థ్యం ఉందని తెలిపారు. ఈ కేంద్రాన్ని మరింత విస్తరించవచ్చని వివరించారు. కొరియా నుండి బ్యాటరీ సెల్స్‌ను దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. వీటిని భారతీయ భాగస్వామి తయారు చేస్తోందని తెలిపారు.

బోర్డు సమావేశాలు

బజాజ్ ఆటో, హిందుస్తాన్ జింక్, హ్యుందాయ్ మోటార్, సిప్లా, టీవీఎస్ మోటార్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, సీజీ పవర్, భాష్, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్, కాల్గేట్, ఎస్‌బీఐ కార్డ్స్, సుజ్లాన్ ఎనర్జీ, భెల్, మోతీలాల్ ఓస్వాల్, ఎంఅండ్ఎం ఫైనాన్షియల్, పిరమిల్ ఫార్మా, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, స్టార్ హెల్త్, వీ–గార్డ్ ఇండస్ట్రీస్, యూటీఐ ఏఎంసీ, జీఈ షిప్పింగ్, మహానగర్ గ్యాస్, రీట్స్, జేఎం ఫైనాన్షియల్, అరవింద్ లైఫ్ స్టైల్స్

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

28-1-2025

విశాఖ	495–00
చిత్తూరు	543–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	470–00
వరంగల్	472–00
రిటైల్ ధర	5.30

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BRITANNIA	5,178.05	1.5
ICICIBANK	1,225.25	1.33
M&M	2,830.00	1.02
HINDUNILVR	2,391.05	0.97
SBIN	747.5	0.45

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HCLTECH	1,710.55	-4.59
TECHM	1,651.00	-4.18
WIPRO	308	-3.78
HINDALCO	585.5	-3.53
SHRIRAMFIN	510.45	-3.22

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,637
ఎన్ఎస్ఈ	95,151
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,63,028
ఎఫ్ఐఐ	- 5,015
డీఐఐ	+ 6,642

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	72.97 (రాత్రి 11.30కు)	\$ 74.66 (క్రితం ముగింపు)
బ్రెంట్	75.94 (రాత్రి 11.30కు)	\$ 77.55 (క్రితం ముగింపు)

యూజ్డ్ కార్లు @ కోటి

పాత కారు టాప్ గేరు!

- 2030 నాటికి ఏటా ఈ స్థాయికి
- మారుతీ స్విఫ్ట్‌కు అధిక డిమాండ్
- కార్స్24 తాజా నివేదికలో వెల్లడి



- 2023లో అమ్ముడైన పాత కార్లు 46 లక్షల యూనిట్లు
- 2030 నాటికి ఏటా ఒక కోటి యూనిట్లకు విక్రయాలు
- యూజ్డ్ కార్ల విపణి సగటు వార్షిక వృద్ధి ఏటా 13%
- ఎస్‌యూవీలదే హవా. వీటి వాటా 2024లో 16.7 శాతం
- కొత్త కార్ల ఫైనాన్సింగ్ వాటా 2010లో 60 శాతం. 2024లో 84 శాతానికి చేరిక.
- వ్యక్తిగత వాహనాలకే 12 % మంది మొగ్గు
- అత్యంత డిమాండ్ ఉన్న మోడల్ మారుతీ సుజుకీ స్విఫ్ట్

న్యూఢిల్లీ: పాత కార్ల అమ్మకాలు 2023లో దేశవ్యాప్తంగా 46 లక్షల యూనిట్లు దాటాయి. 2030 నాటికి ఈ సంఖ్య ఏటా 1 కోటి యూనిట్లను దాటుతుందని కార్స్24 తాజా నివేదిక వెల్లడించింది. పాత కార్ల క్రయవిక్రయాల్లో ఉన్న ఈ సంస్థ రూపొందించిన నివేదిక ప్రకారం.. 2030 నాటికి యూజ్డ్ కార్ల విభాగం సగటు వార్షిక వృద్ధి ఏటా 13% నమోదు కానుంది. ఈ లెక్కన వార్షిక అమ్మకాలు ఆ సమయానికి 1.08 కోట్ల యూనిట్లకు చేరుకుంటాయి. పాత కార్లకు డిమాండ్ నగరాలు, పట్టణాల్లో దూసుకెళ్లనుంది. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ఈ జోరును నడిపిస్తున్నాయి. మరింత చవక, ఆధారపడదగిన ఎంపికల కోసం వినియోగదార్ల ప్రాధాన్యతలు మారుతు న్నందున కొత్త కార్ల మార్కెట్‌తో పోలిస్తే యూజ్డ్ కార్ల మార్కెట్ పురోగమిస్తోంది. పాత కార్ల విపణిలో 2024లో 16.7 శాతం వాటాతో ఎస్‌యూవీలు ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నాయి. ఎస్‌యూవీల డిజైన్, సామర్థ్యం, ప్రీమియం ఆకర్షణలు పట్టణ, గ్రామీణ కస్టమర్లకు ఇష్టమైనవిగా మారాయి.

వ్యక్తిగత వాహనాలకు..

కోవిడ్ అనంతర కాలంలో వినియోగదారుల ప్రాధాన్యతలలో గణనీయ మార్పు కనిపించింది. షేర్డ్ మొబిలిటీ కంటే సౌలభ్యం, భద్రత కోసం 12 శాతం మంది కార్ల కొనుగోలుదారులు వ్యక్తిగత వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మెట్రో, నాన్–మెట్రో నగరాల్లో అత్యంత డిమాండ్ ఉన్న మోడల్‌గా మారుతీ సుజుకీ స్విఫ్ట్ అవతరించింది. అలాగే హ్యుండై శాంట్రో, టాటా టియాగో ఎన్ఆర్‌జీ, మారుతీ సుజుకీ వ్యాగన్–ఆర్ వంటి మోడళ్లు అసాధారణ రీసేల్ విలువను స్థిరంగా అందించాయి. బడ్జెట్ స్పృహ, విలువను చూసే కొనుగోలుదారులలో ఈ మోడళ్లకు ప్రజాదరణ పటిష్టంగా ఉంది. కొత్త కార్ల ఫైనాన్సింగ్ గణనీయమైన వృద్ధి నమోదు చేసింది. ఫైనాన్సింగ్ వాటా 2010లో 60 శాతం నుండి 2024లో 84 శాతానికి చేరింది అని నివేదిక వివరించింది. నూతన వాహనాల కోసం రుణాలపై వినియోగదారులు ఆధారపడుతున్నారని చెప్పేందుకు ఈ గణాంకాలు నిదర్శనమని కార్స్24 కో–ఫౌండర్ గజేంద్ర జంగిద్ తెలిపారు.

ఇక ఈ–కామర్స్ గాడిలో..



- ముసాయిదా సిద్ధం చేసిన కేంద్రం
- పారదర్శకతకు మరింత పెద్ద పీట

న్యూఢిల్లీ: ఈ–కామర్స్‌ను మరింత జవాబుదారీగా చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేసింది. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డిజిటల్ షాపింగ్ రంగంలో మోసపూరిత పద్ధతుల నుండి వినియోగదారులను రక్షించడానికి.. ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌కు స్వీయ–నియంత్రణ చర్యలను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం 'ఈ–కామర్స్–ప్రిన్సిపుల్స్ అండ్ గైడ్‌లైన్స్ ఫర్ సెల్ఫ్ గవర్నెన్స్' పేరుతో ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఈ నియమాలను రూపొందించింది. భాగస్వాముల నుంచి ఫిబ్రవరి 15లోపు అభిప్రాయాలను కోరింది. లావాదేవీకి ముందు, ఒప్పందం, కొనుగోలు తదనంతర దశలను కవర్ చేస్తూ మార్గదర్శకాలకు శ్రీకారం చుట్టారు. ఈ నియమాలు అమలులోకి వస్తే కస్టమర్లు, ఈ–కామర్స్ కంపెనీల మధ్య జరిగే లావాదేవీల్లో పారదర్శకత మరింత పెరగనుంది. నిషేధిత ఉత్పత్తుల విక్రయాలకు అడ్డుకట్ట పడుతుంది. అట్టి ఉత్పత్తులు ఏవైనా లిస్ట్ అయితే ఫిర్యాదులకు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

మార్గదర్శకాల ప్రకారం..

ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు తప్పనిసరిగా వ్యాపార భాగస్వాముల సంపూర్ణ కేవైసీని నిర్వహించాలి. ముఖ్యంగా థర్డ్ పార్టీ విక్రేతల పూర్తి వివరాలు ఉండాల్సిందే. ఉత్పత్తుల ప్రయోజనం, ఫీచర్లను అంచనా వేయడంలో వినియోగదారులకు సహాయం చేయడానికి టైటిల్, విక్రేత చిరునామా, గుర్తింపు సంఖ్య, వీడియోల వంటి సపోర్టింగ్ మీడియాతో సహా వివరణాత్మక ఉత్పత్తి జాబితాను తప్పనిసరి చేస్తారు. ఉత్పత్తులు దిగుమతి చేసుకున్నట్టయితే దిగుమతిదారు వివరాలు, ప్యాకింగ్ చేసిన కంపెనీ, విక్రేతల వివరాలు ఉండాల్సిందే. ప్రాసెసింగ్ చార్జీలు ముందే వెల్లడించాలి. ఒప్పంద సమయంలో కస్టమర్ సమ్మతి, లావాదేవీని సమీక్షించే అవకాశం, క్యాన్సలేషన్‌కు, ఉత్పత్తి వెనక్కి ఇవ్వడానికి, రిఫండ్స్‌కు పారదర్శక విధానం అమలు చేయాల్సి ఉంటుంది. లావాదేవీల పూర్తి వివరాలను నమోదు చేయాలి. చెల్లింపులు పూర్తి సురక్షితంగా జరిగేలా పేమెంట్ సిస్టమ్ అమలులోకి తేవాలి. చట్టాలకు లోబడి కస్టమర్లకు ఈ సమాచారం అందుబాటులో ఉంచాలి. విక్రేతలందరినీ కంపెనీలు సమానంగా చూడాల్సిందే. ఏ విక్రేతకూ ప్రాధాన్యత ఇవ్వకూడదు.

క్యూ3 ఫలితాలు

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ లాభం డౌన్

క్యూ3లో రూ. 339 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 53 శాతం పడిపోయి రూ. 339 కోట్లకు పరిమితమైంది. ప్రొవిజన్లు, తాజా స్లిప్పేజీలు పెరగడం లాభాలను దెబ్బతీసింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 716 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం రూ. 9,396 కోట్ల నుంచి రూ. 11,123 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం సైతం రూ. 7,879 కోట్ల నుంచి రూ. 9,343 కోట్లకు బలపడింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.04 శాతం నుంచి 1.94 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.68 శాతం నుంచి 0.52 శాతానికి తగ్గాయి. పన్నులు మినహాయించి మొత్తం ప్రొవిజన్లు రూ. 655 కోట్ల నుంచి రెట్టింపై రూ. 1,355 కోట్లను తాకాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేరు ఎన్ఎస్ఈలో 1.5 శాతం నష్టంతో రూ. 62 వద్ద ముగిసింది.

కోల్ ఇండియా లాభం డౌన్

- క్యూ3లో రూ. 8,491 కోట్లు
- షేరుకి రూ. 5.6 డివిడెండ్



న్యూఢిల్లీ: మైనింగ్ రంగ పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 17 శాతం క్షీణించి రూ. 8,491 కోట్లకు పరిమితమైంది. ప్రధానంగా అమ్మకాలు తగ్గడం లాభాలను దెబ్బతీసింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 10,292 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 5.6 చొప్పున రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. అమ్మకాలు సైతం రూ. 33,011 కోట్ల నుంచి రూ. 32,359 కోట్లకు బలహీనపడ్డాయి. అయితే మొత్తం వ్యయాలు రూ. 25,133 కోట్ల నుంచి రూ. 26,202 కోట్లకు పెరిగాయి. కాగా.. స్టాండెలోన్ లాభం రూ. 9,316 కోట్ల నుంచి రూ. 9,646 కోట్లకు ఎగసింది. ఈ ఏడాది తొలి 9 నెలల్లో(ఏప్రిల్–డిసెంబర్) బొగ్గు ఉత్పత్తి 531.89 మిలియన్ టన్నుల నుంచి 543.36 ఎంటీకి పెరిగింది.

బీఎస్ఈలో కోల్ ఇండియా షేరు 2 శాతం నష్టంతో రూ. 375 వద్ద ముగిసింది.

టాటా స్టీల్ లాభం నేలచూపు

క్యూ3లో రూ. 295 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మెటల్ దిగ్గజం టాటా స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర లాభం 43 శాతం క్షీణించి రూ. 295 కోట్లకు పరిమితమైంది. ప్రధానంగా ఆదాయం తగ్గడం లాభాలను దెబ్బతీసింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 522 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 55,540 కోట్ల నుంచి రూ. 53,869 కోట్లకు బలహీనపడింది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 53,351 కోట్ల నుంచి రూ. 52,118 కోట్లకు తగ్గాయి. దేశీయంగా ముడిస్టీల్ ఉత్పత్తి 6 శాతం పుంజుకుని 5.68 మిలియన్ టన్నులను తాకింది. డెలివరీలు 8 శాతంపైగా ఎగసి 5.29 ఎంటీకి చేరాయి. కాగా.. టాటా స్టీల్ నెదర్లాండ్స్ లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి 1.76 ఎంటీకి చేరగా.. డెలివరీలు 1.53 ఎంటీగా నమోదయ్యాయి. బ్లాస్ట్ ఫర్నేస్ మూసివేతతో యూకే విభాగం ఉత్పత్తి చేయలేదు. డెలివరీలు 12.5 శాతం క్షీణించి 0.56 ఎంటీకి పరిమితమయ్యాయి. వార్షికంగా 35 ఎంటీ ముడిస్టీల్ సామర్థ్యంతో కంపెనీ గ్లోబల్ దిగ్గజంగా నిలుస్తున్న విషయం విదితమే. 2024 డిసెంబర్‌కల్లా రూ. 85,800 కోట్ల నికర రుణ భారం నమోదైంది.

బీఎస్ఈలో టాటా స్టీల్ షేరు 3 శాతం నష్టంతో రూ. 126 వద్ద ముగిసింది.

యూనియన్ బ్యాంక్ లాభం 28 శాతం జంప్

డిసెంబర్ క్వార్టర్‌కు రూ.4,604 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో పటిష్ట పనితీరు నమోదు చేసింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 28 శాతం వృద్ధితో రూ.4,604 కోట్లకు దూసుకుపోయింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.3,590 కోట్లుగా ఉండడం గమనార్హం. ఆదాయం ఇదే కాలంలో రూ.29,137 కోట్ల నుంచి 7 శాతానికి పైగా వృద్ధితో రూ.31,375 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.25,163 కోట్ల నుంచి రూ.26,958 కోట్లకు పెరిగింది. రుణ ఆస్తుల నాణ్యత మెరుగుపడింది. క్రితం ఏడాది ఇదే కాలంలో స్థూల ఎన్‌పీఏలు 4.8 శాతంగా ఉంటే, తాజాగా 3.8 శాతానికి తగ్గుముఖం పట్టాయి. నికర ఎన్‌పీఏలు 1.08 శాతం నుంచి 0.8 శాతానికి తగ్గాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.1,748 కోట్ల నుంచి రూ.1,599 కోట్లకు పరిమితమయ్యాయి. ఎన్‌పీఏలకు ప్రొవిజన్ కవరేజీ రేషియో (కేటాయింపుల నిష్పత్తి) 93.42 శాతానికి మెరుగుపడింది.

బీఎస్ఈలో యూనియన్ బ్యాంక్ షేరు ఒకటిన్నర శాతం నష్టంతో రూ.105.65 వద్ద ముగిసింది.

ఎయిర్‌క్రాఫ్ట్ ఎంఆర్‌వో సేవల్లోకి స్టార్ ఎయిర్



ముంబై: ప్రాంతీయ విమానయాన సంస్థ స్టార్ ఎయిర్ ఎయిర్‌క్రాఫ్ట్ ఎంఆర్‌వో సేవల వ్యాపారంలోకి ప్రవేశించాలని నిర్ణయించింది. 2019లో ప్రారంభమైన బెంగళూరుకు చెందిన ఈ సంస్థ ఆరేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. మార్చి నాటికి ఫ్లీట్ సంఖ్య 14కు చేర్చనున్నట్టు వెల్లడించింది. అలాగే సర్వీసుల సంఖ్యను 100కు పెంచనున్నట్టు తెలిపింది. ప్రస్తుతం సంస్థ వద్ద ఎంబ్రాయర్ తయారీ తొమ్మిది విమానాలు ఉన్నాయి. 23 కేంద్రాలను అనుసంధానిస్తూ రోజుకు 44 సర్వీసులను నడుపుతోంది. 15 లక్షల మందికిపైగా కస్టమర్లకు సేవలు అందించింది. ఉడాన్ స్కీమ్ కింద కంపెనీకి కేటాయించిన రూట్లలో 90 శాతంపైగా కవర్ చేసినట్టు స్టార్ ఎయిర్ సీఈవో సిమ్రాన్ సింగ్ తివానా తెలిపారు. నెట్‌వర్క్‌కు మరో అయిదు కేంద్రాలు తోడు కానున్నట్టు చెప్పారు.

సెబీకి త్వరలో కొత్త చీఫ్

- అభ్యర్థులకు ప్రభుత్వ ఆహ్వానం
- దరఖాస్తులకు గడువు ఫిబ్రవరి 17



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ప్రభుత్వం కొత్త చైర్మన్‌ను ఎంపిక చేయనుంది. ఇందుకు ఆర్థిక శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రస్తుత చైర్‌పర్సన్ మాధవీపురీ బచ్ మూడేళ్ల పదవీకాలం ఫిబ్రవరి 28న ముగియనుంది. సెబీకి కొత్త చీఫ్‌ను ఐదేళ్ల కాలానికి ఎంపిక చేయనున్నట్లు లేదా అభ్యర్థికి 65 ఏళ్ల వయసు(ఏది ముందయితే)వరకూ బాధ్యతలు అప్పగించనున్నట్లు ఆర్థిక వ్యవహారాల శాఖ తెలియజేసింది. దరఖాస్తుల దాఖలుకు ఫిబ్రవరి 17 గడువుగా పేర్కొంది. ఈ నెలలో 60వ వసంతంలో అడుగు పెట్టనున్న బచ్ పరస్పర విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. కాగా.. కొత్త చైర్మన్‌గా ఎంపికయ్యే వ్యక్తికి సెబీ నిర్వహణపై ప్రభావం చూపగల ఎలాంటి ఆర్థిక లేదా సంబంధిత వ్యవహారాలు ఉండకూడదని ఆర్థిక శాఖ విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది. 25ఏళ్లకు మించిన వృత్తి సంబంధ అనుభవంతోపాటు 50ఏళ్లకు మించిన వయసుగల వ్యక్తులు దరఖాస్తు చేయవచ్చని వివరించింది. ఎంపికైన అభ్యర్థి ప్రభుత్వ కార్యదర్శి స్థాయిలో నెలకు రూ. 5,62,500 చొప్పున వేతనాన్ని పొందనున్నట్లు తెలియజేసింది. సాధారణంగా ప్రభుత్వం సెబీ చీఫ్‌ను తొలుత మూడేళ్ల కాలానికి ఎంపిక చేస్తుంది. తదుపరి మరో రెండేళ్ల పదవీకాలాన్ని పొడిగిస్తుంది. అయితే ఇంతక్రితం యూకే సిన్హా ఐదేళ్ల కాలానికి పదవిని స్వీకరించారు. తదుపరి మరో ఏడాది బాధ్యతలు నిర్వహించారు.

భారత్‌లో క్రెడిట్ కార్డుల జోరు

- అయిదేళ్లలో రెండింతలై 10.8 కోట్లకు చేరిక
- దశాబ్దంలో 94 రెట్లు పెరిగిన డిజిటల్ లావాదేవీలు
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదిక



ముంబై: క్రెడిట్ కార్డుల సంఖ్య భారత్‌లో సుమారు 10.8 కోట్లకు చేరింది. అయిదేళ్లలో వీటి సంఖ్య రెండింతలకుపైగా దూసుకెళ్లిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సోమవారం విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం.. 2019 డిసెంబర్ నాటికి దేశవ్యాప్తంగా కస్టమర్లకు జారీ అయిన క్రెడిట్ కార్డుల సంఖ్య 5.53 కోట్లు నమోదైంది. అయితే డెబిట్ కార్డుల సంఖ్య క్రెడిట్ కార్డుల స్థాయిలో పెరగకపోవడం గమనార్హం. డెబిట్ కార్డులు అయిదేళ్లలో 80.53 కోట్ల నుంచి 2024 డిసెంబర్ నాటికి 99.09 కోట్లకు చేరాయి.

అంతా డిజిటల్‌మయం..

దశాబ్ద కాలంలో డిజిటల్ చెల్లింపులు గణనీయంగా పెరిగాయి. 2013లో రూ.772 లక్షల కోట్ల విలువైన 222 కోట్ల డిజిటల్ లావాదేవీలు జరిగాయి. 2024లో ఈ లావాదేవీలు పరిమాణంలో 94 రెట్లు, విలువలో 3.5 రెట్లు పెరిగి రూ.2,758 లక్షల కోట్ల విలువైన 20,787 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. అయిదేళ్లలో డిజిటల్ చెల్లింపులు పరిమాణంలో 6.7 రెట్లు, విలువలో 1.6 రెట్లు ఎగశాయి. అయిదేళ్లలో వార్షిక వృద్ధి ఏటా సగటున పరిమాణంలో 45.9 శాతం, విలువలో 10.2 శాతం పెరిగింది. రిటైల్ డిజిటల్ చెల్లింపులు 12 ఏళ్లలో సుమారు 100 రెట్లు దూసుకుపోయాయి. ఇవి 2012–13లో 162 కోట్ల లావాదేవీలు నమోదు కాగా.. 2023–24లో వీటి సంఖ్య ఏకంగా 16,416 కోట్లను తాకిందని నివేదిక తెలిపింది.

విదేశాల్లోనూ యూపీఐ..

ఇతర దేశాల ఫాస్ట్ పేమెంట్ సిస్టమ్స్‌తో యూపీఐని అనుసంధానించడం ద్వారా విదేశీ చెల్లింపులను మెరుగుపరిచేందుకు ఆర్‌బీఐ కృషి చేస్తోందని నివేదిక పేర్కొంది. అధిక వ్యయం, తక్కువ వేగం, సేవలు పరిమితంగా ఉండడం, విదేశాలకు చెల్లింపులలో పారదర్శకత లేకపోవడం వంటి సమస్యలను పరిష్కరించడంలో ఇటువంటి అనుసంధానాలు సహాయపడతాయని పేర్కొంది. క్యూఆర్ కోడ్‌ల ద్వారా భారతీయ యూపీఐ యాప్‌లను ఉపయోగించి భూటాన్, ఫ్రాన్స్, మారిషస్, నేపాల్, సింగపూర్, శ్రీలంక, యూఏఈలోని వ్యాపారులకు చెల్లింపులు చేయవచ్చు. చెల్లింపుల మౌలిక వసతులు, పనితీరులో చెప్పుకోదగ్గ వృద్ధి ఆర్‌బీఐ ప్రచురించిన డిజిటల్ పేమెంట్ ఇండెక్స్‌లో స్పష్టంగా కనిపిస్తుందని నివేదిక వివరించింది.

క్యూ3లో ఐవోసీ డీలా

నికర లాభం 64 శాతం డౌన్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో స్టాండెలోన్ నికర లాభం 64 శాతం క్షీణించి రూ. 2,874 కోట్లకు పరిమితమైంది. అమ్మకాలు జోరు చూపినప్పటికీ ప్రధానంగా నిల్వలు, విదేశీ మారక నష్టాలు లాభాలను దెబ్బతీశాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 8,064 కోట్లు ఆర్జించింది. ఈ కాలంలో చమురు నిల్వలపై రూ. 7,800 కోట్లు, ఫారెక్స్ ద్వారా రూ. 1,900 కోట్లు చొప్పున నష్టాలు నమోదయ్యాయి. అయితే ఈ ఏడాది క్యూ2(జులై–సెప్టెంబర్)లో సాధించిన రూ. 189 కోట్లతో పోలిస్తే లాభాలు భారీగా ఎగశాయి. కాగా.. మొత్తం ఆదాయం రూ. 2.3 లక్షల కోట్ల నుంచి రూ. 2.16 లక్షల కోట్లకు నీరసించింది.

మార్జిన్లు వీక్

ప్రస్తుత సమీక్షా కాలంలో ముడిచమురు, శుద్ధిచేసిన ప్రొడక్టుల ధరల మధ్య భారీ అంతరం(క్రాక్స్) ఏర్పడినట్లు ఐవోసీ పేర్కొంది. బ్యారల్‌కు డీజిల్‌పై 19.18 డాలర్ల నుంచి 10.8 డాలర్లకు క్షీణించగా.. పెట్రోల్‌పై 7.04 డాలర్ల నుంచి 3.63 డాలర్లకు బలహీనపడింది. ఇక స్థూల చమురు శుద్ధి మార్జిన్లు(జీఆర్ఎం) సైతం ప్రతీ బ్యారల్‌కు 13.53 డాలర్ల నుంచి 2.95 డాలర్లకు భారీగా నీరసించాయి. అయితే ఈ కాలంలో 6 శాతం వృద్ధితో 26.134 మిలియన్ టన్నుల అమ్మకాలు సాధించినట్లు కంపెనీ చైర్మన్ ఏఎస్ సాహ్నీ పేర్కొన్నారు. ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికమని తెలియజేశారు. వీటిలో ఎగుమతులు యథాతథంగా 1.354 ఎంటీగా నమోదయ్యాయి. మొత్తం 18.11 ఎంటీ ముడిచమురును ప్రాసెస్ చేసింది.

బీఎస్ఈలో ఐవోసీ షేరు 3.2 శాతం నష్టంతో రూ. 124 వద్ద ముగిసింది.

కెనరా బ్యాంక్ లాభం అప్

క్యూ3లో రూ. 4,104 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో స్టాండెలోన్ నికర లాభం 12 శాతం పుంజుకుని రూ. 4,104 కోట్లకు చేరింది. ఆదాయం పెరగడం, మొండిబకాయిలు తగ్గడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 3,656 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 11 శాతం బలపడి రూ. 36,114 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 32,334 కోట్ల ఆదాయం సాధించింది. అయితే నికర వడ్డీ ఆదాయం 3 శాతం నీరసించి రూ. 9,149 కోట్లకు పరిమితమైంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.39 శాతం నుంచి 3.34 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.32 శాతం నుంచి 0.89 శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి 16.44 శాతంగా నమోదైంది. 2024 డిసెంబర్‌కల్లా 9,816 బ్రాంచీలు, 9,715 ఏటీఎంలతో సర్వీసులు అందిస్తోంది. లండన్, న్యూయార్క్‌సహా విదేశాలలోనూ 4 బ్రాంచీలను నిర్వహిస్తోంది.

కెనరా బ్యాంక్ షేరు బీఎస్ఈలో 5% పతనమై రూ. 92 వద్ద ముగిసింది.

మళ్లీ భారత నంబర్‌వన్‌గా సహజ



సాక్షి, హైదరాబాద్: రెండు నెలల విరామం తర్వాత తెలంగాణ టెన్నిస్ క్రీడాకారిణి సహజ యామలపల్లి మళ్లీ టాప్-300లోకి దూసుకొచ్చింది. సోమవారం విడుదల చేసిన మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) తాజా సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో సహజ ఏకంగా 21 స్థానాలు పురోగతి సాధించి 294వ స్థానానికి చేరుకుంది. ప్రస్తుతం డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి అత్యుత్తమ ర్యాంక్ సహజదే కావడం విశేషం. ఫలితంగా ఆమె మళ్లీ భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా నిలిచింది. తొమ్మిది స్థానాలు పడిపోయిన అంకిత రైనా 295వ ర్యాంక్‌కు చేరుకోగా... తెలంగాణకే చెందిన మరో ప్లేయర్ భమిడిపాటి శ్రీవల్లి రష్మిక 332వ ర్యాంక్‌లో ఉంది. 2024 నవంబర్ 286వ స్థానంలో నిలిచిన సహజ ఆ తర్వాత ర్యాంకింగ్స్‌లో పడిపోయి 300 బయటకు వచ్చింది. అయితే గతవారం బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ100 టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరుకోవడంతో ఆమె ర్యాంక్ మెరుగైంది.

షమీ ఫిట్‌గానే ఉన్నాడు

భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్



రాజ్‌కోట్: సీనియర్ పేస్ బౌలర్ మొహమ్మద్ షమీ పూర్తి ఫిట్‌నెస్‌తోనే ఉన్నాడని భారత బ్యాటింగ్ కొత్త కోచ్ సితాన్షు కొటక్ వెల్లడించారు. గత రెండు టి20ల్లో షమీ ఆడలేదు. దీంతో అతని ఫిట్‌నెస్‌పై వస్తోన్న ఊహాగానాలకు కొటక్ తెరదించారు. షమీకి ఎలాంటి ఫిట్‌నెస్ సమస్యలు లేవన్నారు. వంద శాతం మ్యాచ్ ఫిట్‌నెస్‌తో ఉన్నాడని అయితే తుదిజట్టులో ఆడించే అంశంపై కెప్టెన్ సూర్యకుమార్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌లే నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. 2023 నవంబర్‌లో సొంతగడ్డపై జరిగిన వన్డే ప్రపంచకప్ ఫైనల్ తర్వాత షమీ మళ్లీ టీమిండియా తరఫున ఆడలేకపోయాడు. కొన్నాళ్లు విశ్రాంతి, ఇంకొన్నాళ్లు గాయాలతో సతమతమైన 34 ఏళ్ల వెటరన్ సీమర్‌ను తాజాగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టి20ల సిరీస్‌కు ఎంపికచేశారు. 15 నెలల తర్వాత జట్టులో చోటు దక్కింది కానీ ఆడేందుకు మాత్రం నిరీక్షణ తప్పడం లేదు.

రంజీల్లో 'స్టార్స్' వార్!



సిరాజ్

ఢిల్లీ బృందంలో నేడు కోహ్లి చేరిక

- కర్ణాటక తరఫున కేఎల్ రాహుల్
- జడేజాతో సౌరాష్ట్ర పటిష్టం
- హైదరాబాద్‌కు సిరాజ్ పేస్

ఆహా... ఎన్నాళ్లకెన్నాళ్లకు... మనస్టార్లు దేశవాళీ బాటపట్టారు. కింగ్ కోహ్లి ఢిల్లీ తరఫున ఆడితే... హైదరాబాద్‌కు సిరాజ్ పేస్ తోడైతే... కేఎల్ రాహుల్ కర్ణాటకకు జై కొడితే... జడేజా ఆల్‌రౌండ్ ఆటతో సౌరాష్ట్రకు ఆడితే అవి రంజీ మ్యాచ్‌లేనా? రసవత్తర మ్యాచ్‌లు కావా? కచ్చితంగా అవుతాయి. తదుపరి రంజీ దశ పోటీలు తారలతో కొత్త శోభ సంతరించుకుంటున్నాయి. అభిమానులకు నాలుగు రోజులూ ఇక క్రికెట్ పండగే! చూస్తుంటే గంభీర్ సిఫార్సులతో రూపొందించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కొత్త మార్గదర్శకాలు ఎంతటి స్టార్లయినా దేశవాళీ కోసం తగ్గాల్సిందేనని నిరూపించబోతున్నాయి.

న్యూఢిల్లీ: దేశవాళీ రంజీ ట్రోఫీలోని చివరి రౌండ్ మ్యాచ్‌లూ పసందుగా సాగనున్నాయి. అభిమాన క్రికెటర్లు నాలుగు రోజుల ఆటకు అందుబాటులోకి రావడమే దేశవాళీ క్రికెట్‌కు సరికొత్త పండగ తెస్తోంది. ఇదివరకు చెప్పినట్టుగానే విరాట్ కోహ్లి ఢిల్లీ ఆడే తదుపరి మ్యాచ్‌కు అందుబాటులోకి వచ్చాడు. ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం (డీడీసీఏ) సోమవారం ఈ విషయాన్ని వెల్లడించడమే కాదు... రైల్వేస్ జట్టుతో ఈ నెల 30 నుంచి జరిగే పోరుకోసం ఢిల్లీ జట్టును ప్రకటించింది. అందులో కింగ్ కోహ్లి ఉండటమే విశేషం. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఫిబ్రవరి 2వ తేదీ వరకు అతను తన అభిమానులను దేశవాళీ మ్యాచ్ ద్వారా అలరించేందుకు సిద్ధమయ్యాడు. కేవలం మ్యాచ్ రోజుల్లోనే కాదు... ఢిల్లీ సహచరులతో పాటు కలిసి కసరత్తు చేసేందుకు అతను మంగళవారం జట్టుతో చేరతాడని ఢిల్లీ కోచ్ శరణ్‌దీప్ సింగ్ ధ్రువీకరించారు. కొన్నిరోజులుగా టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ (ప్రస్తుత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కోచ్)తో కలిసి బ్యాటింగ్‌లో శ్రమిస్తున్నాడు. ఈ ఫొటోలు, వీడియోలు నెట్టింట తెగ వైరలవుతున్నాయి. ఇప్పుడు రంజీతో అతను రియల్‌గా బ్యాటింగ్ చేయనున్నాడు. ఇదే జరిగితే 2012 తర్వాత కోహ్లి రంజీ మ్యాచ్ ఆడనున్నాడు. ఈ నేపథ్యంలో డీడీసీఏ తగిన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. సెక్యూరిటీ సిబ్బందిని పెంచింది. ఢిల్లీ పోలీసులకు సమాచారమిచ్చింది. సౌరాష్ట్రతో ఢిల్లీ ఆడిన గత మ్యాచ్‌లో బరిలోకి దిగిన రిషభ్ పంత్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకపోవడం కాస్త వెలతే! కానీ 'రన్ మెషిన్' కోహ్లి శతక్కొట్టే ఇన్నింగ్స్ ఆడితే మాత్రం ఆ వెలతి తీరుతుంది.

హైదరాబాద్ పేస్‌కా బాస్... సిరాజ్

జస్‌ప్రీత్ బుమ్రా, షమీలాంటి అనుభవజ్ఞులతో పాటు భారత జట్టు పేస్ దళానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న సిరాజ్ ఇప్పుడు హైదరాబాద్ బలం అయ్యాడు. గురువారం నుంచి నాగ్‌పూర్‌లో విదర్భ జట్టుతో జరిగే ఎలైట్ గ్రూప్ 'బి' మ్యాచ్ బరిలోకి దిగుతున్నాడు. నాగ్‌పూర్ ట్రాక్ పేస్‌కు అవకాశమిచ్చే వికెట్. ఈ నేపథ్యంలో హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్ చెలరేగే అవకాశముంది. అతను నిప్పులు చెరిగితే సొంతగడ్డపై విదర్భకు కష్టాలు తప్పవు! సరిగ్గా ఐదేళ్ల క్రితం 2020లో చివరి రంజీ మ్యాచ్ కూడా విదర్భతోనే ఆడిన సిరాజ్... మళ్లీ ఆ ప్రత్యర్థితోనే దేశవాళీ ఆట ఆడబోతున్నాడు.

జడేజా వరుసగా రెండో మ్యాచ్

ఎలైట్ గ్రూప్ 'డి'లో ఉన్న సౌరాష్ట్ర తరఫున ఈ నెల 23 నుంచి ఢిల్లీతో జరిగిన మ్యాచ్ ఆడిన స్టార్, సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఈ సీజన్‌లో వరుసగా రెండో మ్యాచ్ ఆడేందుకు సై అంటున్నాడు. గత మ్యాచ్‌లో అతని ఆల్‌రౌండ్ 'షో' వల్లే నాలుగు రోజుల మ్యాచ్ కాస్త రెండే రోజుల్లో ముగిసింది. రెండు ఇన్నింగ్స్ (5/66, 7/38)ల్లో కలిపి 12 వికెట్లు తీసిన జడేజా తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌లో 38 పరుగులు కూడా చేశాడు. సౌరాష్ట్ర 10 వికెట్ల తేడాతో ఢిల్లీని ఓడించింది. గురువారం నుంచి అస్సామ్‌తో జరిగే పోరులో మళ్లీ జోరు కనబరచాలనే లక్ష్యంతో రంజీ బరిలోకి దిగుతున్నాడు. అస్సామ్‌ను హిట్టర్ రియాన్ పరాగ్ నడిపిస్తున్నాడు. భుజం గాయం నుంచి కోలుకున్న పరాగ్ ఐపీఎల్ ద్వారానే అందరికంటా పడ్డాడు.

ఫిట్‌నెస్‌తో రాహుల్ రెడీ

కర్ణాటక తరఫున ఎలైట్ గ్రూప్ 'సి'లో పంజాబ్‌తో జరిగిన గత మ్యాచ్‌లోనే కేఎల్ రాహుల్ ఆడాలనుకున్నాడు. కానీ మోచేతి గాయం కారణంగా ఆ రంజీ పోరు ఆడలేకపోయిన స్టార్ ఓపెనర్ ఇప్పుడు పూర్తి ఫిట్‌నెస్‌తో హరియాణా జట్టుతో ఢీకొనేందుకు రెడీ అయ్యాడు. రాహుల్ చివరి సారిగా 2020లో బెంగాల్‌తో జరిగిన రంజీ సెమీఫైనల్స్ మ్యాచ్ ఆడాడు. మళ్లీ ఐదేళ్ల తర్వాత సొంతరాష్ట్రం తరఫున దేశవాళీ మ్యాచ్ ఆడనున్నాడు. అతని చేరికతో కర్ణాటక బ్యాటింగ్ విభాగం మరింత పటిష్టం అయ్యింది. అంతేకాదు. దేవదత్ పడిక్కల్, సీమర్ ప్రసిధ్ కృష్ణలు కూడా ఆడుతుండటం జట్టుకు కలిసొచ్చే అంశం. ఈ ముగ్గురు ఇటీవల ఆస్ట్రేలియాలో పర్యటించిన భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించారు.



రాహుల్

రోహిత్, జైస్వాల్, అయ్యర్ గైర్హాజరు

ఈ రంజీ ట్రోఫీలో ముంబై ఆడాల్సిన చివరి లీగ్ మ్యాచ్‌లోనూ భారత కెప్టెన్ రోహిత్ శర్మ సహా యువ సంచలనం యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్‌లు ఆసక్తి కనబరిచారు. ఈ త్రయం జమ్మూకశ్మీర్‌తో జరిగిన గత మ్యాచ్‌లో బరిలోకి దిగింది. అయితే ఇంగ్లండ్‌తో వచ్చే నెల 6, 9, 12 తేదీల్లో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం వీరంతా భారత జట్టులో చేరాల్సివుండటంతో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరిగే పోరుకు అందుబాటులో ఉండటం లేదని ముంబై వర్గాలు వెల్లడించాయి.



కోహ్లి



అయ్యర్, రోహిత్

నగాల్ ర్యాంక్ 106



న్యూఢిల్లీ: అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్ సుమిత్ నగాల్ ర్యాంక్ దిగజారింది. పది నెలల తర్వాత అతను టాప్-100లో చోటు కోల్పోయాడు. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో నగాల్ 15 స్థానాలు పడిపోయి 106వ ర్యాంక్‌లో నిలిచాడు. గత ఏడాది ఫిబ్రవరిలో టాప్-100లోకి వచ్చిన నగాల్ గత వారం వరకు వందలోపు కొనసాగాడు. అయితే ఆ్రస్టేలియన్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే ఓడిపోవడంతో నగాల్ ర్యాంక్ పడిపోయింది. భారత్‌కే చెందిన శశికుమార్ ముకుంద్ 365వ ర్యాంక్‌లో, రామ్‌కుమార్ రామనాథన్ 406వ ర్యాంక్‌లో, కరణ్ సింగ్ 496వ ర్యాంక్‌లో ఉన్నారు.

టాప్-20లో చోటు కోల్పోయిన బోపన్న



మరోవైపు పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో భారత వెటరన్ స్టార్ రోహన్ బోపన్న ఐదు స్థానాలు పడిపోయి 21వ ర్యాంక్‌లో నిలిచాడు. గత ఏడాది ఆ్రస్టేలియన్ ఓపెన్ డబుల్స్‌లో విజేతగా నిలిచిన బోపన్న ఈసారి తొలి రౌండ్‌లోనే వెనుదిరగడం అతని ర్యాంక్‌పై ప్రభావం చూపింది. టాప్-100లో భారత్ నుంచి ఆరుగురు ఉండటం విశేషం. యూకీ బాంబ్రీ 47వ ర్యాంక్‌లో ఎలాంటి మార్పు లేదు. శ్రీరామ్ బాలాజీ 64వ ర్యాంక్‌లో ఉండగా... హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ ఏడు స్థానాలు పడిపోయి 79వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. అర్జున్ ఖడే 83వ ర్యాంక్‌లో, జీవన్ నెడుంజెళియన్ సరిగ్గా 100వ ర్యాంక్‌లో ఉన్నారు.

సెమీస్‌లో ఇంగ్లండ్

'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై విజయం



కుచింగ్ (మలేసియా): మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్‌లో చివరిదైన నాలుగో సెమీఫైనల్ బెర్త్ ఇంగ్లండ్ జట్టు దక్కించుకుంది. న్యూజిలాండ్ జట్టుతో సోమవారం జరిగిన 'సూపర్ సిక్స్' గ్రూప్-2 మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఆరు వికెట్ల తేడాతో గెలిచింది. ఇప్పటికే 'సూపర్ సిక్స్' గ్రూప్-1 నుంచి భారత్, ఆస్ట్రేలియా... గ్రూప్-2 నుంచి దక్షిణాఫ్రికా సెమీఫైనల్ చేరుకున్నాయి. గ్రూప్-2లో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ జట్లు ఆరు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి. అయితే మెరుగైన రన్‌రేట్ కారణంగా దక్షిణాఫ్రికా గ్రూప్ 'టాపర్'గా ఉంది. ఇంగ్లండ్ గెలుపొందడంతో నైజీరియా సెమీఫైనల్ అవకాశాలకు తెరపడింది. ఈనెల 29న ఐర్లాండ్‌తో జరిగే మ్యాచ్‌లో నైజీరియా గెలిచినా ఐదు పాయింట్లకే పరిమితం అవ్వుతుంది. ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 89 పరుగులకు ఆలౌటైంది. ఒకదశలో 49/0తో పటిష్టంగా కనిపించిన న్యూజిలాండ్‌ను ఇంగ్లండ్ బౌలర్లు టిల్లీ కోర్టీన్ కోల్మన్ (4/8), ప్రిషా థానావాలా (3/19), ట్రూడీ జాన్సన్ (2/7) దెబ్బ కొట్టారు. ఫలితంగా న్యూజిలాండ్ 40 పరుగుల తేడాలో 10 వికెట్లను కోల్పోయింది. ఓపెనర్లు కేట్ ఇర్విన్ (26 బంతుల్లో 35; 2 ఫోర్లు, 1 సిక్స్), ఎమ్మా మెక్లాయిడ్ (31 బంతుల్లో 18) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అనంతరం ఇంగ్లండ్ జట్టు 11.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసి గెలిచింది. డావినా పెరిన్ (15 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్), జెమీమా స్పెన్స్ (18 బంతుల్లో 29; 5 ఫోర్లు), చార్లోటి స్టబ్స్ (15 బంతుల్లో 17 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

సెమీస్‌లో బెంగాల్ టైగర్స్

రూర్కెలా: పురుషుల హాకీ ఇండియా లీగ్‌లో ష్రాచి రార్ బెంగాల్ టైగర్స్ జట్టు సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. సోమవారం జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో బెంగాల్ టైగర్స్ 2-1 గోల్స్ తేడాతో ఢిల్లీ ఎస్‌జీ పైపర్స్ జట్టును ఓడించింది. ఈ గెలుపుతో బెంగాల్ టైగర్స్ జట్టు 18 పాయింట్లతో అగ్రస్థానానికి దూసుకొచ్చింది. మిగిలిన మూడు మ్యాచ్‌ల ఫలితాలు ఎలా ఉన్నా బెంగాల్ జట్టు టాప్-4లోనే ఉండనుంది.



విండీస్ విజయం

- రెండో టెస్టులో ఓడిన పాకిస్తాన్
- 1-1తో సిరీస్ సమం

ముల్తాన్: బౌలర్ల హవా నడిచిన రెండో టెస్టులో వెస్టిండీస్ జట్టు 120 పరుగుల తేడాతో పాకిస్తాన్ జట్టును ఓడించింది. 1990 తర్వాత పాకిస్తాన్ గడ్డపై టెస్టుల్లో వెస్టిండీస్ గెలుపొందడం విశేషం. ఈ గెలుపుతో రెండు టెస్టుల సిరీస్ 1-1తో సమంగా ముగిసింది. 254 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించే క్రమంలో... ఓవర్‌నైట్ స్కోరు 76/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ జట్టు 44 ఓవర్లలో 133 పరుగులకు ఆలౌటైంది. విండీస్ స్పిన్నర్లు జోమెల్ వారికన్ (5/27), గుడకేశ్ మోతీ (2/35), కెవిన్ సింక్లెయిర్ (3/61) పాకిస్తాన్ జట్టును తిప్పేశారు. విండీస్ స్పిన్నర్లను ఎదుర్కోలేక మూడో రోజు ఆటలో పాక్ జట్టు 20 ఓవర్లు ఆడి మరో 57 పరుగులు జోడించి మిగతా ఆరు వికెట్లను కోల్పోయింది. విండీస్ ఎడంచేతి వాటం స్పిన్నర్ వారికన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించడం విశేషం.


సంక్షిప్త స్కోర్లు

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 163 ఆలౌట్ (41.1 ఓవర్లలో); **పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్:** 154 ఆలౌట్ (47 ఓవర్లలో); **వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్:** 244 ఆలౌట్ (66.1 ఓవర్లలో); **పాకిస్తాన్ రెండో ఇన్నింగ్స్:** 133 ఆలౌట్ (44 ఓవర్లలో) (బాబర్ ఆజమ్ 31, రిజ్వాన్ 25, వారికన్ 5/27, సింక్లెయిర్ 3/61, గుడకేశ్ మోతీ 2/35).

వైశాలితో 'షేక్‌హ్యాండ్'కు తిరస్కృతి

- ఉజ్బెకిస్తాన్ గ్రాండ్‌మాస్టర్ నొదిర్‌బెక్‌పై తీవ్ర విమర్శలు
- క్షమాపణలు కోరుతూ వివరణ





విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ చాలెంజర్స్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.వైశాలికి మ్యాచ్‌లో విజయం దక్కినా... మ్యాచ్‌కు ముందు చేదు అనుభవం ఎదురైంది. ఉజ్బెకిస్తాన్‌కు చెందిన ప్రత్యర్థి నొదిర్‌బెక్ యాకుబొయెవ్ గేమ్‌కు ముందు భారత గ్రాండ్‌మాస్టర్‌తో కరచాలనం చేసేందుకు నిరాకరించాడు. వైశాలి ఎదురుగా ఉన్న ప్రత్యర్థికి 'షేక్‌హ్యాండ్' ఇచ్చేందుకు కుడి చేతిని చాచగా... ఉజ్బెక్ గ్రాండ్‌మాస్టర్ మాత్రం నిరాకరిస్తూ కుర్చీని సరిచేసుకొని తాపీగా కూర్చున్నాడు. ఈ గేమ్‌లో భారత చెస్ ప్లేయర్ వైశాలి గెలుపొందింది. అయితే ఆటకు ముందు ఎదురైన అనుభవం దృష్ట్యా మ్యాచ్ ముగిశాక కరచాలనం ఇచ్చేందుకు వైశాలి ఆసక్తి చూపలేదు. ఈ సంఘటన ఈనెల 21న జరిగిన నాలుగో రౌండ్ గేమ్ సందర్భంగా చోటు చేసుకుంది. అయితే ఉజ్బెక్ గ్రాండ్‌మాస్టర్ ఓ మహిళతో వ్యవహరించిన తీరుకు సంబంధించిన వీడియో ఆదివారం (26వ తేదీన) సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వేలకొద్దీ నెటిజన్లు అతనిపై దుమ్మెత్తిపోసేలా విమర్శలు గుప్పించారు. దీంతో కంగుతిన్న యకుబొయెవ్ మతపరమైన ఆచారం వల్లే పరాయి మహిళతో చేయి కలపలేదని దీనికి అందరు మన్నించాలని ఆదివారం సాయంత్రం 'ఎక్స్' వేదికగా వేడుకున్నాడు. తనకు వైశాలి అన్నా... ఆమె తమ్ముడు ప్రజ్ఞానంద అన్నా, ఇతర మహిళలెవరైనా గౌరవమేనని చెప్పుకొచ్చాడు. ఈ విషయంలో మనసు నొప్పించి ఉంటే క్షమించాలని కోరాడు. తాజా ఉదంతం నేపథ్యంలో ఆదివారం జరిగిన ఎనిమిదో రౌండ్లో ఎదురైనా రొమేనియా మహిళా ప్రత్యర్థి ఇరీనా బుల్మాగాకు 'షేక్‌హ్యాండ్ ఇవ్వలేనని ముందే చెప్పాడు. మతపరమైన ఆచారం వల్లే కరచాలనం ఇవ్వలేకపోతున్నట్లు వివరణ ఇచ్చాడు. దీనిని ఇరీనా మన్నించింది.

తొమ్మిదేళ్ల తర్వాత...

- మరోసారి కెరీర్ బెస్ట్ ఏడో ర్యాంక్ చేరుకున్న మాడిసన్ కీస్
- టాప్-10లో నలుగురు అమెరికా క్రీడాకారిణులు



మెల్‌బోర్న్: ఆ్రస్టేలియన్ ఓపెన్ రూపంలో కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన అమెరికా క్రీడాకారిణి మాడిసన్ కీస్... తొమ్మిదేళ్ల విరామం తర్వాత మళ్లీ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. సోమవారం విడుదల చేసిన మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) తాజా ర్యాంకింగ్స్‌లో 29 ఏళ్ల కీస్ 14వ ర్యాంక్ నుంచి ఏడు స్థానాలు ఎగబాకి 7వ ర్యాంక్‌కు చేరుకుంది. కీస్ ఖాతాలో 4680 పాయింట్లున్నాయి. 2016 అక్టోబర్ 10న కీస్ కెరీర్ బెస్ట్ ఏడో ర్యాంక్‌లో నిలిచింది. ఆ తర్వాత 2020 వరకు కీస్ టాప్-20లో కొనసాగింది. 2021 సీజన్ ముగిసేసరికి 56వ ర్యాంక్‌కు చేరిన కీస్ 2022 సీజన్‌ను 11వ ర్యాంక్‌తో... 2023 సీజన్‌ను 12వ ర్యాంక్‌తో, 2024 సీజన్‌ను 21వ ర్యాంక్‌తో ముగించింది. డబ్ల్యూటీఏ తాజా ర్యాంకింగ్స్‌లో టాప్-10లో నలుగురు అమెరికా క్రీడాకారిణులు ఉన్నారు. కోకో గాఫ్ 6538 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో... జెస్సికా పెగూలా 4861 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో... ఎమ్మా నవారో 3709 పాయింట్లతో తొమ్మిదో ర్యాంక్‌లో ఉన్నారు.

సిద్ధరామయ్య భార్యకు హైకోర్టులో ఊరట

ఈడీ సమన్లపై స్టే ఇచ్చిన కర్ణాటక హైకోర్టు

శివాజీనగర: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి రాష్ట్ర హైకోర్టులో సోమవారం ఊరట లభించింది. మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) పరిధిలో ఇంటి స్థలాల కేటాయింపు కేసులో జనవరి 28న(ఈరోజు) తమ ఎదుట హాజరవ్వాలని పార్వతి, నగరాభివృద్ధి మంత్రి భైరతి సురేశ్‌లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సమన్లు జారీచేయడం తెల్సిందే. ఈ సమన్లను సవాల్ చేస్తూ పార్వతి, సురేశ్‌లు కర్ణాటక హైకోర్టును ఆశ్రయించగా సోమవారం హైకోర్టు ఈ సమన్ల అమలుపై స్టే విధించింది. జడ్జి జస్టిస్ ఎం నాగ ప్రసన్న విచారణ జరిపి ఈడీ సమన్ల అమలుపై స్టే విధిస్తూ ఉత్తర్వులిచ్చారు. పార్వతి, సురేశ్‌లు ఈడీ విచారణకు హాజరు కావలసిన అవసరం లేదని వారి తరపు న్యాయవాదులు తర్వాత వెల్లడించారు. మైసూరు తాలూకా కసబా హోబ్లీ పరిధిలోని కసరే గ్రామంలో సర్వే నంబర్ 464లోని స్థలాన్ని 'ముడా'కు అప్పగించినందుకుగాను బదులుగా ఖరీదైన ప్రాంతంలో 14 ఇళ్ల స్థలాలను ఆమెకు కేటాయించారంటూ కేసు నమోదైన విషయం తెల్సిందే. పలువురు సామాజిక కార్యకర్తలు లోకాయుక్త, ఈడీకి ఫిర్యాదు చేయడం, తదనంతరం కేసు నమోదుచేసి ఈడీ దర్యాప్తు చేపట్టడం విదితమే. ఈ నేపథ్యంలో 28న తమ ఎదుట విచారణకు హాజరుకావాలని పార్వతి, నగరాభివృద్ధి మంత్రి భైరతి సురేశ్‌లకు ఈడీ నోటీసులు పంపింది. జనవరి 27 లేదా 28న విచారణకు రావాలని పార్వతికి జనవరి మూడో తేదీనే ఈడీ నోటీసులు పంపింది. అయితే డాక్యుమెంట్ల సేకరణకు సమయం కావాలి, వృద్ధాప్యం కారణంగా స్వయంగా హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆమె విన్నవించారు. అయినాసరే బెంగళూరులోని ఆఫీసుకు నేరుగా విచారణకు హాజరుకావాలని ఈడీ స్పష్టంచేసింది. కేసుకు సంబంధించిన సమాచారాన్ని సమర్పించాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఈడీ విచారణపై కర్ణాటకలో అధికార కాంగ్రెస్ రాష్ట్ర మంత్రులు, పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కక్ష సాధింపులకు పాల్పడుతోందని దుయ్యబట్టారు.

అంతరిక్షం నుంచి 'మహా' అద్భుతం

కుంభమేళా ఫోటోలు పంచుకున్న నాసా వ్యోమగామి



ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళా భూమిపైనే గాక అంతరిక్షంలోనూ ప్రత్యేకత చాటుతోంది. ఆ వైభవాన్ని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న నాసా వ్యోమగామి డాన్ పెటిట్ కెమెరాలో బంధించారు. ఆస్ట్రో ఫోటోగ్రఫీకి ప్రసిద్ధి చెందిన ఆయన ఆ ఫొటోలను ఎక్స్‌లో పోస్టు చేశారు. ఐఎస్ఎస్ నుంచి కూడా మహా కుంభమేళా ప్రాంతం రాత్రిపూట దేదీప్యమానంగా వెలిగిపోతూ కన్పిస్తోంది. గంగా, యమున, సరస్వతి నదుల సంగమం స్థలంలో టెంట్ సిటీ మెరిసిపోతోంది. ఆ ఫోటోలకు ప్రతిస్పందనలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం ఐఎస్ఎస్‌లో డాన్ పెటిట్‌తో పాటు వ్యోమగాములు సునీతా విలియమ్స్, బారీ విల్‌మోర్ తదితరులున్నారు. - న్యూఢిల్లీ

ఢిల్లీ ప్రజలకు ఆప్ మరో 15 గ్యారంటీలు

మేనిఫెస్టో విడుదల చేసిన అర్విందు కేజ్రీవాల్

- ఐదేళ్లలోపు ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తామని భరోసా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు ఇంకా ఎనిమిది రోజులే మిగిలిఉన్న నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ ప్రజలకు మరో 15 గ్యారంటీలను ప్రకటించింది. మధ్యతరగతి ప్రజల కోసం ఇప్పటికే ఒక మేనిఫెస్టోను విడుదలచేసిన ఆప్ సోమవారం మరో అదనపు మేనిఫెస్టోను విడుదల చేసింది. యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం, మెట్రో ఛార్జీలో 50 శాతం రాయితీ వంటి పలు హామీలను ఇందులో చేర్చింది. ఆప్ సీనియర్ మహిళా నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశి, మనీశ్ సిసోడియా తదితరుల సమక్షంలో పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ రెండో మేనిఫెస్టోను సోమవారం 'కేజ్రీవాల్ గ్యారంటీ'పేరిట విడుదల చేశారు. ''బీజేపీ నేతలు హామీలు ఇస్తారు కానీ అమలు చేయరు. మేం మాత్రం ఇచ్చిన హామీలన్నీ ఐదేళ్లలోపు కచ్చితంగా అమలు చేస్తాం. ఢిల్లీలో ప్రత్యర్థి పార్టీలు అధికారంలోకి వస్తే ఢిల్లీ వాసులపై ఆర్థిక భారం తప్పదు''అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు.

కేజ్రీవాల్ 15 గ్యారంటీలు ఇవే..

- వచ్చే ఐదేళ్లలో ప్రతి యువకుడికి ఉపాధి
- మహిళా సమ్మాన్ యోజన క్రింద ప్రతి మహిళకు నేరుగా బ్యాంకు ఖాతాకే రూ.2,100 నగదు జమ
- సంజీవని యోజన కింద 60 ఏళ్లు పైబడిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత చికిత్స
- తప్పుడు నీటి బిల్లుల మాఫీ
- 24 గంటలు తాగు నీటి సరఫరా
- యూరప్‌తరహాలో ప్రపంచ స్థాయి రోడ్లు
- యమునా నదిని శుభ్రం చేయడం
- డాక్టర్ అంబేడ్కర్ స్కాలర్‌షిప్ పథకం
- విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం, ఢిల్లీ మెట్రోలో 50 శాతం రాయితీ
- పూజారి-గ్రంథి సమ్మాన్ యోజన కింద హిందూ ఆలయాల్లో అర్చకులు, గురుద్వారాల్లో గ్రంథీలకు జీతభత్యాల కింద ఒక్కొక్కరికి రూ.18 వేలు
- సొంతిళ్లవారితోపాటే అద్దెకు ఉంటున్న వారికీ ఉచిత విద్యుత్, నీరు
- మురుగు నీటిపైపులైన్ల మరమ్మతు, మురుగు నీటి వ్యవస్థలను మెరుగుపరచటం
- అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డుల జారీ
- ఆటో, టాక్సీ, ఇ-రిక్షా డ్రైవర్లకు జీవిత బీమా, వారి కుమార్తెల వివాహానికి రూ.లక్ష సాయం, పిల్లలకు ఉచిత కోచింగ్
- రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్‌కు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు

7 రోజులు.. 100 సమావేశాలు

- 26 ఏళ్ల తర్వాత ఢిల్లీలో అధికార పీఠాన్ని దక్కించుకునేందుకు బీజేపీ పకడ్బందీ వ్యూహం
- ప్రతీ అసెంబ్లీలో 20వేల ఓట్లు పెంచడం, ప్రతి బూత్‌లో 50శాతం ఓట్లు లక్ష్యంగా ప్రణాళిక
- రేపటి నుంచి ప్రచారంలో మోదీ, అమిత్ షా, యోగి
- బీజేపీపాలిత రాష్ట్రాల సీఎంలు,కేంద్ర మంత్రులు, ఎంపీలకు నియోజకవర్గాల వారీగా ప్రచార బాధ్యత



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ అధికారపీఠంపై ఇరవై ఆరేళ్ల తర్వాత పార్టీ జెండా ఎగురవేయాలని బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. చివరి నిమిషంలో తన ప్రచారాన్ని హోరెత్తించేలా ప్రణాళికలు రచించింది. వచ్చే వారం రోజుల పాటు బూత్ స్థాయి వరకు పార్టీ హామీలపై ప్రచారం జరిగేలా పార్టీ జాతీయ స్థాయి నేతల నుంచి పార్టీ విస్తారక్‌ల వరకు అందరినీ కదనరంగంలోకి దించనుంది. 29 నుంచి ప్రధాని మోదీ తన ప్రచారాన్ని మొదలుపెట్టనున్నారు. బీజేపీపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలంతా నియోజకవర్గాల వారీగా ప్రచార బాధ్యతలు అప్పగించారు. ఈ నియోజకవర్గాల్లో 100కు పైగా సమావేశాలు, ర్యాలీల్లో భాగస్వాములు కానున్నారు.

అసెంబ్లీకి 20వేల ఓట్లు అదనం

గడిచిన 2015 అసెంబ్లీ ఎన్నికల్లో పోలైన ఓట్లలో బీజేపీ 32 శాతం ఓట్లను సాధించింది. మొత్తం 70 స్థానాలకు గానూ కేవలం మూడు చోట్ల నెగ్గింది. 2020 ఎన్నికల్లో 38.51 శాతం ఓట్లతో 8 సీట్లు సాధించింది. ఈ సారి కనీసంగా 50 శాతం ఓట్లు సాధించాలనే లక్ష్యంగా ముందుకెళుతోంది. గతంలో గెలిచిన స్థానాలతో పాటు పోటీ చేసిన అన్ని స్థానాల్లో గతంలో వచ్చిన ఓట్ల కన్నా కనీసంగా 20 వేల ఓట్లు అధికంగా సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని కోసం ప్రతి బూత్ స్థాయిలో పోలయ్యే ఓట్లలో 50శాతం ఓట్లు సాధించేలా మైక్రో మేనేజ్‌మెంట్ వ్యూహాన్ని అమలు చేస్తోంది. కొన్ని నెలలుగా బీజేపీ ఓటర్ల జాబితాలను బూత్‌ల వారీగా తెప్పించి బీజేపీ అనుకూల, ప్రతికూల, స్థిరమైన ఓటర్లను గుర్తించింది. ఢిల్లీలో అందుబాటులో లేని ఓటర్లను వివిధ మార్గాల ద్వారా సంప్రదింపుల ప్రక్రియ పూర్తి చేసింది. ప్రతి బూత్‌లోని ఓటర్ల సామాజిక ప్రొఫైల్‌లను గుర్తించి స్థానిక పార్టీ నేతలు, సామాజికవర్గ నేతలను రంగంలోకి దించి వారికి దగ్గరయ్యే ప్రయత్నాలు చేసింది. ఢిల్లీలోని వివిధ ప్రాంతాలకు బీజేపీ క్లస్టర్లను ఏర్పాటు చేసి ప్రతి క్లస్టర్‌కు ఒక్కో ముఖ్య నేతను ఇంచార్జ్‌గా నియమించింది. మురికివాడలు, అనధికార కాలనీలతోపాటు వీధి వ్యాపారులనూ ఆకట్టుకునే పనిలో పడ్డారు. ఇందుకు ఆర్ఎస్ఎస్ నేతలు కూడా సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇతర రాష్ట్రాలవాసులు ఎక్కువ మంది ఉండే ప్రాంతాల్లో ఆ రాష్ట్రాలకు చెందిన నేతలనే ఇంఛార్జిలుగా నియమించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజలు సుమారు 3లక్షల మంది ఉన్నారు. వీళ్లు అత్యధికంగా ఉండే ఆర్‌కేపురం, పాండవ నగర్, కరోల్‌భాగ్ ప్రాంతాలకు రాష్ట్రానికి చెందిన ఎంపీలు ధర్మపురి అరవింద్, డీకే అరుణ వంటి నేతలకు ప్రచార బాధ్యతలు కట్టబెట్టారు. ఉత్తర ప్రదేశ్, బిహార్, ఉత్తరాఖండ్, పంజాబ్ ప్రజలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆయా రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు పనిచేస్తున్నారు. ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ స్థానిక మోర్చాలను కలుసుకోవడం, సమావేశాలను నిర్వహించడం, పథకాలపై అవగాహన కల్పించడం వంటివి చేస్తున్నారు. కేంద్రం తెచ్చిన బేటీ బచావో- బేటీ పఢావో ప్రచారంతో పాటు, జన్‌ధన్ ఖాతా, ఉజ్వల గ్యాస్ పథకం, ఉచిత గృహాలు, మరుగుదొడ్లు, ముస్లిం మహిళలకు ట్రిపుల్ తలాక్ నుండి స్వేచ్ఛ, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, మహిళా రిజర్వేషన్లు, హిందూ ఆలయాల పునర్నిర్మాణం వంటి అనేక పథకాలపై అవగాహన కల్పించే పనిని అప్పగించారు. ముఖ్యంగా యువ ఓటర్లు లక్ష్యంగా దేశ సమగ్రత, సనాతన ధర్మ పరిరక్షణ, 2047 నాటికి వికసిత్ భారత్ దిశగా అడుగులు, మేక్ ఇన్ ఇండియాతో యువతకు పెరిగిన ఉపాధి వంటి అవకాశాలపై ప్రేరణ కల్పించేలా ప్రణాళికలు రూపొందించారు.

రేపటి నుంచి మోదీ, షా, యోగి..

ఇక ప్రధాని నరేంద్ర మోదీ సహా పార్టీ కీలక నేతలంతా బుధవారం నుంచి ప్రచార పర్వంలో క్రియాశీలక పాత్ర పోషించనున్నారు. ప్రధాని మోదీ 29వ తేదీన కర్కర్‌దామా, 31వ తేదీన యమునా ఖాదర్, ఫిబ్రవరి రెండో తేదీన ద్వారకా ప్రాంతాల్లో బహిరంగ సభలు, ర్యాలీల్లో పాల్గొననున్నారు. ఢిల్లీ ప్రధాన ప్రాంతాల్లో భారీ ర్యాలీలు జరిపేలా ప్రణాళికలున్నాయి. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, అమిత్ షా సైతం ఆరు బహిరంగ సభలు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ యోగి దాదాపు 10 బహిరంగ సభలు, ర్యాలీల్లో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధంచేశారు. డజన్ల కొద్దీ కేంద్ర మంత్రులు, జాతీయ పార్టీల నేతలు, బీజేపీపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు, పొరుగు రాష్ట్రాల మంత్రులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిపి మొత్తంగా 100కు పైగా సభలకు ప్లాన్ చేశారు. ప్రచార అంశాలను పర్యవేక్షించడానికి ప్రతి కేంద్ర మంత్రికి రెండు అసెంబ్లీ నియోజకవర్గాలను కేటాయించారు.

అక్రమ వలసదారుల కోసం...

గురుద్వారాల్లో తనిఖీలు

ట్రంప్ సర్కారు తీరుపై సిక్కు సంఘాల ఆగ్రహం

వాషింగ్టన్: అక్రమ వలసదారులను పట్టుకునే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) అధికారులు న్యూయార్క్, న్యూజెర్సీల్లోని గురుద్వారాల్లో తనిఖీలు చేపట్టారు. సిక్కు వేర్పాటువాదులు, డాక్యుమెంట్లు లేని వలసదారులు తలదాచుకునేందుకు వాటిని ఉపయోగించుకోవచ్చన్న నివేదికల నేపథ్యంలో ఈ చర్యకు దిగారు. దీనిపై సిక్కు సంస్థలు మండిపడ్డాయి. ట్రంప్ సర్కారు చర్యను తీవ్రంగా ఖండించాయి. ఇది మత ప్రదేశాల పవిత్రతకు భంగకరమంటూ విమర్శించాయి. సున్నిత ప్రదేశాలు, పాఠశాలలు, ప్రార్థనా స్థలాల్లో తనిఖీలు చేయరాదన్న గత ప్రభుత్వ మార్గదర్శకాలను ట్రంప్ ప్రభుత్వం మార్చేసింది. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు నేరగాళ్లు ఇకపై పాఠశాలలు, చర్చిల్లో తలదాచుకోవడం కుదరదని తెలిపింది. ఈ నేపథ్యంలోనే వాటిలో తనిఖీలను ప్రారంభించింది.

సిక్కు సంస్థల ఆందోళన..

సున్నిత ప్రదేశాల పాలసీ మార్పుపై సిక్కు అమెరికన్ లీగల్ డిఫెన్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫండ్ (ఎస్ఏఎల్డీఎఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. ''గురుద్వారాలు కేవలం ప్రార్థనా స్థలాలు కాదు. సిక్కులతోపాటు ఇతర సమాజానికి మద్దతు, పోషణ, ఆధ్యాత్మిక ఓదార్పు అందించే కమ్యూనిటీ సెంటర్లు. వాటిని లక్ష్యం చేసుకోవడం మా విశ్వాస పవిత్రతకు భంగం కలిగిస్తుంది. దేశవ్యాప్తంగా వలస సమాజాలకు భయంకరమైన సందేశాన్ని పంపుతుంది''అని ఎస్ఏఎల్డీఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిరణ్ కౌర్‌గిల్ అన్నారు. ''ప్రార్థనా స్థలాలతో పాటు ఆసుపత్రులు, పాఠశాలలు, సామాజిక సేవా సంస్థలకు తనిఖీల నుంచి రక్షణను తొలగిస్తూ తెచ్చిన విధాన మార్పు సరికాదు. దీనివల్ల గురుద్వారాలపై ఐసీఈ ఏజెంట్లు నిఘా, దర్యాప్తులు, అరెస్టులు, దాడులు నిర్వహించడానికి వీలవుతుంది''అని ఆందోళన వ్యక్తం చేశారు. ''గురుద్వారాలు వారెంట్లతో ప్రభుత్వ నిఘాకు, సాయుధ దాడులకు లోనవుతాయనే ఆలోచన సిక్కు విశ్వాస సంప్రదాయానికి ఆమోదయోగ్యం కాదు. ప్రజలు తమ విశ్వాసాన్ని స్వేచ్ఛగా ఆచరించే విషయంలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవడం అంధయుగాలకు సూచిక'' అని సిక్కు కూటమి ఆందోళన వెలిబుచ్చింది.



మంటల్లో భవనం

ఇది పారిస్‌లోని 12వ డిస్ట్రిక్ట్ టౌన్ హాల్. 1876లో నిర్మితమైన ఈ చారిత్రక కట్టడం సోమవారం తెల్లవారుజామున సంభవించిన అగ్నిప్రమాదంలో చాలావరకు కాలిపోయింది. దాని ప్రధాన ఆకర్షణ అయిన 36 మీటర్ల ఎత్తయిన బెల్ టవర్ అయితే దాదాపుగా బుగ్గిగా మారింది. దాని పై భాగం ఏ క్షణమైనా కుప్పకూలేలా ఉంది. 150 మంది సిబ్బంది గంటలపాటు పోరాడి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాద కారణంపై దర్యాప్తు జరుగుతోంది.

2,500 ఏళ్లనాటి బంగారు హెల్మెట్‌ను... ఎత్తుకెళ్లారు

బాంబులతో గది తలుపు పేల్చేసి మరీ దోచేసిన వైనం



ఎస్సెన్ (నెదర్లాండ్స్): నెదర్లాండ్స్‌లో దొంగలు ఏకంగా వేల ఏళ్లనాటి బంగారు హెల్మెట్‌పైనే కన్నేశారు. ఎలాగైనా చేజిక్కించుకోవాలనుకున్నారు. చివరికి అనుకున్నది సాధించారు. కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థను బాంబులతో బద్దలుకొట్టి మరీ దోచుకెళ్లిపోయారు. అది ఏకంగా 2,500 ఏళ్లనాటి బంగారు హెల్మెట్! దాంతో ఈ దొంగతనం సంచలనం సృష్టించింది. ప్రాచీన వస్తు ప్రదర్శన కోసం తమ దేశం నుంచి నెదర్లాండ్స్ పట్టుకుపోయిన అత్యంత విలువైన వస్తువులు చోరశిఖామణుల పాలబడటంతో రొమేనియా సైతం దిగ్భ్రాంతికి గురైంది. నెదర్లాండ్స్‌లోని ఎస్సెన్ నగరంలోని డ్రెంట్స్ పురాతన వస్తుప్రదర్శనశాలలో ఈ భారీ చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం తెల్లవారుజామున ముసుగులు ధరించిన దొంగలు మ్యూజియం వద్దకొచ్చి బయటివైపు ఉన్న భారీ తలుపును రంధ్రాలు పెట్టే మెషీన్, ఇనుప రాడ్లతో ఎలాగోలా తెరిచారు. అక్కడే లోపలివైపు ఇంకో భారీ తలుపు ఉంది. అత్యంత పటిష్టంగా ఉన్న దీనిని మామూలుగా తెరవడం సాధ్యంకాదని దొంగలకు తెలుసో ఏమో, ముందుజాగ్రత్తగా పెద్ద బాంబును వెంట తెచ్చుకున్నారు. తలుపుకు బాంబు అమర్చి పేల్చేశారు. తునాతునకలైన ద్వారం గుండా ఎంచక్కా లోపలికి వెళ్లి అక్కడ అత్యంత ప్రాచీనమైన నాలుగు వస్తువులను తీసుకుని ఉడాయించారు.

వెలకట్టలేని హెల్మెట్

చోరీకి గురైన వాటిల్లో 2,500 ఏళ్ల క్రితం నాటి పుత్తడితో చేసిన హెల్మెట్ ఉంది. క్రీస్తుపూర్వం 50వ సంవత్సరంలో దీనిని తయారు చేశారని కొందరు చరిత్రకారులు చెబుతున్నారు. దాదాపు 907 గ్రాముల బరువైన ఈ హెల్మెట్‌ను రొమేనియాలో వంద సంవత్సరాల క్రితం ఒక కుగ్రామంలో కనుగొన్నారు. 'హెల్మెట్ ఆఫ్ కోటోఫెనెస్టీ'గా పిలుచుకునే దీనిని పూర్వకాలంలో ఉత్సవాలు, సంబరాల్లో ఉపయోగించేవారు. హెల్మెట్ ముందు భాగంలో పెద్ద కళ్లను చెక్కారు. దుష్టశక్తుల బారిన పడకుండా కాపాడుతుందని ఆనాటి జనం విశ్వసించేవారు. జంతు వధ చేస్తున్నట్లుగా హెల్మెట్ వెనుకవైపు చెక్కారు. రొమేనియా సంస్కృతి సంబంధించి ఇది వెలకట్టలేని ప్రాచీన కళాఖండమని చోరీ తర్వాత రొమేనియా ప్రభుత్వం ఆవేదన వ్యక్తంచేసింది. దీంతోపాటు డేసియన్ల రాజ్యానికి చెందిన అలనాటి రాయల్ బ్రేస్‌లెట్‌సహా మూడు వస్తువులనూ దొంగలు పట్టుకెళ్లిపోయారు. రోమన్లు రొమేనియాను పాలించడానికి ముందు రాజ్యమేలిన డేసియన్ల సంస్కృతిని కళ్లకు కట్టేందుకు ఆనాటి వస్తువులను ఒక దగ్గరకు చేర్చి నెదర్లాండ్స్ ప్రభుత్వం ఒక ప్రదర్శనను ఏర్పాటుచేసింది. గత ఏడాది జూలై నుంచి ఈ ప్రదర్శన కొనసాగుతోంది. కీలకమైన హెల్మెట్‌ను సైతం రొమేనియా నుంచి తెప్పించిమరీ ప్రదర్శనకు ఉంచగా అది కాస్తా ఇప్పుడు దొంగలపరమైంది.

చోరుల కోసం వేట మొదలు

మళ్లీ అప్పజెప్తామని చెప్పి బుకారెస్ట్ నగరంలోని 'నేషనల్ హిస్టరీ మ్యూజియం ఆఫ్ రొమేనియా' నుంచి తీసుకొచ్చిన ప్రాచీన వస్తువులు పోవడంతో నెదర్లాండ్స్ ప్రభుత్వం ఈ చోరీ ఘటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఎలాగైనా వాళ్లను పట్టుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. వారం క్రితం చోరీకి గురైన ఒక కారు ఈ మ్యూజియం దగ్గర కాలిపోయిన స్థితిలో ఉండటం చూసి ఈ రెండు చోరీలకు ఏమైనా సంబంధం ఉందేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు. కొట్టుకొచ్చిన కారులో ఇక్కడికొచ్చిన దొంగలు ఆ తర్వాత పారిపోతూ నాలుగు మైళ్ల దూరంలో కారును వదిలేసి తగలబెట్టిపోయారని పోలీసులు భావిస్తున్నారు. కొట్టేసిన కారుకు నకిలీ నంబర్ ప్లేట ఉండటం చూస్తుంటే ఇదేదో ఆరితేరిన దొంగలముఠా పనిగా అనుమానిస్తున్నారు. '' మా మ్యూజియం 170 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ ఇలాంటి చోరీ ఘటన చూడలేదు. నిజంగా ఇది దురదృష్టకరం'' అని ఎస్సెన్‌లోని డ్రెంట్స్ మ్యూజియం డైరెక్టర్ హ్యారీ ట్యూపన్ అన్నారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో

గిరిజనుడి హత్య

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఘాతుకం

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడనే నెపంతో మావోయిస్టులు ఓ గిరిజనుడిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బీజాపూర్ జిల్లా భైరంఘడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశముండిపారా గ్రామానికి చెందిన సోడి భద్రు(45) ఇంటికి ఆదివారం రాత్రి 7 గంటలకు వచ్చిన మావోయిస్టులు భద్రును బయటకు లాక్కొచ్చారు. అడ్డొచ్చిన భార్య, కుటుంబసభ్యులను పక్కకు నెట్టి ఇంటి ఆవరణలోనే గొడ్డలితో తల, నుదిటిపై నరికారు. దీంతో భద్రు అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం సమాచారం అందుకున్న భైరంఘడ్ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని భైరంఘడ్ తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. కాగా, పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా మారి తమ సమాచారాన్ని పోలీసులకు చేరవేస్తున్నందునే హతమార్చామని, ఇలా ఎవరు వ్యవహరించినా ఇదే శిక్ష పడుతుందని హెచ్చరిస్తూ మావోయిస్టులు లేఖ వదిలారు.

పుణెలో 101కు చేరిన జీబీఎస్ కేసులు

షోలాపూర్‌లో ఒక వ్యక్తి మృతి

- మహారాష్ట్రలో నమోదైన తొలి మరణం
- ఏడుగురు సభ్యుల వైద్య నిపుణుల బృందాన్ని పంపిన కేంద్రం

పుణె: ప్రమాదకర క్యాంఫలోబ్యాక్టర్ జెజునీ బ్యాక్టీరియా, వైరస్‌లు సోకడంతో చివరకు గెలేన్ బారే సిండ్రోమ్(జీబీఎస్) వ్యాధి ముదిరి షోలాపూర్‌లో ఒక వ్యక్తి మరణించడంతో మహారాష్ట్రలో జీబీఎస్ భయాలు ఎక్కువయ్యాయి. ఒక్క పుణె పరిధిలోనే జీబీఎస్ సంబంధ కేసులు వంద దాటడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. జీబీఎస్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని మహారాష్ట్ర సర్కార్ ప్రకటించింది. వ్యాధి కట్టడిలో రాష్ట్ర ఆరోగ్యశాఖ యంత్రాంగానికి సాయపడేందుకు ఏడుగురు వైద్య నిపుణులతో బృందాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పంపించింది. జీబీఎస్ సోకడంతో పుణెలో ఒక మరణించినట్లు తెలుస్తోంది. దీంతో మహారాష్ట్రలో తొలి జీబీఎస్ మరణం నమోదైనట్లయింది. షోలాపూర్‌కు చెందిన 40 ఏళ్ల వ్యక్తి పుణెలో చికిత్సచేయించుకుంటూ మరణించారు. కలుషిత నీరు తాగడంతో అందులోని బ్యాక్టీరియా మానవశరీరంలోకి ప్రవేశించి కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలను పెంచేసి చివరకు జీబీఎస్‌కు దారితీస్తుంది. వ్యాధి నిరోధక వ్యవస్థ తగ్గి నరాలు బలహీనమై మనిషి ప్రాణాలు పోయే ప్రమాదముంది. తొలిదశలో గుర్తించి త్వరగా చికిత్స మొదలుపెడితే చికిత్సతో వ్యాధిని నివారించవచ్చు. ఆరు నెలల నుంచి గరిష్ఠంగా రెండు సంవత్సరాల లోపు పూర్తిగా కోలుకోవచ్చు. ''జనవరి 18న శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది, డయేరియా, నొప్పులతో షోలాపూర్‌లో ప్రైవేట్ ఆస్పత్రులో చేరిన రోగి ఆదివారం మరణించారు. ప్రస్తుతం పుణెలో 68 మంది పురుషులు, 33 మంది మహిళలు జీబీఎస్‌తో బాధపడుతున్నారు'' అని షోలాపూర్ ప్రభుత్వ వైద్యకళాశాల డీన్ డాక్టర్ సంజీవ్ ఠాకూర్ వెల్లడించారు. మృతుని రక్తనమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించారు. కేసుల కట్టడికి రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు, పుణె మున్సిపాలిటీ కార్పొరేషన్ ఆరోగ్య బృందాలు కలిసి కట్టుగా కృషిచేస్తున్నాయని మహారాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రకాశ్ అబీద్కర్ చెప్పారు. ఎక్కువ కేసులు సింహగఢ్ రోడ్డు సమీప గ్రామాల్లో వెలుగుచూశాయి. దీంతో చుట్టుపక్కల గ్రామాలకు నీటిసరఫరా జరుగుతున్న ఆ రోడ్డులోని ఒక బావిని మంత్రి స్వయంగా వెళ్లి పరిశీలించారు.

ఆస్ట్రేలియాకు

కార్చిచ్చు ముప్పు

- మండే ఎండలు, మెల్‌బోర్న్‌లో 41 డిగ్రీలు
- జనవరి సగటు కంటే 14నిడిగ్రీలు అధికం

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాను మండే ఎండలు భయపెడుతున్నాయి. మెల్‌బోర్న్‌లో సోమవారం 41 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి! జనవరిలో సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఇది ఏకంగా 14 డిగ్రీలు అధికం. ఆగ్నేయ ఆస్ట్రేలియాలో సోమవారం తీవ్ర వడగాల్పులు వీచాయి. దాంతో కార్చిచ్చు ముప్పు పెరిగింది. ఈ నేపథ్యంలో విక్టోరియా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అగ్నిమాపక ఆంక్షలు విధించారు. సోమవారం న్యూ సౌత్‌వేల్స్, సౌత్ ఆస్ట్రేలియా, వెస్ట్రన్ ఆస్ట్రేలియా, క్వీన్స్‌ల్యాండ్, నార్తర్న్ టెరిటరీ రాష్ట్రాల్లో రెండో అగ్నిప్రమాద ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. వేడి గాలులు పెద్ద మంటలను రేకెత్తించవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. 2019-2020 బ్లాక్ సమ్మర్ తరువాత మళ్లీ ఈ ఏడాది అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 2020 మంటలు 33 మందితో పాటు లక్షలాది వన్యప్రాణులను పొట్టన పెట్టుకున్నాయి.

‘జై తెలంగాణ పార్టీ’ స్థాపకుడు ఎవరు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ ఉద్యమం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో వివిధ రాజకీయ పార్టీల పాత్ర

తెలంగాణ ప్రజా ఫ్రంట్

ప్రజాస్వామిక తెలంగాణే లక్ష్యంగా ‘తెలంగాణ ప్రజా ఫ్రంట్’ (టీపీఎఫ్) ఆవిర్భవించింది. ఇది అనేక ప్రజా సంఘాల కూటమి.
- టీపీఎఫ్ ఏర్పాటులో గద్దర్, ఆకుల భూమయ్య, వేదకుమార్, విమలక్క తదితరులు కీలకపాత్ర పోషించారు.
- ప్రజా గాయకుడు గద్దర్ నేతృత్వంలో 2010 అక్టోబర్ 9న టీపీఎఫ్ ఏర్పడింది.



- పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణకు తీవ్రమైన నష్టం జరుగుతుందని, దాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమాలు చేపట్టారు.
- తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో జాప్యాన్ని నిరసిస్తూ ఆందోళనలు నిర్వహించారు.
- శ్రీకృష్ణ కమిటీ సిఫారసులపై ఆందోళన చేపట్టారు.
- ఉద్యమ పార్టీలు ఎన్నికల్లో పాల్గొనవద్దని గద్దర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలోనే తెలంగాణ ఏర్పాటు సాధ్యమని, అందువల్ల తప్పకుండా పోటీ చేయాలని విమలక్క వాదించారు. దీంతో విభేదాలు తలెత్తి విమలక్క టీపీఎఫ్ నుంచి వైదొలిగారు.
- 2010 అక్టోబర్ 21న విమలక్క ‘ఐక్య కమిటీ’ని ఏర్పాటు చేశారు.
- టీపీఎఫ్ నుంచి గద్దర్ పక్కకు తప్పుకోవడంతో 2012లో ఆకుల భూమయ్య దీని అధ్యక్షుడిగా వ్యవహరించారు.

తెలంగాణ జనసభ -1985

- 1985లో తెలంగాణ జనసభను ఏర్పాటు చేశారు.
- 80వ దశకంలో తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జనసభ ముఖ్య భూమిక పోషించింది.

తెలంగాణ ఫోరం - జానారెడ్డి

1990లో జానారెడ్డి కన్వీనర్‌గా తెలంగాణ ఫోరం ఏర్పాటైంది.
- 1992 సెప్టెంబర్‌లో నాటి ప్రధాని పీవీ నరసింహారావును కలిసి విద్య ఉద్యోగ, సాగునీటి కేటాయింపుల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై జానారెడ్డి వినతిపత్రం సమర్పించారు.
- తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై జానారెడ్డి నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.



వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి భారత రాజ్యాంగంలోని 3వ ప్రకరణ ప్రకారం పార్లమెంట్ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తుందని, ఈ విషయంలో ప్రాంతీయ పార్టీల అభిప్రాయాలను పెద్దగా పరిగణనలోకి తీసుకోరని పేర్కొన్నారు.

ప్రజారాజ్యం

ప్రజారాజ్యం పార్టీని ప్రముఖ నటుడు చిరంజీవి స్థాపించారు. తర్వాత దీన్ని కాంగ్రెస్‌లో విలీనం చేశారు.
- చిరంజీవి సమైక్యాంధ్రవైపు మొగ్గు చూపారు.
- 2010 జనవరి 5న ఢిల్లీలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ప్రజారాజ్యం పార్టీ తరఫున చిరంజీవి, సి.రామచంద్రయ్య హాజరయ్యారు. వీరిద్దరూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తాము వ్యతిరేకమని చెప్పారు.

జై తెలంగాణ పార్టీ - 1997

1997లో ఇంద్రారెడ్డి ‘జై తెలంగాణ పార్టీ’ని స్థాపించారు. తెలంగాణ వ్యాప్తంగా సదస్సులు, సమావేశాలు నిర్వహించారు.
- పటోళ్ల ఇంద్రారెడ్డి టీడీపీలో కీలక నేతగా ఉండేవారు. నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు ఈయన అత్యంత విశ్వసనీయుడు.
- ఎన్.టి. రామారావు ప్రభుత్వంలో ఈయన మంత్రిగా పనిచేశారు.
- 1995లో టీడీపీ సంక్షోభ సమయంలో ఇంద్రారెడ్డి ఎన్టీఆర్ పక్షాన నిలిచారు.
- తర్వాత జరిగిన పరిణామాల వల్ల ఇంద్రారెడ్డి తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు.
- 1996లో నాటి ప్రధాని దేవెగౌడ చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు అనుకూలం అని ప్రకటించారు.

తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేటివ్ ఫోరం - చిన్నారెడ్డి

చిన్నారెడ్డి తెలంగాణ వాది. కాంగ్రెస్‌లోని తెలంగాణవాదులందరినీ ఒక్కటి చేసి ‘తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేటివ్ ఫోరం’ను ఏర్పాటు చేశారు. దీనికి ఆయన కన్వీనర్‌గా వ్యవహరించారు.
- 2000 ఆగస్టు 11న కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ హైదరాబాద్‌కు వచ్చారు. చిన్నారెడ్డి నాయకత్వంలో 41 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తెలంగాణకు అనుకూలంగా సోనియాగాంధీకి వినతిపత్రం సమర్పించారు.
- తెలంగాణ రీజినల్ కాంగ్రెస్ కో ఆర్డినేషన్ కమిటీకి చిన్నారెడ్డి సారథ్యం వహించారు.
- 2004 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. వై.ఎస్. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. వనపర్తి నియోజక వర్గం నుంచి గెలిచిన చిన్నారెడ్డికి వైఎస్ మంత్రి పదవి ఇచ్చారు.



2008 - నవ తెలంగాణ పార్టీ

- టీడీపీ సీనియర్ నేత దేవేందర్ గౌడ్ 2008లో సాధారణ ఎన్నికల ముందు ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి నవ తెలంగాణ పార్టీ స్థాపించారు.
- వాహనాలకు తెలంగాణ పేరుతో స్టిక్కర్లు అంటించడం తదితర కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను వేగవంతం చేయాలంటూ ఆందోళనకు దిగారు.
- 2009 మార్చిలో దేవేందర్‌గౌడ్ తన పార్టీని ప్రజారాజ్యం పార్టీలో విలీనం చేశారు.

తెలంగాణ రిజర్వేషన్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు విద్యాసంస్థల్లో రిజర్వేషన్ల కోసం ‘తెలంగాణ రిజర్వేషన్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్’ ఏర్పాటు చేశారు.
- తెలంగాణ ఆకాంక్షను ఈ సంస్థ బలంగా వినిపించింది.
- ఆరు సూత్రాల పథకం ప్రకారం విద్యాసంస్థల్లో స్థానికులకు 85 శాతం సీట్లు కేటాయించాల్సి ఉండేది. ఓపెన్ కాంపిటీషన్ కోటా కోసం 15 శాతం సీట్లు కేటాయించాల్సి ఉండగా, ప్రభుత్వం ఓపెన్ కోటా కోసం 15 శాతం సీట్లను స్థానికేతరులకు రిజర్వు చేసింది.
- తెలంగాణలో రిజర్వేషన్ల కోసం మొదలైన ఈ ఉద్యమం తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను వెలుగులోకి తీసుకువచ్చింది.



- 2009 ఆగస్టు 6న ప్రజారాజ్యం నుంచి బయటకు వచ్చి మళ్లీ తెలుగుదేశం పార్టీలో చేరారు.
- దేవేందర్ గౌడ్ ప్రస్తుతం టీడీపీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

లోక్‌సత్తా పార్టీ

2006లో లోక్‌సత్తా రాజకీయ పార్టీగా అవతరించింది. మొదట్లో ఇది తెలంగాణపై ఎలాంటి నిర్ణయం చెప్పలేదు. తర్వాత తెలంగాణ ప్రాంతానికి చెందిన ఈ పార్టీ నాయకుల ఒత్తిడితో తెలంగాణ ఏర్పాటును స్వాగతిస్తామని చెప్పారు. ఆ తర్వాత ఈ పార్టీ కార్యకర్తలు ఉద్యమంలో పాల్గొన్నారు.

మాదిరి ప్రశ్నలు

1. 1990లో జానారెడ్డి దేనికి కన్వీనర్‌గా వ్యవహరించారు?
ఎ) తెలంగాణ జేఏసీ
బి) తెలంగాణ ఫోరం
సి) తెలంగాణ పార్టీ
డి) తెలంగాణ సమితి
2. 2005లో కేంద్రం ఎవరి అధ్యక్షతన ఒక ఉపసంఘాన్ని నియమించింది?
ఎ) చిదంబరం బి) శశిథరూర్
సి) రాహుల్ గాంధీ డి) ప్రణబ్ ముఖర్జీ
3. ఏ పార్టీ కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో తెలంగాణ అంశాన్ని చేర్చింది?
ఎ) టీడీపీ బి) కాంగ్రెస్
సి) టీఆర్ఎస్ డి) బీజేపీ
4. నాగం జనార్దన్ రెడ్డి ఏర్పాటు చేసిన పార్టీ ఏది?
ఎ) నవ తెలంగాణ
బి) నిత్య తెలంగాణ
సి) తెలంగాణ మండల సమితి
డి) తెలంగాణ నగారా సమితి
5. 2001 మే 11న కరీంనగర్‌లో కేసీఆర్ ఏర్పాటు చేసిన ‘సింహగర్జన’ సమావేశానికి హాజరై తెలంగాణ ఏర్పాటుకు మద్దతు తెలిపిన శిబూ సోరెన్ ఏ పార్టీ నాయకుడు?
ఎ) జార్ఖండ్ ముక్తి మోర్చా
బి) అకాలీదళ్ సి) బీఎస్పీ డి) ఎస్.పి.
6. తెలంగాణ బిల్లుకు లోక్‌సభలో మద్దతు తెలిపిన బీజేపీ ఫ్లోర్ లీడర్ ఎవరు?
ఎ) రాజ్‌నాథ్ సింగ్ బి) వరుణ్ గాంధీ
సి) సుష్మాస్వరాజ్ డి) అరుణ్‌జైట్లీ
7. తల్లి తెలంగాణ పార్టీని ఎవరు స్థాపించారు?
ఎ) విజయశాంతి బి) నాగం జనార్దన్ రెడ్డి
సి) డి.కె. అరుణ డి) సబిత ఇంద్రారెడ్డి
8. 2002 ఏప్రిల్ 27న టి.ఆర్.ఎస్. ప్రథమ వార్షికోత్సవ సభను ఎక్కడ నిర్వహించారు?
ఎ) ఆదిలాబాద్ బి) నిజామాబాద్
సి) రంగారెడ్డి డి) నల్లగొండ
9. 2010 జనవరి 5న కేంద్రం నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి బీజేపీ తరఫున తెలంగాణ ప్రాంతం నుంచి హాజరైన నాయకుడు ఎవరు?
ఎ) కిషన్ రెడ్డి
బి) బండారు దత్తాత్రేయ
సి) యెండల లక్ష్మీనారాయణ
డి) లక్ష్మణ్
10. 2000లో ఆలె నరేంద్ర బీజేపీ నుంచి బయటకు వచ్చి ఏ పార్టీని స్థాపించారు?
ఎ) తెలంగాణ నగారా సమితి
బి) తెలంగాణ రాష్ట్ర సమితి
సి) తెలంగాణ సాధన సమితి
డి) నవ తెలంగాణ
11. తెలంగాణ బిల్లుకు రాజ్యసభలో బీజేపీ తరఫున మద్దతు తెలిపిన నాయకులు ఎవరు?
ఎ) అరుణ్ జైట్లీ బి) అర్జున్ ముండ
సి) రవిశంకర్ ప్రసాద్
డి) మహావీర్ త్యాగి
12. 1969 తెలంగాణ ఉద్యమం, జై ఆంధ్ర ఉద్యమం తర్వాత ప్రవేశపెట్టిన పథకం ఏది?
ఎ) 5 సూత్రాల పథకం
బి) 3 సూత్రాల పథకం
సి) 4 సూత్రాల పథకం
డి) 6 సూత్రాల పథకం
13. గిర్‌గ్లాని కమిషన్ తన నివేదికను ఎన్ని రోజుల్లోగా ఇవ్వాలని కేంద్రం పేర్కొంది?
ఎ) 30 రోజులు బి) 90 రోజులు
సి) 60 రోజులు డి) 40 రోజులు
14. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించిన బిల్లును రాజ్యసభ ఎప్పుడు ఆమోదించింది?
ఎ) 2014 ఫిబ్రవరి 20
బి) 2014 ఫిబ్రవరి 21
సి) 2014 ఫిబ్రవరి 22
డి) 2014 ఫిబ్రవరి 24
15. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ దీక్షను ఎప్పుడు ప్రారంభించారు?
ఎ) 2009 నవంబర్ 29
బి) 2009 డిసెంబర్ 24
సి) 2009 అక్టోబర్ 24
డి) 2009 నవంబర్ 4

సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) డి; 5) ఎ; 6) సి; 7) ఎ; 8) డి; 9) బి; 10) సి; 11) ఎ; 12) డి; 13) బి; 14) ఎ; 15) ఎ.

చంద్రుడి పైకి మానవుడిని పంపిన మొదటి దేశం?



మన విశ్వం

1. శుక్రగ్రహం తరహాలోనే సూర్యుడి చుట్టూ తూర్పు నుంచి పడమరకు తిరిగే గ్రహం?
- యురేనస్
2. అక్షం అత్యధికంగా వంగి ఉండటం ఏ గ్రహం ప్రత్యేకత?
- యురేనస్
3. యురేనస్ గ్రహం సూర్యుడి చుట్టూ పరిభ్రమించడానికి పట్టే సమయం?
- 84 సంవత్సరాలు
4. యురేనస్ గ్రహానికి మరో పేరు?
- గ్రీన్ ప్లానెట్
5. సూర్యుడి చుట్టూ పరిభ్రమించడానికి నెప్ట్యూన్‌కు పట్టే సమయం?
- 165 సంవత్సరాలు
6. తోకచుక్కలు సూర్యుడి చుట్టూ ఏ కక్ష్యలో పరిభ్రమిస్తుంటాయి?
- అతి దీర్ఘవృత్తాకర కక్ష్య
7. తోకచుక్క సూర్యుడిని సమీపించే కొద్దీ దాని తోక పొడవు?
- పెరుగుతుంది.
8. హేలీ అనే తోకచుక్క ఎన్ని సంవత్సరాలకు ఒకసారి కనిపిస్తుంది?
- 76 సంవత్సరాలు. హేలీ తోకచుక్క 1986లో కనిపించింది. తిరిగి 2062లో దీన్ని చూడవచ్చు.
9. సౌర కుటుంబం ఏయే పదార్థాలతో ఏర్పడిందో తెలుసుకోవడానికి శాస్త్రవేత్తలకు ఉపకరించేవి?
- ఉల్కాపాతాలు
10. భారతదేశం మొదటిసారిగా ప్రయోగించిన ఉపగ్రహం?
- ఆర్యభట్ట
11. విశ్వానికి కేంద్రంలో సూర్యుడు ఉన్నాడు. మిగతా అంతరిక్ష వస్తువులన్నీ దాని చుట్టూ పడమర నుంచి తూర్పు వైపు తిరుగుతున్నాయని తెలిపిన శాస్త్రవేత్త?
- కోపర్నికస్
12. చంద్రుడి ఆకారంలో కలిగే మార్పులను ఏమంటారు?
- చంద్రకళలు
13. అతి తక్కువ వ్యాసం ఉన్న గ్రహం?
- బుధగ్రహం
14. సూర్యుడిలో మండుతున్న ఇంధనం?
- ఉదజని (హైడ్రోజన్)
15. నక్షత్రాలు తూర్పు నుంచి పడమరకు తిరుగుతున్నట్లు కనిపించడానికి కారణం?
- భూమి పడమర నుంచి తూర్పునకు గుండ్రంగా తిరగడం.
16. సూర్యుడు ఏ తరహా నక్షత్రం?
- మధ్య తరహా నక్షత్రం
17. సూర్యుడి చుట్టూ ఒకసారి పరిభ్రమించడానికి శని గ్రహానికి ఎంత కాలం పడుతుంది?
- 29.5 సంవత్సరాలు
18. మనం ఎల్లప్పుడూ చంద్రుడి ఒకే ముఖాన్ని చూస్తుంటాం. కారణం?
- చంద్రుడి ఆత్మభ్రమణ, భూమి చుట్టూ పరిభ్రమణ కాలాలు సమానం (27.3 రోజులు). చంద్రుడికి, భూమికి మధ్య దూరం 3,84,399 కి.మీ.
19. బ్లాక్‌హోల్ దేన్ని సూచిస్తుంది?
- రోదసిలో ఒక నక్షత్ర స్థితి
20. రోదసి యాత్రికుడికి బాహ్య రోదసి ఎలా కనిపిస్తుంది?
- నల్లగా
21. కాస్మిక్ కిరణాలను విడుదల చేసేవి?
- సూర్యుడు, నక్షత్రాలు
- కాస్మిక్ కిరణాల ఉనికిని మొదటిసారిగా సి.టి.ఆర్.విల్సన్ గుర్తించారు.
- కాస్మిక్ కిరణాలను మిల్లికాన్, విక్టర్ హెజ్ ప్రయోగపూర్వకంగా కనుగొన్నారు.
- కాస్మిక్ కిరణాలు ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్, పాజిట్రాన్ అయాన్లను కలిగి ఉంటాయి.
- ఈ కిరణాల్లో 80% వరకు ప్రోటాన్లు ఉంటాయి. నక్షత్రాల్లో అధిక సంఖ్యలో ప్రోటాన్లు ఉండటమే దీనికి కారణం.
- కాస్మిక్ రే టెలిస్కోప్ అనే పరికరం ద్వారా కాస్మిక్ కిరణాల ఉనికి, దిశను తెలుసుకోవచ్చు.
- ఈ కిరణాల తీవ్రత ధ్రువాల వద్ద అత్యధికంగా, భూమధ్యరేఖ వద్ద అత్యల్పంగా ఉంటుంది.
- మనదేశంలో కాస్మిక్ కిరణాలను గురించి విక్రమ్ సారాభాయ్, హోమీ జహంగీర్ బాబా, మేఘనాథ్ సాహా అధ్యయనం చేశారు.
- 1985లో భారత్, అమెరికా సంయుక్తంగా అనురాధ అనే ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపి కాస్మిక్ కిరణాల గురించి అధ్యయనం చేశాయి.
22. భూ కేంద్రం ఎన్ని పొరలుగా ఉంటుంది?
- రెండు
- బాహ్యకేంద్ర మండలం- 2,300 కి.మీ.
- అంతర కేంద్ర మండలం- 2600 కి.మీ.
23. రాత్రి సమయంలో కాంతివంతంగా కనిపించే గ్రహం?
- శుక్రుడు
24. జియోస్టేషనరీ ఉపగ్రహం భూమి చుట్టూ తిరగడానికి పట్టే సమయం?
- 24 గంటలు
25. ఆస్ట్రనామికల్ యూనిట్ అనే ప్రమాణాన్ని వేటి మధ్య దూరం కొలవడానికి ఉపయోగిస్తారు?
- సూర్యుడి కేంద్రం నుంచి భూ కేంద్రానికి మధ్య దూరం కొలవడానికి
26. అంతరిక్షం బయట నుంచి భూవాతావరణంలోకి ప్రవేశించిన చిన్న పదార్థాన్ని ఏమని పిలుస్తారు?
- ఉల్క
27. భూ వాతావరణంలో పొరల సరైన క్రమం?
- ట్రోపోస్పియర్, స్ట్రాటోస్పియర్, మోనోస్పియర్, ఐనోస్పియర్, ఎక్సోస్పియర్
28. సౌరవ్యవస్థను కనుగొన్నవారు?
- కోపర్నికస్
29. సౌరమండల వ్యవస్థ ఎక్కడి నుంచి ప్రారంభమైనట్లు భావిస్తారు?
- సూర్యుడు
30. కృత్రిమ ఉపగ్రహాన్ని ప్రయోగించిన మొదటి దేశం?
- రష్యా
31. చంద్రుడి పైకి మానవుడిని పంపిన మొదటి దేశం?
- అమెరికా
32. జాన్‌గాలే కనుగొన్న గ్రహం?
- ఇంద్రుడు
33. భారత్ తన తొలి ఉపగ్రహమైన ఆర్యభట్టను ఎప్పుడు ప్రయోగించింది?
- 1975
34. పాలపుంత చుట్టూ సూర్యుడు ఒకసారి పరిభ్రమించడానికి పట్టే కాలం?
- 250 మిలియన్ సంవత్సరాలు
35. నక్షత్రం రంగు దేన్ని సూచిస్తుంది?
- ఉష్ణోగ్రత
36. భూమి ఏ గ్రహాల మధ్యలో ఉంది?
- శుక్రుడు, అంగారకుడు
37. బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం ఏ విషయాన్ని వివరిస్తుంది?
- విశ్వ ఆవిర్భావం
38. బిగ్ బ్యాంగ్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు?
- అబ్బెజార్జియస్ లైమిట్రి
39. జీవిని ప్రతిచోట ప్రభావితం చేసేది?
- గురుత్వాకర్షణ
40. బ్లూ మూన్ అంటే?
- ఒకే నెలలో రెండోసారి వచ్చే పౌర్ణమిచంద్రుడు
41. భూ స్థావర ఉపగ్రహం ఎత్తు?
- 36,000 కి.మీ.
42. భూ కేంద్రం నుంచి భూస్థావర ఉపగ్రహం ఎత్తు?
- 42,400 కి.మీ.
43. భూస్థావర ఉపగ్రహం భూమి చుట్టూ పరిభ్రమించడానికి పట్టే కాలం?
- 23 గంటల 56 నిమిషాల 4.09 సెకన్లు లేదా సుమారు 24 గంటలు లేదా ఒక రోజు
44. భూమికి అత్యంత సమీపంలో భూమిచుట్టూ పరిభ్రమించేందుకు ఉపగ్రహానికి పట్టే సమయం?
- 84.6 నిమిషాలు లేదా 5,000 సెకన్లు
45. సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
- కోపర్నికస్
46. సూర్యకేంద్రక సిద్ధాంతం సరైందేనని అభిప్రాయపడ్డ శాస్త్రవేత్త?
- టైకోబ్రాహి
47. సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని వివరించేందుకు నియమాలు ప్రతిపాదించిందెవరు?
- జోహన్నెస్ కెప్లర్
48. కెప్లర్ ఎన్ని గ్రహ గమన నియమాలను ప్రతిపాదించారు?
- మూడు
49. కెప్లర్ మొదటి గ్రహ గమన నియమానికి మరోపేరు?
- కక్ష్యానియమం
50. కెప్లర్ రెండో గ్రహ గమన నియమానికి మరో పేరు?
- వైశాల్య నియమం
51. కెప్లర్ మూడో గ్రహ గమన నియమానికి మరో పేరు?
- ఆవర్తన కాల నియమం
52. కెప్లర్ మూడో గ్రహ గమన నియమం సూత్రం?
- $T^2 \propto R^3$
53. సూర్యుడి చుట్టూ గ్రహాలు ఏ కక్ష్యలో పరిభ్రమిస్తుంటాయి?
- దీర్ఘవృత్తాకార కక్ష్య
54. సూర్యుడికి, భూమికి మధ్య దూరాన్ని ఏ ప్రమాణాల్లో కొలుస్తారు?
- ఆస్ట్రనామికల్ యూనిట్లలో
$1\ A.U. = 1.495 \times 10^{11}$ మీ.
= 149.5 మిలియన్ కి.మీ.
- ఇది భూమికి, సూర్యుడికి మధ్య సగటు దూరాన్ని సూచిస్తుంది.
55. భూమికి, సూర్యుడికి మధ్య ఉన్న అత్యల్ప దూరాన్ని ఏమంటారు?
- పరిహేళి
56. పరిహేళి ఏ రోజున ఏర్పడుతుంది?
- జనవరి 3
57. పరిహేళి ఏర్పడినప్పుడు భూమికి, సూర్యుడికి మధ్య దూరం?
- 147 మిలియన్ కి.మీ.
58. భూమికి, సూర్యుడికి మధ్య ఉండే అత్యధిక దూరాన్ని ఏమంటారు?
- అపహేళి
59. అపహేళి ఏ రోజున సంభవిస్తుంది?
- జూలై 4
60. అపహేళి ఏర్పడినప్పుడు భూమికి సూర్యుడికి మధ్య ఉండే దూరమెంత?
- 152 మిలియన్ కి.మీ.
61. భూమి ఉపరితలంపై ఉన్న పొరను ఏమంటారు?
- భూపటలం
- భూపటలం మందం 5 కి.మీ. నుంచి 32 కి.మీ.
- ఈ పొరలో లభ్యమయ్యే మూలకాలు సిలికాన్, అల్యూమినియం.
62. భూపటలం కింది భాగంలో ఉండే పొరను ఏమని పిలుస్తారు?
- భూ ప్రావారం
- దీని మందం 2900 కి.మీ.
- ఈ పొరలో లభ్యమయ్యే మూలకాలు సిలికాన్, మెగ్నీషియం

విద్య, ఉద్యోగ సమాచారం

కొచ్చిన్ పోర్ట్ అథారిటీ, కేరళలో వివిధ ఉద్యోగాలు

కేరళలోని కొచ్చిన్ పోర్ట్ అథారిటీలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
» **పోస్టుల వివరాలు:** డ్రెడ్జర్ కమాండర్-01, అసిస్టెంట్ ఇంజనీర్-02, డిప్యూటీ డైరెక్టర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్), సీఎంఎఫ్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** డ్రెడ్జర్ కమాండ్ పోస్టుకు 45 ఏళ్లు, అసిస్టెంట్ ఇంజనీర్, డిప్యూటీ డైరెక్టర్ పోస్టుకు 35 ఏళ్లు.
» **వేతనం:** నెలకు డ్రెడ్జర్ కమాండ్ పోస్టుకు రూ.70,000 నుంచి రూ.2,00,000, అసిస్టెంట్ ఇంజనీర్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000, డిప్యూటీ డైరెక్టర్ పోస్టుకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 23.01.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.02.2025.
» **వెబ్‌సైట్:** https://cochinport.gov.in

ఐఐఎం ముంబైలో వివిధ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ముంబైలో.. జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్, అకౌంటెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్-01, జూనియర్ అకౌంటెంట్ -01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, బీకాం, బీబీఏ, సీఏ, ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టుకు 30 ఏళ్లు, జూనియర్ అకౌంటెంట్ పోస్టుకు 35 ఏళ్లు.
» **వేతనం:** నెలకు జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్‌కు రూ.35,400 నుంచి రూ.1,12,400, జూనియర్ అకౌంటెంట్‌కు రూ.25,500 నుంచి రూ.81,100.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.02.2025.
» **వెబ్‌సైట్:** https://iimmumbai.ac.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నైవేలిలో ఏ రకమైన బొగ్గు లభిస్తుంది?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం

భారతదేశం ఇంధన వనరులు

సాధారణంగా ప్రతి పోటీ పరీక్షల్లో ఖనిజ వనరులకు సంబంధించి ప్రశ్నలు కచ్చితంగా ఉంటాయి. ఖనిజ వనరుల్లో ఇంధన వనరులు అతి ప్రధానమైనవి. ఆర్థిక వ్యవస్థ ప్రగతి ఆయా దేశాల, ప్రాంతాల ఇంధన వనరుల స్థాయి మీద ఆధారపడి ఉంటుంది. ప్రశ్నలు సాధారణంగా వివిధ ఇంధన ధాతువులు, వాటి లభ్యత స్థాయి, విస్తరణ, గనుల(ఉత్పత్తి) కేంద్రాలు, వాటిని ఉత్పత్తి చేస్తున్న ప్రధాన ప్రభుత్వ - ప్రైవేట్ రంగ సంస్థల పేర్లు, ఖనిజాల శుద్ధి మొదలైన అంశాలపై ఉంటాయి. ఖనిజ వనరులు తెలంగాణలో ఎక్కడ లభ్యమవుతున్నాయి లేదా ఉత్పత్తి అవుతున్నాయనే అంశాలపై కూడా ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. ఇంధన వనరులను ప్రధానంగా రెండు తరగతుల కింద విభజించవచ్చు. అవి 1) శిలాజ ఇంధనాలు 2) అణు ఇంధనాలు బొగ్గు, చమురు, సహజవాయువు శిలాజ ఇంధనాల తరగతికి చెందుతాయి. యురేనియం, థోరియం, ప్లుటోనియం, లిథియం, ఇల్మనైట్, ర్యుటైల్, జిర్కాన్ మొదలైనవి అణు ఇంధనాల తరగతికి చెందుతాయి.

శిలాజ ఇంధనాలు జీవ పదార్థం నుంచి తయారవుతాయి. ఇవి ప్రధానంగా కార్బోనిఫెరస్ భౌమ్య యుగంలో ఏర్పడ్డాయి. నిల్వల పరంగా చూస్తే భారతదేశంలో బొగ్గు నిల్వలు సంతృప్తికర స్థాయిలో ఉన్నట్లుగా చెప్పొచ్చు. కానీ చమురు-సహజ వాయువు నిల్వల స్థాయి, ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది. చమురు - సహజ వాయువు ఉత్పత్తుల కోసం మన దేశం ప్రధానంగా దిగుమతులపై ఆధారపడుతుంది. భవిష్యత్తులో వీటి భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ప్రస్తుతం చమురు- సహజ వాయువు నిక్షేపాల అన్వేషణపై దృష్టి కేంద్రీకరిస్తుంది. ఇందుకోసం దేశ, విదేశీ పెట్టుబడులను ఈ రంగంలోకి ఆహ్వానిస్తుంది.అణు ఇంధన వనరులు విస్తారంగా లభిస్తున్నప్పటికీ, వీటిని వినియోగించే అణు రియాక్టర్ సాంకేతిక పరిజ్ఞానం మనకు లేకపోవడం ప్రధాన సమస్య. దేశంలో అమలవుతున్న మూడంచెల అణు ఇంధన పథకం మూడో దశకు చేరుకున్నప్పుడు దేశీయ అణు ఇంధన నిల్వలు వినియోగంలోకి వస్తాయి. ప్రస్తుతం ఈ పథకం రెండో దశలోనే ఉంది.

మాదిరి ప్రశ్నలు

1. బొగ్గు నిల్వలు భారతదేశంలోని కింది ఏ నదీ లోయలో లభించవు?
   ఎ) దామోదర్ బి) నర్మద
   సి) మహానది డి) సోన్
2. ట్రిపామ్ శ్రేణి అవక్షేప శిలల్లో ఏ ఖనిజ వనరులు లభిస్తున్నాయి?
   ఎ) బొగ్గు బి) యురేనియం
   సి) చమురు డి) థోరియం
3. నైవేలిలో ఏ రకమైన బొగ్గు లభిస్తుంది?
   ఎ) ఆంథ్రసైట్ బి) బిట్యూమినస్
   సి) లిగ్నైట్ డి) పీట్
4. బూడిద శాతం ఏ రకమైన బొగ్గులో ఎక్కువగా ఉంటుంది?
   ఎ) ఆంథ్రసైట్ బి) బిట్యూమినస్
   సి) లిగ్నైట్ డి) పీట్
5. భారతదేశంలో మోనజైట్ నిల్వలు అత్యధికంగా ఉన్న రాష్ట్రం?
   ఎ) తమిళనాడు బి) మహారాష్ట్ర
   సి) కేరళ డి) ఒడిశా
6. టెరిషరీ భౌమ్య యుగానికి చెందిన బొగ్గు నిల్వలు భారతదేశంలో ఏ ప్రాంతంలో ఉన్నాయి?
   ఎ) చోటానాగపూర్ పీఠభూమి
   బి) మహారాష్ట్ర
   సి) పశ్చిమ భారతదేశం
   డి) ఈశాన్య భారతదేశం
7. భారతదేశంలో బొగ్గు నిల్వలు సుమారుగా ఎన్ని టన్నులు?
   ఎ) 250 మిలియన్ బి) 250 బిలియన్
   సి) 100 మిలియన్ డి) 100 బిలియన్
8. తెలంగాణలోని కింది జిల్లాల్లో బొగ్గు నిల్వలు లేవు?
   1) ఖమ్మం 2) వరంగల్
   3) కరీంనగర్ 4) ఆదిలాబాద్
   ఎ) 2 బి) 2, 3
   సి) 1 డి) పైవేవీ కావు
9. తెలంగాణలో బొగ్గును ఉత్పత్తి చేసే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
   ఎ) కొత్తగూడెం బి) రామగుండం
   సి) సింగరేణి డి) హైదరాబాద్
10. పీట్ తరగతికి చెందిన బొగ్గు నిల్వలు ప్రధానంగా ఎక్కడ కేంద్రీకృతమై ఉన్నాయి?
    ఎ) ఛత్తీస్‌గఢ్ బి) జమ్ము
    సి) తమిళనాడు డి) కేరళ
11. భారతదేశంలో అత్యధిక నిల్వలు ఉన్న అతిపెద్ద బొగ్గు క్షేత్రం ఏది?
    ఎ) ఝరియా బి) రాణిగంజ్
    సి) గిర్డి డి) సింగరేణి
12. కింద సూచించిన వాటిలో బొగ్గు గని కేంద్రాలను గుర్తించండి.
    1) భూపాలపల్లి 2) సత్తుపల్లి
    3) మణుగూరు 4) మందమర్రి
    ఎ) 1, 2 బి) 3, 4
    సి) 1, 3, 4 డి) పైవన్నీ
13. కోకింగ్ బొగ్గు ప్రధానంగా దేశంలో ఎక్కడ లభిస్తుంది?
    ఎ) ఝరియా బి) కోర్బా
    సి) సింగ్రౌలి డి) తాల్చేర్
14. భారతదేశం ప్రధానంగా ఏ దేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటుంది?
    1) ఆస్ట్రేలియా 2) యూఎస్ఏ
    3) దక్షిణాఫ్రికా 4) చైనా
    ఎ) 1, 2 బి) 1, 3
    సి) 2, 3 డి) 1, 4
15. భారతదేశంలో నీటి ముంపు వల్ల అతి పెద్ద దుర్ఘటన జరిగిన బొగ్గుగని ?
    ఎ) తాల్చేర్ బి) బొకారో
    సి) చస్నాలా డి) గోదావరిఖని
16. భారతదేశంలో బొగ్గు ఉత్పత్తి చేసే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్ (CIL) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
    ఎ) ధన్‌బాద్ బి) ఢిల్లీ
    సి) కలకత్తా డి) నాగపూర్
17. అంబానీ చమురు క్షేత్రం ఏ ప్రాంతంలో ఉంది?
    ఎ) కావేరి బేసిన్ బి) కె.జి. బేసిన్
    సి) కాంబత్ సింధుశాఖ
    డి) బ్రహ్మపుత్ర లోయ
18. భారతదేశంలో అత్యధికంగా చమురును ఉత్పత్తి చేసే అతిపెద్ద చమురు క్షేత్రం ?
    ఎ) గాంధార్ బి) రవ్వ
    సి) దిగ్బాయ్ డి) ముంబై హై
19. భారత ప్రభుత్వం ఓఎన్‌జీసీ (ONGC) కింద సూచించిన ఏ విదేశీ చమురు క్షేత్రంలో పెట్టుబడి పెట్టింది?
    ఎ) అంపారా బి) డహరాన్
    సి) సఖాలిన్ డి) బాకు
20. భారతదేశంలో మొట్టమొదటిగా కనుగొన్న చమురు క్షేత్రం?
    ఎ) లూనెజ్ బేసిన్ బి) దిగ్బాయ్
    సి) నహర్‌కతియా డి) నారిమన్నం
21. వాయవ్య భారతదేశంలో కింది ప్రాంతంలో చమురు సహజవాయువు నిల్వలున్నట్లుగా నిర్ధారించారు?
    ఎ) థార్ ఎడారి బి) చంబల్ లోయ
    సి) కచ్ మైదానం
    డి) సట్లెజ్-యమునా మైదానం
22. HBJపైపు లైను మార్గం కింది రాష్ట్రాల గుండా వెళ్తుంది?
    ఎ) మహారాష్ట్ర-గుజరాత్-రాజస్థాన్
    బి) గుజరాత్-మధ్యప్రదేశ్-ఉత్తరప్రదేశ్
    సి) గుజరాత్-మధ్యప్రదేశ్-రాజస్థాన్
    డి) గుజరాత్-మహారాష్ట్ర-మధ్యప్రదేశ్
23. కింద సూచించిన ప్రదేశాల్లో చమురు శుద్ధి కర్మాగారం లేదు?
    ఎ) బరౌని బి) పానిపట్
    సి) బోన్‌గాయిగావ్ డి) రాంచీ
24. ప్రపంచంలో కెల్లా అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రంగా రూపొందిన భారతీయ నగరమేది?
    ఎ) దిగ్బాయ్ బి) ట్రాంబే
    సి) జామ్‌నగర్ డి) వడోదర
25. ఏ రెండు పట్టణాలు / నగరాలను కలుపుతూ చమురు - సహజవాయువు గొట్టపు మార్గాన్ని నిర్మిస్తున్నారు?
    ఎ) విజయవాడ-విశాఖపట్నం
    బి) కాకినాడ-విశాఖపట్నం
    సి) హైదరాబాద్-కాకినాడ
    డి) హైదరాబాద్-విశాఖపట్నం
26. జతపరచండి.
    a) నహర్‌కతియా 1) గుజరాత్
    b) గాంధార్ 2) అసోం
    c) కర్ణాంగ్ 3) మహారాష్ట్ర
    d) బేసిన్ 4) అరుణాచల్‌ప్రదేశ్

	a	b	c	d
ఎ)	1	2	4	3
బి)	1	2	3	4
సి)	2	1	4	3
డి)	2	1	3	4

27. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాల్లో యురేనియం నిక్షేపాలున్నట్లుగా నిర్ధారించారు?
    ఎ) నల్లగొండ, కడప
    బి) నల్లగొండ, అనంతపురం
    సి) వరంగల్, కడప
    డి) వరంగల్, కర్నూల్
28. జాదుగుడా ఏ ఖనిజాన్ని ఉత్పత్తి చేసే గని కేంద్రం?
    ఎ) బొగ్గు బి) చమురు
    సి) యురేనియం డి) థోరియం
29. ఈశాన్య భారతదేశంలో యురేనియం ఖనిజం ఎక్కడ లభిస్తుంది?
    ఎ) ఖాసీ కొండలు బి) గారో కొండలు
    సి) నాగా కొండలు డి) మిష్మి కొండలు
30. ప్రపంచంలో అత్యధికంగా మోనజైట్ నిల్వలు కలిగి ఉన్న దేశం ?
    ఎ) ఆస్ట్రేలియా బి) భారతదేశం
    సి) కెనడా డి) దక్షిణాఫ్రికా
31. మోనజైట్ ముడి ఖనిజంలోని ప్రధాన ఖనిజం ఏది?
    ఎ) యురేనియం బి) ప్లుటోనియం
    సి) థోరియం డి) బెరీలియం
32. భారతదేశంలో జిర్కాన్ ఇల్మనైట్ వంటి అణు ఖనిజాలను ఉత్పత్తి చేసే సంస్థ ?
    ఎ) యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
    బి) ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్
    సి) ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్
    డి) మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్

సమాధానాలు


1) బి; 2) సి; 3) సి; 4) డి; 5) సి; 6) డి; 7) బి; 8) డి; 9) ఎ; 10) డి; 11) బి; 12) డి; 13) ఎ; 14) డి; 15) సి; 16) సి; 17) బి; 18) డి; 19) సి; 20) బి; 21) ఎ; 22) బి; 23) డి; 24) సి; 25) బి; 26) సి; 27) ఎ; 28) సి; 29) ఎ; 30) బి; 31) సి; 32) బి.

The screen background is known as..

TCP/IP MODEL

(Transmission Control Protocol (TCP) And The Internet Protocol (IP))

Like OSI network model, TCP/IP also has a network model. TCP/IP was on the path of development when the OSI standard was published and there was interaction between the designers of OSI and TCP/IP standards. The TCP/IP model is not same as OSI model. OSI is a seven-layered standard, but TCP/IP is a four layered standard. The OSI model has been very influential in the growth and development of TCP/IP standard, and that is why much OSI terminology is applied to TCP/IP. The following figure compares the TCP/IP and OSI network models.



As we can see from the above figure, presentation and session layers are not there in TCP/IP model. Also note that the Network Access Layer in TCP/IP model combines the functions of Data link Layer and Physical Layer.

LAYER 4: APPLICATION LAYER

Application layer is the top most layer of four layer TCP/IP model. Application layer is present on the top of the Transport layer. Application layer defines TCP/IP application protocols and how host programs interface with Transport layer services to use the network.

Application layer includes all the higher-level protocols like DNS (Domain Naming System), HTTP (Hypertext Transfer Protocol), Telnet, SSH, FTP (File Transfer Protocol), TFTP (Trivial File Transfer Protocol), SNMP (Simple Network Management Protocol), SMTP (Simple Mail Transfer Protocol) , DHCP (Dynamic Host Configuration Protocol), X Windows, RDP (Remote Desktop Protocol) etc.

LAYER 3: TRANSPORT LAYER

Transport Layer is the third layer of the four layer TCP/IP model. The position of the Transport layer is between Application layer and Internet layer. The purpose of Transport layer is to permit devices on the source and destination hosts to carry on a conversation.



Transport layer defines the level of service and status of the connection used when transporting data.

The main protocols included at Transport layer are TCP (Transmission Control Protocol) and UDP (User Datagram Protocol).

LAYER 2: INTERNET LAYER

Internet Layer is the second layer of the four layer TCP/IP model. The position of Internet layer is between Network Access Layer and Transport layer. Internet layer pack data into data packets known as IP datagram's, which contain source and destination address (logical address or IP address) information that is used to forward the datagram's between hosts and across networks. The Internet layer is also responsible for routing of IP data grams.

BANK EXAMS
COMPUTER AWARENESS

Packet switching network depends upon a connectionless internetwork layer. This layer is known as Internet layer. Its job is to allow hosts to insert packets into any network and have them to deliver independently to the destination. At the destination side data packets may appear in a different order than they were sent. It is the job of the higher layers to rearrange them in order to deliver them to proper network applications operating at the Application layer. The main protocols included at Internet layer are IP (Internet Protocol), ICMP (Internet Control Message Protocol), ARP (Address Resolution Protocol), RARP (Reverse Address Resolution Protocol) and IGMP (Internet Group Management Protocol).

LAYER 1: NETWORK ACCESS LAYER

Network Access Layer is the first layer of the four layer TCP/IP model. Network Access Layer defines details of how data is physically sent through the network, including how bits are electrically or optically signaled by hardware devices that interface directly with a network medium, such as coaxial cable, optical fiber, or twisted pair copper wire. The protocols included in Network Access Layer are Ethernet, Token Ring, FDDI, X.25, Frame Relay etc.

The most popular LAN architecture among those listed above is Ethernet. Ethernet uses an Access Method called CSMA/CD (Carrier Sense Multiple Access/Collision Detection) to access the media, when Ethernet operates in a shared media. An Access Method determines how a host will place data on the medium.

IN CSMA/CD Access Method, every host has equal access to the medium and can place data on the wire when the wire is free from network traffic. When a host wants to place data on the wire, it will check the wire to find whether another host is already using the medium.

If there is traffic already in the medium, the host will wait and if there is no traffic, it will place the data in the medium. But, if two systems place data on the medium at the same instance, the y will collide with each other, destroying the data. If the data is destroyed during transmission, the data will need to be retransmitted. After collision, each host will wait for a small interval of time and again the data will be retransmitted.

MODEL BITS

1. At which place is India's Silicon Valley situated?
   1) Kolkata 2) Hyderabad
   3) Chennai 4) Bangalore
   5) None of these
2. A connection from one HTML document to another HTML document is called ________
   1) Connecting Link
   2) Hyper Link 3) Icon
   4) All of these 5) None of these
3. ________ device is used to connect your computer with a telephone line, so that can access information from other servers and ordinary users too.
   1) LAN Card 2) Set Top Box
   3) Modem 4) UPS
   5) None of these
4. Device on one network can communicate with devices on another network via________
   1) Gateway 2) Utility Server
   3) Printer Server
   4) File Server 5) None of these
5. The screen background is known as the________
   1) Desktop 2) Window
   3) Application 4) Frames
   5) None of these
6. Which of the following is not an input device?
   1) VDU 2) Keyboard
   3) Light pen 4) Mouse
   5) None of these
7. What are the units used to count the speed of a printer?
   1) CPM 2) BIT 3) PPM
   4) DPI 5) None of these
8. A computer that combines the characteristic of analog and digital computers________
   1) Super Computer
   2) Digital Computer
   3) Analog Computer
   4) Hybrid Computer
   5) None of these
9. WORM stands for?
   1) Wanted Original Read Memory
   2) Wanted Once Read Memory
   3) Write Once Read Memory
   4) Write Original Read Memory
   5) None of these
10. Memory unit is a part of ______
    1) Input Device 2) Control Unit
    3) Output Device
    4) Central Processing Unit
    5) None of these
11. Which of the following companies developed MS Office-2000?
    1) Novell 2) Corel 3) Lotus
    4) Sunsoft 5) None of these
12. What is the meaning of 'MICR'?
    1) Magnetic Ink Character Recognition
    2) Magnetic Intelligence Character Recognition
    3) Magnetic Information Cable Recognition
    4) Magnetic Insurance Cases Recognition
    5) None of these
13. VIRUS stands for________
    1) Very Important Record User Searched
    2) Vital Information Resource Under Siege
    3) Verify Interchanged Result until Source
    4) Very Important Resource under Search
    5) None of these
14. The technique that extends storage capacities of main memory beyond the actual size of the main memory is called ______
    1) Virtual storage
    2) Multitasking
    3) Multiprocessing
    4) Multiprogramming
    5) Switching
15. ________ command we can use to close the windows.
    1) Alt + F4 2) Alt+ S
    3) Alt + End 4) Alt + F1
    5) None of these
16. Algorithm is used ________
    1) To bring itself into desired state by its own action
    2) To perform logarithmic operations
    3) To describe a set of procedure by given result is obtained
    4) As a high level language
    5) None of these
17. FOXPRO is a ________
    1) RDMBS 2) DBMS
    3) Language 4) All of the above
    5) None of these
18. Who is considered as the father of FORTRAN?
    1) John Bardeen
    2) Charles Babbage
    3) John Backus
    4) William Shockley
    5) None of these
19. Which of the following will connect you to the Internet?
    1) A Commercial online service
    2) An Internet service provider
    3) A network connection
    4) All of the above
    5) None of these
20. What software allows you to view internet sites?
    1) A cyber cafe 2) A browser
    3) A modem 4) Your computer
    5) None of these
21. When more than one window is open, to switch to the next window – is the key combination.
    1) CTRL+F5 2) CTRL+F6
    3) CTRL+F7 4) CTRL+F8
    5) None of these
22. Where are data and program stored when the processor uses them?
    1) Main memory
    2) Secondary memory
    3) Disk memory
    4) Program memory
    5) None of these
23. __ represents raw facts, where- as _____ is a meaningful data.
    1) Information, reporting
    2) Data, information
    3) Information, bits
    4) Records, bytes
    5) Bits, bytes
24. Saving is a process
    1) To copy the document from memory to storage medium
    2) To bring change in present status of the document
    3) To change entire form
    4) All of the above
    5) None of these
25. PNG stands for________
    1) Potable Name Generator
    2) Portable Network Generator
    3) Printed Name Graphics
    4) Portable Network Graphics
    5) None of these
26. The maximum Zoom percentage in MS Power Point is________
    1) 100% 2) 200% 3) 400%
    4) 500% 5) None of these
27. The word 'FTP'stands for _____
    1) File Translate Protocol
    2) File Transit Protocol
    3) File Typing Protocol
    4) File Transfer Protocol
    5) None of these
28. Compiler in computer system is a ______
    1) Package 2) System Software
    3) Process
    4) Application Software
    5) None of these

KEY

1) 4	2) 2	3) 3	4)1	5) 1
6) 1	7) 4	8) 4	9) 3	10) 4
11) 5	12) 1	13) 2	14) 1	15) 1
16) 3	17) 3	18) 3	19) 2	20) 2
21) 2	22) 1	23) 2	24) 1	25) 4
26) 3	27) 4	28) 4		